రెండు రాష్ట్రాలలో విలసిల్లనున్న తెలుగు జాతి ఐక్యత

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 12 సంచిక : 3 హైదరాబాద్ 152 మార్చ్ 2014 పేజీలు : 68 రు. 15

- తెలంగాణ బిల్లులో లోపాలు
- పోల'వరం' ఎవరికి? శాపం ఎవరికి?
- కేంద్ర, రాష్ట్ర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్లు
- రూపాయి పతనం అంటే ఏమిటి?
- ఖనిజాల అక్రమ తవ్వకాలు - షా కమిషన్
- బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభం

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 50
కుట్రరాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
సామాజిక విద్య - ఒకమిథ్య	ఎ. నర్సింహారెడ్డి	100
ప్రజా ఎజెండా లేని పార్లమెంటరీ రాజకీయాలు	ఎ. నర్సింహారెడ్డి	40
ఒక ప్రేతాత్మక కథ	అరుంధతీ రాయ్	25
సమాధిలోకి సామ్రాజ్యవాదం	డి. పాపారావు	200
కొత్తకోణం	ఎనిశెట్టి శంకర్	80
ఫారెన్‌హీట్ 451	ఎనిశెట్టి శంకర్	90

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్సి, ఎస్టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్సి, ఎస్టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా పూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు - రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు - అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు - మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	న్యూవిస్టా పబ్లికేషన్స్	100

లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్ని

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-1	శారదాంబ స్మారక కమిటీ	రు. 300
అలిశెట్టి ప్రభాకర్ కవిత	అలిశెట్టి మిత్రులు	150
సాహిత్య సమాలోచన	కృష్ణాబాయి	300
సందిగ్ధ సందర్భం	సి.వి. సుబ్బారావు	40

చరిత్ర-జీవిత చరిత్ర

భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
కన్నబీరన్	వ్యాస సంకలనం	50
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఆర్.ఎస్.రావు స్మృతిలో	వ్యాస సంకలనం	50
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
టాల్‌స్టాయ్ పరిచయ వ్యాసాలు	యన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు	30

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
జనహృదయం జనార్దన్	సూరపనేని మోహనరావు	60
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50

కథ - నవల

గంగానమ్మ	విజయ	15
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగాయి	100
పంచమం	చిలుకూరి దేవపుత్ర	100
అజేయుడు	అలెగ్జాండర్ ద్యుమా	160
ఘంటారావం	విక్టర్ హ్యూగో	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50

Fifty Years of Andhra Pradesh	**(1956-2006)**	300
Towards Understanding Semi Feudal - Semi Colonial Society	R.S. Rao	300
In search of Method	Mudunuri Bharathi	200
Individual Sub-groups, Groups and Freedom	Mudunuri Bharathi	75
Crisis and Development in Marxian Framework	Mudunuri Bharathi	80
Methodoly of Social Enquiry	Mudunuri Bharathi	150
On Education	Mudunuri Bharathi, R.S. Rao	100
Understanding Maoists	N. Venugopal	300

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email: veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

152 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మార్చ్ 2014
సంపుటి : 12
సంచిక : 3

లోపలి పేజీల్లో...

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజెన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా
వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

'మేం మళ్లీ వస్తాం' అన్న పుస్తకం మార్కెట్‌లోకి వచ్చిందని తెలియగానే, నిజంగా నాకు వళ్లు పులకరించింది. 'ఇలా మిగిలేం', 'మాకు దిక్కులేదు, ఇంక మీ ఆడోళ్ల సంగతేం చూస్తాం' 'ఆ రోజులు వెళ్లిపోయాయి'.... ఇట్లాంటి రీతిలో రచనలూ, ఆ తరువాతి పలాయన రీతులూ అరాయించుకోలేక, అయినా కమ్యూనిజం పట్ల ఆశ చావక, ఏదో మార్పు తప్పక వస్తుందన్న మార్క్స్ దృక్పథపు ఆశతో ఎదురుచూస్తున్న చాలా మందికి కూడా ఆ వార్త ఉత్తేజితం చేసి ఉంటుంది. కమ్యూనిజం పట్ల అభిమానమూ, ఆశవాహ దృక్పథమూ కలవారెవరైనా ఈ పుస్తకాన్ని నిండు గుండెతో ఆహ్వానిస్తారనే అనుకున్నాను. ఏవైనా సైద్ధాంతిక పొరపాటు అవగాహనలు ఉండవచ్చు. అసలు అలా, ఈ నిరాశాజనక పరిస్థితులలో, 'మేం మళ్లీ వస్తాం' అనడమే గొప్ప సంగతి. ఆ మాటే ఎంతో ధైర్యం కలిగిస్తున్నది.

కానీ ఈ పుస్తకంపైన రంగనాయకమ్మ అర్థంలేని విమర్శలు చూశాక, ఆమె ఈ పుస్తకం గొంతెత్తి ఇచ్చిన ఈ గొప్ప నినాదాన్ని తూలనాడడం, తూర్పారబట్టడం చూశాక, ఆమెలో మార్క్సిజం కంటే డాగ్మాటిజమే ఎక్కువ ఉందేమో, ఆమె అసలు సిసలైన మార్క్సిస్టు కాదేమోనని అనిపించింది. కారల్ మార్క్స్ పేరు వింటేనే ఉర్రూతలూగిపోయే ఆమె, 'మేం మళ్లీ వస్తాం' లాంటి ప్రాణప్రదమైన వాక్యాన్నే వెటకారం చేసే అహంకీకృతపు విమర్శ చేయడం చూసి, ఇటువంటి వారెవరూ కమ్యూనిస్టు శిశువుని హత్య చేసేవారే తప్పితే సజావుగా కాన్పు చేసేవారు కాదని అనిపించి, ఇట్లాంటి వారి మీద విరక్తి పుట్టింది. ఇట్లాంటి వాళ్ల రాతల మీద ఆధారపడకుండా ఇంగ్లిష్ గట్టిగా నేర్చుకుని నేరుగా మార్క్సిజాన్ని అధ్యయనం చేయడమే మంచిదనిపిస్తున్నది. పుస్తకాలు రాసినంత మాత్రాన ఎవరూ మార్క్సిస్టులు కాజాలరు అని ఏ గొప్ప మార్క్సిస్టు అయినా అని ఉంటే అందుకు సాక్షులుగా రంగనాయకమ్మను మొదటి వరుసలోనే చూపించవచ్చు.

అయితే ఈ పుస్తక రచయిత జగన్మోహనరావు చాల సంయమనంతో, ఎక్కడా సంస్కారం కొరవడకుండా రంగనాయకమ్మ చేసిన విమర్శలకు మంచి వివరణ ఇచ్చారు. ఆయనకు మా అభినందనలు. ఇక రంగనాయకమ్మ శైలిగురించి అనేక సందర్భాలలో ఆమె వితండ, తింగర (బుచ్చి) వాదాల గురించీ ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. పెట్టుబడిదారీ పత్రికలూ, అక్కడక్కడా హాట్ హాట్ కమ్యూనిస్టు భావజాల పత్రికలూ కూడా ఆమె సందర్భ శుద్ధిలేని అన్నిలో ఆజ్యపు రచనలకు, తమ మార్కెట్ పెంచుకునేందుకు అచ్చువేశాయి. కలకలం పుట్టించి తమ సర్క్యులేషన్ పెంచుకోవడం వాటికి బాగా అలవాటు. 'వీక్షణం'కు ఆ దుస్థితి లేదని తలుస్తాను.

విభిన్న భావనల వ్యాప్తికి, 'వేయిపూవులు వికసించ నీయండి' అన్న మావో మహాశయుని స్ఫూర్తికి, ఎంతగానో సహకరిస్తున్న వీక్షణంకూ, అందుకు కృషిచేస్తున్న సంపాదక మిత్రులకూ, ఆయా రంగాల రచయితలకూ, అనువాదకులకూ నా నిండైన అభినందనలు.

డి. నటరాజ్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం

వీక్షణం ప్రజాహితైక, సామాజిక విశ్లేషణాత్మక పత్రిక అంటూ ఘోషపెడ్తున్నారు. కాని దీనిలో వివిధ వ్యాసాలు గానీ, విశ్లేషణలు గానీ అంత ఆకర్షణీయంగా లేవు. మా అభిప్రాయాలు. అమెరికా, బ్రిటన్‌లు చేసే, జరిపించే, అన్యాయాలు, అకృత్యాలను నగ్నంగా విశ్లేషించి మీ పాత్రికేయులుగానీ లేక ఈ రంగంలో ఫ్రీలాన్స్‌గా విశ్లేషించే దురంధరుల వ్యాసాలుగానీ సీరియల్‌గా ప్రతి నెల వేయాలి.

వైద్య రంగంలో ఎంఎన్‌సిలు, యు.ఎస్/యు.కె వార్తలు ఈ రంగంలో ఇండియా, ఆఫ్రికా తదితర దేశాల ప్రజలపై సరికొత్త మందులు ఎలా ప్రభావం చూపుతాయో ముందుగా ఎలుకలు, పిల్లులు వగైరాలపై ప్రయోగించి తరువాత మనుషులపై ప్రయోగానికి భారత డాక్టర్లకి లక్షలు, కోట్లు పెద్ద భవంతుల రూపేణాగానీ సింగపూర్/యుఎస్/యుకె/గల్ఫ్ పిక్‌నిక్ యాత్రలు రూపేణా లంచాలతో ముంచెత్తి సామాన్య ప్రజానీకంపై కొత్త మందులు వాడి, ఫలితాలు సానుకూలమా లేక రియాక్షన్/సైడ్ ఎఫెక్ట్స్‌తో ఉన్నవా అనే సమాచారం సేకరించి, ఈ సమాచారం ఆధారంగా యు.ఎస్‌లో గుర్తింపు పొందే ముందు రు. 80 లేక 100కు అమ్మిన మందు గుర్తింపు తర్వాత 2000 లేక 3000లకు అమ్మి డాక్టర్లను కోటీశ్వరులుగా చేస్తున్నారు. ప్రజలను దోచుకుని తింటున్నారు. దేశంలోని మందుల వ్యాపారాలు ముఖ్యంగా విజయవాడ, హైదరాబాద్, ముంబై, గుజరాత్‌లలో గల కల్తీ మందుల వ్యాపారాల గుట్టు బయటపెడుతూ వాటి వల్ల ప్రజల ఆరోగ్యం ఎలా దెబ్బతింటుందో వివరించే వ్యాసాలు వస్తే బాగుంటుంది. ఆర్‌టిఐ, పిఐఎల్, ఉన్నతాధికారుల అవినీతి వ్యతిరేక చట్టం లాంటి అనేక ప్రజాహిత చట్టాలు వాటి వివరాలు, అవి ఏవిధంగా ప్రజానీకానికి ఉపయోగకరమో విశ్లేషించి తెలిపే వ్యాసాలు ప్రచురించగలరు. అమెరికన్/యుకె కాలేజి/యూనివర్సిటీలలో పేరెన్నికగన్నవి, గవర్నమెంట్ ఆమోదం లేనివి వాటి వివరాలు యువత కోసం ప్రచురించాలి. పత్రికలో విప్లవాత్మక మార్పులతో లోపభూయిష్ట విషయాలను కడిగి ప్రక్షాళన చేసి సమాజానికి తోడ్పడండి.

పి. లక్ష్మణరావు, విశాఖపట్నం

నేనొక నక్సలైట్ రాజకీయ ఖైదీని. కర్నాటకలోని మంగళూరు జైలు నుంచి రాస్తున్నాను. నేను వీక్షణం పత్రికలోని ముఖ్యమైన వ్యాసాలను రెగ్యులర్‌గా చదువుతున్నాను. వీక్షణం నెల నెలకు, సంవత్సరం నుంచి సంవత్సరానికి అభివృద్ధి అవుతోంది. అది మనందరికీ సంతోషకరం. ఈ రకమైన పత్రిక ఈ రోజు చాలా అవసరం. ఇంకా మెరుగైనా విశ్లేషణలతో వ్యాసాలు రావాలి. నేను విడుదలై బైటికి వెళ్లాక కూడా వీక్షణం చదువుతూనే ఉంటాను. రెండు మూడు సంవత్సరాలుగా జైలు నిర్బంధంలో నేను పురోగామి రాజకీయాలతో కొనసాగడానికి ఉపయోగపడిన వీక్షణం పత్రికకు కృతజ్ఞతలు.

– **దేవేంద్ర,** మంగళూరు

(మిగతా 62వ పేజీలో...)

Statement about ownership and other particulars of periodical **Veekshanam as require**d to be published in the first issue of every year after the last day of February

Form IV (See Rule 8)

1. Place of publication	:	Hyderabad
2. Periodicity of its publication	:	Monthly
3. Printer's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency, 3-6-394, Street No. 3, Himayatnagar, Hyderabad - 500 029.
4. Publisher's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency, 3-6-394, Street No. 3, Himayatnagar, Hyderabad - 500 029.
5. Editor's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency, 3-6-394, Street No. 3, Himayatnagar, Hyderabad - 500 029.
6. Name and addresses of individuals who own the newspaper	:	N. Venugopal Rao

I, N. Venugopal Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

(N. Venugopal Rao)

Date : 1st March, 2014 Signature of the Publisher

ప్రజా ఉద్యమ విజయం తథ్యమన్న తెలంగాణ

వీక్షణం

ఒక ప్రాంతంగా తెలంగాణ విజయం సాధించింది. ఒక ప్రాంత ప్రజల కోరికగా రాష్ట్ర సాధనా ఆకాంక్ష, స్వయంపాలనా ఆకాంక్ష విజయం సాధించింది. ఒక సుదీర్ఘ ఉద్యమంగా తెలంగాణ ప్రజలు విజయం సాధించారు. ఇది నిస్సందేహంగా తెలంగాణ ప్రజల విజయమే గాని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల పరాజయం ఎంతమాత్రమూ కాదు. వీక్షణం గత పన్నెండు సంవత్సరాలుగా పదేపదే చెపుతున్నట్టు, వీక్షణంలో అచ్చయిన వ్యాసాలలో ఎక్కువభాగం చెప్పినట్టు తెలంగాణ ప్రజలు కోస్తా, రాయలసీమ ప్రజలకు వ్యతిరేకంగా ఎన్నడూ పోరాడలేదు. ఆంధ్రప్రదేశ్ పేరు మీద ఆరు దశాబ్దాలుగా అమలవుతున్న పాలక విధానాలకు వ్యతిరేకంగా పోరాడారు. సమైక్యరాష్ట్రంలో తమ న్యాయమైన వాటా తమకు దక్కడం లేదని పోరాడారు. ఆ వాటా ఇస్తామని అనేకసార్లు వాగ్దానాలు చేసి ఉల్లంఘించిన పాలకుల కుటిలనీతికి వ్యతిరేకంగా పోరాడారు. పాలకవర్గాల ప్రచార, వినోద సాధనాలు తమను రెండవ తరగతి పౌరులుగా చూసి తమ సంస్కృతిని, అస్తిత్వాన్ని అవమానిస్తు న్నాయని పోరాడారు. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ ప్రజలు తమకు రావలసినదాని కోసమే పోరాడారు గాని, మరొకరిది కావాలని పోరాడలేదు. ఏది ఏమైనా అదంతా గత చరిత్ర. ఇప్పుడిక ఆ గతాన్ని తవ్వుకోవడం కేవలం చరిత్ర రచనకే తప్ప మరెందుకూ ఉపయోగపడదు. ఇప్పుడు కావలసింది రెండు ప్రాంతాల తెలుగు ప్రజల మధ్య స్నేహ సుహృద్భావాలు. రెండు చోట్లా కోట్లాది ప్రజానీకం సమానమైన సమస్యల లోనే ఉన్నారు. రెండు చోట్లా స్వార్థపూరిత, అవకాశవాద రాజకీయ నాయకత్వాలు ప్రజల వనరులను కొల్లగొట్టి తమ పబ్బం గడుపు కుంటున్నాయి.

గత ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజా ఉద్యమంతో మరెవరికీ, ప్రత్యేకించి ఇవాళ మరొక రాష్ట్రంలో ఉన్న తోటి తెలుగు ప్రజలకు పేచీ ఉండనవసరమే లేదు. ఆ పోరాటం వల్ల తెలుగు ప్రజల ఐక్యత దెబ్బతిన వలసిన అవసరమేమీ లేదు. ఇంతకాలం సాగిన పోరాటం ప్రజల మధ్య వైమనస్యం కాదు. కాని కోస్తాంధ్ర, రాయలసీమ పాలకవర్గాలు అక్కడి ప్రజలలో కొందరిలోనైనా అబద్ధాలు, భ్రమలు, అపోహలు, అపార్థాలు నింపి వైమనస్యాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నించాయి. ప్రచార సాధనాలన్నీ కోస్తాంధ్ర, రాయలసీమ పాలకవర్గ భావజాలంతో నిండి ఉండడం వల్ల అలా అనవసరమైన వైమనస్యాన్ని రెచ్చగొట్టడం కొంతవరకు సాధ్యమయింది. నిజానికి రెండు ప్రాంతాల తెలుగు ప్రజల మీద ఒకే పాలకవర్గాల దోపిడీ పీడనలు సాగుతున్నాయి. రెండు ప్రాంతాల తెలుగు ప్రజలు కలిసి ఉమ్మడిగా చేయవలసిన పోరాటాలు ఎన్నో ఉన్నాయి. ఆ దోపిడీ పీడనలలో ఒక భాగాన్ని గుర్తించి, తొలగించుకునే పోరాటంలో ఇప్పటిదాకా తెలంగాణ అగ్రభాగాన ఉండి, విజయం సాధించింది. అందుకు కారణం ఆ పాలకవర్గ దోపిడీ పీడనలకు అదనంగా ప్రాంతీయ వివక్ష, వాగ్దానాల ఉల్లంఘన, అస్తిత్వ అవమానం వంటి అంశాలు కలవడమే. ఇప్పుడు ఆ పోరాటంలో ఆ దశ ముగిసింది గనుక తెలుగువారందరూ కలిసి చేయవలసిన ఉమ్మడి పోరాటాలకు సమాయత్తం కావలసి ఉంది.

అయితే తెలంగాణ సాధించిన విజయం కూడ సంపూర్ణమేమీ కాదు. ప్రజల ఆకాంక్షలన్నీ సఫలం కాలేదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరచిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు–2014లో చాల లోపాలు, తెలంగాణ వ్యతిరేక అంశాలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమంలో ఒక దశ ముగిసిన ఈ సందర్భంలో బేరీజు వేసుకుంటే తెలంగాణ ఉద్యమం నేర్చుకోదలచు కున్నవారికి తప్పనిసరిగా కొన్ని అనుకూల పాఠాలనూ ప్రతికూల పాఠాలనూ నేర్పుతుంది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ ఆకాంక్ష, నాలుగు దశాబ్దాలుగా సాగుతున్న పోరాట వ్యక్తీకరణలు, రెండు దశాబ్దాలుగా నిరంతరాయంగా సాగుతున్న ప్రజా సంఘటిత కృషి, విస్తారమైన సృజనాత్మక, విశ్లేషణాత్మక భావజాల ప్రచారం, పదిహేను సంవత్సరాల రాజకీయ ప్రయత్నాలు, ఐదు సంవత్సరాల చట్టబద్ధ ప్రయత్నాలు, వేలాది మంది ప్రాణాల బలి – ఈ సమగ్ర చరిత్ర నుంచి ప్రజలూ, ఉద్యమకారులూ, రాజకీయవేత్తలూ గ్రహించవలసిన అంశాలెన్నో ఉన్నాయి.

ఒక ఉద్యమం నిజమైన ప్రజా ఆకాంక్షల మీద నిర్మాణమైనట్టయితే నాయకత్వాలు ఎంత ద్రోహపూరిత, స్వార్థపూరిత, కుటిల ప్రయత్నాలు చేసినా ఉద్యమం ఎప్పటికీ చల్లారదనేది మొట్టమొదటి పాఠం. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందే తెలంగాణ రాష్ట్రాన్ని కోరి, త్వరలోనే ద్రోహం చేసిన హైదరాబాద్ కాంగ్రెస్ నాయకత్వం, 1969 ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించినట్టు నటించి ద్రోహం చేసిన తెలంగాణ ప్రజాసమితి, 1996 నుంచీ ప్రజలలో రగులుతున్న ఆందోళనను తమ ప్రయోజనాల కోసం వాడుకోవడానికి ప్రయత్నించిన అరడజను రాజకీయ పక్షాలు, డజన్లకొద్దీ ప్రజా సంఘాలు ఎన్నెన్ని రకాల వంచనలకు, రాజీలకు, లోపయకారీ ఒప్పందాలకు సిద్ధపడినా తెలంగాణ ప్రజలు ఉద్యమ పథాన్ని వీడలేదు. ఇవాళ్టి విజయానికి ప్రధాన కారణం ఆ అకుంఠిత దీక్షే.


ప్రజల ఆకాంక్షలను, ప్రయోజనాలను కూడ తమకు అనుకూలంగా మార్చుకోవడానికి, వాటిని చూపి తమ పబ్బం గడుపుకోవడానికి ఒక పాలకవర్గ ముఠా కాకపోతే మరొక పాలకవర్గ ముఠా ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే ఉంటాయని, ప్రజలు, ఉద్యమ శ్రేణులు ఆ విషయంలో జాగరూకంగా ఉండాలని కూడ తెలంగాణ ఉద్యమ చరిత్ర పాఠం నేర్పుతున్నది. అలాగే ప్రజా ఉద్యమం ఎంత బలంగా నడిచినా, ప్రజా ఆకాంక్షల పునాది ఎంత స్థిరమైనదైనా, ఉద్యమం సమరశీల రూపాలు చేపట్టకపోతే చివరికి ఆ ఉద్యమ పరిష్కారం పాలకవర్గ ముఠాల మధ్య తగాదా పరిష్కారంగా మారుతుందని కూడ తెలంగాణ నేర్పుతున్నది. ప్రజా ఉద్యమం నిజమైన ప్రజాశక్తుల చేతిలో లేకపోతే, సమరశీల పోరాట రూపాలు చేపట్టి ప్రత్యర్థుల మెడలు వంచకపోతే, పాలకవర్గ ముఠా తగాదాగా పరిష్కారమైతే, నిజమైన ప్రజా ప్రయోజనాలు నెరవేరవని కూడ తెలంగాణ నేర్పుతున్నది. పాలకవర్గాల ముఠా తగాదాగా పరిష్కారం కుదిరితే, ప్రజా ఉద్యమం గెలిచినట్టే ఉంటుంది గాని ఏ ఆకాంక్షల కోసం ఆ ఉద్యమం నడిచిందో ఆ ఆకాంక్షలు పూర్తిగా నెరవేరవని బిల్లులోని తెలంగాణ ప్రజావ్యతిరేక అంశాలు నేర్పుతున్నాయి. అందువల్ల తెలంగాణ ఈ విజయంతో సంబరపడి ఇదే అంతిమగమ్యం అనుకోవడానికి వీలు లేదు. ఆంధ్రప్రదేశ్ ఏదో కోల్పోయానని అనుకోనక్కరలేదు. రెండు ప్రాంతాల ప్రజలూ తమ తమ పాలకవర్గాలు అనుసరించబోయే ప్రజావ్యతిరేక విధానాల మీద విడివిడి పోరాటాలూ, ఉమ్మడి పోరాటాలూ చేయవలసే ఉంది. వీ

నెత్తురుటేర్లు పారించి 'చాయ్‌వాలా'గా నటిస్తున్న మోడీ


పదహారో లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు ఎనిమిది పది వారాల్లోకి వచ్చాయి గనుక ఎన్నికల జ్వరం పెరిగిపోతూ ఉంది. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ – యుపిఎ కూటమి, నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ – ఎన్‌డిఎ కూటమి హోరాహోరీ ప్రచారం మొదలుపెట్టాయి. ఈ దేశంలో కొనసాగుతున్న పార్లమెంటరీ ఎన్నికల ద్వారా వ్యవస్థ మారబోయేదేమీ లేదు. ప్రజల మౌలిక సమస్యలు తీరబోయేదేమీ లేదు. ఒక పాలకవర్గ ముఠాను అధికారం నుంచి దించి మరొక పాలకవర్గ ముఠాను అధికారంలో కూచోబెట్టడానికే ఈ ఎన్నికలు ఉపయోగపడతాయి. ఆ సాధారణ అవగాహన ఉంచుకుంటూనే 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంలోని ప్రత్యేక అంశాలను కూడ గుర్తించవలసి ఉంది. ఆ ప్రత్యేకాంశాలలో ఒకటి నరహంతక నరేంద్ర మోడీని తమ ప్రతినిధిగా ప్రకటిస్తూ సంఘపరివారం సాగిస్తున్న మతోన్మాద విద్వేష ప్రచారం. మూడువేల మంది ముస్లింలను ఊచకోత కోసిన గుజరాత్ జనహననానికి ముఖ్యమంత్రిగా బాధ్యుడూ, ఆ తర్వాత గడిచిన పన్నెండు సంవత్సరాలలో ఎన్నడూ పశ్చాత్తాపమైనా ప్రకటించనివాడూ, మరింతగా మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నవాడూ నిస్సిగ్గుగా ప్రధానమంత్రి అభ్యర్థి కావడం, ఒక పాలకవర్గ ముఠా నాయకుడు కావడం ఎంత అమానవీయమో, అప్రజాస్వామికమో, అక్రమమో చెప్పనక్కరలేదు. పైగా ఈ విషప్రచారానికి మోడీ చాయ్ వాలా అనీ, వెనుకబడిన కులాలకు చెందినవాడనీ, గుజరాత్ ను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తున్నవాడనీ మేలి ముసుగులు అల్లుతున్నారు. ఈ ప్రచారం ద్వారా అట్టడుగు శ్రామికులలో ఒకడనే సెంటిమెంటును, దేశంలో బలంగా ఉన్న కుల సంఘీభావాన్నీ, ప్రజలలో అభివృద్ధి కోసం ఉన్న ఆకాంక్షలనూ వాడుకునే ఎత్తుగడ ఉంది. అంటే ప్రజల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అంశాలనూ, ఆకాంక్షలనూ వాడుకుని గద్దెనెక్కాలనే కుటిల ప్రయత్నానికి సంఘపరివార హిందూ బ్రాహ్మణీయ పాలకవర్గ ముఠా ప్రయత్నిస్తున్నది. ఈ మూడు భుజకీర్తులూ అబద్ధాలు, అర్ధసత్యాలు. ఎప్పుడో చిన్నప్పుడు చాయ్ అమ్మాడేమో గాని, పదిహేడో ఏట ఆర్‌ఎస్‌ఎస్ లో ప్రవేశించిననాటినుంచీ, అంటే నలభై సంవత్సరాలకు పైగా మోడీ నమ్ముతున్నది రక్తపాత రాజకీయాలను మాత్రమే. పుట్టుకరీత్యా వెనుకబడిన కులానికి చెందినవాడే కావచ్చుగాని ఆయన తండ్రినాటికే ఆ కులవృత్తిలో లేరు. శూద్రుడిగా పుట్టినప్పటికీ శూద్ర వ్యతిరేక విషం చిమ్మే బ్రాహ్మణీయ హిందూత్వ సంఘపరివార్ నాయకుడిగా ఆయనకు ఆ కులం గురించి చెప్పుకునే అర్హత లేదు. ఇక గుజరాత్ అభివృద్ధి నమూనా పేరు మీద మోడీ సాగిస్తున్న ప్రచారంలో ప్రతి అక్షరం అబద్ధమేనని ఎందరో స్వతంత్ర పరిశీలకులు ఇప్పటికే చూపి ఉన్నారు. ఇటువంటి రక్తపిపాసి, అబద్ధాలకోరు, వంచనాశిల్పి మోడీ ఈ దేశప్రధాని కావడం ఈ దేశపు ఉజ్వలమైన ప్రజాచైతన్య సంప్రదాయానికే అవమానం. అలాగే, మోడీత్వ, హిందూత్వ దుర్మార్గాల గురించి మాట్లాడడమంటే కాంగ్రెస్ దుర్మార్గాల పట్ల నిర్లిప్తంగా ఉండడం కాదు. ఈ రెండు దుర్మార్గాలు ఒకదానికొకటి ప్రత్యామ్నాయం కావని గుర్తించి, ఈ రెండు పాలకవర్గ ముఠాలను కూలదోసి ప్రజలు తమ ప్రత్యామ్నాయాన్ని నిర్మించుకోవలసి ఉంది. వీ

ఉక్రెయిన్ ప్రజలపై సాగుతున్న మారణకాండ

ఒకప్పటి యూనియన్ ఆఫ్ సోవియెట్ సోషలిస్ట్ రిపబ్లిక్స్‌లో భాగం, ప్రస్తుత తూర్పు యూరప్ దేశం ఉక్రెయిన్ ఏడెనిమిది సంవత్సరాలుగా, 2004లో 'నారింజ విప్లవం' నాటి నుంచీ సంక్షుభితంగానే ఉన్నప్పటికీ గత రెండుమూడు నెలలుగా అట్టుడికిపోతున్నది. జనవరిలోనూ, ఫిబ్రవరి లోనూ జరిగిన ప్రజాందోళనల్లో వంద మందికి పైగా మరణించారు. నిజానికి ఉక్రెయిన్ సంక్షోభపు మౌలిక కారణం అక్కడి ప్రజల ఆర్థిక, రాజకీయ సమస్యల తీవ్రత కాగా, అధికార, ప్రతిపక్ష పాలక ముఠాల మధ్య ఘర్షణలు, తీవ్రవాద జాతీయవాదానికీ, అంతర్జాతీయ ద్రవ్యసంస్థల ఆదేశాలకూ మధ్య పెనుగులాట, అన్నిటికన్న ముఖ్యంగా ఆ దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థపై పట్టుకోసం ఒకవైపు రష్యన్ ఫెడరేషన్, మరొకవైపు యూరపియన్ యూనియన్ సాగిస్తున్న కుతంత్రాలు ప్రజాజీవితాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. ఉక్రెయిన్ పాలక ముఠాల మధ్య ఎంత గందరగోళం కొనసాగుతున్నదంటే అనేక మంది అగ్రనాయకులు ఏ క్షణాన ఏ పక్షంలో ఉంటారో తెలియని స్థితి ఉంది. విక్టర్ యానుకోవిచ్ 2004లో ప్రధానిగా ఎన్నికై, ఆ ఎన్నికలలో అనేక అక్రమాలకు పాల్పడ్డాడనే ఆరోపణలను ఎదుర్కొని 'నారింజ విప్లవం'లో పదవీచ్యుతుడయ్యాడు. అప్పుడు అధికారానికి వచ్చిన విక్టర్ యుష్చెంకో – యూలియా టైమొషెంకో ప్రభుత్వం రష్యన్ ఫెడరేషన్‌తో ఇంధన సరఫరా ఒప్పందాలు కుదుర్చుకొని దేశ ఖజానాకు భారీగా నష్టాలు కలిగించింది. కొద్ది కాలంలోనే యానుకోవిచ్ ఐక్యసంఘటనలో మళ్లీ అధికారానికి వచ్చి, బలపడ్డాడు. 2007 ఎన్నికల్లో టైమొషెంకో ప్రధాని అయినప్పటికీ, 2010 ఎన్నికల్లో అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. తనమీద పోటీచేసి ఓడిపోయిన టైమొషెంకోను జైలుపాలు చేసి, ఐఎంఎఫ్ ఆదేశాల మేరకు ఆర్థిక విధానాలను మార్చడం ప్రారంభించాడు. సహజవాయువు ధరలు పెరిగిపోయాయి. వైద్య ఆరోగ్య రంగం పరిస్థితి దిగజారింది. పెన్షన్ సంస్కరణలు, కొత్త కార్మిక నిబంధనలు, రైల్వేల ప్రైవేటీకరణ, కొత్త పన్నుల విధానం వంటి ప్రజావ్యతిరేక విధానాలెన్నిటినో అమలులోకి తేవడానికి ప్రయత్నించాడు. ఒకవైపు ఈ ఆర్థిక సంస్కరణ విధానాలను ప్రవేశపెడుతూనే, యూరపియన్ యూనియన్ తో దూరంగా ఉండడానికి ప్రయత్నించాడు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సంక్షోభానికి ప్రతిస్పందనగా దేశవ్యాప్తంగానూ, రాజధాని కీవ్ నగరంలోని యూరో మైదాన్‌లోనూ ప్రారంభమైన ప్రజా ప్రదర్శనలలోకి ప్రతిపక్షాలు చొరబడి, ఆ ఆందోళనలను యూరపియన్ యూనియన్ అనుకూల ఆందోళనలుగా మార్చాయి. మౌలిక సమస్యలు మరుగున పడి ఈ ఆందోళన యూరపియన్ యూనియన్ అనుకూల వర్గానికీ, రష్యన్ ఫెడరేషన్ అనుకూల వర్గానికీ మధ్య జరుగుతున్న ఘర్షణగా వ్యక్తం కావడం మొదలయింది. ప్రదర్శకుల మీద ప్రభుత్వ నిర్బంధకాండ పెరగడంతో అధ్యక్షుడు విక్టర్ యానుకోవిచ్ పదవి వదిలి, దేశం వదిలి పారిపోయాడు. హడావుడిగా సమావేశమైన పార్లమెంటు అధ్యక్షుడిగా వ్యవహరించే అధికారాన్ని ఒలెక్సాండ్ర్ తుర్చీవెన్ కు అప్పగించింది. ఇటువంటి అతుకులు, మాట్లు ఎన్ని వేసినా, ఎవరు దిగిపోయి, ఎవరు గద్దెనెక్కినా, ప్రభుత్వం అటు యూరపియన్ యూనియన్ వైపుకో, ఇటు రష్యన్ ఫెడరేషన్ వైపుకో మొగ్గినా ప్రజలకు ఒరగబోయేదేమీ లేదు. వారి మౌలిక సమస్యలు పరిష్కారమయ్యేది లేదు. సమకాలీన ప్రపంచ రాజకీయాలు ఎంత సంక్షుభితంగా, ఎంత కుహనా వ్యక్తీకరణలతో ఉన్నాయో ఉక్రెయిన్ మరొకసారి ప్రకటిస్తున్నది. వీ




❖ **కామ్రేడ్ మాదాల నారాయణస్వామి** – రచనలు – ప్రసంగాలు – సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ప్రచురణ – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : ఇ.నెం. 2-1-716, (బి-6, ఎఫ్-4), ఎస్‌వి స్కూల్ ఎదురుగా, ఒ.యు. మెయిన్ రోడ్, విద్యానగర్, హైదరాబాద్ – 500044. ఫోన్: 040 27668471; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **దండకారణ్య కథలు** – 2005-2012 – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 224 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్ మార్క్; నవోదయ బుక్‌హౌస్




❖ **ఆదర్శ జీవులు – అమరులు** – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 53 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **భూదేవి** – తోటపల్లి జగన్మోహనరావు – తెలంగాణ రిసోర్స్ సెంటర్ – స్పృహ సాహితీ సంస్థ – 184 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : తెలంగాణ రిసోర్స్ సెంటర్, 'చంద్రం', 490, స్ట్రీట్ నెం.11, హిమాయత్‌నగర్, హైదరాబాద్ – 500 029; సెల్: 9030626288 website : www.trchyd.org



❖ **సమకాలీనం** – కథా విమర్శ – ఎ.కె. ప్రభాకర్ – స్పృహ సాహితీ సంస్థ – 199 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు : జూలూరు గౌరీశంకర్, 1-8-702/33/20/ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500 044; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **విద్య – ప్రపంచీకరణ – అసమానతలు** – ఎం. శ్రీనివాస్ – అడుగుజాడలు పబ్లికేషన్స్ – 280 పేజీలు, 1/8 డెమీ, రు. 175, ప్రతులకు : అడుగుజాడలు పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. 302, వైష్ణవి నెస్ట్, తిరుమల మ్యూజిక్ సెంటర్ వెనుక, మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ – 500 036; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **ప్రజాస్వామిక తెలంగాణ – ఆకుల భూమయ్య రచనలు** – తెలంగాణ విద్యార్థి గళం – 60 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : కె. జగన్ రూం నెం. 40, నర్మదా హాస్టల్ (ఎన్‌ఆర్‌ఎస్‌ఎచ్) ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ – 500 007, సెల్: 9912402011; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **విద్యా హక్కు చట్టం ఎవరి కోసం?** – వ్యాస సంకలనం – పిడిఎస్‌యు రాష్ట్ర కార్యవర్గం ప్రచురణ – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : ఎడిటర్, తిరుగుబాటు, ఇ.నెం. 2-1-716 (బి-6, ఎఫ్-4) ఎస్వీఎస్ స్కూల్ ఎదురుగా, ఒ.యు. మెయిన్ రోడ్, విద్యానగర్, హైదరాబాద్ – 500 044, ఫోన్: 040-27668470 email : pdsu1974@gmail.com




❖ **చికాగోలో నానమ్మ** – తెలంగాణ పల్లె నుండి విశాల విశ్వం దాక – బి.ఎస్. రాములు కథలు – విశాల సాహిత్య అకాడమీ ప్రచురణ – 220 పేజీలు, 1/8 డెమీ, సాదా ప్రతి రు. 120, లైబ్రరీ ప్రతి రు. 150, ప్రతులకు : విశాల సాహిత్య అకాడమీ, 201, సులేఖ గోల్డెన్ టవర్స్, 2-2-186/53/5, రామకృష్ణ నగర్, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్ – 500 013, సెల్: 08331966987




❖ **ప్రసిద్ధ సమకాలీన కన్నడ కథలు** – రంగనాథ రామచంద్రరావు – లక్ష్మి ప్రచురణలు – 128 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : వి. లక్ష్మీకుమారి, 1-11-163/1, 4వ అంతస్తు, ఫ్లాట్ నెం. 402, స్టీఫెన్స్ కాటేజ్, శ్యామ్‌లాల్ బిల్డింగ్, బేగంపేట్, హైదరాబాద్ – 500 016



❖ **ఒక మహా ఆవిర్భావం తర్వాత** – శ్రీమతి పత్తి సుమతి – గురజాడ అధ్యయన వేదిక, ప్రజాపక్ష పత్రిక వివిధ భారతి ప్రత్యేక ప్రచురణ – 80 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు




❖ **తెలంగాణ నూతన ఆకాంక్ష** (వ్యాస సంకలనం) – చెవ్వ రఘుపతి రావు (సి.ఆర్.) – ఎం.ఎం. పబ్లికేషన్స్ – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : సి.ఆర్. వీక్షణ, 12-10-587/96/సి, మేడిబావి, సీతాఫల్‌మండి, సికింద్రాబాద్



❖ **అరణ్యపర్వం** – కథల సంపుటి – ఆలూరి భుజంగరావు – రాహుల్ సాహిత్య సదనం – 199 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు : నవోదయ బుక్ హౌస్; విశాలాంధ్ర బుక్ హౌస్; దిశ పుస్తక కేంద్రం; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో



❖ **తెలంగాణ సాహిత్య సంస్థలు** – డా. బన్న అయిలయ్య – నానీ ప్రచురణలు – 192 పేజీలు, 1/8 డెమీ, రు. 160, ప్రతులకు: శ్రీమతి కె. విజయ, ఎం.ఎ., బి.ఇడి., 2-7-1261/1, 'రాజగృహం', విజయపాల్ కాలనీ, హనుమకొండ – 506370; ఫోన్: 0870 – 2456001



❖ **ఊహల గుస గుసలు** – దీర్ఘ కవిత – కె. బాలకృష్ణారెడ్డి – సుధీర్ ప్రచురణలు – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : కె. బాలకృష్ణారెడ్డి, నిర్మల్ హైట్స్, నిర్మల్ నగర్, ఒంగోలు; సెల్: 94402 42495



❖ **వాయుగానం** – తాళ్లూరి లాబన్‌బాబు – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 151 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 403, విజయసాయి రెసిడెన్సీ, 16-11-20/7/1/1, సలీంనగర్ కాలనీ, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036; సెల్: 9848787284

పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభలు

పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభలు జనవరి 28, 29, 30 తేదీలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగాయి. ఈ సభలో పాల్గొన్న వక్తలు ప్రైవేట్ విద్యా విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సమాజ మార్పు కోసం విద్యార్థులు కృషి చేయాలని, సమాజ మార్పు విద్యార్థులతోనే సాధ్యమవుతుందని తెలియ చేశారు. అలాగే గతంలో నిలిపివేసిన విద్యార్థి ఎన్నికలను తిరిగి నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సభలకు ప్రొ. హరగోపాల్, టిఎన్‌జిఒ అధ్యక్షులు దేవిప్రసాద్‌లతో పాటు విద్యార్థి నాయకులు, విద్యార్థులు హాజరయ్యారు.

సీనియర్ పాత్రికేయులు మృతి

సీనియర్ పాత్రికేయులు మద్దాలి సత్యనారాయణ శర్మ (96) ఫిబ్రవరి 5న హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లోని ఆయన స్వగృహంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చనిపోయారు. ఆయనది కృష్ణా జిల్లా, కలువపాముల గ్రామం. ఆయన 1936లో పాత్రికేయ వృత్తిలో ప్రవేశించారు. ఆయన అనేక పత్రికల్లో పనిచేశారు. మద్రాసు, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్‌లలో పనిచేశారు. ఆంధ్రపత్రికకు సంపాదకులుగా పనిచేశారు.

మాలల మహా గర్జన

ఫిబ్రవరి 9న 'ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఎంఎస్‌ఎ)' ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో మాలల మహా గర్జన జరిగింది. 'తెలంగాణ పునర్నిర్మాణం, సామాజిక న్యాయ సాధనకై' అనే అంశం మీద ఈ సభ జరిగింది. సభకు హాజరైన వక్తలు తెలంగాణ పునర్నిర్మాణంలో అన్ని అణగారిన వర్గాల ప్రజలు ఐక్యం కావాలన్నారు. కులనిర్మూలనకు, సమసమాజ స్థాపనకు ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ సభకు ఎఎంఎస్‌ఎ అధ్యక్షులు మాందాల భాస్కర్, ప్రజా గాయకుడు గద్దర్, తెలంగాణ పొలికల్ జెఎసి కో-చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య, ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొ. మల్లేశ్, ఎంపి వివేక్, మాజీ మంత్రి విజయ రామారావులతో పాటు అనేక మంది హాజరయ్యారు.

తొలితరం నక్సలైట్ నాయకుడు రవూఫ్ మృతి

సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ నాయకులు కామ్రేడ్ రవూఫ్ (89) ఫిబ్రవరి 9న బెంగళూర్‌లో అనారోగ్యంతో చనిపోయారు. ఆయన 1924లో అనంతపురం జిల్లా, కదిరి మండలం, కుటాగుళ్ల గ్రామంలో జన్మించారు. ఆయన కొండపల్లి సీతారామయ్య, కెజి సత్యమూర్తి, పైలా వాసుదేవరావులతో కలిసి సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ(సిఒసి)ని 1971లో ఏర్పాటు చేశారు. పార్వతీపురం కుట్ర కేసులో తీహార్ జైల్లో 13 ఏళ్లు జైలు జీవితం గడిపారు.

బడ్జెట్ సమావేశాలు

2014-15 రాష్ట్ర బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి ఫిబ్రవరి 10న ఓట్ ఆన్ అకౌంట్ పద్ధతిలో ఉభయ సభలో ప్రవేశ పెట్టారు. మొత్తం బడ్జెట్ రు. 1,83,129 కోట్లు, అందులో ప్రణాళికేతరానికి రు. 1,15,179 కోట్లు, ప్రణాళిక వ్యయానికి రు. 67,950 కోట్లు, కేంద్ర పన్నుల వాటా రు. 27,028 కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ రు. 21,078 కోట్లు, సొంత పన్నుల రాబడి రు. 84,780 కోట్లు కేటాయించారు. కేంద్రం ఇస్తున్న జాతీయ ఉపాధి హామీ వంటి కొన్ని పథకాల నిధులను ఈ బడ్జెట్‌కు కలుపడం వలన బడ్జెట్ నిధులు గతం కంటే పెరిగాయి

మున్సిపల్ కార్మికుల సమ్మె

కనీస వేతనాలు, మధ్యంతర భృతి పెంచాలంటూ రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో, కార్పొరేషన్‌లలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 7 నుంచి 13 వరకు సమ్మె చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనం పెంచాలని, డిఎతో పాటు కార్మికుల 20 దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని పభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో తొమ్మిది మున్సిపాలిటీ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సత్యారావు

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా అదపాక సత్యారావును నియమిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఫిబ్రవరి17న ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఫిబ్రవరి 18న పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ముఖ్యమంత్రికి ప్రెస్ సెక్రటరిగా పనిచేశారు.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి రాజీనామా

రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా తన పదవికి ఫిబ్రవరి 19న రాజీనామా చేశారు. రాష్ట్ర గవర్నర్ సిఎం రాజీనామాను ఫిబ్రవరి 21న అమోదించారు. అదేవిధంగా సిఎం మంత్రివర్గ రాజీనామాను అమోదిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ప్రభుత్వం అపధర్మ ప్రభుత్వంగా (జిఒ నెం. 52 ప్రకారం) కొనసాగుతుందని మహంతి తెలిపారు.

అంగన్ వాడీల సమ్మె

అంగన్‌వాడి ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించి, కనీస వేతనం పెంచాలంటూ రాష్ట్రవ్యాప్తంగా 'అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్' ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 నుంచి నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. అలాగే ఫిబ్రవరి 17 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిస్తూ ఫిబ్రవరి 18న హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఫిబ్రవరి 24న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది అంగన్‌వాడి ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

లంబాడీల సమర భేరి

హైదరాబాద్‌లోని నిజాం కాలేజి గ్రౌండ్‌లో ఫిబ్రవరి 25న 'లంబాడ హక్కుల పోరాట సమితి' (ఎల్‌హెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో 'లంబాడాల రాజ్యాధికార సమర భేరి' సభ జరిగింది. ఈ సభకు హాజరైన వక్తలు తెలంగాణ పునర్నిర్మాణంలో లంబాడీలకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని, లంబాడి తండాలను గ్రామ పంచాయితీలుగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభకు ప్రజా గాయకుడు గద్దర్, అరుణోదయ విమలక్క, ఎల్‌హెచ్‌పిఎస్ వ్యవస్థాపకులు బెల్లయ్య నాయక్‌లతో పాటు వివిధ పార్టీల నాయకులు, అనేక మంది హాజరయ్యారు. వీ

తెలంగాణ - ఆంధ్ర: ఒక విజయం, కొన్ని అపజయాలు

***తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ చరిత్ర నేపథ్యంలో తెలంగాణ సాధించిన విజయాన్నీ, తెలంగాణలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ సాగవలసిన ప్రజా ఉద్యమాలను వివరిస్తున్నారు* ఎన్. వేణుగోపాల్**

తెలంగాణ ఒక రాష్ట్రంగా ఏర్పడింది. జస్టిస్ ఫజల్ అలీ నాయకత్వం లోని రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ (1953–55) రోజుల నుంచీ వ్యక్తమవుతున్న ప్రజల కోరిక అనేక మలుపులు తిరిగి ఎట్టకేలకు నెరవేరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు ఫిబ్రవరి 18న లోకసభలో, ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆమోదం పొంది. రాష్ట్రపతి సంతకం కోసం ఎదురుచూస్తున్నది. 2013 జూలై 30న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం, అక్టోబర్ 3న కేంద్ర మంత్రివర్గ నిర్ణయం, డిసెంబర్ 12న రాష్ట్రపతి నుంచి బిల్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు రావడం, జనవరి 30న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆ బిల్లును తిరస్కరిస్తూ తీర్మానం చేయడం, ఫిబ్రవరి 7న కేంద్ర మంత్రివర్గం బిల్లును ఆమోదించడం వంటి ఎన్నెన్నో మజిలీలు దాటిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మరొక రెండు మూడు నెలల్లో పూర్తయి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడుతుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష రాజకీయ నిరుద్యోగుల సృష్టి అనీ, రాజకీయాధికారంలో వాటా కోసం మాత్రమే కొందరు రాజకీయ నాయకులు ఈ ఆకాంక్షను రెచ్చగొడుతున్నారనీ, ఒక వ్యక్తికి మంత్రి పదవి ఇచ్చి ఉంటే తెలంగాణ ఉద్యమమే తలెత్తేది కాదనీ, ప్రత్యేక రాష్ట్ర వాంఛ దొరలదీ, పెత్తందార్లదీ మాత్రమేననీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష అనవసరమైనదీ, అసాధ్యమైనదీ, చరిత్ర వ్యతిరేకమైనదీ, అవాస్తవాలమీద ఆధారపడ్డదీ అనీ, ఎన్నికల ప్రయోజనం కోసమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనీ ఎన్నెన్నో అబద్ధాలు, దుర్వ్యాఖ్యానాలు, కువ్యాఖ్యానాలు, సంకుచిత అర్థాలు చాలకాలంగా ప్రచారంలో ఉన్నాయి. వీటిలో అక్కడక్కడ ఇసుమంత సత్యం ఉన్నప్పటికీ, తెలంగాణ ఆకాంక్ష ప్రాథమికమైన, మౌలికమైన మూడు కారణాల మీద ఆధారపడినందు వల్లనే ఆరు దశాబ్దాలుగా ఆరకుండా రగులుతూ ఉంది. స్థూలంగా చెప్పాలంటే ఆ మూడు కారణాలలో మొదటిది ఆర్థికపరమైనది, రెండవది రాజకీయపరమైనది, మూడవది సాంస్కృతిక రంగానికి చెందినది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోరుకున్నవాళ్లందరికీ, నాయకత్వానికి కూడ ఆ ఆకాంక్షల పట్ల పూర్తి అవగాహన లేకపోవచ్చు. ఎప్పుడైనా సామాజిక పరిణామాలు అంతర్గత, మౌలిక, పరోక్ష సామాజికశక్తుల ఫలితమే తప్ప ఏ ఒక్క వ్యక్తి కోరుకుంటేనో, కొందరు వ్యక్తులు కోరుకుంటేనో, ఏ కొద్ది మంది రెచ్చగొడితేనో జరిగేవి కావు. సామాజిక శక్తుల సంచలనమే, ఐక్యత–ఘర్షణల ఫలితమే సామాజిక పరిణామాలు. సామాజిక శక్తులను ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మూలాల నుంచి అన్వేషించడమే అర్థవంతమైన సామాజిక వివేచన. తెలంగాణ సామాజిక పరిణామాలకు కూడ ఆ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మూలాలను అన్వేషించవలసి ఉంటుంది.

సమాజపు ఆర్థిక, భౌతిక వనరులలో, వాటి ఫలితాలలో తమ న్యాయమైన వాటా తమకు దక్కడం లేదనే అభిప్రాయమే తెలంగాణ ప్రజా ఆకాంక్షల ఆర్థిక కారణం. తమ పూర్వీకులు నివసించిన, తాము నివసిస్తున్న ప్రాంతంలోని భూమి, నీరు, అడవి, ఖనిజాలు, నిర్ణయాధికారం వంటి వనరుల మీద, ఫలితాల మీద తమకు వాటా రావాలని అనుకోవడం ఎక్కడైనా మనుషుల కనీస ఆర్థిక అవగాహన. వర్గ సమాజంలో ఈ అవగాహన సంపూర్ణంగా వాస్తవ రూపం ధరించే అవకాశమే లేదు. కాని ఆ వర్గ సమాజ పరిధిలోపలనే, పాలకవర్గాల దోపిడీ పీడనలు ఉండగా కూడ, తమ వాటా తమకు దక్కాలనే కోరికకు ప్రతిస్పందనగానే 'మేమెంతో మాకంత' వంటి డిమాండ్లు, న్యాయమైన వాటా, రిజర్వేషన్లు, రక్షణాత్మక వివక్ష వంటి విధానాలు పుట్టుకొచ్చాయి. రాజ్యాంగ రచనలో పాత్ర వహించిన ఈ విధానాలే తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంతో విలీనం చేసేటప్పుడు ప్రధాన పాత్ర వహించాయి. ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ వాటా విస్తీర్ణంలో గాని, జనాభాలో గాని 40–42 శాతం గనుక, అంతకుముందు తెలంగాణ రాచరిక పాలనలో ఆధునిక విద్యా, వైద్య, నీటిపారుదల, పాలనా సౌకర్యాలు లేకుండా ఉన్నది గనుక న్యాయమైన వాటా మాత్రమే కాదు, ప్రత్యేకమైన రక్షణలు అవసరమని తెలంగాణ సమాజం కోరుకుంది. ఆ కోరికనే తెలంగాణ నాయకులు వ్యక్తీకరించారు. ఆంధ్ర రాష్ట్ర నాయకులు అంగీకరించారు. తెలంగాణకు ఫెయిర్ షేర్ అనే మాట పెద్దమనుషుల ఒప్పందంలోకి అందువల్లనే వచ్చింది.

ఆర్థిక సమస్యల పరిష్కారం ఎప్పుడైనా రాజకీయ వ్యవస్థ ద్వారానే జరుగుతుంది. కాని పెద్దమనుషుల ఒప్పందంలో వ్యక్తమైన తెలంగాణ ఆర్థిక ఆకాంక్షలను పరిష్కరించడానికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ వ్యవస్థ ప్రయత్నించలేదు. ఆ ఆర్థిక సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల ఏర్పడినది రెండో, రాజకీయ సమస్య. తెలంగాణ ప్రజల ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని సవరిస్తామని చేసిన వాగ్దానాలన్నిటినీ సమైక్య రాష్ట్రం ఏర్పడ్డ మరుసటి రోజు నుంచే ఉల్లంఘించడం ప్రారంభమయింది. ఆ వాగ్దానాల అమలును పర్యవేక్షించే బాధ్యత ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ మండలి వందలాది అభ్యంతరాలు చెప్పినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఆ అభ్యంతరాలను పరిష్కరించవలసిన చట్టబద్ధమైన బాధ్యత ఉన్న గవర్నర్లు ఆ విషయమే మరచిపోయారు. అందుకే పెద్దమనుషుల

ఒప్పందాన్ని చట్టబద్ధం చేస్తూ పార్లమెంటు ఆమోదించిన రక్షణలను అమలు చేయమని 1968లో ఆందోళన ప్రారంభమైంది. ముఖ్యమంత్రి నాయకత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశం 1969 జనవరిలో మరికొన్ని వాగ్దానాలు చేసి, మళ్లీ వాటిని ఉల్లంఘించింది. దానితో రక్షణల అమలు ఆందోళన ప్రత్యేక రాష్ట్ర ఆందోళనగా మారింది. తెలంగాణ నిదుల మిగులుపై కుమార్ లలిత్, జస్టిస్ భార్గవ కమిటీల నివేదికలు, ముల్కీ నిబంధనలు చెల్లుతాయని సుప్రీం కోర్టు తీర్పు, ఇందిరాగాంధీ ప్రతిపాదించిన ఆరు సూత్రాల పథకం, రాజ్యాంగ సవరణ ద్వారా 371 డి అధికరణం, రాష్ట్రాన్ని జోన్లుగా విభజిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు, జి.ఒ. 610, గిర్ గ్లాని కమిషన్, వగైరా... ఆ తర్వాత గడిచిన నాలుగు దశాబ్దాలలో పాలకులు ఎన్ని వాగ్దానాలు చేశారో, అన్నిటికన్నీ ఎలా ఉల్లంఘించారో లెక్కలేదు. అందువల్ల ఈ రాజకీయ సమీకరణాలు ఇలాగే ఉన్నంతకాలం వాగ్దానాల ఉల్లంఘన జరుగుతుందనీ, ఇక కొత్త వాగ్దానాలు, హామీలు అవసరం లేదనీ, రాష్ట్ర ఏర్పాటు మాత్రమే ఏకైక పరిష్కారమనీ 1990ల మధ్య నుంచి మళ్లీ ఉద్యమం రగుల్కొంది.

ఆ ఆర్థిక, రాజకీయ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తూ వచ్చినవి సాంస్కృతిక కారణాలు. తెలంగాణ సమాజం తనకొక ప్రత్యేక అస్తిత్వం ఉన్నదని ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందునుంచే భావిస్తూ ఉండింది. ఆ అస్తిత్వం సమైక్య రాష్ట్రంలో చెరిగిపోగూడదని స్వాభిమాన కాంక్షను ప్రకటించింది. కాని గడిచిన ఆరు దశాబ్దాల పాలనా చరిత్రను, ప్రచార మాధ్యమాల చరిత్రను, వినోద, విజ్ఞాన సాధనాల చరిత్రను, చివరికి సమైక్య రాష్ట్రపు పాఠ్యపుస్తకాలను చూస్తే అడుగడుగునా కనిపించేది తెలంగాణ అస్తిత్వం పట్ల చిన్నచూపు, అవమానం, అవహేళన. విస్మరణ. ఈ సాంస్కృతిక కారణం తెలంగాణ సమాజపు మనసును లోతుగా గాయపరిచింది గనుకనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అంత పెద్ద ఎత్తున సంఘీభావం దొరికింది. ఈ సాంస్కృతిక అణచివేత ప్రభావం గణనీయంగా ఉండడం వల్లనే ఉద్యమ క్రమంలో తెలంగాణ సాంస్కృతిక వికాసం వెల్లువలా పెల్లుబికింది.

ఇంత లోతైన, విస్తృతమైన ప్రజా ఆకాంక్ష గనుకనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాలకవర్గాలు కూడ పరిగణనలోకి తీసుకోక తప్పలేదు. అంతేగాక ఇది ఒక ప్రాంతీయ ఆకాంక్ష గనుక ఈ ప్రాంతపు పాలకవర్గ ముఠాలు కూడ ఇందులో భాగం కావడంతో ఈ సమస్యను పరిష్కరించడం పాలకవర్గాలకు అనివార్యమైపోయింది. ప్రజల ఆకాంక్షలు, పాలకవర్గాలలో కొన్ని ముఠాల ఆకాంక్షలు ఏకమయ్యే సందర్భాలు చరిత్రలో అరుదుగానైనా ఉన్నాయి. మన కళ్ల ముందరే బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా భారత ప్రజానీకం, భారత పాలకవర్గ ముఠాలు ఏకమైన ఉదాహరణ ఉంది. ప్రస్తుత తెలంగాణ ఉద్యమం మరొక ఉదాహరణ. ఇలా పాలకవర్గాలు కూడ కలిసి ఉన్నందువల్లనే ఉద్యమానికి ఒక స్థాయిలో గుర్తింపూ, బలమూ వచ్చాయి, మరొక స్థాయిలో ప్రజావ్యతిరేక ధోరణులూ, బలహీనతలూ వచ్చాయి. వర్తమాన చరిత్రను సక్రమంగా, సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఈ రెండు అంశాలనూ సవ్యంగా అర్థం చేసుకోవడం అవసరం. ఈ ద్వంద్వ స్వభావాన్ని అర్థం చేసుకున్నప్పుడే తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో పాలకవర్గ ముఠాల సందిగ్ధాలు, ఊగిసలాటలు, కుట్రలు, వెన్నుపోట్లు, మౌనాలు, గాంభీర్య వ్యక్తీకరణలు అర్థమవుతాయి. పాలకవర్గ ముఠాల నాయకత్వంలో, వారి మధ్య ఘర్షణగా జరిగినందువల్లనే ఈ ప్రజా ఉద్యమం ఎన్నడూ సమరశీల పోరాటరూపాలు చేపట్టకుండా నాయకత్వాలు జాగ్రత్త పడ్డాయి. అయితే వారు ఉద్యమాన్ని అహింసాయుతంగా నడిపామని ఎన్ని గొప్పలు చెప్పుకున్నప్పటికీ అపారమైన ప్రాణనష్టం సంభవించిందంటే ఉద్యమంలో ఒకవైపు నుంచి హింస జరగలేదనే గాని, అవతలివైపు నుంచి హింస జరిగిందన్నమాట.

దేశంలో ఒక కొత్త రాష్ట్రం ఏర్పాటు అనేది చాల సులభమైన, రాజ్యాంగ బద్ధమైన ప్రక్రియ. ఇప్పుడు జరిగిన తీరు చూసినా లోకసభ, రాజ్యసభలలో కలిపి ఆరుగంటలకు మించని చర్చతో రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ప్రధానభాగం పూర్తయిపోయింది. మరి ఈ ఆరు గంటల కోసం అరవై సంవత్సరాల తాత్సారం ఎందుకు జరిగిందంటే పాలకవర్గ ముఠాల మధ్య పంపకాల వాటాలు కుదరకపోవడం ఒక అంశం, ప్రజలు కోరినదాన్ని, కోరినట్టుగా ఇవ్వగూడదనుకునే పాలకవర్గ స్వభావం మరొక అంశం. ప్రజా ఉద్యమం కూడ పాలకులను లొంగదీసే సమరశీల పోరాటరూపాలు చేపట్టకుండా ఉద్యమ నాయకత్వం రూపొందించిన ఆటంకాలు మరొక అంశం.

గత చరిత్ర అంతా వదిలేసినా, 2004 ఎన్నికల వాగ్దానం తర్వాత ఏరోజునైనా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం యుపిఎ బాధ్యతగా ఉండింది. అది సరిగ్గా పది సంవత్సరాలు ఆలస్యం చేసింది. ఆ పది సంవత్సరాలలో అనవసరంగా వ్యాపించిన వైమనస్యానికీ, వైషమ్యానికీ, ఆత్మహత్యలకూ, మనస్తాపాలకూ, వనరుల విధ్వంసానికీ కాంగ్రెస్ బాధ్యత వహించాలి. యుపిఎ మొదటి ఐదు సంవత్సరాల తాత్సారం ఒక ఎత్తు కాగా, 2009 డిసెంబర్ 9న 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతున్నది' అని స్వయంగా కేంద్ర హోంమంత్రి చేసిన ప్రకటన అమలులోకి రాకుండాపోవడం మరొక ఎత్తు. ఆ ప్రకటన తర్వాత రెండు వారాలలోనే ఆ ప్రకటనను ఉపసంహరించుకుని 'విస్తృత ప్రాతిపదికపై చర్చలు జరపవలసిన అవసరం ఉన్నద'ని శ్రీకృష్ణ కమిటీ వేశారు. దానితో ఒక సంవత్సరం తాత్సారం చేసి, దాని నివేదిక వచ్చిన తర్వాతనైనా వెంటనే నిర్ణయం తీసుకోలేదు. మరొక రెండున్నర సంవత్సరాలు సమయం వృథాచేసి, పాలక ప్రతిపక్ష ముఠాలు ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన చేసి, చివరికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తన నిర్ణయం ప్రకటించింది. అప్పుడైనా పని వేగంగా జరిగిందా అంటే అదీ లేదు. మరొక నాలుగు నెలలు నత్తనడక నడిచి, ఇక ఎన్నికలు ఆరు నెలల్లోకి వచ్చాయనగా హడావిడిగా బిల్లు తయారీ మొదలయింది. సంబంధిత రాష్ట్ర శాసనసభ అభిప్రాయాలు తెలుసుకోవాలనే రాజ్యాంగ నియమం హాస్యాస్పదంగా, జుగుప్సాకరంగా అమలయింది. రాష్ట్ర శాసనసభ తన అభిప్రాయం చెప్పలేదు సరిగదా మందబలంతో బిల్లును తిరస్కరించింది.

ఆ తర్వాత చర్చించవలసిన, అవసరమైన సవరణలు ప్రతిపాదించ వలసిన లోకసభ, రాజ్యసభలలో కోస్తా, రాయలసీమ సభ్యులు, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాది పార్టీ సభ్యులు చేసిన నినాదాలు, గందరగోళం వల్ల వివరమైన, అవసరమైన చర్చ జరగకుండానే

మూజువాణి వోటుతో, ఒకరకంగా బలవంతంగా, అప్రజాస్వామికంగా మందబలంతోనే బిల్లు ఆమోదం పొందింది. అయితే ఆంధ్రప్రదేశ్ శాసనసభే దీనికి దారి చూపింది గనుక ఒక అక్రమానికి మరొక అక్రమం జవాబు చెప్పిందనుకోవాలి.

ఈ మొత్తం క్రమంలో, నిజంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల ప్రయోజనాలేమైనా దెబ్బ తింటాయా, అలా జరిగితే వాటిని ఎలా పరిష్కరించాలి అని ఏ మాత్రం చర్చ జరగలేదు. వ్యాపారస్తులు, సంపన్నులు, కాంట్రాక్టర్లు అయిన చట్టసభల సభ్యులు తమ ప్రయోజనాలకు, మార్కెట్లకు, ముడిసరుకుల సరఫరాకు భంగం వాటిల్లుతుందేమో అనే అనుమానంతో, తెలంగాణ వనరులు ఎల్లకాలానికీ తమకే చెందాలనే ఆశతో ఈ చర్చలను అడ్డుకున్నారు. ఆ రకంగా శాసనసభలోనైనా, పార్లమెంటులోనైనా మందబలం ప్రయోగం వల్ల ఎక్కువగా నష్టపోయినది కోస్తా, రాయలసీమ ప్రజానీకమే. వారిని ఆ నష్టానికి గురిచేసినది ఆ ప్రాంతపు ప్రజాప్రతినిధులుగా నటిస్తున్న స్వార్థప్రయోజనశక్తులే.

అలా కోస్తా, రాయలసీమ ప్రజల సమస్యలను, అవసరాలను పక్కనపెట్టి తమ సొంత కంపెనీల, ఆస్తుల, కాంట్రాక్టుల, కుటుంబాల ప్రయోజనాల కోసం అక్కడి ప్రజాప్రతినిధులు పోరాడగా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని తామే ఇచ్చామని, తమ వల్లనే వచ్చిందని ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ రెండూ కూడ ప్రత్యక్షంగా తెలంగాణ ఆశయానికి ద్రోహం చేయడానికే ప్రయత్నించాయి. కాంగ్రెస్ తాత్సారంతో, చివరిదాకా సాగలాగి, అసలు బిల్లు ఆమోదం పొందుతుందా లేదా అనే ఉత్కంఠను కలిగించి, ఏదో ఒక బిల్లు వస్తే చాలుననే మనఃస్థితి కల్పించి, అనేక లోపాలతో తయారయిన బిల్లు విషగుళికను తెలంగాణచేత మింగించింది. మరొకవైపు భారతీయ జనతా పార్టీలో కొందరు నాయకులు తమవల్లనే తెలంగాణ సాధ్యమవుతుందని ప్రకటిస్తుండగానే, మరి కొందరు నాయకులు తెలంగాణను ఆపడానికి, బిల్లుకు ఆటంకాలు కల్పించడానికి, బిల్లును ఓడించడానికి చివరి నిమిషం దాకా ప్రయత్నాలు చేశారు. రాజ్యసభలో చిట్టచివరి గంటలో కూడ భాజపా నాయకుడు వెంకయ్య నాయుడు కోస్తా, రాయలసీమ అనుకూల సవరణలు అనే సాకుతో (నిజానికి అవి ఆ ప్రాంత ప్రజలకు అవసరమైన, ఉపయోగపడే సవరణలు కూడ కాదు, ఆ ప్రాంత సంపన్నులకు, వ్యాపారులకు, కాంట్రాక్టర్లకు, బహుళజాతిసంస్థలకు ఉపయోగపడే సవరణలు మాత్రమే) బిల్లును అడ్డుకుంటామని హెచ్చరించాడు.

ఒకవైపు అధికార కాంగ్రెస్ కూ ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ కీ మధ్య తెలంగాణ బిల్లు విషయంలో ఒప్పందం కుదిరిందనే ఊహాగానాలూ, ప్రకటనలూ సాగుతుండగానే ఆ రెండు పార్టీలూ తెలంగాణ బిల్లును చివరిక్షణంలోనైనా ఆపడానికి ఈ కుట్రలూ కుహకాలూ సాగించాయి. ఢిల్లీ పీఠం మీద తెలంగాణ వ్యతిరేక పన్నాగాలు ఇంత బహిరంగంగా, నిర్లజ్జగా జరుగుతూ ఉండగా అన్ని పార్టీల తెలంగాణ నాయకత్వాలూ, ప్రత్యేకించి తెలంగాణ కోసమే ఏర్పడ్డాననే తెలంగాణ రాష్ట్ర సమితి నాయకత్వమూ అయితే మౌనమైనా వహించాయి, లేదా అసమర్థమైన నామమాత్రపు నిరసననైనా తెలిపాయి.

ఆ కుట్రలూ కుహకాలూ మౌనమూ కలిసి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు 2014 ఎన్నో తెలంగాణ వ్యతిరేక, ప్రతికూల, నిరర్థక అంశాలతో రూపొందింది. మిగిలిన ఆంధ్రప్రదేశ్ కు ఏ రాయితీలు, మినహాయింపులు, నిధులు, వాగ్దానాలు ఇచ్చినా, అవి అక్కడి ప్రజలకు నిజంగా చెందకపోయినా అది పట్టించుకోవలసిన విషయమే గాని, అంతకన్న తీవ్రంగా పట్టించుకోవలసిన విషయం తెలంగాణ ఆరు దశాబ్దాలుగా ఏమి కోరుతున్నదో అవి లేకుండా, వాటికి వ్యతిరేకంగా నిబంధనలతో బిల్లు తయారుచేసి అది తెలంగాణ బిల్లు అని నమ్మించడం.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు 2014 లోనూ, దానికి లోకసభ, రాజ్యసభలలో ప్రతిపాదించిన సవరణలలోను తెలంగాణ వ్యతిరేక అంశాలు ఎన్ని ఉన్నాయో, తెలంగాణ ఇన్నాళ్లుగా కోరుతున్న అంశాలు ఎట్లా ధ్వంసమై పోయాయో వివరంగా చెప్పడానికి ఇక్కడ స్థలం సరిపోదు గాని ఐదారు ముఖ్యమైన విషయాలు చెప్పాలి.

తెలంగాణ రావడానికి పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా అంగీకరించి మూడులక్షల మంది ఆదివాసులను బలి పెట్టవలసి వచ్చింది. 'తెలంగాణ వస్తే చాలు ఆదివాసులు ఏమైపోయినా ఫరవాలేదు' అని తెలంగాణ రాజకీయ నాయకత్వం, 'ఆదివాసులు తెలంగాణలో ఉండిపోతే పోలవరం కట్టి వారిని ముంచడానికి తెలంగాణ అభ్యంతరం చెపుతుందేమో, కనుక వాళ్లను మాకివ్వండి, వాళ్లను ముంచి పోలవరం కట్టుకుంటాం' అని కోస్తా, రాయలసీమ రాజకీయ నాయకత్వం అన్నాయంటే ఎంత దుర్మార్గమైన, అమానవీయమైన రాజకీయ వాదనలు రాజ్యం చేస్తున్నాయో ఊహించవచ్చు. పోలవరం అనేక కారణాల వల్ల ఎంతమాత్రం నిర్మించగూడని ప్రాజెక్టు. ముంపు, పర్యావరణం, సాంకేతిక అంశాలు, ఆర్థిక లాభనష్టాలు, ప్రయోజనాలు, ప్రత్యామ్నాయాలు వంటి ఏ కోణం నుంచి చూసినా అది అంగీకరించడానికి వీలులేని ప్రాజెక్టు. దానివల్ల విశాఖపట్నం – కాకినాడ పెట్రో కెమికల్ బహుళజాతి సంస్థల పరిశ్రమల కారిడార్ కు, కృష్ణా – గుంటూరు జిల్లాల మూడో పంటకు తప్ప మరే ప్రయోజనమూ లేదు. ఇవాళ సమైక్య ఉద్యమం పేరుతో నడిచినది కృష్ణా – గుంటూరు జిల్లాల ఒక సామాజికవర్గపు ప్రయోజనాల పరిరక్షణ ఉద్యమమే గనుక, వారు బహుళజాతిసంస్థలకు దళారీలే గనుక ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చర్చలో పోలవరానికి ప్రాధాన్యత వచ్చింది. తాను ఎన్నో సంవత్సరాలుగా వ్యతిరేకిస్తున్న పోలవరం ఇప్పుడు చట్టబద్ధంగా మారిపోతుంటే మౌనంగా ఉండిపోవడం తెలంగాణ ఉద్యమ నాయకత్వపు బలహీనత.

బిల్లు హైదరాబాద్‌ను పది సంవత్సరాల పాటు ఉమ్మడి రాజధానిగా మార్చింది. దాని మీద అధికారాన్ని గవర్నర్‌కు దఖలు పరచింది. ఒకరకంగా ఇది హైదరాబాదును కేంద్రపాలిత ప్రాంతంగా చేయడంతో, తెలంగాణ నుంచి దూరం చేయడంతో సమానం. హైదరాబాద్ ను తెలంగాణ నుంచి విడదీయడం నైసర్గికంగా, భౌగోళికంగా మాత్రమే కాదు, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవితంలో కూడ అసాధ్యమూ, అవాంఛనీయమూ. నిజానికి గత కొన్ని దశాబ్దాలుగా హైదరాబాద్ విపరీతమైన కేంద్రీకరణకు గురయింది. ఆధునిక ప్రజాస్వామిక పాలనా పద్ధతులలో ముఖ్యమైన వికేంద్రీకరణ చిన్న చిన్న విషయాలలో కూడ జరగకుండా పోయింది. అందువల్లనే సంపద అంతా

పోగుపడిన హైదరాబాద్ వివాదాలకు కేంద్ర బిందువయింది.

అలాగే బిల్లు రెండు రాష్ట్రాలకూ ఉమ్మడి గవర్నర్‌ను, ఉమ్మడి హైకోర్టును, ఉమ్మడి ప్రభుత్వరంగ సంస్థలను, నదీ జలాల బోర్డులను, ఉమ్మడి విద్యా సంస్థలను ప్రతిపాదిస్తున్నది. ఇటువంటి నిబంధనలన్నీ ఇంతవరకూ ఎప్పుడూ ఎక్కడా ఏ రాష్ట్ర విభజనలోనూ లేనివి, అచారిత్రికమైనవి, రాజ్యాంగవ్యతిరేకమైనవి, ఇకముందు అనవసర వివాదాలకు దారితీసేవి.

మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు రెండు రాష్ట్రాలను ఏర్పరచి వాటి మధ్య శాంతి, స్నేహ, సుహృద్భావాలకు మార్గం సుగమం చేయడం కాకుండా ఆరని చిచ్చును రగిలించేలా ఉంది. బిల్లులో తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న అంశాలను ఎట్లా అధిగమించవచ్చుననే ఆలోచనలు ఇప్పటికే కొంతమంది ఆలోచనా పరులలో ప్రారంభమయ్యాయి. చట్టబద్ధమైన సవరణల ద్వారా, న్యాయస్థానాలను ఆశ్రయించి సవరణలు సాధించడం ద్వారా, బిల్లులో పొందుపరచిన నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా అధిగమించ వచ్చునని కొందరు అభిప్రాయ పడుతున్నారు. కాని ఈ మూడు మార్గాలలోను సాధ్యమైనవీ, సాధ్యం కానివీ కూడ ఉంటాయి.

ఈ మూడు మార్గాల కన్న ప్రజలలోకి వెళ్లి బిల్లు లోపాల గురించి వివరించి, ఆ లోపాల సవరణకు ప్రజా ఉద్యమాన్ని నిర్మించడమే ఇటు లోపాల సవరణకైనా, అటు ప్రజా చైతన్యం వికసించడానికైనా ఉత్తమ మార్గం. 'నిన్న విడిచిన పోరాటం నేడు అందుకొనక తప్పదు' అన్నట్టుగా తెలంగాణ సాధన పోరాటం ముగిసినా, తెలంగాణ పునర్నిర్మాణం కోసం జరగవలసిన పోరాటం కొనసాగవలసిందే. బిల్లులో లోపాల సవరణను కూడ పునర్నిర్మాణ ప్రయత్నంలో భాగంగానే చూడవలసి ఉంటుంది.

కాగా, తెలంగాణ ఉద్యమం సాగినంతకాలం కోస్తా, రాయలసీమ లలో అశేష ప్రజానీకం మౌనంగానే ఉండిపోయారు. 2004 ఎన్నికలలో కాంగ్రెస్, 2009 ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీలన్నీ తెలంగాణ అనుకూల ప్రకటనలు చేసినప్పటికీ కోస్తా, రాయలసీమ ప్రజలలో వ్యతిరేకత కనిపించలేదు. కేవలం 2009 డిసెంబర్ 9 తర్వాత శాసనసభ్యుల ఆశ్రితులు ప్రారంభించిన ఆందోళనల వల్ల, ఆ ఆందోళనలకు మితిమీరిన ప్రచారం ఇచ్చి వైమనస్యాన్ని, విద్వేషాన్ని రెచ్చగొట్టిన ప్రచార మాధ్యమాల వల్ల, కొద్దిమంది తెలంగాణ నాయకులు వ్యక్తం చేసిన తప్పుడు అభిప్రాయాల వల్ల కోస్తా, రాయలసీమ ప్రజలలో కొంతవరకు భయాందోళనలు వ్యాపించాయి. సాగునీరు, విద్యావకాశాలు, ఉద్యోగా వకాశాలు, హైదరాబాద్ అవకాశాలలో వాటా వంటి వాటికి ఏం జరుగుతుందోననే అనుమానాలు తలెత్తాయి.

ఇప్పుడిక రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి గనుక, రెండు రాష్ట్రాలలోను ఉన్నది తెలుగు మాట్లాడే ప్రజలే గనుక, వీరి మధ్య సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి గనుక సమస్యలేవైనా ఉన్నా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేయవలసి ఉంది. ఇదే సమయంలో తమ సొంత నాయకులు వారి సొంత లాభాల కోసం తమను ఎలా బలిపెట్టారో కూడ ఆంధ్రప్రదేశ్ ప్రజలు గుర్తించవలసి ఉంది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు దాకా ప్రతి జిల్లాలోను ఎన్నో ప్రజా సమస్యలు ఉన్నాయి. ఆ సమస్యల పరిష్కారం కోసం ఏ ఒక్కరోజూ పనిచేయని రాజకీయ నాయకులు ఇప్పుడు సమైక్య ఆంధ్ర ప్రదేశ్ పేరుతో తమను రెచ్చగొట్టి, పావుల్లా వాడుకున్నారని అక్కడి ప్రజలు గుర్తించవలసి ఉంది. ఒక కొత్త రాష్ట్రాన్ని, కొత్త రాజధానిని, కొత్త పాలనా విధానాలను రూపొందించుకునే అరుదైన అవకాశం వచ్చిన సందర్భంగా ఆ అవకాశాన్ని ప్రజానుకూలంగా మార్చుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రయత్నించవలసి ఉంది. రాజధాని కోసం కీచులాటలు కాకుండా, హైదరాబాద్ కేంద్రీకరణ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని వికేంద్రీకరణ అభివృద్ధి నమూనాను ప్రతిపాదించి, అమలు చేసుకోవలసి ఉంది. విశాఖ – కాకినాడ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్ మెంట్ కారిడార్, కోస్తా కారిడార్, పోలవరం, బాక్సైట్ తవ్వకాలు, అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఓడరేవులు, చేపల చెరువులు, రాయలసీమ సమస్యలు వంటి ఎన్నో తీవ్రమైన ప్రజా సమస్యలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడుతున్నది. గత అనుభవాన్ని బట్టి చూస్తే అక్కడి రాజకీయ నాయకత్వం ఈ సమస్యల పరిష్కారానికి ఇసుమంత ప్రయత్నమైనా చేయదని, ప్రజలకు మరింతగా సమస్యలు సృష్టిస్తుందని స్పష్టమవుతున్నది గనుక ప్రజలను సంఘటితం చేసి ఈ సమస్యల మీద పోరాటాలు నిర్వహించవలసిన బాధ్యత అక్కడి ప్రజానుకూల శక్తుల మీద ఉన్నది. తమ పోరాట చైతన్యంతో సుప్రసిద్ధులైన తెలంగాణ రాష్ట్ర ప్రజలు తమ సమస్యల పరిష్కారాల కోసం పోరాడుతూనే ఆంధ్రప్రదేశ్ ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించవలసి ఉన్నది. రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు తమ ఉమ్మడి సమస్యల మీద, విడివిడి సమస్యల మీద పాలకవర్గాల మీద రాజీలేని పోరాటాలకు సిద్ధపడవలసిన బాధ్యతను చరిత్ర వారి మీద మోపుతున్నది. తెలుగు ప్రజల వైభవోజ్వల ఉద్యమ నేపథ్యం తెలిసినవారెవరైనా వారు ఈ చారిత్రక కర్తవ్యాన్ని తప్పనిసరిగా స్వీకరిస్తారని, విజయాలు సాధిస్తారని ఆశించవచ్చు.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు.*

– సం.

ఆంక్షల సంకెళ్లలోకి తెలంగాణ!

ఆరు దశాబ్దాల పాటు ఉద్యమించి సాధించుకున్న భౌగోళిక తెలంగాణను ఆక్షలు లేని తెలంగాణగా మలచుకోవడానికి మరో ప్రజా ఉద్యమం చేయాలని అంటున్నారు కె. ప్రభాకర్

'ఎవరి చేతులకు సంకెళ్లు వేసినా అవి నా జాతి ప్రజలందరికే వేసిన సంకెళ్లే' – నెల్సన్ మండేలా. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెట్టబడుతున్న సందర్భంలో ఇరు ప్రాంతాల ప్రజలకు న్యాయం జరగాలని కోరుకునే వాళ్లైనా, సమైక్యంగా ఉండాలని ఆకాంక్షించే వాళ్లైనా, తెలంగాణ కోసం ఆందోళనే జీవితంగా, పోరాటమే ఊపిరిగా బతుకుతున్న వాళ్లు, బతుకుని చాలిస్తున్న వాళ్లు తీవ్రంగా ఆలోచించాల్సిన సందర్భం.

నిజాయితీగా ప్రజల ఆకాంక్షలను గుర్తించే, చిత్తశుద్ధి ఉన్నటువంటి రాజకీయ పార్టీలన్నీ 'ఆంక్ష'లతో ఆమోదం పొందబోతున్న తెలంగాణ బిల్లు గూరించి చర్చించవలసి ఉంది. ప్రజా వ్యతిరేక అంశాలపట్ల పోరాడ వలసి ఉంది. పార్లమెంటులో సవరణల కోసం ప్రయత్నించడంతో పాటు, ఆంక్షలులేని తెలంగాణ కోసం, 'విభజన వికాసానికే అన్న దృక్పథంతో ఇరు ప్రాంతాల నాయకులు, పైన చెప్పిన నెల్సన్ మండేలా' మాటల నేపథ్యంలో కృషి చేయవలసి ఉంది.

ప్రజా సంక్షేమమే మా ధ్యేయం అని ప్రకటించుకున్న రాజకీయ పార్టీలు విభజన అనివార్యమని, అది పార్లమెంటులో ఆమోదం పొందుతున్న సందర్భంలోనైనా, తమ కర్తవ్యంగా ప్రజలకు నష్టదాయకంగా ఉన్నటువంటి అంశాల గురించి ఆలోచించడం విజ్ఞత కలిగిన వారి పని. కానీ అందుకు విరుద్ధంగా ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుని తీరతామని, అక్రమ పద్ధతుల్లోనో, ఆధిపత్య ఆంక్షలతోనో ఇక ఇరు ప్రాంతాలను కలిపి ఉంచడం అసాధ్యమని మొదటగా గుర్తించవలసి ఉంది. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రాంత నాయకులు ఆ ప్రాంత ప్రజల్ని కొద్దికాలం మోసగించడం సాధ్యం కావచ్చుకాని, వాస్తవాలు గుర్తిస్తున్న ప్రజలు తగిన సందర్భంలో సరైన పద్ధతుల్లో ఆయా పార్టీలకు, నాయకులకు తగిన జవాబు ఇస్తారని అనేక సందర్భాల్లో రుజువైంది.

ఏర్పడితే తమ సకల సౌలభ్యాలు కోల్పోతామన్న బెంగతో అటు సీమాంధ్ర ప్రజల ఆందోళనల మధ్య, ఇటు తెలంగాణ నాయకుల సౌలభ్యాలు నెరవేరే పరిస్థితుల్లో అనేక అక్రమ సవరణలతో బిల్లు ఆమోదం పొందింది.

ఇది నాబోటి సామాన్య కార్యకర్తకు ఈ పది పన్నెండేళ్లుగా తెలంగాణ ఎందుకు? తెలంగాణ వస్తే ఏమొస్తుంది? అన్న ప్రశ్నలకు అనేక సభల్లో మాట్లాడిన మాటలకు, ఉపన్యాసాలకు భిన్నంగా ఏర్పడ బోతున్న తెలంగాణ భవిష్యత్ చిత్రపటం అగమ్యగోచరంగా కనిపిస్తుంది. ప్రజల ప్రయోజనాలకు, ఆకాంక్షలకు భిన్నంగా నాయకుల, స్వప్రయోజనాలకు అనుగుణంగా తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టారని అర్థమవుతోంది. అందులో మొదటిది ఇరుప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా హైదరాబాద్‌ను 'పదేళ్ల ఉమ్మడి రాజధాని', గవర్నర్‌కు ప్రత్యేక అధికారాలు, ఆంక్షలతో పరిపాలన కొనసాగడం.

'విభజన వికాసానికే' అన్న సంకల్పం కాస్త అటు సీమాంధ్ర, ఇటు తెలంగాణ ప్రజలను 'ముంపు'కు గురిచేస్తున్న పోలవరం ప్రాజెక్టు జాతీయ హోదాను కల్పించడం. అభివృద్ధి పేరిట రెండు వందలకుపైగా గ్రామాలను, మూడు లక్షల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమిని, విస్తీర్ణమైన అటవీ సంపదను విధ్వంసం చేయడం ద్వారా నిర్మించ తలపెట్టిన పోలవరంతో కోస్టల్ కారిడార్ నిర్మితమవుతున్న, బహుళజాతి పెట్టుబడి వర్గాలకు తప్ప మరెవ్వరికి ప్రయోజనం లేనిది.

గోదావరి జలాల వినియోగం జరగకపోవడం వల్ల, గోదావరి నది జలాలను తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణంతో అను సందానించక పోవడం వల్ల సమైక్య రాష్ట్రంలో సాగిన జల దోపిడి ఇక ముందు 'పోలవరం' రూపంలో మరింత యథేచ్ఛగా సాగబోతున్నప్పుడు ఎందుకో ఈ తెలంగాణ! అట్లాగే రాష్ట్రం విడిపోవడం ద్వారా తమ స్వయం పరిపాలన ద్వారా ఇన్నాళ్లూ తెలంగాణ ప్రజలకు తెలంగాణ ఉద్యమం వాగ్దానం చేసిన ఆకాంక్షలు నెరవేరకుండా 'పదేళ్లు' ఉమ్మడి రాజధాని అనే అంశం అప్రజాస్వామికమైనది. ఈ పదేళ్లూ అటు ప్రాంతవారూ ఇటు రాకపోకలు, నివాస, విద్య, ఉద్యోగ వ్యాపార రంగాలతో పాటు రాజకీయ నిర్ణయాత్మక అంశాల్లో ఈ ప్రాంతం మీద ఆధారపడడం వల్ల నష్టాలే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదు.

సాధ్యమైనంత త్వరలో నూతన రాజధాని నిర్మాణానికి పాల్పడడం ద్వారా సీమాంధ్ర ప్రాంత నిరుద్యోగులకు, సెక్రటేరియట్, హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్, కోర్టులు, వైద్య, విద్యాలయాలతో పాటు ఆయా రంగాల్లో వెల్లువెత్తే అవకాశాలను, ఉమ్మడి రాజధానిపేరా కొల్లగొట్టడమే జరుగుతుంది.

ఇటు తెలంగాణ ప్రాంతంల్లో ఇన్నేళ్లుగా ఆయా రంగాల్లో జిఒ 36, ప్రెసిన్షియల్ ఆర్డర్, 610 జిఓ, గిర్‌గ్లాని నివేదికలో తేలిన అక్రమాలు సరిచేయడం ద్వారా తెలంగాణ ప్రాంత నిరుద్యోగుల కళ్లల్లో వెలుగు విరజిమ్మే మార్పును పదేళ్ల పాటు ఆయా రంగాల్లో ఎలాంటి మార్పులుండవు అని ప్రకటించడం ద్వారా ఆర్పివేయ చూస్తున్నారు.

దీనికి తోడు, హైదరాబాద్‌లో ఉన్నటువంటి సెక్రటేరియట్, రాష్ట్ర స్థాయి కార్యాలయాలున్న ఖైరతాబాద్ ప్రాంతాన్ని ప్రత్యేక ప్రాంతంగా ఇరు ప్రాంతాల ప్రజల ప్రయోజనాలకు, సౌలభ్యాలకు భంగకరంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధికి ఉమ్మడి గవర్నర్ పాలనను విస్తరింప చేయడం అన్యాయం. హైదరాబాద్‌లో నివసిస్తున్నా ఆయా పనులపై విద్య, ఉద్యోగ తదితర రంగాల్లో స్థిరపడ్డవారికి ఈ పదేళ్లకాలం ఓ

అగ్ని పరిక్షను శాంతిభద్రతల పేర ఎదుర్కోవాల్సి రావడం తీవ్ర అభ్యంతరకరమైంది. శాంతిభద్రతలతో పాటు, రెవెన్యూ లావాదేవీలు, అప్పులు, ఆస్తులు పంపకాల్లో ఇంతకు ముందు ఏర్పడ్డ రాష్ట్రాల సందర్భంగా పాటించిన షరతులకు భిన్నంగా ఉమ్మడి రాజధాని ప్రతిపాదన ముందుకు తేవడం అత్యంత అప్రజాస్వామికమైన అంశం.

ఇది నూతనంగా ఏర్పడబోయే రెండు రాష్ట్రాలకు తీవ్ర ఇబ్బందికరమైన అంశం. దూర, భారాలకు వ్యయ ప్రయాసాలకు ఓడ్చడం అవసరమైన అంశం. అదే కోవలో నూతనంగా ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర రాజధాని, రాష్ట్ర రాజధానిలో పునర్నిర్మాణం చేయాల్సిన కార్యాలయాలు, లక్షలాది నియామకాలు, పరిపాలనా సౌలభ్యాలను నిరాకరించ పూనుకోవడం సీమాంధ్ర, సమైక్య నాయకుల విద్రోహానికి నిదర్శనం.

హైదరాబాద్ చుట్టంతా ఇప్పటికే నియమాలకు విరుద్ధంగా నిర్మిత మవుతున్న విల్లాలు, కొల్లగొట్టిన లక్షలాది ఎకరాల ప్రజల భూములు, పూడ్చబడిన చెరువులు, హైటెక్ పేరిట, గ్రేటర్ హైదరాబాద్ పేరిట ఐదు జిల్లాల్లోని 35 మండలాలు, దాదాపు 800 గ్రామాలు వాటి గ్రామ పంచాయితీ రద్దుకాబోవడం, మున్సిపల్ పరిపాలన ఎంతటి అసౌకర్యానికి గురి చేస్తుందో ఊహించలేం.

అట్లాంటి హైదరాబాద్ నగరంలోనే ఉమ్మడి రాజధానికి సంబంధించిన పరిపాలన కొనసాగడం, చట్ట పరిధిలో ఏర్పడనున్న వివాదాల వల్ల హైదరాబాద్ నగర జీవనం ఎంతటి సంక్షోభంలోకి నెట్టివేస్తుందో ఊహించడం కష్టం.

సీమాంధ్ర ప్రజలు, ఉద్యోగులు హైదరాబద్ నగరంలో గవర్నర్ పరిపాలన వల్ల ఇంతకు ముందటి సౌలభ్యాలతో పాటు ఉచితంగా కార్యాలయ వసతులు, నీళ్లు, సేవా తదితర రంగాలను వినియోగించు కోవడం సమస్యాత్మకం కానుంది. ఉద్యోగాల్లో కొనసాగిన వివక్ష రూపుమాపకుండా, పదేళ్లపాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో జోక్యం చేసుకోబోతున్నా హామీవల్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరకపోగా తీవ్ర అసంతృప్తికి గురి కావాల్సి వస్తుంది. ఇవాళ్టికి విద్య, వైద్యం కార్పొరేటీకరణకు చెంది సామాన్యునికి అందుబాటులో లేకుండా పోతుందనేది నిర్వివాదాంశం. అట్లాంటి విద్యా రంగాన్ని 'కెజి నుండి పిజి' దాకా ఉచితంగా అందిస్తామన్న హామీ నెరవేరాలంటే అనివార్యంగా ఇప్పుడున్న వివిధ రకాల ప్రైవేట్, ఎయిడెడ్ కార్పొరేట్ పాఠశాలల్ని ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, అందరికీ సమాన విద్యను అందించాలి.

అట్లాగే కనీసం కడుపునొప్పి లేచినా కార్పొరేట్ దవాఖానకు వెళ్తే లక్షల్లో ఫీజుల రూపంలో కొల్లగొడుతున్న కార్పొరేట్ వైద్యం స్థానంలో ప్రజా వైద్యం, ప్రజలందరికీ ఉచిత వైద్యాన్ని అందించాలంటే అనివార్యంగా ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యేది కాకుండా, ఆంక్షల సంకెళ్లలో నలిగే తెలంగాణ కాకుండా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుకునే ఆంక్షలులేని స్వయం పాలనతో కూడిన తెలంగాణ కావాలి. అందుకు ఆటంకంగా మారబోతున్నది ఆంక్షలతో కూడిన గవర్నర్ పరిపాలన. అందుకే బిల్లులో సవరించ వలసిన అత్యవసర అనివార్యమైన అంశాలుగా వీటిని గుర్తించి రద్దుకోసం ప్రయత్నించ వలసిన కర్తవ్యం తెలంగాణ ప్రజలపై ఉంది.

అసలు కొత్త రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వడం ఎంత ముఖ్యమో, అంతకంటే ఉన్న రాజధానిలో ఈ ఆరు దశబ్దాలుగా కొల్లగొట్టబడ్డ వివిధ రంగాలకు చెందిన ఆస్తులు, నిధులు, నదులు, సేవా రంగాలకు, తెలంగాణకు కూడా నష్ట పరిహారం డిమాండ్ చేయవలసి ఉన్నది.

ఏదో ఒక తెలంగాణ రానివ్వండి, తర్వాత చూద్దాం అనే వైఖరి వల్ల తెలంగాణ ఏర్పడుతుందన్న ఆనందం, ఆవిరైపోయిన నిధులు, నిల్వలు, తదితర రంగాల్లో చక్కదిద్దుకుంటున్న కార్యక్రమాల వల్ల ఏమి మిగలని, కేవలం భౌగోళిక చిత్రపటంగా తెలంగాణ కనబడుతుంది. దాన్ని చూస్తూ కుమిలి పోవడం తప్ప మరోదారి ఉండదు.

అందుకే ఆంక్షలులేని స్వయం పాలిత తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడవలసిన అవసరం ఎంతో ఉంది. మూతపడ్డ ప్రభుత్వ పరిశ్రమల్ని తెరిపించాలి. ఓపెన్ కాస్టుల్ని నిరోధించి, బొగ్గు నిల్వల్ని స్థానిక విద్యుత్ ప్లాంట్‌ల రూపకల్పనతో ఉపాధి రంగాన్ని మెరుగుపర్చడం, కూనరిల్లి పోయిన వ్యవసాయ రంగాన్ని పున ప్రతిష్టించు కోవడమంటే, వరుస గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించుకోవడం, విద్య, వైద్యం, సేవారంగాల్లో ప్రజలందరికీ ఉచిత నాణ్యమైన సేవలందించడంతో పాటు, ఏ ప్రాంతానికి చెందిన వాళ్లైనా స్నేహ పూర్వకంగా కలిసుండే ఓ స్వేచ్ఛాపూరిత వాతావరణాన్ని కల్పించాలి. ప్రజల పౌర ప్రజాస్వామిక హక్కులకు ఆటంకం కలగని, మాటకు, పాటకు సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. సామాజిక ప్రజాస్వామిక తెలంగాణగా మార్చడానికి ఆంక్షలు లేని తెలంగాణ తప్ప మరోక మార్గం లేదు. విలీనాలతోనో రేపటి ఎన్నికల సీట్లు, స్వార్థానికి తెలంగాణ నాయకత్వం ప్రజల ఆకాంక్షలను తాకట్టు పెట్టకుండా చూడవలసిన సందర్భం.

(రచయిత తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ కన్వీనర్) వీ

రాబోయే సంచికలలో...

- **పతనావస్థలో ప్రజారోగ్యం - డా. నళిని**
- **అధోలోకంలో బ్యాంకుల వ్యవసాయ రుణాలు - వి. హనుమంతరావు**
- **హత్యల ద్వారా ఉద్యమాలను ఆపలేరు - విశ్వనాథ్**
- **ఆదివాసుల మరణాలు - ఒక పరిశీలన - ఎం. నాగమణి**
- **ఈ శతాబ్దపు రైఫిల్ - విశ్వం**

పోల'వరం' ఎవరికి? ముంపు శాపమెవరికి?

***ప్రకృతి వనరులను రక్షిస్తున్న ఆదివాసులను నిర్వాసితుల చేస్తూ బహుళజాతి కంపెనీల ప్రయోజనం కోసం నిర్మిస్తున్న పోలవరంను అడ్డుకోవడమే తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రధానమైన అంశం కావాలని అంటున్నారు* వరవరరావు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును చివరి క్షణందాకా అడ్డుకోవడానికి ప్రయత్నించిన స్వార్థపరశక్తులకు ప్రాతినిధ్యం వహిస్తూ వెంకయ్య నాయుడు లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లు ఆమోదం పొందిన నాడు అది చీకటి రోజని తన మనసులో కల్మషాన్ని కక్కేశాడు. ఇంకా అక్కడ సాధ్యం కానపుడు రాజ్యసభలో తాను స్వయంగా సభ్యుడు గనుక సవరణల రూపంలో అడ్డుకోవడానికి ఆఖరి క్షణందాకా ప్రయత్నించాడు. చివరకు డివిజన్ కోరి రాజ్యసభ నియమాలు అనుమతించవని డిప్యూటీ స్పీకర్ చెప్పినపుడు మొహమంతా మాడ్చుకుని కూర్చున్నాడు. తెలంగాణ నుంచి విడిపోయి ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదేళ్ల కొరకు ప్రత్యేక ఆర్థిక ప్రతిపత్తులు, రాయితీలు కోరి, రాయబారాలు చేసి చివరకు ఐదేళ్ల కొరకు ప్రధాని హామీల రూపంలో సాధించుకున్నాడు. ఆ సందర్భంగా హైదరాబాదు నగరం గురించి బంగారు గుడ్లు పెట్టే బాతును పదేళ్ల తర్వాతనైనా వదులుకోక తప్పదనే ఆక్రోశాన్ని ఎంత వెళ్లగక్కాడో అంతవెళ్లగక్కాడు.

అవన్నీ ఒక ఎత్తు – పోలవరం ప్రాజెక్టు విషయంలో ఆయన జైరాం రమేశ్ నుంచి పొందిన విస్పష్టమైన హామీ ఒక ఎత్తు. వాస్తవానికి ఇది ఒక ప్యాకేజీలో భాగంగా యుపిఏ తెలంగాణ ప్రకటన చేసిన నాటి నుండీ కాంగ్రెస్ ప్రభుత్వం హామీపడుతున్నది. తెలంగాణ ప్రజలకు హైదరాబాదుతో కూడిన తెలంగాణ, 'బహుళార్థక ప్రయోజనాలకు' పోలవరం ప్రాజెక్టు – అనేది టు ఇన్ వన్ ప్రతిపాదన. ఈ బహుళార్థ ప్రయోజనాలనే మాట స్వయంగా జైరాం రమేశ్ రాజ్యసభలో ఉపయోగించిన మాట. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లుకు రాజ్యసభలో ఒడిశా నుంచి ఒక సభ్యుడు పోలవరం ప్రాజెక్టు విషయంలో ఒక సవరణ ప్రతిపాదించాడు. 'పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఒడిశా, చత్తీస్‌గడ్ రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేసి ఉన్నాయి గదా, దానిని కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి ప్రాజెక్టుగా ఎట్లా చేపడుతుంది? వీలులేదు. కనుక బిల్లుకు ఆ సవరణ చేయాలన్నది ఆ సభ్యుడి ప్రతిపాదన. రాయలసీమలో హంద్రీనీవా వంటి ప్రారంభించిన ప్రాజెక్టులన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి గదా వాటి భవిష్యత్తు ఏమిటి? అవి వివాదంలో పడతాయా? అని అడిగే ఉపప్రశ్న రూపంలో వెంకయ్య నాయుడు పోలవరం కాంట్రాక్టర్లు, ఆ ప్రాజెక్టు నిర్మాణం జరిగి లబ్ధిపొందే పారిశ్రామిక వేత్తలు, డెల్టా రైతుల అందరి పక్షాన మళ్లీ (బిల్లులో భాగమైన అంశం) ఈ విషయంలో వివరణ కోరాడు.

రాజ్యసభలో జైరాం రమేశ్ కడుపులో ఏమీ దాచుకోకుండా అదెంత దుర్మార్గమైన ప్రాజెక్టో, అందుకే అది తాము ఎన్ని శక్తులు అడ్డువచ్చినా ఎందుకు నిర్మించి తీరుతామో కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. వెంకయ్యనాయుడు పూర్తిగా సంతృప్తి చెంది ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇతర నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో స్పష్టత కోరే తన సవరణల కోసం పట్టుపట్టనని కూర్చున్నాడు.

జైరాం రమేశ్ చెప్పిందేమిటంటే చాల మంది, ముఖ్యంగా తెలంగాణవాదులు భావిస్తున్నట్లు అది కేవలం నీటి పారుదల ప్రాజెక్టు కాదు. అది బహుళార్థక సాధక ప్రాజెక్టు. దాని నుంచి విద్యుదుత్పత్తి జరుగుతుంది. కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు తలపెట్టిన పరిశ్రమలకు నీళ్లూ అందించబడతాయి. కనుక డెల్టాలో అదనపు సాగు భూములకు, మూడో పంటకు నీళ్లు మాత్రమేకాదు ఎన్నో ప్రైవేట్ విద్యుత్ కంపెనీల కోసం, కాకినాడ నుంచి విశాఖపట్నం దాకా ఒప్పందాలు చేసుకున్న, చేసుకోనున్న బహుళజాతి, బడా కంపెనీల కోసం పర్యాటక కేంద్రాల కోసం నీళ్లు అందించడానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణమవు తున్నదన్న మాట. కనుక ఈ విషయంలో తెలంగాణ, ఆంధ్ర సరిహద్దుల మధ్యన ఉన్న ఆదివాసుల గోడు మాత్రమేకాదు, ఒడిశా, చత్తీస్‌గడ్ గోడు కూడా వినేదిలేదు. నర్మదా డ్యాం విషయంలో నరేంద్రమోడీతో కలిసి గుజరాత్‌లో ఏం చేశామో, పోస్కో గురించి నవీన్ పట్నాయక్‌తో కలిసి ఏంచేశామో, ఇపుడు ఆంధ్ర, తెలంగాణ పాలకుల కోసం కూడ అదే చేస్తాం. అది చేయకుంటే మాకు కేంద్ర దళారీలనే గుర్తింపు ఉండదుగదా అన్నది జైరాం రమేశ్ హామీ అంతరార్థం.

వెంకయ్యనాయుడు నెల్లూరు జిల్లాలో పుట్టినా ఆయన ఆస్తులు, పరిశ్రమలు అన్నీ ఎక్కువగా విశాఖపట్నంలోనే ఉన్నాయి. అది ఆదివాసి ఉత్తరాంధ్ర కేంద్ర స్థలం. మత్స్యకారులను, ఆదివాసులను, రెల్లి, గొల్లజాతి వారిని దోచుకోవడానికి ఎంతో అనువైన స్థలం. జైరాం రమేశ్‌కు ఆదివాసుల పట్ల ఉన్న ప్రేమ గురించి మన మధ్యతరగతి మేధావుల్లో కూడ కొందరికి భ్రమలున్నాయి. ఎందుకంటే ఆదివాసి సంక్షేమ పథకాలన్నీ వాళ్లదాకా చేరడానికి ఆయన పారామిలిటరీ బలగాలకు తోడిచ్చే ఘర్షణ (కాన్‌ఫ్లిక్ట్) ప్రాంతాలకు టాటా సోషల్ స్టడీస్ ఇన్‌స్టిట్యూట్ నుంచి మెరికల వంటి పరిశోధక విద్యార్థులను పంపుతూ ఉంటాడు. 'భద్రత కూడిన సంక్షేమం' అని ఆయన దానికి పేరు పెట్టాడు. ఆయన ఒకసారి అదిలాబాద్ వెళ్లి వస్తే అక్కడ ప్రజలకు అభయారణ్యం వస్తుంది. కుంతాల జలపాతం ఉన్న అతిథి గృహంలో బసచేసి వెళ్తే అక్కడ పవర్ ప్రాజెక్టు వస్తుంది. కాకపోతే ఆ ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టర్‌కు ఆదివాసి గుర్తింపు ఉంటుంది. ఆయన అచ్చంపేటలో రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే నల్లమల అడవుల్లో డీబీర్ వజ్రాల కంపెనీ సర్వే మొదలవు

తుంది. ఆయన ఎప్పుడు ఆదివాసి ప్రాంతాల్లో జులపాలు ఎగిరేస్తూ, హస్తాలు ఛడాయించుకుంటూ ఆదివాసుల వేషాలు వేసుకొని నృత్యాలు చేస్తూ తిరిగిపోతూ ఉంటాడు.

రాజ్యసభలో కూడా తెలంగాణ బిల్లు ఆమోదం పొందాక తెలంగాణ ఎంపిలు అందరూ తెలంగాన బిల్లు రూపకర్త అని పొగుడుతూ ఇతన్నే భుజాల మీదికి ఎత్తుకొని తైతక్కలాడారు. ఎందుకూ? తప్పుల తడక, భవిష్యత్ తెలంగాణకు అన్నీ అనర్థాలే, అవరోధాలలే రచించినందుకా? టాస్క్‌ఫోర్స్ విజయ్‌కుమార్ నాయకత్వంలో శాంతి భద్రతల గురించి, హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గురించి ఆశలు లేపి చేర్చినందుకా? పోలవరం ముంపు ప్రాంతాలను భద్రాచలం డివిజన్ నుంచి తీసి ఆంధ్ర ప్రాంతంలో చేర్చినందుకా? ఎందుకోమరి తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా ముంపునకు గురవుతున్న ఆదివాసి ప్రజలకు ఈ ఎంపిలు రేపు జవాబు చెప్పాల్సి ఉంటుంది. జైరాం రమేశ్‌నైతే దేశవ్యాప్తంగా ఆదివాసులు నిలదీసి తీరుతారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో మూడు వేల గ్రామాల్లో మూడు లక్షల మంది ఆదివాసులు మునిగిపోతారు. నిర్వాసితులవుతారు. నిరాశ్రయులవుతారు. శబరి నది అదృశ్యమవుతుంది. విలువయిన వనమూలికలు, ఔషధమూలికలు విధ్వంసమవుతాయి. ఎంతో జీవరాశి నశిస్తుంది. పర్యావరణ విధ్వంసం మీద సుప్రీంకోర్టులో ఇప్పటికే ఎన్నో ఫిర్యాదులున్నాయి. పాపికొండలు అదృశ్యమవుతాయి. భద్రాచలంలో గుడిమెట్ల దాకా నీళ్లు వస్తాయా – గర్భగుడిదాక వస్తాయా అన్న చర్చ గోదావరి వరదలు వచ్చినప్పుడు, ఈ ప్రాజెక్టు సందర్భంలో ప్రముఖంగా వస్తుంది గానీ, భద్రాచలం పట్టణం ఏ రాష్ట్రంలో చేరుతుందా అన్నది పత్రికలకు వార్త అవుతుంది గానీ, మేధావులకు చర్చనీయాశం అవుతుంది గానీ ఆదివాసుల భవిష్యత్ ఏమిటి అనేది ఎవరికి పట్టదు.

మొదట పోలవరం ప్రాజెక్టును తెలంగాణతో పాటు ఒక ప్యాకేజీలో చేర్చిన వాడు జైరాం రమేశ్. ఎందుకంటే అది బహుళజాతి, బడా కంపెనీల దళారీలైన ఆంధ్ర, రాయలసీమ (బహుశ తెలంగాణ) కాంట్రాక్టర్ల, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకు ఉద్దేశించింది. అట్లే పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఇటు భద్రాచలం ఖమ్మం వైపు తెలంగాణ నుంచి చిరకాలంగా ప్రజాస్వామ్యవాదుల ప్రతిఘటన, ఉత్తర తెలంగాణ విప్లవోద్యమ ప్రభావం వల్ల పోలవరం ముంపు ప్రాంతాలను తెలంగాణ నుంచి తొలగించి ఆంధ్రప్రాంతంలో చేరుస్తున్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలు కూడా ఖమ్మంలోనే వందల సంఖ్యలో ఉన్నాయి. కనుక ఇది ఒక వివాదస్పద అంశం అవుతుంది గనుక, కృష్ణా, గోదావరి జలాల పంపిణీతో పాటు ఈ ప్రాజెక్టు నిర్మాణం కేంద్రం చేపట్టినప్పటికీ ఇది చిచ్చు పెడుతుందని కిరణ్‌కుమార్ రెడ్డి కేంద్రాన్ని బ్లాక్‌మెయిల్ చేయడానికి కూడా చూశాడు. ఇంకా బిల్లు ఆమోదం పొందడం తథ్యం అని తెలుసుకున్న తరుణంలో ముంపు ప్రాంతంలో (భద్రాచలంతో సహా) చేర్చాలనే ప్రతిపాదనను తెచ్చిన వాడు కూడా జైరాం రమేశ్. అంటే ముంపు ప్రాంతాలు ఆంధ్రలో చేరితే ఆదివాసులను ముంచిన అపరాధ భావం మనకు అంటదని కావచ్చు తెలంగాణ ఎంపిలు జైరాం రమేశ్‌ను తలకెత్తుకున్నది? తెలంగాణ ప్రజల ముందు, ప్రజాస్వామిక వాదుల ముందు మూడు ప్రశ్నలు. తెలంగాణ రాష్ట్రం కోసం 1968 నుంచి గత 45 సంవత్సరాలుగా చేస్తున్న పోరాటం, ముఖ్యంగా 1996 నుంచి గత 18 ఏళ్లుగా సాగుతున్న పోరాటం భూమి, నీళ్లు, వనరులు, చదువులు, కొలువులు, ఆత్మగౌరవం కొరకు జరుగుతున్న పోరాటం. ఇందులో తెలంగాణ భూముల దురాక్రమణ, హైదరాబాద్ దురాక్రమణ ఎంత ప్రధానమైనదో కృష్ణా, గోదావరి జలాలు డెల్టా జిల్లాల వలసాధిపత్యానికి వదిలిన నీళ్లు కావడం కూడా అంతే ముఖ్యమైంది.

కృష్ణా నది మీద బీజాపూర్, రాయ్‌చూర్ జిల్లాల కరువు ప్రాంతం కొరకు ఆల్‌మట్టి దగ్గర ఆనకట్ట కొంత ఎత్తు లేపితే కృష్ణా జిల్లాలో మూడో పంటకు నీరు లేకుండా పోతుందని మనం ఆందోళన చెందాం. వ్యతిరేకించాం. ఈ విషయంలో మనలను అణిచివేసి, దోచుకొని ప్రజల, విప్లవకారుల నెత్తురు నీళ్లవలే పారించిన చంద్రబాబు వెనుక నిలబడడానికి కూడా వెనుకాడలేదు.

గోదావరి నది మీద మహారాష్ట్రలో బాబ్లీ ప్రాజెక్టు చేపడితే తెలంగాణ తెలుగుదేశం ఎంపిలకు అది చంద్రబాబు ఆయన ప్రాతినిధ్యం వహించే దళారీ వర్గం ప్రేరేపణతో తెలంగాణ రాష్ట్ర సాధనతో... పోటీ పెట్టబడిన ముఖ్యమైన అంశమనిపించింది. అందుకోసం బాబ్లీదాక వెళ్లి దెబ్బలు తిని అరెస్టయి వీరోచిత పోరాటం చేసి అడ్డుపడ్డారు.

మరిప్పుడు దిగువన ఇందిరా సాగరం నిర్మాణం జరిగితే గోదావరిపై మనం ఎగువన ఎత్తిపోతల పథకాలైన చేపట్టగలమా? మనం ఆల్మట్టి, బాబ్లీలను వ్యతిరేకించినట్లే రేపు పోలవరం ప్రాజెక్టు లబ్ధిదారులు గోదావరిపై ఎగువన ఏ ప్రాజెక్టునయినా వ్యతిరేకిస్తే ఏం జవాబు చెపుతారు? ఇవాళకో న్యాయం, రేపుకోన్యాయం అంటారా? పైగా కృష్ణా, గోదావరి జలాల పంపకంపై ఒక చట్టబద్ధమైన కమిటీ వేసి ఉభయుల జుట్టు (నదుల పుట్టుక నడక) కేంద్రం తన చేతిలో పట్టుకున్నది. నియంత్రిస్తున్నది. నిన్న సముద్రం విలయ శిశువుకు దక్కని స్థన్యమని ఆవేదన చెందిన గోదావరి రేపు ఇందిరా సాగర్‌లో మునిగిపోవడానికేనని మనం గోదావరికి ఇన్ని కన్నీళ్లు, నెత్తురు అంకితం చేసింది.

మౌలికమైనదీ, ప్రజాస్వామికమైనదీప్రశ్న – ముంపు ప్రాంతాలు ఎవరివని కాదు – ముంపు ప్రాంతాలు ఎందుకని?

ఎవరో ఒకరు తేలడం కోసం ఎవరో ఒకరు మునగవలసిందేనా? మైదాన ప్రాంత ప్రజలకోసం అడవిలో ఉండే వాళ్లు. ఆదివాసేతరుల కోసం ఆదివాసులు. మైనారిటీ ప్రజల కోసం మైనారిటీలు. లబ్ధిదారుల కోసం నదిని తన దేహంలో ప్రవహింపచేసిన అడవి. లబ్ధిదారులెవరు ప్రజలు కారు. కొంత మంది రైతులుండవచ్చు. వీళ్లను మినహాయిస్తే మిగతావారందరూ సంపన్నులు. కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, కంపెనీలు, దోపిడీదార్లు. వాళ్ల కోసం, మనందరి కోసం గోదావరి జలాలనే కాదు, అడవిలోని వనరులను, ఖనిజాలను, సంపదను అంతా వేల సంవత్సరాలుగా కాపాడుతున్న ఆదివాసులు మునిగిపోవాల్సిందేనా?

తెలంగాణ వాళ్లు, ఆంధ్రవాళ్లు కాని, తెలుగువాళ్లు కాని – ఆదివాసులే అయినా ఆదివాసులు రెండు ప్రాంతాల ప్రయోజనాల కోసం – ఒకరిది న్యాయమైన ప్రయోజనం, మరొకరిది స్వార్థ ప్రయోజనం. కావచ్చు, అవును. కాని అంతకన్న న్యాయంగా ఆదివాసులకే చెందవలసిన అడవి ఎందుకు మునిగిపోవాలి? అడవికి భౌతికంగా చెందని మనకేం హక్కున్నది వాళ్ల అడవిని ముంచడానికి? ఆదివాసుల ఉనికిని, జీవన

శైలిని, సంస్కృతిని, అడవిని, వనరులను, ఖనిజాలను, సంపదను, జీవరాశిని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మన చిరకాల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోలేక పోతున్నామా? ఈ ప్రశ్న మనమే ఎందుకు వేసుకోవాలంటే మనది న్యాయమైన పోరాటం గనుక. మనది ప్రజాస్వామికమైన పోరాటం గనుక. నిన్నటిదాక మనలను ముంచిన వారికి ఆదివాసులను ముంచడం ఒక మనుసుకు పట్టే విషయమే కాదు. పెట్టుబడికి మనుసు ఉండదు. మార్కెట్ ఉంటుంది. కనుక పోలవరం ప్రాజెక్టు కింద ఆదివాసుల ముంపు గురించి న్యాయంగా ఆలోచించ వలసిన ప్రజాస్వామిక బాధ్యత తెలంగాణ ప్రజలది. పోరాట చైతన్యమున్న ప్రజలది. తెలంగాణ ప్రజలు ఆదివాసులకు అండగా నిలిచి పోలవరం ప్రాజెక్టును నిలువరించడానికి రేపు ఏర్పడబోయే ప్రభుత్వం మీద తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఎంత పోరాటం చేశారో అంత పోరాటం చేయాలి. ఎందుకంటే డెల్టా జిల్లాల సంపన్న వర్గాల, కులాల అణిచివేత, పీడన, దోపిడి ఎట్ల ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నవాళ్లు గనుక మనకొరకు గోదావరిని, అడవిని కాపాడుతున్న ఆదివాసుల పట్ల మన ఈ కర్తవ్యాన్ని చేపట్టాలి.

మనం తెలంగాణను అస్తిత్వ పోరాటం, ఆత్మగౌరవ పోరాటం అంటున్నాం గదా? మరి ఆదివాసుల అస్తిత్వం, ఆత్మగౌరవం గురించి కూడా మనమే ఆలోచించాలి గదా. మనం దళితుల వర్గీకరణను న్యాయమైనదని ప్రజాస్వామికంగా పోరాడుతున్న వాళ్లం. ఆదివాసుల వర్గీకరణ రేపు తెలంగాణలో ఎజెండా మీదికి వచ్చే ముఖ్యమైన అంశం అవుతుందని అనుకుంటున్న వాళ్లం. మరి అస్తిత్వం, ఆత్మగౌరవమే కాదు కదా. వాళ్ల కాళ్ల కింద నేల కూడా కరిగిపోయే, మునిగిపోయే కోయల గోడు మనకు పట్టదా?

ఆదివాసులు స్వతంత్రులు. స్వయం ప్రతిపత్తి గలవాళ్లు. జల్, జంగల్, జమీన్‌ల పై అధికారం ఉన్నవాళ్లు. ఆదివాసి ప్రాంతాలపై రాజ్యాధికార హక్కు కూడా ఉన్నవాళ్లు. ఈ చరిత్రకు రాజ్యాంగ ఆమోదం ఉన్నది. ఐక్యరాజ్య సమితి ఆమోదం ఉన్నది. భద్రాచలం రాజధానిగా రేపు వాళ్లు మన్నెం రాజ్యం ఏర్పడాలని పోరాడితే (ఎవరో కొందరు స్వార్థపర శక్తుల ప్రయోజనం కోసం కాదు, బహుళ సంఖ్యాక ఆదివాసుల ప్రయోజనం కోసం) అది తెలంగాణ కన్నా ప్రజాస్వామిక పోరాటమవు తుంది. అటువంటి పోరాటాలు సాయుధంగా తుపాకులకు గుండెలెదురొడ్డి, ఆత్మహత్యలు చేసుకోని, వివిధ పోరాట రూపాలు తీసుకొని పోరాటలకు, త్యాగాలకు తోవా, ఠికానా అని చెప్పదగిన తెలంగాణ తప్ప ఇంకెవరు అండగా నిలువగలరు?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విధ్వంసకరమైంది, చేపట్టడానికి వీలులేదని కేంద్రం మీద ఒత్తిడి తెచ్చే మలిపోరాటానికి సిద్ధమవడమే ఇవాళ తెలంగాణ ప్రజాస్వామ్యవాదుల ముందున్న కర్తవ్యం. తెలంగాణ పునర్ నిర్మాణ కర్తవ్యాలలో అన్నిటికన్న ప్రాధాన్యం గలది.

(రచయిత విప్లవ కవి, విప్లవ రచయితల సంఘం నాయకులు) వీ

పాఠకులకు విజ్ఞప్తి!

వీక్షణం విడిప్రతి వెల, సంవత్సర చందాల రేట్లు పెంచక తప్పడం లేదు

వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక విడిప్రతి వెల, చందారేట్లు జనవరి 2011 సంచిక నుంచి మూడు సంవత్సరాల పాటు ఏ మార్పూ లేకుండా ఉన్నాయి. ప్రతి నెలా న్యూస్ ప్రింట్ ఖరీదు, ముద్రణా వ్యయం, నిర్వహణా వ్యయం ఎంతగా పెరిగిపోతున్నా, ప్రతి సంచిక విడిప్రతి ఉత్పత్తి వ్యయంలో సగమే వెనక్కి వస్తున్నా, ప్రతినెలా పెద్ద ఎత్తున లోటుతో, ఆర్థిక ఇబ్బందులతో నడుస్తున్నా, ఆ భారాన్ని పాఠకుల మీద వేయకుండా ఉండడానికి ప్రయత్నిస్తూ వచ్చాం. ఇక తప్పనిసరి పరిస్థితులలో ఏప్రిల్ 2014 సంచిక నుంచి వీక్షణం విడిప్రతి వెల, చందా రేట్లు పెంచక తప్పడం లేదు. మారిన రేట్ల ప్రకారం విడిప్రతి వెల రు. 20, సంవత్సర చందా రు. 200, మూడు సంవత్సరాలకు రు. 540, ఐదు సంవత్సరాలకు రు. 900, పది సంవత్సరాలకు రు. 1700 ఉంటుంది. వీక్షణంను ఆదరిస్తున్న పాఠకులు ఈ పరిస్థితిని అర్థం చేసుకుని ఎప్పటిలాగే సహకరిస్తారని ఆశిస్తున్నాం. కొత్త విడిప్రతి వెల, చందా రేట్లు 1 ఏప్రిల్ 2014 నుంచి అమలు లోకి వస్తాయి. అప్పటివరకూ చందాలు చెల్లించేవారికి పాత రేట్లే వర్తిస్తాయి.

వీక్షణం మీ పత్రిక

వీక్షణం ప్రజల పత్రిక

వీక్షణంను నాలుగు కాలాల పాటు నిలబెట్టుకునే బాధ్యత ప్రజలదే

ఓట్ ఆన్ అకౌంట్ రాష్ట్ర బడ్జెట్

ఇది ఎన్నికల సంవత్సరం కావడం వల్ల పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రభుత్వ పాలన ఉంటుందో లేదో తెలియదు. అందువల్ల కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పూర్తి సంవత్సరానికి సమగ్ర బడ్జెట్ ప్రవేశ పెట్టే లోపుగా తాత్కాలికంగా పనులు నడవడానికి ఓట్ ఆన్ అకౌంట్ (అనామతు) బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎన్ని ఘనమైన వాగ్దానాలు చేసినప్పటికీ అవన్నీ నెరవేర్చే బాధ్యత ఆ ప్రభుత్వం మీద ఏమీ ఉండదు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఇచ్చిన ఖాతాలన్నిటినీ సవరించే, మార్చే, కొత్త కేటాయింపులను ప్రతిపాదించే అధికారం పూర్తి బడ్జెట్ ప్రవేశ పెట్టే భవిష్యత్ ప్రభుత్వానికి ఉంటుంది. అందువల్ల ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను సాధారణంగా పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు. మామూలుగా బడ్జెట్ ఫిబ్రవరిలో ప్రవేశపెట్టి, మార్చిలో చర్చ జరిపి ఆమోదించి, ఏప్రిల్ 1 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేస్తారు. కాని, ఈ సారి ఏప్రిల్‌లోనే ఎన్నికలు జరగవలసి ఉన్నందు వల్ల ఫిబ్రవరి రెండవ వారంలోనే రాష్ట్ర బడ్జెట్, మూడవ వారంలో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడమూ, వెంటనే ఆమోదించడమూ జరిగిపోయాయి. ఇవి ఏప్రిల్ 1న అమలులోకి వస్తే కొత్త ప్రభుత్వం బహుశా మే - జూన్‌లలో పూర్తి బడ్జెట్ ప్రవేశ పెడుతుంది. అంటే ఈ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఎక్కువలో ఎక్కువ రెండు నెలల కన్న అమలులో ఉండదు.

అయినా వివరాలు తెలుసుకోవడం అవసరం కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ 2014-15 ఫిబ్రవరి 10న ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రవేశపెట్టాడు. శాసనసభ జరుగుతున్న తీరు వల్ల పూర్తి బడ్జెట్ ప్రసంగాన్ని కూడ చదవడానికి అవకాశం దొరకలేదు. రు.1,83,129 కోట్ల మొత్తం బడ్జెట్‌లో ప్రణాళికేతర వ్యయం రు. 1,15,179 కోట్లు కాగా, ప్రణాళికా వ్యయం రు. 67,950 కోట్లు.

ప్రణాళికేతర ఖర్చు
(రు. కోట్లలో)

జీతాలు	42,622
నాన్ శాలరీ	3,884
వడ్డీలు	16,787
అప్పు చెల్లింపు	8,115
పింఛన్లు	16,517
నిర్వహణ	1,796
రాయితీలు	14,332
అందులో	
బియ్యంపై	3,000
విద్యుత్తుపై	7,500

కొత్త పన్నులు గాని, కొత్తగా భారీ కేటాయింపులు గాని లేని ఈ బడ్జెట్ రంగు, రుచి, వాసన లేని బడ్జెట్ అనే చెప్పాలి.

గత సంవత్సరం సాధించిన విజయాల గురించి బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ఎన్నో ప్రకటనలు చేశారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ధాన్యం ఉత్పత్తి 43.95 లక్షల టన్నులకు పెరిగిందని, గత ఐదు సంవత్సరాలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా 1.89 కోట్ల పని దినాలను కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రు. 7,025 కోట్ల పెట్టుబడితో 4,339 చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయనీ, అవి 59,864 మందికి ఉపాధి కల్పించాయనీ అన్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రు. 1,811 కోట్ల వ్యయంతో 2.23 లక్షల ఇళ్లు నిర్మించిందని తెలిపారు. 2012-13 ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రం చేసిన మొత్తం అప్పులు రు. 1,52,476 కోట్లకు చేరాయని, అంటే రాష్ట్ర ప్రజల్లో ప్రతి ఒక్కరి మీద రు. 18,106 అప్పు ఉందని ఆర్థిక మంత్రి చెప్పారు.

అయితే బడ్జెట్‌లో ప్రకటించే అంకెలు ఎంత నామమాత్రం అయిపోయాయంటే 2012-13 బడ్జెట్‌లో ప్రకటించిన అన్ని అంచనాలు మొత్తం మీద 13.3 శాతం మేరకు కోతలు పడి తగ్గిపోయాయి. అందులోనూ ప్రణాళిక కేటాయింపుల్లో 19.71 శాతం కోత పడింది. వీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ 2014-15
(రు. కోట్లలో)

	బడ్జెట్	ప్రస్తుత బడ్జెట్ కంటే పెరిగిన శాతం
మొత్తం బడ్జెట్	1,83,129	13.50
అందులో ప్రణాళికేతరం	1,15,179	13.00
ప్రణాళిక వ్యయం	67,950	14.35
కేంద్ర పన్నుల్లో వాటా	27,028	12.00
గ్రాంట్స్ ఇన్ ఎయిడ్	21,078	33.38
సొంత పన్నుల రాబడి	84,780	17.03
సొంత పన్నుల్లో		
అమ్మకం పన్ను	61,950	18.00
ఎక్సైజ్	8,625	15.00
మోటారు వాహనాల పన్ను	5,005	15.00
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	7,377	15.00
పన్నేతర రాబడులు	16,262	5.64
అందులో గనులు, ఖనిజాలు	3.452	12.00
మొత్తం రెవెన్యూ ఖర్చు	1,48,678	17.30
రెవెన్యూ మిగులు	474	
ఆస్తులపై పెట్టుబడి	26,339	1.01
ద్రవ్యలోటు	25,402 (జీఎస్‌డిపిలో 2.60 శాతం)	
జీఎస్‌డిపి	9,77,739	

ఓట్ ఆన్ అకౌంట్ కేంద్ర బడ్జెట్

***రానున్న రెండు మూడు నెలల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల దేశ ప్రజలకూ, దేశ ఆర్థిక స్థితికీ ఎటువంటి ప్రయోజనం లేదనీ, ఎన్నో లక్ష్యాలను నిర్దేశించుకున్నా అవి ఏవీ ఇప్పటి వరకూ సాధించలేకపోయారనీ అంటున్నారు* వి. హనుమంతరావు**

ఆర్థికమాంద్యం, నిరుద్యోగం, ఆహార ధరలు, ఆర్థిక అసమానతలు, పరిపాలనా వైఫల్యం – ఇవన్నీ ఆర్థికమంత్రి చిదంబరం అధికార కుర్చీ దిగిపోతూ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో దేశానికి ఒరగబెట్టిన కానుకలు.

ఈయనకు ముందు ఆర్థికమంత్రిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీకి వొడాఫోన్ సంస్థ మన దేశానికి ఇవ్వాల్సిన సుమారు పదకొండు వేల కోట్ల రూపాయల విషయంలో ఎడముఖం, పెడముఖంగా సంబంధాలు, అభిప్రాయాలున్న నేపథ్యంలో చిదంబరం తిరిగి ఆర్థికమంత్రిగా అధికారం చేబట్టారు. (మంత్రికాక ముందు వొడాఫోన్ సంస్థకు ఆర్థిక సలహాదారుగా ఉన్నారు.) చిదంబరం ఈ విషయమై ఒక విలేకరి ప్రశ్నకు జవాబు ఇవ్వకుండా తప్పుకున్నారు. ఈయన కుర్చీలో కూర్చోవడం, దేశంలో ఆర్థిక మాంద్యం చోటు చేసుకోవడం జరిగింది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి చావు తప్పి కన్ను లొట్టపోయి దేశం ఇలా బయట పడిందో లేదో ఈ మహానుభావుడు గద్దెనెక్కి చక్రం తిప్పడం ప్రారంభించాడు. ఈ సోదంతా ఎందుకు చెపుతున్నానంటే, ఎటువంటి నేపథ్యంలో ఈ పెద్ద మనిషి అధికారంలోకి వచ్చాడో తెలియ చేయడానికే.

ప్రైవేట్ రంగాన్ని భుజాన వేసుకున్నాడు. కార్పొరేట్ రంగానికి ప్రతి సంవత్సరం సుమారు అయిదు లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ ఇచ్చి, ప్రభుత్వానికి ఆ మేరకు ఆదాయాన్ని కోల్పోయేలా చేశాడు. తయారీ రంగం పడుకొంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని, పెట్టుబడులు క్షీణిస్తుంటే విదేశాలకు వెళ్లి ఒట్టి చేతుల్తో తిరిగి వచ్చారు. విదేశీ పెట్టుబడి దారులు ఎన్నికలు అయిపోయి, కొత్త ప్రభుత్వం వచ్చే వరకూ వేచి చూస్తున్నారు. సవాలక్ష సమస్యలతో దేశం పీకలలోతు మునిగి ఉంది.

ఆర్థికమంత్రి బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ, తన లక్ష్యాలేమిటో చెప్పారు. ఆర్థిక పరిస్థితిని పరిపుష్టి చేయడం, ధరలను స్థిరీకరించడం, దిగజారు తున్న పెరుగుదలను నిలుపుదల చేయడం, తయారీ రంగానికి మళ్లీ ప్రాణం పోయడం, ఎగుమతులను ప్రోత్సహించడం, ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడం, పెట్రోలియం, విద్యుచ్ఛక్తి, బొగ్గు, రహదారులు, వస్త్ర పరిశ్రమ – వీటిలో ఏ ఒక్క లక్ష్యమైనా సాధించారా? ఈ సమస్యలన్నీ చాలా కాలంగా దేశాన్ని వెంటాడుతున్నవే. ఇవి తెల్లారేసరికి పరిష్కారం అయ్యేవి కావన్న మాట నిజమే. కాని కొంతమేరకన్నా ఇంత మేరకు సాధించానని చెప్పగలరా?

ఆహార ద్రవ్యోల్బణం ఇంకా ఇబ్బందికరంగానే ఉందని ఆయనే తన ఉపన్యాసంలో అంగీకరించారు. టోకు ధరలు తగ్గాయని అన్నారు. సామాన్యుడు టోకు ధరలకు కొనుక్కోరు కదా. వ్యవసాయానికి ఇచ్చే రుణాలు పెంచామని అంటున్నారు. నిజమే, కాని వ్యవసాయ రుణాలు 70 వేల కోట్ల రూపాయలు మాఫీ చేసినప్పటి నుంచి ప్రతి సంవత్సరం పెంచుతూనే ఉన్నారు. ఇప్పుడూ పెంచారు. ఇందులో కొత్తేముంది? ఇస్తున్న రుణాలు ఏ వర్గానికి అందుతున్నాయి అనేదే ముఖ్యం. సన్న, చిన్నకారులకు ఎంత ముట్టిందో ఏ బడ్జెట్ ప్రసంగంలోనూ చెప్పరేం?

236 ప్రాజెక్టులు పూర్తి చేశామంటున్నారు. మంచిదే. కాని ఈ సంఖ్య 1947 నుంచా? ఇంకా ఎన్ని ప్రాజెక్టులు ఉన్నాయి? ఆలస్యం అయ్యే కొద్దీ మొదట వేసిన అంచనాలు ద్విగుణీకృతం, త్రిగుణీకృతం అవుతున్నాయని ప్రభుత్వం గణాంకాలే చెపుతున్నాయి.

ఎగుమతులు పెరిగాయట. ఒక సంవత్సరం పెరిగితే మరో సంవత్సరం తగ్గుతాయి. సమాచారం కావాల్సింది ఎగుమతులకు, దిగుమతులకు మధ్య సమతూకం సాధించారా? దిగుమతులు తగ్గాయని చిదంబరం చెప్పుకొచ్చారు. అంటే మన పరిశ్రమల స్థాపనకు కావాల్సిన యంత్రసామగ్రి దిగుమతులు తగ్గాయా? 33 సంవత్సరాల నుంచి సాధించిన అభివృద్ధి గురించి జబ్బలు చరుచుకొన్నారు. ఇప్పటికే వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి చేసిన గిమ్మిక్కు తప్ప మరేమీ కాదు.

కేంద్ర ప్రతిపాదిత పథకాలు అన్ని రాష్ట్రాల్లో అమలు జరుగు తున్నాయి. వీటికి కేంద్రం 50 నుంచి 75 శాతం నిధులు సమకూర్చు తుంది. మిగతా శాతం ఖర్చు రాష్ట్రాలు భరించాలి. ఇప్పుడు కేంద్ర పాలిత ప్రాంతాలకిచ్చే సహాయంలో కూడా కోతలు, వాతలు పెట్టారు. మొత్తం బడ్జెట్టే కోతల బడ్జెట్.

ప్రపంచమంతా మాంద్యాన్నెదుర్కొంటోంది. దాని నుంచి అభివృద్ధి చెందిన దేశాలే కిందా మీదా పడుతున్నాయి. అలాంటి దేశాల నుంచి నిధులు, పరిశ్రమలను ఆహ్వానిస్తే, అది మన ఆర్థిక పరిస్థితికి ఆ అంటురోగం అంటుకొంటుంది. ఇప్పటికే రుణభారం మొత్తం రెవెన్యూ ఆదాయంలో 36.9 శాతంగా ఉంది. ఇప్పుడు ప్రవేశపెట్టింది 2014-15 బడ్జెట్. కొత్త ప్రభుత్వం వచ్చే వరకూ అవసరమైన నిధుల మంజూరు కోసం పార్లమెంట్ అనుమతి తీసుకొంటుంది. అలాంటప్పుడు పూర్తి సంవత్సరం బడ్జెట్‌ను ఎందుకు కోరాలి? ఇది రాబోయే ప్రభుత్వం చేతులు, కాళ్లు బంధించడమే. కొత్త ప్రభుత్వం కొత్త తరహాలో బడ్జెట్‌ను రూపొందించుకుంటుంది. ఈ విధానాన్ని పునఃపరిశీలించాలి.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

ఖనిజాల అక్రమ తవ్వకాలు - షా కమిషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, అధికారుల అండదండలతో మైనింగ్ మాఫియా ఖనిజ వనరులను కొల్లగొడుతోందనీ, ఆదివాసులను నిర్వాసితులను చేస్తూ, పర్యావరణానికి తీవ్ర హాని చేస్తోందనీ షా కమిషన్ చెప్పిన నిజాలను వివరిస్తున్నారు బి. రామకృష్ణ

దేశంలో విద్యాభివృద్ధికి, వైద్య, ఆరోగ్య పరిరక్షణకు, ఆహార భద్రతకు, ఉపాధి కల్పనలకు సంబంధించి ప్రభుత్వాల వద్ద ఎప్పటికీ వనరుల కొరత తీరనే తీరదు. అయితే బోఫోర్స్, హవాలా, సైనిక శవపేటికల, గడ్డి, టెలికాం, బొగ్గు, మైనింగ్ మొదలైన అనేక కుంభకోణాలతో పాటు ప్రజా సంపద లూటి చేస్తున్నారు. స్విస్ బ్యాంకులో దాచుకొన్న సొమ్ము, కర్నాటక మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి, జగన్‌లతో పాటు అంబానీ, టాటా, మిట్టల్ వంటి పెట్టుబడిదారుల ఆస్తులు చట్ట వ్యతిరేకంగానో, చట్ట సమ్మతంగానో, చట్టాతీతంగానో కోటానుకోట్ల ప్రజల సంపదతో కొద్దిమంది భోగలాలసాల్లో మునిగి తేలుతున్నారు. మరోవైపు దేశ జనాభాలో అధిక ప్రజలు పొట్ట, బట్ట, నిలువనీడ కోసం అల్లాల్లాడి పోతున్నారు.

అవినీతి అక్రమాలకు సహకరిస్తూ లేదా వాటిలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మునిగిన ప్రభుత్వ పాలనా యంత్రాంగం, రాజకీయ శక్తుల ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ప్రజా ఉపయోగ చట్టాలున్నా అవి అమలుకు నోచుకోకపోవడం జరుగుతుంటుంది. వీటినే మరోసారి రుజువు చేసింది జస్టిస్ ఎం.బి. షా కమిషన్ రిపోర్ట్. దేశంలో ఇనుము, మాంగనీస్ ఖనిజాల చట్టవ్యతిరేక మైనింగ్‌పై విచారణ కోసం నవంబర్ 2010లో కేంద్ర ప్రభుత్వం షా కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ తొలిసారిగా 17 జనవరి 2011న సమావేశమైంది. అప్పటి నుండి పద్దెనిమిది నెలల కాలంలో అంటే 16 జూలై 2012లోపు తన నివేదికను సమర్పించాల్సి ఉంది. కర్నాటక, గోవా, జార్ఖండ్, ఒడిశా, చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి ఏడు రాష్ట్రాల్లో విచారించాల్సి ఉన్నందున పెద్ద మొత్తంలో సమాచార సేకరణ, దాన్ని క్రోడీకరించడం కోసం కమిషన్ కాల పరిమితిని ఒక సంవత్సరం పొడిగించారు. ఆ తరువాత మరో మూడు నెలలు పొడిగించారు. అక్టోబర్ 2013లో షా కమిషన్ ఒడిశాకు సంబంధించి మధ్యంతర నివేదికను అందించింది. దీనికంటే ముందు కర్నాటక, గోవాలకు సంబంధించిన నివేదిక ఇచ్చింది.

గోవాలో జరిగిన అక్రమ మైనింగ్‌లపై షా కమిషన్ ఆగస్ట్ 2012లో నివేదికను సమర్పించింది. గోవాలో తొంబై మైన్‌లు అక్రమంగా నడుస్తున్నాయి. వీటికి జాతీయ వన్య ప్రాణుల బోర్డు నుండి అనుమతులు లేవు. ఈ మైన్‌ల వల్ల పర్యావరణం, భూగర్భ జలాలు, సహజ కాలువలు, సరస్సులు, నదులు కలుషితమవడం, వ్యవసాయం, జీవవైవిధ్యం తీవ్రంగా నష్టమవుతోంది. వీటిపై తనిఖీలు లేవు. ఇవన్నీ తెలిసి కూడ గోవా రాష్ట్ర అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి దిగంబర్ కామత్ మిన్నకుండి పోయాడని షా కమిషన్ సూటిగా చెప్పింది. డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజి (డిఎంజి) రెగ్యులర్ తనిఖీలు, పర్యవేక్షణలు చేయలేదు. అక్రమ మైనింగ్ వల్ల పన్నెండు సంవత్సరాల కాలంలో గోవాలో 35 వేల కోట్ల స్కామ్ జరిగిందని షా కమిషన్ తెలియజేసింది. ఈ రిపోర్ట్ ఫలితంగా సుప్రీంకోర్టు సెప్టెంబర్ 2012లో గోవాలోని మైన్‌లపై నిషేధం విధించింది. కర్నాటకలో 2011లో నిషేధం విధించింది. ఈ నిషేధం ఏప్రిల్ 2013లో తొలగించబడింది.

గోవా రాష్ట్ర గనుల శాఖ, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైనింగ్ (ఐబిఎం), అలాగే కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ (ఎంఒఇఎఫ్)లు ఈ అక్రమ మైనింగ్‌లో పాలుపంచుకున్నాయని షా కమిషన్ రిపోర్ట్ చెప్పింది. సంవత్సరానికి 12.5 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని మాత్రమే తవ్వేలా చర్యలు తీసుకోవాలని, చట్ట వ్యతిరేకంగా అధికంగా తవ్వి సొమ్ము చేసుకున్న మైనింగ్ కంపెనీల నుండి సొమ్మును రికవరీ చేసుకోవాలని సూచించింది. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన కంపెనీలు, సహకరించిన ప్రభుత్వ యంత్రాంగంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచన చేసింది.

ఒడిశాలో 1994-95 నుండి టాటా స్టీల్, ఆదిత్య బిర్లా గ్రూప్, జిందాల్, ప్రభుత్వ సంస్థ సెయిల్ (ఎస్ఎఐఎల్) మొదలైన కంపెనీలు యథేచ్ఛగా అక్రమ మైనింగ్‌ను సాగిస్తున్నాయి. చట్ట వ్యతిరేకమైన మైనింగ్ వల్ల ఒడిశా రాష్ట్రానికి 59 వేల 203 కోట్ల రూపాయల నష్టం వచ్చిందని షా కమిషన్ తన రిపోర్ట్‌లో పేర్కొన్నది. అక్రమ మైనింగ్ వల్ల రు. 88.47 కోట్లు నష్టం వచ్చిందని, ఈ మైన్‌లకు మైనింగ్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ చట్టం ప్రకారం అనుమతులు లేవు. రు. 88.47 కోట్లు రికవరి చేయమని కాగ్ 2008 నాటి రిపోర్ట్ చెప్పిన విషయాన్ని షా కమిషన్ గుర్తు చేసింది. అక్రమ మైనింగ్ చేసిన ఆర్‌బిటి లిమిటెడ్ వలన ప్రభుత్వానికి రు. 110 కోట్లు నష్టం జరిగిందని విజిలెన్స్ ఎంక్వైరీ రిపోర్ట్ 2009 ఆగస్ట్ 10న పేర్కొన్న విషయాన్ని షా కమిషన్ ప్రస్తావించింది.

చట్ట వ్యతిరేకమైన మైనింగ్‌కు షా కమిషన్ ఐదు కారణాలను చూపెట్టింది. 1) మినరల్ కన్సెషన్ రూల్ 24ఎ(6) దుర్వినియోగం కావడం; 2) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ, తనిఖీలు చేయకుండడం; 3) చెక్‌పోస్టులు, కంప్యూటరైజ్డ్ వే బ్రిడ్జీలు లేకపోవడం; 4) మాఫియా నియంత్రణలో మైనింగ్ జరగడం; 5) ఎగుమతుల ద్వారా అధిక ఆదాయం ప్రత్యేకించి చైనా దేశం నుండి ఉండడం.

మినరల్ కన్సెషన్ రూల్ 24ఎ(6) ఎలా దుర్వినియోగం అవుతుందో చూద్దాం.

మైనింగ్ లీజు కాలం ముగిసే కనీసం పన్నెండు నెలల ముందే

దాన్ని రెన్యువల్ చేసుకోవడం కోసం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి లేదా అధికారికి అర్జీ పెట్టుకోవాలి. రెన్యువల్ చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబిఎం) కంట్రోలర్ జనరల్ నుండి అనుమతిని పొందాలి. ఒకవేళ ఐబిఎం నుండి మూడు నెలల లోపు రిపోర్ట్ రాకుంటే ఐబిఎంకు రెన్యువల్ చేయడంపై వ్యతిరేకత లేనట్లేనని భావించాలి. మైనింగ్ లీజు వారు రెన్యువల్‌కు అర్జీ పెట్టుకున్న తరువాత రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ కాల పరిమితి ముగిసే లోపు పరిష్కరించకపోతే గనుక ఆ లీజు మళ్లీ ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేవరకు పొడిగించబడినట్లుగానే భావించాలి. ఐబిఎం గాని, రాష్ట్ర ప్రభుత్వం గాని సకాలంలో స్పందించకపోవడం వల్ల మైనింగ్ సంస్థల కార్యకలాపాలకు రాజమార్గం ఏర్పడినట్లైంది. ఇలా మినరల్ కన్సెషన్ రూల్ 24ఎ(6) దుర్వినియోగానికి గురయ్యి మైనింగ్ కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా ఖనిజాల తవ్వకాలు కొనసాగించుకునే వీలు కల్పించింది.

రెన్యువల్ తేదీలు ముగిసినాక కూడ రాష్ట్ర ప్రభుత్వం తగు ఉత్తర్వులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడం వల్ల లీజు కాలం చట్ట ప్రకారమే పొడిగించబడినట్లుగానే భావించి 215 మైనింగ్ కంపెనీలు ఒడిశాలో పని చేస్తున్నాయి. వీటిలో 15 మైన్‌లకు లీజు కాలం ముగిసి ఇరవై సంవత్సరాలకు పైగా దాటిపోయాయి. 17 మైన్‌ల కాలంముగిసి 15-20 సంవత్సరాలు అయింది. 38 మైన్‌ల కాలం ముగిసి 10-15 సంవత్సరాలు అయింది. 65 మైన్‌ల కాలం ముగిసి 5-10 సంవత్సరాలు అయింది. ఐదు సంవత్సరాలలోపు కాలం ముగిసినవి 80 మైన్‌లు ఉన్నాయి.

ఇనుము, మాంగనీస్ ఖనిజాలను తగ్గింపు రేట్లతో ఎగుమతులకు రవాణా చేయడంలో రైల్వేలను మైనింగ్ కంపెనీలు మోసం చేశాయి. 2011లో దక్షిణ తూర్పు రైల్వే శాఖ అక్రమాల్ని గుర్తించి 14 మైనింగ్ కంపెనీలకు 1,874 కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ నోటీసులు ఇచ్చింది. ఈ డబ్బు వసూలు మాట అలా ఉంచితే కనీసం డిమాండ్ అన్నా చేసిందనే అల్ప సంతోషం పొందవచ్చు.

2001-02లో ఒక టన్ను ఇనుప ఖనిజంపై లాభం రు. 139.78 ఉండగా, 2010-11కు వచ్చేసరికి రు. 3,237.64కు చేరింది. కాని ప్రభుత్వం పాత రేటుతోనే వసూలు చేస్తోంది. ప్రభుత్వం వసూలు చేయాల్సిన రాయల్టీకి గాని, రేటుకు గాని సవరణలు 2012లో చేయవల్సి ఉండింది. కాని అది జరగలేదు. రాయల్టీ నిర్ణయించడంలో ఆలస్యం చేయడం, అతి తక్కువ ధరలను నిర్ణయించడం వల్ల ప్రభుత్వం పెద్ద మొత్తంలో నష్టపోతోంది. అదే స్థాయిలో మైనింగ్ కంపెనీలు అత్యధిక లాభాలను గడిస్తున్నాయి.

ఐబిఎం ఎన్నో మైనింగ్ లీజులకు వాటి ప్లాన్‌లలో మార్పులకు చేర్పులకు అవకాశమిస్తూ ఆదేశాలివ్వడం వల్ల అధిక మొత్తంలో ఖనిజాలను తవ్వుకునే వీలు కల్పించింది. కొన్నింటి విషయంలో పాత తేదీల నుండే తవ్వుకునే అవకాశమివ్వబడింది. అంటే అవి చట్ట వ్యతిరేకంగా అధికంగా తవ్విన ఖనిజాలకు చట్టబద్ధత కల్పించిందన్న మాట. 2000 నుండి 2013 వరకు ఖనిజాలను తవ్వుకునే పరిమాణాన్ని 41.654 మిలియన్ టన్నుల నుండి 118.978 మిలియన్ టన్నుల వరకు పెంచుతూ అనుమతులిచ్చింది. ఇంత వరకు 154.263 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం తవ్వుకునే విధంగా అనుమతులివ్వడం, దాన్ని అలాగే కొనసాగిస్తే గనుక రాబోయే ముప్పై సంవత్సరాల్లో ఒడిశా రాష్ట్రంలో ఇనుప ఖనిజం నిల్వలు హరించుకుపోతాయి. కనుక భవిష్యత్ తరాలు ఇనుప ఖనిజాన్ని దిగుమతి చేసుకునే పరిస్థితి దాపురించకుండా ఉండడానికి గాను ఎగుమతులపై ఆంక్షలు లేదా నిషేధాలు విధించమని షా కమిషన్ సూచన చేసింది. ఈ సూచనను కేంద్రం తోసిపుచ్చింది.

అక్రమ మైనింగ్ వల్ల తీవ్రంగా నష్టపోయిన కియంజర్, సుందర్‌గడ్ జిల్లాల అభివృద్ధి కోసం మైనింగ్ కంపెనీల నుండి రికవరీ చేసిన సొమ్మును వినియోగించాలని షా కమిషన్ చెప్పింది. అసలు రికవరీ అవుతుందా? అయితే గియితే ఈ జిల్లాల్లో వినియోగిస్తారనేది అనుమానమే.

ఇనుము, మాంగనీస్ ఖనిజాల మైనింగ్‌లలో అన్ని రకాల చట్ట వ్యతిరేక పద్ధతులు పాటించబడ్డాయి. తిరిగి పొందలేని సాంప్రదాయిక సహజ వనరులను కొన్ని సంస్థలు, వ్యక్తులు, కొల్లగొడుతున్నారు. అందుకు చట్టాలను, న్యాయాలను కాలరాస్తున్నారు. తరతరాలకు చెందాల్సిన జాతీయ సంపదను కొద్దిమందికి కట్టబెట్టడంలో బ్యూరోక్రాట్‌లు, రాజకీయ శక్తులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిలాఖత్ అయ్యాయి. షా కమిషన్ ఈ అక్రమాలను వెలికి తీస్తున్న క్రమంలో పెద్ద మొత్తంలో మైనింగ్‌లలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకున్నామని చెప్పుకోవడం కోసం, తమ ప్రభుత్వంపై పడుతున్న నిందలను తొలిగించుకోనేందుకు ఒడిశా ప్రభుత్వం కొన్ని పోలీసు కేసులను నమోదు చేసింది. రాష్ట్ర, రాష్ట్రేతర మైనింగ్ బడా మైనింగ్ వ్యాపార వర్గాలు, రాజకీయ శక్తులు, అత్యున్నతస్థాయి ప్రభుత్వాధికారుల గనుల, పర్యావరణ, అటవి మంత్రిత్వ శాఖలు కలిసి చేసిన ఈ కుంభకోణంలో ఈ కేసులు న్యాయం సాధిస్తాయని అనుకోలేం. అందుకే వాటిపై సిబిఐ చేత విచారణ చేపట్టాలని షా కమిషన్ సూచించింది. ఈ సూచనను ఒడిశా ప్రభుత్వం తిరస్కరించింది.

గోవాలో అక్రమ మైనింగ్‌లపై షా కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన తరువాత ఒడిశాలోని నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అధికంగా పరిమితులకు మించి తవ్వుకున్న ఖనిజపు విలువలను మైనింగ్ వర్గాల నుండి రికవరీ చేయడం కోసం షోకాజ్ నోటీసులు ఇవ్వడం మొదలుపెట్టింది. మొత్తంగా 59,203 కోట్ల రూపాయల వసూలు కోసం 146 మైనింగ్ కంపెనీలకు నోటీస్‌లు ఇచ్చింది. షా కమిషన్ మైనింగ్‌ల అక్రమాలను నిష్కర్షగా బయట పెడుతుంటే తప్ప ప్రభుత్వానికి కళ్లు తెరవవన్నమాట. అయినా ఈ నోటీస్‌ల ద్వారా సాధించబడేది ఎంత అనేది సందేహమే.

గిరిజనుల జీవితాలను, ప్రభుత్వ, ప్రజా ఆదాయాలను, సంపదలను బలి తీసుకుంటూ మైనింగ్ మాఫియా అపరిమితమైన లాభాలను సొంతం చేసుకుంటున్నాయి. మైనింగ్‌కు అయ్యే ఖర్చుతో పోలిస్తే వచ్చే లాభాలు రెట్టింపుకంటే ఎక్కువగా ఉన్నాయి. ఈ అక్రమ లాభాలను జాతీయ సంపదకు జత చేయాల్సి ఉంది. ఈ సంపదతో మైనింగ్ వ్యాపార వర్గాలు బిలియనీర్లు అవుతుంటే అక్కడ పనిచేసే కూలీలు కనీస వేతనాలతో సతమతమవుతున్నారు. వారికి న్యాయమైన వేతనాలు లేవు. అక్కడ ఆదివాసులు చులకనలు, ఛీత్కారాలకు గురవుతున్నారు. స్థానికులకు ఎలాంటి ప్రయోజనాలు లేకపోను, పర్యావరణ ప్రమాదాలు, కాలుష్యం వారిని వెంటాడుతున్నాయి. మైనింగ్ పనులన్నీ దాదాపుగా యంత్రాలు చేసేస్తున్నాయి కాబట్టి మనుషులకు ఉద్యోగావకాశాలు లేకుండా పోతున్నాయి.

ఒడిశా రాష్ట్రంలోని ఆరు పెద్ద నదుల్లో ఒకటైన బైతరణి నదీ

పరివాహక ప్రాంతాల్లో అధిక భాగం కియంజర్, సుందర్‌ఘడ్ జిల్లాల్లో ఉంది. బైతరణి నది ఈ జిల్లాల ప్రజలకు జీవనాధారంగా ఉపయోగ పడుతోంది. ఈ నదిని అక్కడి 55 మైనింగ్ లీజులు ప్రత్యక్షంగా కలుషితం చేస్తున్నాయి. ఒడిశాలో 77 శాతం ఇనుము, మాంగనీస్ ఖనిజాల మైనింగ్ అటవీ ప్రాంతంలో జరుగుతోంది. అక్కడి 192 మైన్‌లలో 176 మైన్‌లు దట్టమైన అటవీ ప్రాంతాలలో ఉన్నాయి. వీటిలో 92 మైన్‌లకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ (ఎంఒఇఎఫ్) అనుమతులు లేనే లేవు. అయినా అవి నడుస్తూనే ఉంటాయి. అడవిని విచ్ఛిన్నం చేస్తూనే ఉంటాయి. జీవవైవిధ్యాన్ని వినాశనం కావిస్తూనే ఉంటాయి. ఈ మైన్‌లలో చాలా వాటికి ఫారెస్ట్ క్లియరెన్స్ (ఎఫ్‌సి) గాని, ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ (ఇసి)లు గాని లేవు. వన్యప్రాణుల సంరక్షణకు భంగం కలుగని పక్షంలోనే ఇసి ఇవ్వాలి. ఫారెస్ట్ కన్సర్వేటివ్ ఆక్ట్, 1980 ప్రకారం అటవీ ప్రాంతంలో మైనింగ్ లీజులను రెన్యువల్ చేసే ముందు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందాలి. అలా పొందకుండా రెన్యువల్ అర్జీలను 5 నుండి 20 సంవత్సరాలకు పైగా పెండింగ్‌లో పెట్టారు. ఈ పెండింగ్‌ల కాలంలో ఆయా మైనింగ్ కంపెనీలు తమ మైన్‌ల కాలపరిమితి పొడిగించబడినట్లుగానే భావించి తవ్వకాలు సాగిస్తున్నాయి. ఇందుకోసం స్వయంగా మైనింగ్ కన్సెషన్ రూల్ 24ఎ(6) వీలు కల్పిస్తోందని ఇంతకు ముందు చర్చించాం. ఇలాంటి తవ్వకాలకు తప్పనిసరిగా పొందాల్సిన ఎఫ్‌సిలు గాని, ఇసిలు గాని అవసరమే లేకుండా పోయింది. మైన్‌లను ఎప్పటికప్పుడూ తనిఖీ చేస్తూ, పర్యవేక్షించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలనా యంత్రాంగం కావాలనే ఆ పని చేయకపోవడం వలన అనేక అక్రమాలకు తావివ్వడం జరుగుతోంది.

విస్తృతమైన, విపరీతమైన అక్రమ తవ్వకాల వల్ల పెద్ద మొత్తంలో అడవులు నరికి వేయడం, నదులు, కాలువలు, చెరువులు, భూగర్భ జలాలు కలుషితం కావడం, సాగు భూములు విషతుల్యం కావడం జరుగుతోంది. 2008 నుండి 2011 సంవత్సరాల్లో మైనింగ్ మాఫియా విశృంఖలంగా చెలరేగిపోయింది. దీన్ని ఆపడంలో ప్రభుత్వ నియంత్రణా వ్యవస్థ కుప్పకూలిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వం, నిర్లక్ష్యం అనేది నేరపూరితమైందని షా కమిషన్ తేల్చి చెప్పింది. ఈ విషయంలో ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం, కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వం కావాలనే కళ్లు మూసుకున్నాయని తేలిపోయింది. ఇదంతా కూడ దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు ప్రజా సంపదను, సహజ వనరులను దోచుకోబడుతున్నాయి.

చత్తీస్‌గడ్‌లో నేటి వరకు 18 మైనింగ్ లీజులు మంజూరైతే వాటిలో 12 లీజులు బస్తర్ ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలోని దంతెవాడ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 69 శాతం ఇనుప ఖనిజం ఉత్పత్తి అవుతోంది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం బస్తర్ ప్రాంతంలో 62 శాతం భూభాగం అటవీ ప్రాంతంలో ఉంది. అక్కడి జనాభాలో 79 శాతం ఆదివాసులే ఉన్నారని 2011 జనాభ లెక్కలు చెబుతున్నాయి. దంతెవాడలో ఇనుప ఖనిజ మైనింగ్ కోసం పిఇఎస్ఎ, 1966 చట్టం, అటవీ హక్కుల చట్టాలు ఉల్లంఘించబడుతున్నాయి. ఆదివాసులకు రక్షణగా ఉన్న ఈ చట్టాలు అతిక్రమించబడి వారు విస్థాపనకు లోనవుతున్నారు. చత్తీస్‌గడ్‌లో అక్రమ మైనింగ్‌లపై విచారణ కోసం అక్కడి వారు షా కమిషన్ కాలపరిమితిని పెంచమని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. అయితే కేంద్ర ప్రభుత్వం దాన్ని తోసిపుచ్చింది.

షా కమిటి కాలపరిమితి పెంచకుండా, దాన్ని ఇంకేమాత్రం పనిచేయనీయకుండా చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వెనుక మైనింగ్ మాఫియా ప్రయోజనాలున్నాయనేది స్పష్టమే. ఇప్పటికే కర్నాటక, గోవా, ఒడిశా రాష్ట్రాలలో మైనింగ్ మాఫియా శక్తులు చేసిన, చేస్తున్న అవినీతి అక్రమాలను వెలుగులోకి షా కమిషన్ తెచ్చింది. అలాగే అక్రమ మైనింగ్ వర్గాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వాధికారుల మధ్య కొనసాగుతున్న విడదీయరాని బంధాలను బయట పెట్టింది షా కమిషన్. ఇంకా ఈ కమిషన్‌ను కొనసాగనిస్తే రాజకీయ నాయకులకు, మంత్రులకు, ముఖమంత్రులకు, బడా మైనింగ్ కంపెనీలకు కాళ్లలో కట్టెలాగా, కళ్లల్లో కారం లాగా మారే పరిస్థితి కొనసాగేది. షా కమిషన్ చట్టవ్యతిరేకంగా పనిచేస్తున్నదని మైనింగ్ కంపెనీలు ఆరోపిస్తూ దొంగే.. దొంగా! దొంగా! అన్నట్లు కోర్టుకు వెళ్లాయి. మైనింగ్ కంపెనీలకు చెప్పుకోవడానికే తగు సమయం ఇవ్వట్లేదని షా కమిషన్‌పై ఆరోపణలు చేశాయి. వీటి తరపున ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మినరల్ ఇండస్ట్రీస్ కోర్టులో 2013 ఫిబ్రవరి 26న పిటిషన్ వేసింది. షా కమిషన్ ముందు అక్రమ మైనింగ్ కంపెనీల తరపున పేరున్న ప్రముఖ న్యాయవాదులు రాంజెట్మలానీ, గోపాల్ సుబ్రమనియమ్, ఎ.కె. దివాన్, యు.యు. లలిత్, పినాకీ మిశ్రా వాదనలు వినిపించారు.

పెద్ద ఎత్తున అధిక లాభాల కోసం మైనింగ్ అధిపతులు చట్టాలను శక్తిహీనం చేయిస్తున్నారు. అధికార యంత్రాంగాన్ని తమ చెప్పుచేతుల్లో ఉంచుకుంటున్నారు. రాజకీయ శక్తులను తమతోపాటు నడిపించు కుంటున్నారు. కొన్ని సందర్భాలలో కర్నాటక బిజెపి మాజీ మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి వంటి రాజకీయ శక్తులే మైనింగ్ అధిపతులుగా ఉన్నారు. ఎందరో ఎంపిలు, ఎంఎల్ఎలు, మంత్రులు అక్రమ మైనింగ్ వ్యాపారాల్లో పాలుపంచుకుంటున్నారు. తరతరాల భారత ప్రజానీకం సహజ వనరులను, జాతి సంపదను కొల్లగొడుతూ, లూటీ చేస్తూ స్వైర విహారం చేస్తున్నారు. మైనింగ్ మాఫియా ముందు ప్రభుత్వాలు సాగిలబడు తుంటాయి. గనుల, పర్యావరణ అటవీ శాఖలు, కాలుష్య నియంత్రణ సంస్థలు మైనింగ్ కంపెనీల ముందు వినమ్రంగా చేతులు ముడుచుకొని నిలుచుంటాయి. అడవులను, పర్యావరణాన్ని నాశనం చేయడాన్ని ఆదివాసుల జీవితాలను నాశనం చేయడం తప్పని నిరసన తెలిపే వారిపై నిర్దాక్షిణ్యంగా, నిరంకుశంగా ప్రభుత్వాలు పోలీసులు, సైన్యాలతో విరుచుకు పడుతున్నాయి. ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చుకుని, మరెన్నో త్యాగాలతో సంఘటితమవుతూ సర్వశక్తులు ఒడ్డి నిరసనలు తెలుపుతున్న ఆదివాసులపై, వారికి అండగా నిలుస్తున్న కలాలు, గళాలపై కత్తులు గుచ్చుతున్నాయి ప్రభుత్వాలు. దేశ సరిహద్దులో ఉండే సైన్యం చత్తీస్‌గడ్ అడవుల్లోని ఆదివాసుల ఆవాస ప్రాంతాల్లో దిగిపోయి దాడులు చేస్తుంటుంది. ఆదివాసుల కాళ్ల కింద ఉన్న గనులను కొల్లగొట్టే కంపెనీలకు దాసోహం అయిపోతుంటుంది. ఇదంతా కూడ చట్టబద్ధంగానే చలామణి అయిపోతుంటుంది. కాని మైనింగ్ మాఫియా వద్ద మాత్రం ఈ ప్రభుత్వాలు గుడ్డివై పోతుంటాయి. షా కమిషన్ లాంటివి నిజాలను వెలుగులోకి తెస్తే గాని తెలుసుకోలేని అమాయకపు జీవులైపోతుంటాయి. ఈ విధంగా భారత్‌లో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందన్నమాట.

(రచయిత ఉపాధ్యాయులు, డిటిఎఫ్ సభ్యులు) వీ

భారత సమాజంలో జాతి వివక్ష

66 ఏళ్ల స్వతంత్ర భారతంలో ప్రజాస్వామ్యం ఎంత బూటకమో పాలకవర్గాల అణచివేతల తీరే నిదర్శనమని, వీటిని ప్రజా పోరాటాల ద్వారానే మార్చవచ్చని అంటున్నారు **భూసారం శివన్న**

మానవ సంకీర్ణ సమాజంలో విభిన్న రూపురేఖలు, శరీర నిర్మాణాలు, దేహధారుడ్యాలు, ఒంటి రంగులు, జుట్టుతీర్లు ఎన్నో. మనుషుల మధ్య ఈ రంగు, రూపు, రేఖా వైవిధ్యాలు వివిధ భూమండలాల్లో, భూఖండాలలో, వివిధ జన జాతుల ప్రవాహ ప్రయాణ కాలగమనంలో, సమ్మేళనంలో రూపు దిద్దుకున్న ప్రస్తుత మానవ జాతుల ఆవిర్భావాన్ని, వాటి పరిణామాలను మనకు తెలియచేస్తున్నాయి.

హిందూ పురాణేతిహాసాలలో ఒక పురాణమైన భాగవతంలో వర్ణించిన భగవత్ అవతారాల తోరణం కూడా ఏమి తెలియచేస్తోంది? శ్రీహరి ధరించిన బహు అవతారాలలో 18వ అవతారం రామునిగ, 19వ అవతారం బలరామునిగ, 20వ అవతారం కృష్ణునిగ మానవావతారాలు దాల్చినట్లు చెప్పబడింది. వీటికి పూర్వావతారాలన్నీ గమనిస్తే అవి పశు పక్ష్య జంతు జాలాల నుండి వచ్చినవే అని గ్రహించవచ్చు. ఈ క్రమం అశాస్త్రీయంగానైనా, ఓ కల్పనగానైనా మానవ పరిణామాన్ని తడిమింది.

హిందూ జాతి ప్రజలు ఇప్పటికీ ఈ అవతారాలను గాఢంగా నమ్ముతున్నారని కిక్కిరిసి తొక్కులాటలో నలిగి చనిపోతున్న భక్త జన సందోహాలు మనకు తెలియజేస్తున్నాయి. ఏ కొద్దిమందో మినహాయిస్తే వీరంతా కుక్కను, నక్కను, ఏనుగును, ఎలకను, నందిని, పందిని, వినాయకుణ్ణి, ఉగ్రనర్సింహుణ్ణి దైవాలుగా స్వీకరించి ఆరాధిస్తున్నారు. భగవంతుని పట్ల, భక్తి పట్ల, జీవరాసుల ఆరాధన పట్ల ఇంత విశాలత గల హిందూ సమాజం, తమవి కావనుకున్న రూపు రేఖలు, కట్టూ, బొట్టూ, ఆహార్యం గల ఈశాన్య భారత దేశ ప్రజలను గేలి చేస్తుంది. దుర్భాషలాడుతుంది. అంతేగాదు జాత్యాహకారంతో కొట్టి చంపుతుంది.

తన జాతి మనుషులు అని చెప్పుకుంటూనే కోట్లాది పౌరులను అస్పృశ్యులుగా, కడగొట్టువారిగా ముద్రవేసి నిత్యహింసకు, మానసిక వేదనకు గురిచేస్తుంది. వారిపై అణిచివేత కొనసాగిస్తూ, హత్యలకు, మానభంగాలకు కూడా వెనకాడక ఏహ్య చరిత్రను కొనసాగిస్తుంది. శరీరం రంగు, రూపు గొప్పలు చెప్పుకొని శ్వేత జాతి ప్రజలు నల్లజాతి ప్రజలపై కొనసాగిస్తున్న దురహంకారం దొంతరు దొంతర్లుగా మానవ సమాజాన్ని, అందునా హిందూ సమాజాన్ని పట్టి పీడిస్తున్నది.

ఒక నెల క్రితం దేశ రాజధాని ఢిల్లీ పుర వీధుల్లో కొంత మంది హిందూ చిరు వ్యాపారులు ఈశాన్య భారతదేశపు 19 – 20 ఏళ్ల యువకుడు, విద్యార్థి 'నిడో టానియ'ను చితకబాదడం వల్ల అతను చనిపోయాడు. దీని వెంబడే ఈశాన్య భారత ప్రజలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవేవో దురదృష్టవశాత్తూ జరిగిన చెదురు మదురు సంఘటనలుగా చిత్రించి, పరిగణించి పక్కకు తుడిచి పారేయలేం. వీరిపై ఇటువంటి దాడులు, అత్యాచారాలు ఏదో ఒక సందర్భంలో, ఏదో ఒక వంకతో జరగడమన్నది నిత్యకృత్యమయ్యింది. చదువు సంధ్యల కోసమో, ఉద్యోగాల కోసమో, పనులు చేసుకొని బతకడం కోసమో దేశంలో ఒక మూల నుండి వచ్చిన వీరిని అగౌరవపరిచి, కించపరిచి, దుర్భాషలాడి, వేదించి, చివరకు చంపడం వరకు వెళుతున్నా రంటే హిందూ జాతి దురహంకారపు దార్ఢ్యికం ఎంతబలంగా ఉందో అంచనా వేయవచ్చు. నిడో టానియ పై దాడి దీనికి ఒక చిన్న ఉదాహరణ మాత్రమే.

భారత రాజ్యం, ఈశాన్య భారతం తమదేనంటుంది. మరి ఈ రాజ్యంలోని ప్రధాన హిందూ జాతి మనుషులు ఈశాన్య భారతంలో నివసించే ప్రజలను మట్టుకు మావాళ్లు కానేకాదని అంటున్నారు. ఆ ప్రదేశం, ఆ భూభాగాలు, అక్కడి సమస్త వనరులు మట్టుకు మా హిందూ జాతికే చెందాలని అంటున్నారు. ఈ భరత జాతి గత 66 ఏళ్లుగా తన జాత్యాహంకార సైన్య పటాలాలతో ఈశాన్య భారత ప్రజల కుత్తకలు కత్తిరిస్తూనే ఉంది. అక్కడి మానవ వనరులతో సహా సమస్త సంపదను తమదేనని ఏకపక్షంగా ప్రకటించుకొని ఈశాన్య భారత ప్రజలను జంగ్లీ – జాన్వర్లుగా, నీతిబాహ్యులుగా ముద్రవేస్తుంది. వారిని ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు మానభంగాలకీ, ఆకృత్యాలకి, కిరాతక చర్యలకు, ఎన్‌కౌంటర్లకు, ఊచకోతకు, మానవ వేటకు మాత్రమే అర్హులుగా గణిస్తున్నది. కశ్మీరీ భూభాగం తమదేనని, ఇది భారతదేశంలో సంపూర్ణ అంతర్భాగమని ఈ హిందూ రాజ్యం చెపుతుంది. కాని భరతజాతి హిందూ సమాజం మట్టుకు అక్కడ నివసించే కశ్మీర్ ప్రజలు తమవాళ్లు కాదంటుంది. కశ్మీరీ భూభాగాన్ని తమ జాతి సైన్యపు ఇనుప కౌగిలిలో బిగించి ఉంచింది. అక్కడి స్త్రీలపై అత్యాచారాలు, గృహ దహనాలు, ఊచకోతలు కొనసాగించడానికి కశ్మీర్‌ను భగవంతుడు తమకు ప్రసాదించిన సుందర సౌభాగ్య ప్రదేశమని అనునిత్యం నిరూపించుకుంటోంది.

ఈ భారత రాజ్యం 'దండకారణ్యం' తన దేనంటుంది. అక్కడి సమస్త భూ భౌగోళిక సంపదలు తనవేనంటుంది. కాని, ఆ భూభాగంలో నివసిస్తున్న వనజీవన, గిరిజీవన జనజాతులను శత్రువులుగా, సమూలంగా నిర్మూలించవలసిన అన్య ప్రాణులుగా జమకడుతుంది. అక్కడ సంపదను కొల్లగొట్టు కోవడానికి, పెట్టుబడి సామ్రాజ్యాన్ని స్థాపించుకోవడానికి, దండకారణ్యాన్ని సైనిక శిబిరంగా మార్చి వేసింది. పచ్చని జీవితాలను, జీవరాసులను, నదీనదాలను, సెలయేళ్లను, వనాలను బూడిద, కాలుష్యమయం చేసే పనిలో పచ్చవేటను కొనసాగిస్తున్నది.

రూపాయి పతనం అంటే ఏమిటి?

డాలర్ - రూపాయి మారకం విలువ ఎలా నిర్ణయమవుతుందో వివరిస్తూ, ప్రపంచ బ్యాంక్ ఆర్థిక విధానాల వల్ల రూపాయి విలువ రోజురోజుకూ దిగజారిపోతోందని అంటున్నారు **ఆర్.శశికుమార్**

రూపాయి విలువ గురించి మాట్లాడుకోబోయే ముందు మీ అందరికీ ఒక ప్రశ్న! ఒక తెల్లకాగితం మీద నేను 500 అనే అంకెవేసి మీకు ఇస్తే మీరు తీసుకుంటారా? మొహమాటం కొద్దీ కొంతమంది తీసుకోవచ్చు. సరే! దానికి బదులుగా అయిదు వందనోట్లు ఇమ్మంటే ఇస్తారా? కచ్చితంగా ఇవ్వరు. కిలో బియ్యం 50 రూపాయలు అనుకుంటే, నేను ఆ కాగితం మీకిస్తాను. మీరు నాకు 10 కిలోల బియ్యం ఇస్తారా? ఇవ్వరు. అదే కాగితం మీద ఆర్.బి.ఐ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) గవర్నర్ సంతకం చేసి ఇస్తే! తప్పకుండా పై రెండూ చేస్తారు. కాగితం మారలేదు. కావాలంటే నేను అంతకన్నా మంచి నాణ్యమైన కాగితం మీద 500 అనే అంకె వేసి ఇస్తాను. అయినా మీరు నా కాగితాన్ని చిత్తుకాగితం కన్న ఎక్కువగా చూడరు. కానీ అలాంటి చిత్తుకాగితాల మీద 10, 20, 50, 100, 500, 1000 అని కొన్ని అంకెలు మార్చి ఆర్.బి.ఐ ముద్రిస్తే మాత్రం మీరు దానికి తగ్గ విలువ ఇస్తారు. కరెన్సీ అంటే సరిగ్గా అదే! చలామణీ కాగలిగిన చిత్తుకాగితాలు మాత్రమే. అంటే ఒక కాగితం విలువ కాగితాన్నిబట్టి కాక దానికి మీరు ఇచ్చే ఆమోదాన్ని బట్టి మాత్రమే ఉంటుందన్నమాట. పది సంవత్సరాల క్రితం మీరు వంద రూపాయలు మాత్రమే తీసుకొని నాకు పది కిలోల బియ్యం ఇచ్చారనుకోండి. కానీ ఇప్పుడు అదే పది కిలోల బియ్యానికి 500 రూపాయలు అడుగుతున్నారనుకోండి. దానర్థం బియ్యం విలువ పెరిగినట్లా? లేక రూపాయి విలువ తగ్గినట్లా? లేక రెండూనా? కచ్చితంగా అది ఆ రెండింటి మిశ్రమ ఫలితమే! ఎప్పుడైతే 100 రూపాయలతో ఒకప్పుడు నాకు 10 కిలోల బియ్యం వచ్చేవి కాస్తా ప్రస్తుతం రెండు కిలోల బియ్యమే వస్తోందంటే రూపాయి కొనుగోలు శక్తి ఆ మేరకు పడిపోయిందన్నమాట. దాన్నే మనం ద్రవ్యోల్బణం అని అంటాం!

రూపాయి అని మనం దేన్ని అంటున్నామో అది కేవలం వస్తు లేక

అంతేనా, ఈ దేశంలో నివసిస్తున్న ఇస్లాం మతస్తులను తమనెత్తిమీద శనిగా, టెర్రరిస్టులుగా, చంపి పారెయ్యాల్సిన శత్రువులుగా పరిగణిస్తున్నది. మరిన్ని గుజరాత్ మారణహోమాలను సృష్టించి తన జాత్యాహంకార జెండాను సమున్నతంగా ఎగరవేసే పనిలో తలమునకలై ఉంది. దక్షిణ భారత భూభాగాల్లో నివసించే ద్రావిడ జాతి ప్రజలను కోతులుగా, రాక్షస జాతులుగా, తమకన్నా దిగువ వారిగా తన నకిలీ రామాయణ జాత్యాహంకారంతో ప్రకటిస్తూ విర్రవీగుతూ ఉంటుంది.

పైపైకి రాజ్యం తాను గొప్ప ఉదార ప్రజాస్వామ్య స్వభావమని చెప్పుకుంటుంది. స్త్రీ పురుష సమానత్వాన్ని చాటుకుంటుంది. దానికి ఉదాహరణగా ఇందిర–సోనియాలను, సుష్మాస్వరాజ్‌లను, మాయావతులను, జయ – మమతలను, కొంతమంది మహిళా మోడల్స్ సిఇఒలను సినీ తారలను అధికార పీఠాల్లో ఎత్తి చూపిస్తుంది. కానీ ఈ రాజ్యాధికార పీఠాల్లో ఏం జరుగుతుందో గమనించినట్లయితే, ఇన్ని వేల శతాబ్దాల కాల గమనంలో ఏ మానవ చారిత్రక దశలో స్త్రీలపై, బాలికలపై ఈ రోజుల్లో జరుగుతున్న లైంగిక అత్యాచారాల వంటివి ఈ భారత జాతి హిందూ సమాజంలో తప్ప ఇంకెక్కడా, ఇంకే ఇతర సమాజాల్లోనూ జరగవు, జరిగి ఉండవు అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఈ భారత దేశ సమాజంలో, అందునా 21వ శతాబ్దంలో పెచ్చరిల్లి మరీ ఎందుకు ఈ నీతి బాహ్య అమానుష లైంగిక వేట నిత్యకృత్యమైంది? దేశభక్తి తనదేనని నకిలీ పూనకంతో చెప్పుకుంటున్న భూభాగాల్లో జాత్యాహంకార పాశవిక దాడులు ఎందుకని అక్కడి జన జాతులపై పెచ్చరిల్లి కొనసాగుతున్నాయి? మానవ మస్తిష్కాలు ఇంతగా ఎందుకు కుళ్లి కలుషితమైపోయాయి. విషపూరితమైపోయాయి. రంగుకు, రూపానికి, పైపై మెరుగులకు ఇంతగా గిరాకీ ఎందుకు పెరిగిపోయింది? ఈ వికృతానందంలో కోల్పోతున్న మానవత్వపు విలువలు, కొడిగట్టిపోతున్న అభ్యుదయ ఛాయలు దేనిని సూచిస్తున్నాయి?

ఈ 66 ఏళ్ల స్వాతంత్ర్య భారతం ఎంతటి బూటకపు వ్యవస్థో ఇప్పుడు అమల్లో ఉన్న రాజకీయ ఆర్థిక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, చట్ట సభల్లో నిత్య రచ్చ చెప్పకనే చెపుతున్నాయి. వీటిని వేరే ప్రత్యేకంగా విప్పి చెప్పనవసరం లేదు. ఈ వ్యవస్థను సమూలంగా నిర్మూలించకుండా కుళ్లిగబ్బు గొడుతున్న దురహంకారాల పెంటకుప్పగా తయారైన భారతదేశాన్ని ప్రక్షాళన చేయడం సాధ్యమా?

వివిధ మానవ సమూహాలను అద్భుతమైన రంగురాళ్ల పొందికగ, ఓ అందాల సుందరమయ హారంగా, ప్రకృతి వర ప్రసాదంగా స్వీకరించి నడుచుకోగలిగే, నూతన మానవ సమాజ సంస్కృతితో తొణికిసలాడే ప్రపంచం ఎలా సాధ్యపడుతుంది. భారత హిందూ దురహంకారానికి గురవుతున్న సకల దేశీయ జనజాతులు ఒక్కటై ఆలోచించాల్సిన విషయం. మొదటి ప్రపంచంగా చలామణి అవుతున్న తెల్లజాతి దురహంకారం, సామ్రాజ్యవాద దురహంకారాలకు గురవుతున్న మూడవ ప్రపంచ ప్రజలు లేచి నిలబడి బడితె బాదుడుకు సిద్ధమవ్వాల్సిన చారిత్రక సందర్భమిది.

(రచయిత శ్రామిక నేస్తం పత్రిక సంపాదకులు) వీ

సేవల మారకానికి ఉపయోగపడే సాధనం మాత్రమే అని అర్థమయ్యాక అదే మారకం అంతర్జాతీయంగా జరగాలంటే కూడా ఈ రూపాయి ఉపయోగపడుతుందా? అని ఆలోచించాలి. ఆర్.బి.ఐ ముద్రించిన 500 అనే చిత్తు కాగితాన్ని మీరు ఆమోదించి నాకు 10 కేజీల బియ్యం ఇవ్వడానికి సిద్ధమయ్యారు. కానీ అదే 500 రూపాయల నోటు నేను థాయ్‌లాండ్‌లో ఒక రైతుకి ఇస్తే బియ్యం కాదు సరికదా! కనీసం ఒక్క గింజ కూడా ఇవ్వడు. అంటే మన చిత్తు కాగితాలకి మనం ఆమోదం తెలిపినట్లుగా ప్రపంచం అంతా ఆమోదం తెలపదు అనే కదా! మరి ప్రపంచమంతా ఆమోదం తెలపాలంటే ఎలా? ఏ ఉమ్మడి కరెన్సీ మారకానికి ప్రపంచమంతా చలామణీ అవుతుంది? ఒకప్పుడు బంగారం! తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఊపులో ఉన్న సమయంలో వారి పౌండ్ స్టెర్లింగ్ ఆ తర్వాత అమెరికన్ సామ్రాజ్యవాదం వేళ్లూనుకొన్న తర్వాత అమెరికన్ డాలర్. మరి అలాంటి డాలర్‌తో పోలిస్తే మన రూపాయి విలువ రానురానూ దిగజారిపోతూ ఉందని ప్రతిరోజూ వార్తలు చూసి మనం వాపోతూనే ఉన్నాం. కానీ దానికి కారణాలు కానీ, లేక పరిష్కారాలు కానీ మనకి పూర్తిగా చేరడంలేదు. వాటి గురించి కొంత విశ్లేషించే ప్రయత్నం చేద్దాం!

66 సంవత్సరాల స్వతంత్ర(?) భారతంలో డాలర్/రూపాయి మారకం విలువ 66 రెట్లు పెరిగింది. అంటే రూపాయి విలువ 66 వంతులు తగ్గిందన్నమాట. మరొక్కసారి చెపుతున్నాను. అది 66 శాతం కాదు. 66 రెట్లు. మరలా అదే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అంటే డాలర్ విలువ ఈ కాలంలో అంతగా పెరిగిందా? లేక రూపాయి విలువ అదేకాలంలో తగ్గిందా? లేక రెండూనా? మరలా అదే సమాధానం. రెండూ... కానీ రెండింటికీ గల కారణాలు మాత్రం అనేకం. ముందు డాలర్ విలువ పెరగడానికి గల కారణాలు, దానికి దారితీసిన పరిస్థితులు గమనిద్దాం!

500 రూపాయలు అని ఆర్.బి.ఐ ముద్రించిన చిత్తుకాగితాన్ని మీరందరూ... ఆమోదించారు కానీ ప్రపంచంలో మిగిలిన దేశాల వాళ్లు ఆమోదించరు అని తెలుసుకున్నాం కదా! అయితే అదేపని అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ కనక చేస్తే మాత్రం ప్రపంచమంతా ఆమోదించాలి. కాగితం మారలేదు. కానీ ఆ కాగితానికున్న ఆమోదయోగ్యత మారింది. ఒక చిత్తుకాగితం మీద అమెరికన్ ప్రభుత్వం 100 డాలర్లు అని ముద్రించి ఎవరికైనా ఇస్తే వారు ఆ దేశానికి తమ వస్తు/సేవలను అందిస్తారు. అదే 100 డాలర్లు అనే కాగితం మనం ఇచ్చినా మనకి కూడా వస్తు/సేవలను అందిస్తారు. అదేమిటి? మన కాగితానికి లేని విలువ అమెరికన్ కాగితానికి ఎలా వచ్చింది అనే సందేహం మనల్ని పీడిస్తూ ఉంటుంది. అక్కడే మనం అమెరికన్ సామ్రాజ్యవాద పోకడలను గమనించాలి. ఇన్ని సంవత్సరాలుగా సామ, దాన, భేద, దండోపాయాలను వాడి అమెరికా తన డాలరును ఒక అంతర్జాతీయంగా ఆమోదయోగ్యమైన కరెన్సీగా మార్చుకొంది. డాలరు ఆధిపత్యాన్ని ప్రశ్నించిన పాపానికి సద్దాం హుస్సేన్ వంటి నాయకులను భౌతికంగా నిర్మూలించి ప్రపంచానికి బహిరంగ హెచ్చరిక చేసింది. ప్రపంచంలోనే అత్యధిక చమురు ఉత్పత్తి దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) వంటి దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా ఆయా కరెన్సీలను డాలర్‌కి సొంతం చేసుకొంది. అంటే చమురు దిగుమతి చేసుకోవలసిన దేశాలన్నీ తప్పనిసరిగా డాలరులలోనే ఆయా చమురు ఎగుమతి దేశాలకు చెల్లించవలసి ఉంటుంది. స్వేచ్ఛా మార్కెట్ సిద్ధాంతాల ప్రకారం డిమాండ్, సప్లై థీరీని అనుసరించి డాలర్‌కు కృత్రిమంగా డిమాండ్‌ని సృష్టించింది. ఇది ఎలాంటిదంటే కేకులో మా ముక్క మేము పూర్తిగా తీసుకున్న తర్వాత మిగతావారందరూ స్వేచ్ఛా మార్కెట్ ప్రకారం పంచుకోవాలి అని చెప్పడం అన్నమాట. అసలు ప్రపంచ విపణిలో బంగారం తప్ప ఏ ఇతర దేశపు కరెన్సీనైనా ఎందుకు ఉమ్మడి మారకంగా అంగీకరించాలి అనే ప్రశ్న లేవనెత్తనీయకుండా యుద్ధ భీతిని సృష్టించి డాలరును చలామణీ చేసుకుంటోంది. అంటే డాలరు విలువ పెరగడం అనేది సహజంగా జరిగిన, జరుగుతున్న పరిణామమేమీ కాదు. మళ్లీ మొదట తీసుకున్న ఉదాహరణకే వద్దాం. నేను మీ పీకమీద కత్తిపెట్టి 500 రూపాయలు అని నేను రాసిన చిత్తుకాగితం నువ్వు ఆమోదిస్తావా? చస్తావా? అంటే మీరేం చేస్తారు? తప్పని స్థితిలో ఆమోదిస్తారు. ఇలా కొంతమంది ఆమోదించాక మిగిలినవారి పీకమీద కత్తిపెట్టాల్సిన అవసరంలేదు. అందరూ ఆటోమేటిక్‌గా ఆమోదిస్తారు. ఇలా సృష్టించుకున్న ఆమోదంతో అమెరికన్ డాలరు ఇవాళ ప్రపంచ కరెన్సీగా చలామణీ అవుతోంది.

సరే డాలరు గొడవ మనకెందుకు? మన రూపాయి ఎందుకు బక్కచిక్కి పోతోంది అని అనిపిస్తే అదే చూద్దాం! ఇందాక చెప్పుకున్నట్లు రూపాయి కొనుగోలు శక్తి దేశీయంగా తగ్గిపోతే అదే ద్రవ్యోల్బణం. అలాగే రూపాయి కొనుగోలు శక్తి అంతర్జాతీయంగా కూడా తగ్గిపోతే అది మారకపు విలువ పతనం. కరెన్సీలు కూడా డిమాండు సప్లై సిద్ధాంతాల ప్రాతిపదికన తమ విలువను మార్చుకుంటూ ఉంటాయి. కాబట్టి రూపాయి విలువ తగ్గుతోంది అంటే రూపాయికి డిమాండు తగ్గుతోంది అని అర్థం. అలాగే రూపాయికి డిమాండ్ పెరిగితే అప్పుడు రూపాయి మారకపు విలువ కూడా పెరుగుతుంది. మరి రూపాయి డిమాండ్ పెరగాలంటే ప్రపంచంలో కొందరైనా మాకు రూపాయిలు కావాలి అని అడగాలి కదా! ఎవరైనా రూపాయిలు ఎందుకు అడుగుతారు? ఒకవేళ వారు భారతీయ వస్తువుల్నిగాని, సేవల్ని గానీ వినియోగించుకుంటే, వారు చెల్లించాల్సింది రూపాయిల్లో అయితే అప్పుడు రూపాయికి డిమాండ్ పెరుగుతుంది. అంటే మన ఎగుమతులు బాగా ఉంటే రూపాయికి డిమాండ్ పెరుగుతుంది. దీనికి విరుద్ధంగా దిగుమతులు కనుక ఎక్కువ అవుతుంటే రూపాయి డిమాండ్ తగ్గుతుంది. ఈ రెండింటి మధ్య ఉండే వ్యత్యాసం పాజిటివ్‌గా ఉండవచ్చు లేక నెగెటివ్‌గా ఉండవచ్చు. మనదేశానికి ఈ వ్యత్యాసం నెగెటివ్‌గా ఉండడం వల్ల దాన్నే వాణిజ్య లోటు (ట్రేడ్ డెఫిసిట్) అంటాం. ఈ అంతరం రానురానూ పెరిగిపోతూ ఉంటే రూపాయి డిమాండ్ తగ్గడంతో పాటు దాని మారకం విలువ కూడా తగ్గుతుంది. అయితే అంతర్జాతీయ విపణిలో వసూళ్లు, చెల్లింపులు ఎక్కువగా అమెరికన్ డాలర్లలోనే జరుగుతాయి కాబట్టి మన దిగుమతులకు మనం డాలర్లలో చెల్లించాలి. అలాగే మన ఎగుమతుల నుంచి వచ్చే వసూళ్లు కూడా డాలర్లలోనే చేయాలి. మనకి రావలసిన వాటికంటే మనం ఇవ్వాల్సినవి ఎక్కువ ఉంటే దాన్నే కరెంట్ అకౌంట్ డెఫిసిట్ అంటాం.

ఒకవేళ ఈ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ గనక రోజురోజుకీ పెరిగిపోతూ ఉంటే అప్పుడేం చేయాలి? మన దగ్గర ఉన్న విదేశీమారక నిల్వల్ని ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్న కొద్దీ అంటే కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పెరిగిపోతున్న కొద్దీ మన అంతర్జాతీయ ఆర్థిక పరపతి ఆ మేరకి తగ్గిపోతూ ఉంటుంది. ఈ లోటుని పూరించుకోవడానికి బహిరంగ మార్కెట్లో డాలర్లు కొనవలసిన అగత్యం ఏర్పడుతుంది. అంటే ఆటోమేటిక్‌గా రూపాయి డిమాండు తగ్గుతూ, డాలర్ డిమాండ్ పెరుగుతూ ఉంటుంది. గత కొన్ని సంవత్స రాలుగా జరుగుతున్నది సరిగ్గా ఇదే. అయితే ఈ విపత్కర పరిణామాలకు కారణాలు అసంఖ్యాకంగా ఉన్నా, కొన్నిటిని మాత్రమే ప్రస్తావిస్తాను.

ఎగుమతులు, దిగుమతులు

భారతదేశం ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న మొదటి నాలుగు వస్తువులు పరిశీలిస్తే, ముడి చమురు ప్రథమస్థానంలో, బంగారం రెండవస్థానంలో నిలుస్తాయి. అయితే వినియోగతత్వాన్ని విపరీతంగా పెంచడం వల్ల పెరిగిన డిమాండ్ ఎలక్ట్రానిక్ గూడ్స్‌ని మూడవ స్థానంలో నిలుపుతోంది. మొదటి రెండూ సహజవనరులు కాబట్టి మనం వాటిని పూర్తిగా ప్రభావితం చేయలేకపోవచ్చు కానీ ఎలక్ట్రానిక్ గూడ్స్ తయారీ భారతదేశంలో చేయలేమా? తద్వారా తరలిపోతున్న 33 బిలియన్ డాలర్లను కొంతైనా కాపాడుకోలేమా? చిదంబరం సామాన్య మధ్యతరగతి కుటుంబీకుల్ని బంగారంపై మోజు తగ్గించుకోమని సెలవిచ్చారు. బాగానే ఉంది. బంగారం దిగుమతులకి మనం చెల్లిస్తోంది 62 బిలియన్ డాలర్లు అయితే అందులో సగం అంటే 31 బిలియన్ డాలర్లు రకరకాల రత్నాలు, వజ్రాలకోసం అనే సంగతి ఎందుకు విస్మరిస్తున్నారు? అత్యంత విలువైన ఈ రాళ్ల కోసం మనం అంత పెద్దమొత్తంలో డాలర్లు చెల్లించాల్సి వస్తోంది. అందులో కొంతభాగం జ్యూయలరీగా మార్చి మనం తిరిగి ఎగుమతి చేస్తున్నప్పటికీ, మిగిలిన భాగం భారతదేశంలో ఏ వర్గాలకి ఉపయోగపడు తుందో సులువుగానే అర్థం చేసుకోవచ్చు. నల్ల ధనాధిపతులకి నగదు రూపంలో కన్నా బంగారం లేక వజ్రాల రూపంలో దాన్ని దాచుకోవడం సులభం. ఈరకంగా మనదేశం తన నిల్వల్లోని డాలర్లు అమ్మి తద్వారా తెచ్చుకున్న బంగారం / వజ్రాలతో తన దేశంలోని నల్లధనాన్ని సులువుగా దాచుకోవడానికి దోహదపడుతోంది. ఎంత అద్భుతమైన ఆర్థిక నిర్వహణ!

భారతదేశపు మొత్తం దిగుమతుల్లో అత్యధిక శాతం ఏ దేశం నుంచి చేసుకుంటుంది? అని అడిగితే ఈ రోజుల్లో స్కూలు పిల్లలు కూడా ఠక్కున చెపుతారు చైనా అని. అయితే ఎంత మొత్తంలో భారతదేశం చైనాల మధ్య వాణిజ్యం జరుగుతోందో నిశితంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. చైనా నుంచి భారతదేశం దిగుమతి చేసుకుంటున్న వస్తు / సేవల విలువ 58 బిలియన్ డాలర్లు కాగా చైనాకి భారతదేశం ఎగుమతి చేస్తున్నది కేవలం 18 బిలియన్ డాలర్లు మాత్రమే! అంటే ఒక్క చైనా దేశంతోనే మన బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ 40 బిలియన్ డాలర్లు తక్కువగా ఉందన్నమాట. అంతేకాదు. మనం చైనా నుంచి ఏమి దిగుమతి చేసుకుంటున్నాం, వారికి ఏమి ఎగుమతి చేస్తున్నాం అనేది కూడా గమనించాలి.

చైనా నుండి మన దిగుమతులలో ముఖ్యమైనవి (2012) (శాతంలో)

అణురియాక్టర్లు / యంత్రాలు	- 23
విద్యుత్ యంత్రపరికరాలు	- 21
జీవరసాయనాలు	- 10
ఎరువులు	- 6

చైనాకు మన ఎగుమతులు (2012) (శాతంలో)

ముడిఖనిజాలు	- 23
పత్తి	- 22
రాగి	- 12

మనకు స్పష్టంగా అర్థమయ్యేదేమిటంటే మన ఎగుమతులు ఎక్కువభాగం సహజవనరులు, ముడిసరుకులు కాగా వారి ఎగుమతులు ఎక్కువ భాగం సాంకేతిక ఉత్పత్తులు. అంటే 66 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా మన ముఖ్య ఎగుమతి సరుకులు ముడి పదార్థాలేనన్న మాట. ఏటా లక్షలాదిగా ఇంజనీర్లని ఉత్పత్తి చేస్తున్న మనం వారికి ఉపాధి కల్పిస్తూ సాంకేతిక ఉత్పత్తులు తగినంతగా తయారు చేయలేని దుస్థితిలో ఉన్నామన్నమాట. ఆఖరికి ఎరువులు కూడా దిగుమతి చేసుకోవడమంటే మనలాంటి వ్యవసాయాధారిత దేశానికి సిగ్గుచేటు. ఇంచుమించుగా ఒకేసారి ప్రయాణం ప్రారంభించిన చైనా, ఇండియాల ప్రస్థానం ఇన్నేళ్లుగా ఎలా సాగుతోందో దీన్ని బట్టే మనకి అర్థమవుతుంది. మరికొన్ని గణాంకాలు గమనిస్తే చైనా ఎందుకు ట్రేడ్ సర్‌ప్లస్‌లో ఉందో భారతదేశం ఎందుకు ట్రేడ్ డెఫిసిట్‌లో ఉందో స్పష్టమవుతుంది.

మొత్తం వస్తు ఎగుమతిని తయారైన వస్తువులు (ప్రాసెస్డ్ గూడ్స్), తయారు కాని వస్తువులు (అదర్ గూడ్స్) గా స్థూలంగా విభజన చేయవచ్చు. తయారైన వస్తువులు అంటే ముడి పదార్థాల మీద కొంత శ్రమను జోడించి వస్తురూపంగా తయారు చేయడం అన్నమాట. ఇలాంటి తయారైన వస్తువులు చైనా మొత్తం ఎగుమతుల్లో 60 శాతం ఉండగా మనదేశం మొత్తం ఎగుమతుల్లో కేవలం 30 శాతం మాత్రమే ఉన్నాయి అంటే విలువను జోడించే కార్యకలాపం (వాల్యూ ఆడింగ్ ఆక్టివిటీస్) మన దేశంలోకన్నా చైనాలో చాలా ఎక్కువగా జరుగుతున్నదన్న మాట.

అలాగే ప్రపంచస్థాయిలో జరిగే మొత్తం ఎగుమతులు, దిగుమతులు పరిశీలిస్తే చైనా, ఇండియాల మధ్య అంతరం సులువుగానే బోధ పడుతుంది.

	చైనా	**భారతదేశం**
దిగుమతులు	9.5 శాతం	2.5 శాతం
ఎగుమతులు	10.4 శాతం	1.7 శాతం

(పైన చెప్పినవి మొత్తం ప్రపంచంలోని ఎగుమతులు / దిగుమతుల్లో ఆయా దేశాల వాటా శాతం)

ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) / వ్యవస్థాగత విదేశీ మదుపులు (ఎఫ్ఐఐ)

మన స్వయంకృతాపరాధంగా పెంచుకుంటూ పోయిన ట్రేడ్ డెఫిసిట్, కరెంట్ డెఫిసిట్ (సిఎడి)లని పూడ్చుకోవడానికి విదేశీ ప్రత్యక్ష

పెట్టుబడులు (ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ – ఎఫ్‌డిఐ), విదేశీ సంస్థాగత మదుపు (ఫారెన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్ట్‌మెంట్ – ఎఫ్ఐఐ) మాత్రమే మార్గమని మన చిదంబరం పదే పదే నొక్కి వక్కాణిస్తూ ఉంటారు. సరే! వాటి వల్ల పై రెండు లోటులూ కొంత పూడే మాట వాస్తవమే అయినప్పటికీ అవేమీ కొత్తగా ఇప్పుడు వస్తున్నవేమీ కాదే! సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్.పి.జి) విధానాల్లో భాగంగా అంచెలంచెలుగా 1991 నుండి అంటే 22 సంవత్సరాలనించీ వాటికి మనం రెడ్‌కార్పెట్ వేసి స్వాగతం పలుకుతూనే ఉన్నాం. అయినా ఇంతకాలానికి కూడా భారతదేశానికి అంతర్జాతీయ విపణిలో విశ్వసనీయతను ఎందుకు సృష్టించలేకపోయాం? అనేది పునరాలోచించుకోవాల్సిన విషయం. అభివృద్ధి, అవినీతి ఎప్పుడూ కలిసే ప్రయాణిస్తాయనేది ఒక కఠోరమైన అంతర్జాతీయ వాస్తవమైనప్పటికీ మనం దానికి ఉన్న అప్రకటిత హద్దులన్నీ దాటేశాం! తద్వారా అత్యంత జుగుప్సాకరమైన ముద్రని మూట కట్టుకున్నాం. ఫలితంగా భారతదేశంవైపు చూడాలంటేనే ఎంతోమంది పెట్టుబడిదారులు భయపడే పరిస్థితిని మనమే కల్పించుకున్నాం.

సరే! దాని సంగతి అటుంచితే అసలు ప్రత్యక్ష విదేశీ పెట్టుబడి (ఎఫ్‌డిఐ)కీ, సంస్థాగత విదేశీమదుపు (ఎఫ్.ఐ.ఐ)కీ ఉన్న ముఖ్యమైన తేడా ఏమిటని చాలామందికి సందేహం ఉంటుంది. ఎఫ్ఐఐ అంటే ఏదైనా విదేశీసంస్థ భారతదేశంలోని ఏ కంపెనీల్లోనైనా 10 శాతం కంటే తక్కువ వాటాని కొనుగోలు చేయటం. సాధారణంగా ఈ కొనుగోలు స్టాక్ ఎక్స్‌చేంజ్ ద్వారా జరుగుతుంది. ఎవరైనా మన కంపెనీల షేర్లు ఎందుకు కొంటారు? వాటి మీద లాభాలు గడిద్దామని మాత్రమే. ఎఫ్ఐఐ లకి, ఆయా కంపెనీల మీద ఏరకమైన ఆసక్తి ఉండదు. వారి దృష్టి కేవలం దానిమీద వచ్చే లాభాలమీద మాత్రమే. అంటే ఎఫ్ఐఐల దృష్టిలో అది కేవలం ఒక స్వల్పకాలిక మదుపు (షార్ట్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్) మాత్రమే.

అయితే ఎఫ్ఐఐలతో వచ్చిన చిక్కేమిటంటే, ఎప్పుడయితే వారికి షేరు ధరలలో ఉన్న ఎగుడుదిగుడుల వల్ల లాభాలు వస్తాయో, వారు వెంటనే ఆ షేర్లు అమ్ముకొని ఆ లాభాన్ని తమదేశానికి తీసుకుపోతారు. అలాగే ఒకవేళ భవిష్యత్తులో షేరు విలువలు గణనీయంగా తగ్గిపోతాయి అని వారికి అనిపించినాసరే! వెంటనే తమ షేర్లు అమ్మి సొమ్ము చేసుకొంటారు. సర్వసత్తాక, సార్వభౌమ, భారతదేశంలోని కరెంట్ అకౌంట్ డెఫిసిట్ తగ్గించుకోవడానికి జూదం కంటే పెద్దగా లక్ష్యాలేమీ లేని ఎఫ్ఐఐలని ఆహ్వానించడమంటే అంతకంటే సిగ్గుచేటు లేదు. అలా వచ్చి ఇలా వెళ్లిపోయే అస్థిర పెట్టుబడి (ఫ్లోటింగ్ కాపిటల్) ఇంత పెద్ద దేశానికి అతిముఖ్యమైన విషయంగా తోస్తోందంటే అది మన పాలకుల చేతకానితనం తప్ప మరేమీ కాదు.

సరే! ప్రత్యక్ష విదేశీ పెట్టుబడి (ఎఫ్‌డిఐ) విషయానికొద్దాం. ప్రపంచీకరణ కొత్తపుంతలు తొక్కుతున్న ఈ రోజుల్లో పెట్టుబడి ఖండాంతరాలు దాటి విచ్చలవిడిగా విశృంఖలంగా వ్యాప్తి చెందుతోంది. మనకి నచ్చినా నచ్చకపోయినా ఇది ఒక వర్తమాన వాస్తవం. అందులో భాగంగానే భారతదేశం కూడా ఎఫ్‌డిఐలకి స్వాగతం పలుకుతోంది. ఎఫ్ఐఐలకి భిన్నంగా ప్రత్యక్ష విదేశీ పెట్టుబడి ఒక దీర్ఘకాలిక మదుపుగా పరిగణించబడుతుంది. అలాగే ఎఫ్‌డిఐ తీసుకొచ్చే విదేశీసంస్థలు భారతీయ కంపెనీలలో 10 శాతం కంటే ఎక్కువ వాటానే కలిగి ఉంటాయి కాబట్టి ఆ కంపెనీల మనుగడ, వృద్ధి మీదనే వారి దృష్టి ఎక్కువగా ఉంటుంది (ఉండాలి!) సరే! ఇవన్నీ వినడానికి భాగానే ఉన్నా, భారతదేశంలోకి నిజంగా ఎఫ్‌డిఐ వస్తోందా? అనేది ఒక మౌలికమైన ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఎందుకంటే పెట్టుబడి (డాలర్లతో తీసుకొచ్చేది) ఎక్కువగా అవసరమైనది ఉత్పత్తి (మానుఫ్యాక్చరింగ్ సెక్టర్) రంగంలో. సేవారంగం (సర్వీస్ సెక్టర్) ఎక్కువగా మూలధన ఆధారితం కాదు. అది ఎక్కువగా శ్రమ ఆధారితంగా ఉంటుంది. ఇంతకాలంగా ఎఫ్‌డిఐ అని ఊదరకొడుతున్న మనం ఏ రంగాల్లో ఎఫ్‌డిఐని ఆకర్షించగలిగామో ఒక్కసారి పరిశీలిద్దాం.

భారతదేశంలోకి ఇంతవరకూ వచ్చిన ఎఫ్‌డిఐ రంగాల వారీగా సేవారంగం – 19 శాతం, నిర్మాణరంగం – 11 శాతం, టెలికాం – 7 శాతం, కంప్యూటర్లు – 6 శాతం, మందుల రంగం – 5 శాతం

ఈ వివరాలను బట్టి మనకి అర్థమయ్యేదేమిటంటే ఉత్పాదక రంగంలో కంటే సేవారంగంలోనే ఎక్కువగా ఎఫ్‌డిఐలు భారతదేశానికి వచ్చాయని. సేవారంగం ఎప్పుడైనా ఒక సహాయక పాత్రను మాత్రమే పోషించ గలుగుతుంది కానీ అదే ప్రగతికి మూలాధారం కాబోదు. మనకంటే ముందుగానే ఎఫ్‌డిఐలని ఆహ్వానించిన చైనా అదే ఎఫ్‌డిఐల ద్వారా తన దేశంలో ఉద్యోగావకాశాలు సృష్టించి, ప్రజల కొనుగోలు శక్తి పెంచి, విలువ జోడింపు కార్యకలాపం మీద దృష్టిపెట్టి, సంపదని సృష్టించి, ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఎగుమతిదారుగా నిలబడి, తద్వారా అపారమైన డాలర్ నిల్వలు మూటకట్టుకుని తిరిగి అదే డాలర్లను అమెరికాకి అప్పుగా ఇచ్చే పరిస్థితికి చేరుకుంది.

వాల్యూ ఆడింగ్ ఆక్టివిటీస్‌కి నాన్ వాల్యూ ఆడింగ్ ఆక్టివిటీస్‌కి తేడా సరిగ్గా అదే. అయితే దానితోపాటు నిర్వహణా నిబద్ధత, కార్యదక్షత, సరియైన వ్యూహం తప్పనిసరి. పెట్టుబడి కోసం మనం దేబిరించనవసరం లేదు. దానికి సరైన అవకాశం కల్పిస్తే అదే ప్రపంచంలో తగిన మార్కెట్ల కోసం దేబిరిస్తుంది అన్న చిన్న మూలాంశాన్ని భారతదేశం విస్మరించినట్లుగానూ చైనా గుర్తించినట్లుగానూ మనకనిపిస్తుంది. అప్పులకోసం వెంపర్లాడే పరిస్థితిలో మనం ఉంటే అమెరికాకి అత్యంత పెద్ద రుణదాతగా చైనా ఉంది. సరే! చైనాలో ఉన్న రాజకీయ సామాజిక పరిస్థితులు వారి అంతర్గత బలాలు, బలహీనతల సంగతి ఇక్కడ ప్రస్తావించడం లేదు. కానీ స్థూలంగా చెప్పాలంటే అత్యంత పటిష్టమైన పునాదిపై నిర్మించబడ్డ సౌధంగా చైనా ఈరోజు మనకి కనబడుతోంది. భారతదేశం ఇంకా పునాది కోసమే వెతుక్కుంటోంది. పునాదులు తవ్వుతున్నా మనుకుంటూ గోతులు తవ్వుకుంటోంది. అదే సమయంలో ఈనాటి సమాధులే రేపటి సౌధాలకి పునాదులు అంటూ సొంత ప్రజలనే మభ్యపెడుతూ మనుగడ సాగిస్తోంది.

ఎఫ్‌డిఐలకి సంబంధించి మరొక ఆసక్తికర అంశం కూడా మనం గమనించాలి. మనకు సహజంగా ఉన్న ఆలోచనతో, సమాచారంతో ఒక్క ప్రశ్నకి సమాధానం చెప్పండి.

భారతదేశంలోకి అత్యధికంగా ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) ఏ దేశం నుంచి వస్తాయి? ఎక్కువ మంది అమెరికా అనుకుంటారు.

కొంతమంది ఏ ఇంగ్లండో, జర్మనీనో లేక చైనానో అనుకుంటాం. కానీ భారతదేశంలోకి వస్తున్న (ఎఫ్‌డిఐ) లో 38 శాతం మారిషస్ అనే ఒక చిన్నదేశం నుంచి వస్తోందంటే ఆశ్చర్యం కలుగకమానదు. సింగపూర్ నుంచి 10 శాతం ఎఫ్‌డిఐ వస్తుండగా అమెరికా నుంచి కేవలం 6 శాతం ఎఫ్‌డిఐ మాత్రమే వస్తోంది. సైప్రస్ అనే మన కోనసీమ అంత చిన్న దీవి నుంచి భారతదేశానికి నాలుగు శాతం ఎఫ్‌డిఐ వస్తోంది. మన కార్పొరేట్, టాక్స్ చట్టాలకు ఈ గణాంకాలు చెంపపెట్టు వంటివి. ఇప్పటికే మన ప్రభుత్వాలకి ఈ విదేశీ మదుపు (ఎఫ్‌డిఐ) లని పారదర్శకంగా మార్చాల్సిన అవసరం కనబడడంలేదంటే అది నిద్ర అనుకోవాలా? లేక నిద్ర నటిస్తున్నారనుకోవాలా? దేశంలోని నల్లధనం విదేశాల్లో దాచుకొనే వారందరూ డాలర్లలోనే దాచుకుంటారు. అలాంటి మొత్తం ఎంత విదేశీ బ్యాంకుల్లో డాలర్లలో మూలుగుతోందో మన ప్రభుత్వం చెప్పగలదా? విదేశీ వాణిజ్య నిమిత్తం మనం వెచ్చించే డాలర్ల వల్ల ఎంతమేరకి రూపాయి విలువ దిగజారిందో అంచనా చేయగలమా?

ఇవన్నీ బహిరంగ రహస్యాలలాగా, ఎవరూ మాట్లాడకూడని విషయాల లాగా గోప్యంగా ఎందుకు ఉంచుతారు? బంగారంపై 10 శాతం కస్టమ్స్ సుంకం వల్ల బంగారం వినియోగం తగ్గకపోగా స్మగ్లింగ్ కార్యకలాపాలు పెరిగిన మాట వాస్తవం కాదా! తద్వారా మరలా నల్లధనాధిపతుల నిల్వలు హవాలా రూపంలో ఇతర దేశాలకు తరలిపోవడం, కనబడడం లేదా!

ఇవన్నీ జవాబులులేని ప్రశ్నలు. 'చిత్తశుద్ధిలేని శివ పూజలేల' అన్నట్లు ఆచరణకు నోచుకోని చట్టాలు ఉంటే ఎంత? ఊడితే ఎంత? చివరికి ఈ చట్టాలు సామాన్యుల నడ్డివిరగ్గొట్టడానికి తప్ప నిజమైన పారదర్శకతను సాధించడంలో ఘోరంగా విఫలమవ్వడం అత్యంత గర్హణీయం. భారతదేశానికి వచ్చే ఎఫ్‌డిఐలో 52 శాతం బోగస్ కంపెనీల నుంచే సూట్‌కేస్ కంపెనీల నుంచే వస్తుంటే ఆ ఎఫ్‌డిఐ మన ఆర్థిక వ్యవస్థని బలోపేతం చేస్తుందా? లేక కకావికలం చేస్తుందా? అనేది ఆలోచించాలి.

విదేశీమారక నిల్వలు – ప్రవాస భారతీయులు

మన దేశానికి ఉన్న విదేశీమారక నిల్వల్లో ఎక్కువభాగం మన ఎగుమతుల ద్వారా వస్తున్నప్పటికీ అంతకంటే ఎక్కువ చెల్లింపులు మన దిగుమతులకి చెల్లిస్తూ వాణిజ్యలోటును పెంచుకుంటున్నామని ఇంతకుముందు చెప్పుకున్నాం. మరి ఆ లోటు ఎలా భర్తీ అవుతోంది? మనకి అవసరమైన డాలర్లు ఎక్కడి నుండి వస్తున్నాయి? అంటే కొంతభాగం బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నప్పటికీ ఎక్కువభాగం ప్రవాస భారతీయులు పంపే నగదు (రెమిటెన్సెస్) ద్వారానే వస్తున్నాయని మనకి స్పష్టమవుతుంది.

ప్రపంచంలో అత్యంత ఎక్కువ ఫారెన్ రెమిటెన్సెస్ ఉన్న దేశంగా భారతదేశం అగ్రస్థానంలో ఉంది. 2012లో 71 బిలియన్ డాలర్ల ఫారెన్ రెమిటెన్సెస్ మన దేశంలోకి ప్రవాస భారతీయుల ద్వారా వచ్చింది. ఇది నిజానికి మనదేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐ కంటే సుమారు మూడు రెట్లు ఎక్కువ. (ఎఫ్‌డిఐ 22 బిలియన్ డాలర్లు). అలాగే ఈ మొత్తం మన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎగుమతుల కంటే కూడా ఎక్కువ.

ఇంత ఎక్కువగా ప్రవాస భారతీయుల డాలర్లు భారతదేశానికి వస్తూ ఉండడం వల్లే భారతదేశపు విదేశీమారక నిల్వల మీది ఒత్తిడి గణనీయంగా తగ్గింది. అయితే ఈ రెమిటెన్సెస్‌లో ఎక్కువ భాగం ఎక్కడి నుంచి వస్తాయని మనం అనుకుంటాం? సహజంగానే మనవాళ్లు అమెరికా, ఇంగ్లండ్ లాంటి దేశాలకి ఎక్కువ వెళుతున్నారనుకుంటాం. అలాగే వారి ఆదాయాలు కూడా పాశ్చాత్య దేశాల్లో ఎక్కువ ఉంటాయి కాబట్టి అక్కడి నుంచే ఎక్కువగా వస్తాయని అనుకుంటాం. కానీ అత్యంత ఆశ్చర్యకరంగా ఎక్కువ ఫారెన్ రెమిటెన్సెస్ యుఎఇ (దుబాయి) అనే చిన్న దేశం నుంచి మనకు ప్రవహిస్తున్నాయి.

కొన్ని లక్షలమంది శ్రామికులు, భవన నిర్మాణ కార్మికులు తమ రక్తాన్ని స్వేదంగా మార్చి, అత్యంత దయనీయ పరిస్థితుల్లో తాము జీవిస్తూ మనదేశానికి 16 బిలియన్ డాలర్లు రెమిటెన్సెస్ (ఒక లక్షకోట్ల రూపాయలు) పంపిస్తున్నారు. అమెరికాలోని ఎన్ఆర్ఐల ద్వారా ఇండియాకి వచ్చేవి 12 బిలియన్ డాలర్లు మాత్రమే. అయితే మన ప్రభుత్వం గల్ఫ్‌దేశాల్లోని శ్రామికులని కనీసం పట్టించు కోవడం లేదు. వారికున్న అనేకానేక సమస్యలవైపు కనీసం కన్నెత్తైనా చూడడం లేదు. భారతదేశపు విదేశీమారక నిల్వల పెంపుకై కృషిచేస్తున్న వారిని చిన్నచూపు చూడడం మనవారు చేస్తున్న మరొక్క పెద్ద తప్పు.

అలాగే భారతదేశపు ఎగుమతులు అత్యంత ఎక్కువగా ఏ దేశానికి వెడతాయనుకుంటున్నాం? అవికూడా యుఎఇ అనే చిన్నదేశానికే! 36 బిలియన్ డాలర్లు ఎగుమతులు మనం యుఎఇ కి చేస్తుంటే 35 బిలియన్ డాలర్లు అమెరికాకి చేస్తున్నాం. ఈ ఎగుమతుల్లో సింహభాగం మనవారు అక్కడ వినియోగించే వస్తువులవే. బంగారు ఆభరణాలు మొదలుకొని ఎన్నో నిత్యావసర వస్తువుల వరకూ భారతదేశం నుంచి యుఎఇకి ఎగుమతి అవుతున్నాయి.

ఇంత ప్రాముఖ్యత ఉన్న గల్ఫ్ దేశాలతో మన సంబంధాలు ఎలా ఉన్నాయి, అమెరికాతో ఎలా ఉన్నాయి అనేది స్పష్టంగా అందరికీ తెలిసిన విషయమే! పూర్తిగా నిర్లక్ష్యానికి, నిరాదరణకి గురవుతున్న గల్ఫ్ ప్రవాస భారతీయులు ఎంతమేరకి మన విదేశీ మారక నిల్వలకు దోహదం చేస్తున్నారో పై గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

అవినీతి, లంచగొండితనం, పారదర్శకతలేని వ్యాపార విధానాలు, వ్యవసాయరంగంపై నిర్లక్ష్యం, స్వయంసమృద్ధిపై దృష్టిలేకపోవడం, దిగజారిన రాజకీయ వ్యవస్థ, అశాస్త్రీయ పారిశ్రామిక విధానాలు, కుళ్లిపోతున్న సామాజిక విలువలు, బ్యాంకింగ్ రంగ అసమర్థ నిర్వహణ, స్వల్పకాలిక దృష్టితో ఉన్న ద్రవ్య విధానం, పక్షపాత పరపతి విధానం... ఇలా చెప్పుకుంటూపోతే కొండవీటి చాంతాడంత లిస్టు ఉన్న ఆర్థిక వ్యవస్థలో రూపాయి విలువ తరగకుండా పెరుగుతుందని ఆశించడం అత్యాశే అవుతుంది. స్వల్పకాలిక ఒడిదుడుకులు సహజమైనప్పటికీ, ఈ రుగ్మతలపై దీర్ఘకాలిక యుద్ధం అన్నివైపుల నుంచి జరగకపోతే ఇకపైన కూడా దిగజారుడే తప్ప మరొకదారి కనబడడం లేదు.

(17 నవంబర్ 2013న 'రూపాయి పతనం' అనే అంశంపై 'జనసాహితి' విజయవాడలో నిర్వహించిన సభలో చదివిన ప్రసంగపాఠం)

(రచయిత చార్టడ్ అకౌంటెంట్, డైరెక్టర్ చాంప్స్, హైదరాబాద్) వీ

బంగ్లాదేశ్‌లో రాజకీయ ప్రతిష్టంభన

స్వాతంత్య్రం వచ్చి నాలుగు దశాబ్దాలు దాటినా బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం నిలదొక్కుకోకపోవడానికి కారణం ఆ దేశ రాజకీయ నాయకులే అంటున్నారు ఎ. నర్సింహా రెడ్డి

బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు 2014 జనవరి 5న జరిగిన హింసాత్మక, వివాదాస్పద ఎన్నికల్లో ప్రధానమంత్రి షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ పార్టీ పూర్తి మెజారిటీ సాధించింది. బంగ్లాలోని దాదాపు అన్ని ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించిన ఈ ఎన్నికల్లో నాలుగింట మూడొంతుల మెజారిటీ సాధించిన అవామీలీగ్ జనవరి 12వ తేదీన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. షేక్ హసీనా ప్రధాని పదవి చేపట్టడం ఇది మూడవసారి. బంగ్లా పార్లమెంట్‌లో మొత్తం 300 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కానీ ఈ ఎన్నికలను ప్రధాన ప్రతిపక్షాలన్నీ బహిష్కరించడంతో 153 స్థానాల్లో అవామీలీగ్, దాని మద్దతుదారైన జాతీయ పార్టీ అభ్యర్థులు తప్ప మరెవరూ నిలబడక పోవడంతో ఆ స్థానాల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 147 స్థానాలకు 2014 జనవరి 5న పోలింగ్ జరిగింది. దీంతో మొత్తం 300 స్థానాల్లో 232 అవామీలీగ్ సొంతమయ్యాయి. దాని మిత్రపక్షం జాతీయ పార్టీ 33 స్థానాలు, అధికార కూటమిలోని వర్కర్స్ పార్టీ, సమాజ తాంత్రిక్ దళ్, జాతీయ పార్టీ (మంజు) 12 స్థానాలు గెలుచుకున్నాయి. స్వతంత్రులకు 13 స్థానాలు దక్కగా, చిన్న పార్టీలు మిగిలిన స్థానాలను చేజిక్కించుకున్నాయి.

బంగ్లాదేశ్ ఆవిర్భవించి 42 ఏళ్లు దాటినా అక్కడ ప్రజాస్వామ్యం పూర్తిగా నిలదొక్కుకోలేదు. అక్కడ ప్రజాస్వామ్య పునాదులు బలపడక పోవడానికి ప్రజాస్వామ్యేతర శక్తులు ఎంత కారణమో ప్రజాప్రతినిధులూ అంతే బాధ్యులు. ఆవిర్భవించిన అనతికాలంలోనే తొలి దేశాధినేత, 'బంగబంధు' షేక్ ముజిబుర్ రహమాన్ హత్య (1975)తో ప్రజాస్వామ్యానికి తొలి విఘాతం ఏర్పడింది. ఆ తరువాత వివిధ సందర్భాల్లో సైనికాధికారులు, ప్రజాప్రతినిధులు దేశాన్ని పాలించారు. అందరూ ఒకరినొకరు దెబ్బతీసుకునే ప్రయత్నంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పూర్తిగా నీరుగార్చారు. ప్రస్తుత బంగ్లాదేశ్ పరిస్థితే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. మూడు దశాబ్దాలుగా అవామీలీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనా వాజెద్, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధినేత్రి బేగం ఖలీదా జియా చుట్టూనే బంగ్లాదేశ్ రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. ఎవరు పాలించినా ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠపరిచే బదులు దాన్ని నీరుగార్చేందుకే ప్రయత్నించారు.

లౌకిక జాతీయవాదానికి సవాలుగా మారిన మతఛాందసవాదం:

పదహారుకోట్ల జనాభా గల బంగ్లాదేశ్ ప్రపంచంలోని బీద దేశాల్లో ఒకటి. పాకిస్థాన్ 'పుణ్యమా' అని అక్కడ ఉగ్రవాదం ఊపిరి పోసుకున్నా, అది పూర్తిస్థాయిలో శిరసెత్తకుండా హసీనా సర్కారు అయిదేళ్లుగా పలు జాగ్రత్త చర్యలు తీసుకొంది. హసీనా ఏలుబడిలో ఐదారు శాతం వృద్ధిరేటు నమోదైనా నిరుద్యోగం, పేదరికం, అవినీతి, అధికధరలు, పారిశ్రామిక ప్రమాదాలు, మానవహక్కుల ఉల్లంఘనల వంటి ప్రధాన సమస్యలెన్నో ప్రజలను వేధిస్తున్నాయి. తన పాలనపై ప్రజాతీర్పునకు ఆస్కారం ఇవ్వకుండా ఏకపక్ష ఎన్నికలతో పునరధికారానికి లంఘించిన హసీనా, చర్చలకు షరతులు పెడితే ఒప్పుకొనేది లేదని ఖలీదా జియా స్పష్టీకరిస్తున్నారు. మరో వైపు ప్రతిపక్షాలు పాల్గొనకుండా ఎన్నికలు నిర్వహించడాన్ని అమెరికా విమర్శించింది. వీలైనంత త్వరగా మరోసారి ఎన్నికలు నిర్వహించాలని యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్‌లు పిలుపునిచ్చాయి. ఎన్నికల సమయంలో తలెత్తిన హింసను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్ తప్పుబట్టారు. సమగ్రతతో కూడిన రాజకీయ ప్రక్రియ కోసం బంగ్లాదేశ్ రాజకీయ పక్షాలు అర్థవంతమైన చర్చను ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంతో చర్చలు, మళ్లీ ఎన్నికల నిర్వహణ డిమాండ్లను బంగ్లాదేశ్ ప్రధానమంత్రి త్రోసిపుచ్చారు. బిఎన్‌పి హింస, ఉగ్రవాదం విడనాడి, నిషిద్ధ జమాతే-ఇ-ఇస్లామీతో సంబంధాలను తెంచుకున్నప్పుడే ప్రతిపక్షంతో చర్చలు జరుపుతామని హసీనా ప్రకటించారు.

2008లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ నెగ్గడంతో ఆ పార్టీ నేత షేక్ హసీనా ప్రధానమంత్రి అయ్యారు. ఆమె ప్రభుత్వం అయిదేళ్ల పాలన అనంతరం తాజా ఎన్నికలు జరిగాయి. వీటిలో అవామీ లీగ్‌తో పోటీపడి దాన్ని ఓడించాల్సింది పోయి ప్రతిపక్ష బిఎన్‌పి ఆధ్వర్యంలోని 18 పార్టీల కూటమి ఎన్నికలను బహిష్కరించింది. బంగ్లా రాజ్యాంగం ప్రకారం ఎన్నికలకు ముందు దేశంలో అధికారంలో ఉన్న పార్టీ పాలన నుంచి తప్పుకుని తటస్థులతో కూడిన తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. దానికి ఎన్నికల నిర్వహణ కార్యక్రమాన్ని అప్పగించాలి. గత రెండు దశాబ్దాలుగా బంగ్లాలో ఎన్నికలు ఇలాగే జరుగుతున్నాయి. కానీ 2011లో షేక్ హసీనా ఈ నిబంధనకు సవరణ తీసుకువచ్చారు. ఆ మేరకు తాత్కాలిక ప్రభుత్వాన్ని కూడా (ఎన్నికలకు ముందు) తన నాయకత్వంలోనే ఏర్పాటు చేశారు. అందులో ప్రధాన ప్రతిపక్షమైన బిఎన్‌పి కూడా చేరాలని ఆహ్వానించి మంత్రి పదవులు కూడా ఇస్తామన్నారు. కానీ ఆమె తెచ్చిన రాజ్యాంగ సవరణను తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు షేక్ హసీనా అధికారాన్ని అంటిపెట్టుకునేందుకు దీని ద్వారా కుట్రపన్నారని ఆరోపణలు చేశాయి. దేశవ్యాప్తంగా నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించాయి. అధికార పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఎన్నికలు నిజాయితీగా, నిష్పక్షపాతంగా జరగవని పేర్కొంటూ వాటిని బహిష్కరించాయి. దీంతో సివిల్ పోలీసుల బందోబస్తుతో సాగాల్సిన ప్రక్రియను సైనికులు దగ్గరుండి నడిపించాల్సిన దుస్థితి ఏర్పడింది. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్న సాకుతో బేగం ఖలీదా జియా, ఎర్షాద్‌లను ప్రభుత్వం గృహనిర్బంధంలో ఉంచడంతో ఎన్నికలు ఏకపక్షంగా మారాయి. వాస్తవానికి బంగ్లాదేశ్

నేషనలిస్ట్ పార్టీకి ప్రజల్లో మంచి పట్టు ఉంది. దేశవ్యాప్తంగా నిబద్ధతగల కార్యకర్తలు, విస్తృత యంత్రాంగం బిఎన్‌పి సహజ బలాలు. గత జూన్‌లో జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆ పార్టీ మంచి ఫలితాలే సాధించింది. ఈ ఎన్నికల్లోనూ బిఎన్‌పి పాల్గొని ఉంటే అవామీలీగ్‌ను నిలువరించగలిగేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాలలో వ్యక్తమైంది. బంగ్లాలో ఎన్నికలు ఏకపక్షంగా జరిపి ఉండకూడదనీ, ప్రతిపక్షాలతో సయోధ్యకు కృషి చేయాల్సిందనీ భావిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి తన ప్రతినిధులను ఢాకాకు పంపినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదు. అన్ని చర్చలూ విఫలమయ్యాయి.

రాజ్యాంగ సవరణ చేసినా తాను ప్రజాస్వామ్యాన్ని కాలరాయలేదనీ, తాత్కాలిక ప్రభుత్వంలో ప్రతిపక్షాలకు కూడా అవకాశమిచ్చినా అవి చేరలేదనీ హసీనా పేర్కొన్నారు. తటస్థులతో కూడిన ప్రభుత్వం ఏర్పాటైతే అది ఎన్నికలు సకాలంలో నిర్వహించక వాయిదా వేయచ్చనీ (గతంలో 2006లో అలా ఒకసారి జరిగింది), దానిపై సైన్యం ఆధిపత్యం చెలాయించే ప్రమాదం ఉందనీ, అందుకే రాజ్యాంగ సవరణ చేయాల్సి వచ్చిందనేది ఆమె వివరణ. 2006లో ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వం రెండేళ్ల పాటు ఎన్నికలు జరపకుండా అధికారంలో కొనసాగి 2008లో వాటిని నిర్వహించింది. ఏమైనా షేక్ హసీనా ప్రతిపక్షాల డిమాండ్లను తోసిపుచ్చి తన నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరిపించేశారు. వీటిని బిఎన్‌పియే కాకుండా మూడో అతిపెద్ద పార్టీ అయిన జాతీయ పార్టీ నేత, మాజీ ప్రధాని, నియంత అయిన మహమ్మద్ హుస్సేన్ ఎర్షాద్ కూడ చివరి క్షణంలో బహిష్కరించారు. కానీ ఆయన పార్టీలో చాలామంది నిలబడి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన భార్య రౌషన్ ఎర్షాద్ పార్లమెంటులో ప్రతిపక్ష నేత కావడం విశేషం. కాగా ఎర్షాద్ స్వయంగా హసీనా ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు హాజరయ్యారు.

ఈ రాజకీయ అశాంతి సంగతి అలా ఉండగా, 1971లో బంగ్లా ఏర్పాటుకు పూర్వం పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినప్పుడు బంగ్లా ప్రజలను ఊచకోత కోసిన యుద్ధ నేరస్తులకు మరణ శిక్షలు విధించాలంటూ 2013 ఆరంభంలో (షాబాగ్) ఉద్యమం చెలరేగింది. ఈ యుద్ధ నేరస్తుల విచారణను షేక్ హసీనా ఆదేశించారు. అందుకోసం ఒక విచారణ కమిషన్‌ను కూడా నియమించారు. ఈ యుద్ధ నేరస్తుల్లో ఎక్కువ భాగం బిఎన్‌పి మిత్రపక్షమైన జమాతే ఇస్లామీకి చెందినవారే. ఈ జమాతే ఇస్లామీ ఇస్లామిస్టు ఛాందసవాద పార్టీ, దీనికి చెందిన యుద్ధ నేరస్తుల విచారణలో పలువురికి మరణశిక్షలు పడ్డాయి. ఈ నేరస్తులందర్నీ ఉరితియ్యాలంటూ ప్రజలు ఢాకాలోని షాబాగ్‌లో గుమిగూడి ఉద్యమాలు జరిపారు. కానీ బిఎన్‌పి మాత్రం ఈ యుద్ధ నేరస్తులకు, మిత్రపక్షమైన జమాతేకీ అండగా నిలిచి వారికి మరణ శిక్షలు వేయకూడదంటూ దేశవ్యాప్తంగా 2012-13లో నిరసనలు, ఘర్షణలు, హింసాకాండలకు దిగింది. ఇందులో 500 మందికిపైగా మరణించగా, ఎన్నికల హింసలో 100 మందికి పైగా బలయ్యారు. బిఎన్‌పి అండతో జమాతే వర్గాలు బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపైనే ఈ దాడులు, హింసాకాండ జరుపుతున్నారంటూ కొన్నివర్గాలు ఆరోపిస్తున్నాయి. బంగ్లాలో నాలుగో అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన జమాతే ఇస్లామీ తాజా ఎన్నికల్లో పాల్గొనకుండా ఆరుమాసాల క్రితం దానిపైన ప్రభుత్వం నిషేధం విధించింది. జమాతే ఇస్లామీని, ఉగ్రవాదాన్ని విడిచిపెడితే చర్చలకు, అవసరమైతే మళ్లీ ఎన్నికలకు సిద్ధమని హసీనా వాజెద్ ప్రకటిస్తున్నారు. హసీనా, ఖలీదాల మధ్య రాజకీయ స్పర్థలు వ్యక్తిగత కక్షల స్థాయికి దిగజారిన నేపథ్యంలో ఉగ్రవాద మూకల ఉరుములూ బాంబుపేలుళ్లతో ఇప్పుడు బంగ్లాలో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఇంతకాలం పడుతూ లేస్తున్న బంగ్లా ప్రజాస్వామ్యం నేడు పెను సంక్షోభంలో కూరుకుపోతున్న వైనం కళ్లకు కడుతోంది. ఒకనాడు జనరల్ ఎర్షాద్ సైనిక నియంతృత్వానికి చరమగీతం పాడడానికి ఉమ్మడిగా ఉద్యమించిన 'బేగమ్'లు ఇద్దరూ, ఇప్పుడు పంతాలూ పట్టింపులతో పందెంకోళ్లలా తలపడుతుంటే - ప్రజాస్వామ్యమే నెత్తురోడుతోంది. హసీనా హయాంలోనే జరిగిన ఎన్నికల చట్టసవరణల్లో - ఓటర్లు అభ్యర్థులందర్నీ తిరస్కరించేందుకు గల 'నో ఓట్' నిబంధనను ఎత్తేశారు. పార్టీ అభ్యర్థిత్వాలు సంతలో సరుకులు కాకుండా చూసేందుకు - పార్టీలో కనీసం మూడేళ్ల సభ్యత్వం ఉండితీరాలన్న అంశాన్నీ తొలగించారు. ఎన్నికల చట్టాల్ని ఉల్లంఘించేవారి అభ్యర్థిత్వాల్ని రద్దుచేసేందుకు ఎన్నికల కమిషన్‌కి గల అధికారాన్నీ ఊడబెరికారు. అధికార పార్టీకి చెందిన అసంతుష్టులు స్వతంత్రులుగా ఎన్నికల బరిలోకి దిగే వీల్లేకుండా కఠిన నిబంధనలు ఎన్నింటినో చట్టబద్ధం చేశారు. పునరధికారమే లక్ష్యంగా హసీనా రాజకీయ పావులు కదిపారన్నది సుస్పష్టం. ఆపద్ధర్మ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించిన అనంతరం రాజ్యాంగంలోని ఆపద్ధర్మ ప్రభుత్వం నిబంధనను 2011లో ప్రభుత్వం తొలగించింది.

యుద్ధ నేరస్తులపై విచారణ - ఏకపక్ష ఎన్నికలు

అవామీలీగ్‌కు బంగ్లాదేశ్ పట్ల ఓ నిర్దిష్ట దృక్పథం ఉంది. 1971 నాటి ఘటనల తాలూకు హంతకులు, వారికి సైదోడుగా నిలిచిన వారు లేని బంగ్లాదేశ్‌ను వారు కోరుకుంటున్నారు. బిఎన్‌పికి తమ చిన్న మిత్రపక్షం జెఐతో పోలిస్తే ఉదారవాద పార్టీగానే పేరుంది. అయితే అది అవామీలీగ్ కన్నా ఎక్కువగా ఇస్లామిక్ సంవిధానాలను పాటిస్తుంది. అయితే జెఐ లాగా ఈ పార్టీ తీవ్రస్థాయిలో షెరియత్ చట్టాలు కావాలని పట్టుబట్టడం లేదు. 2008లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అవామీలీగ్ పార్టీ నాలుగింట మూడొంతుల ఆధిక్యతతో విజయం సాధించింది. అప్పుడు దక్కిన సంపూర్ణ మెజారిటీతో, తమకు దక్కిన అపరిమిత అధికారాలతో ఆ పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లు యుద్ధ నేరస్తులపై విచారణ చేపట్టింది. 1971లో పాకిస్థాన్ సైన్యానికి సహకరించి, ఊచకోతకు పాల్పడ్డ బంగ్లాదేశీయులను యుద్ధ నేరస్తులుగా గుర్తించారు. పైగా ప్రధాన ప్రతిపక్షం బిఎన్‌పి వారు కూడా దోషులుగా ఖరారై శిక్షలకు గురికావడం సమస్యను మరింత జటిలం చేసింది.

బంగ్లాదేశ్‌లోని పాక్ ఆక్రమిత సైన్యం సాగించిన మారణహోమానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం ఆ పోరాటం జరిగిందని అందరికీ తెలుసు. పాకిస్థాన్ ఆక్రమిత సైన్యం వందల వేలసంఖ్యలో ప్రజలను హత్యచేసింది, దహనకాండకు, లూటీలకు పాల్పడింది. వేలాది మంది మహిళలపై అత్యాచారాలకు పాల్పడింది. అమానవీయంగా వివిధ నేరాలకు పాల్పడింది. పాకిస్థాన్ సేనలతో పాటు ఛాందసవాద పార్టీ జమాతే ఇస్లామీ, దాని నాయకులు, కార్యకర్తలు ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారు. తన ఆదేశం, నియంత్రణలో అల్-బదార్, అల్-షామ్స్, రజాకార్లు వంటి బలగాలను జమాతే ఇస్లామీ నిర్మించుకున్నది.

ప్రస్తుత ప్రభుత్వం చాలా ఊగిసలాటలో విచారణ క్రమాన్ని ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసింది. అవి కొంత మంది నిందితులకు మరణశిక్షలు విధించాయి. ప్రస్తుతం

నిందితుల పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరుగుతుంది. అదే సమయంలో పేరుమోసిన నేరస్తుడు, 1971లో జరిగిన అత్యాచారాలు, హత్యల్లో స్వయంగా పాల్గొన్న ఖాదర్ ముల్లాకు హైకోర్టు మరణశిక్ష విధించింది. అతన్ని ఇప్పటికే ఉరితీశారు. ప్రతిపక్షాలను యుద్ధ నేరస్తులుగా చిత్రీకరించి ప్రభుత్వం ఉరితీయిస్తోందనే ఆరోపణలతో ఢాకా వీధులలో సాగుతున్న నిరసన ప్రదర్శనలు తీవ్రతరం అవుతున్నాయి. సీనియర్ జమాతే ఇస్లామీ నేత ఉరితీతకు వ్యతిరేకంగా సాగిన ప్రదర్శనలలో హింసాకాండ తీవ్రస్థాయికి చేరింది.

ముల్లాను ఉరితీయడాన్ని ఖండిస్తూ పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పశ్చిమ దేశాల మీడియాలో ఎక్కువ భాగం అమెరికా యూరోపియన్ యూనియన్ ప్రభుత్వాలు కూడా యుద్ధ నేరస్తులను ఉరితీయడాన్ని వ్యతిరేకించాయి. విచారణ నిలిపివేసే విధంగా బంగ్లాదేశ్ ప్రభుత్వంపై వారు భారీగా ఒత్తిడి తీసుకువచ్చారు. ఖాదర్ ముల్లాను ఉరితీసే చివరి క్షణాలకు ముందు కూడా బంగ్లాదేశ్ ప్రధానమంత్రికి, ప్రభుత్వంలోని ఇతర అత్యున్నత స్థాయిలోని వారికి కుప్పలుతెప్పలుగా ఫోన్‌కాల్స్ వచ్చాయి. కోర్టు తీర్పు అమలు చేయడాన్ని నిలిపివేయాలని, లేకుంటే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. జమాతే పార్టీ, పాశ్చాత్య లాబీలు, మానవ హక్కుల సంస్థలుగా చెప్పుకునే కొన్ని సంఘాలు కూడ ఆకస్మికంగా స్వరంమార్చి బంగ్లాదేశ్‌లో విచారణ క్రమం పారదర్శకంగా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా జరగడం లేదని విరుచుకుపడ్డాయి. అయితే, డాన్ హేగ్, నురెంబర్గ్ లేదా టోక్యోలో ఇప్పటి వరకు నిర్వహించిన ఏ ఇతర అంతర్జాతీయ విచారణ కన్నా తీసిపోని విధంగా బంగ్లాదేశ్‌లో 1971 యుద్ధ నేరస్తుల విచారణ క్రమం జరుగుతున్నది. బంగ్లాదేశ్‌లో నిందితులు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నారు.

భారత్‌పై ప్రభావం

భారత్ బంగ్లాకు పొరుగుదేశం, మిత్రదేశం కూడా కావడంతో అక్కడి రాజకీయ పరిస్థితులు మనపై ప్రభావం చూపుతున్నాయి. ఇండియాతో విస్తృత సరిహద్దులున్న బంగ్లాదేశ్ వ్యవహారాలు భారత్‌కు ఎంతో కీలకమనడంలో సందేహం లేదు. భారత్ అనుకూల ధోరణి కనబరచే హసీనా అధికారంలో కొనసాగడం ఇండియాకు ఎంతో ఊరట. బంగ్లాలోని అధికార అవామీలీగ్ పార్టీ భారత్‌కు అనుకూల పార్టీ అనే అభిప్రాయం ఉంది. ఆ కారణంగా, బంగ్లాలో హసీనా రాజ్యాంగ ద్రోహాల్ని విస్మరించిన మన్మోహన్ ప్రభుత్వం 'ఊరంతా ఒకదారి, ఉలిపి కట్టెది ఒకదారి' అన్న చందంగా వ్యవహరించింది. భారత వ్యతిరేక ఉగ్రవాద శక్తులకూ, బంగ్లాదేశ్ రక్షణ అవసరాలకూ అవినాభావ సంబంధం ఉందని లోగడే సూత్రీకరించిన ఖలీదా జియా – ఇండియాతో నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలను తూలనాడారు. అలాంటి ఖలీదా బంగ్లా పగ్గాలు చేపట్టడం ఇండియాకు ఇబ్బందికరమే అయినా, హసీనా దుందుడుకు తనం వల్ల ఆ దేశం మొత్తంగా సంక్షోభంలో కూరుకు పోవడం భారత్ దీర్ఘకాలిక ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు. ఈ నేపథ్యంలోనే ఒకపక్క బంగ్లాలో ఎన్నికలు ఏకపక్షంగా జరిగినందున వాటిని మళ్లీ జరపాలని అమెరికా, తదితర దేశాలు పిలుపునిస్తుండగా, మరో పక్క భారత్ మాత్రం ఎన్నికలు రాజ్యాంగబద్ధమైన అవసరాన్ని నెరవేర్చాయంటూ వాటిని ఆమోదించడమే కాకుండా ప్రధాని షేక్ హసీనా విజయాన్ని మన్మోహన్ అభినందించారు కూడా.

నేడు బంగ్లాలో వైరిపక్షాలై మోహరించిన హసీనా, ఖలీదాల మధ్య రాజకీయంగా రాజీ కుదిరి బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభానికి తెరపడితేనే శాంతి నెలకొంటుంది. అవామీలీగ్ పార్టీ అధినేత్రికి భారత నాయకులతో మైత్రీ సంబంధాలుండడంతో ఆ పార్టీ అధినేత్రికి ఇరుదేశాల మధ్య బంధాలు సామరస్యంగా సాగుతున్నాయి. గతంలో బిఎన్‌పి నేత ఖలీదా జియా మూడు సార్లు ప్రధానిగా ఉన్నప్పుడు భారత్ – బంగ్లా సంబంధాల్లో ఒడిదుడుకులేర్పడ్డాయి. అందువల్ల బంగ్లా రాజకీయాలు భారత్‌పై ప్రభావం చూపక తప్పదు. బంగ్లాదేశ్‌తో భారత్‌కు 4000 కి.మీ. పైగా సరిహద్దు ఉంది. అందులో 800 కి.మీ. పైగా ఒక్క త్రిపుర రాష్ట్రంలోనే ఉంది. తీస్తా, ఫెనీ నదీజలాల పంపిణీలో వివాదాలున్నాయి. బంగ్లా నుంచి భారత్‌లోకి అక్రమంగా చొరబడుతున్న వారి గురించి భారత్‌లోని రాజకీయ పార్టీల మధ్య వివాదాలు నడుస్తున్నాయి.

బంగ్లాదేశ్‌లో అవామీలీగ్ ప్రభుత్వానికీ, విపక్ష బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి)కి మధ్య చాలాకాలంగా పచ్చగడ్డివేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. అధికారాన్ని దక్కించుకోవడం కోసం ఒకరకంగా లౌకికవాదులకూ, మతతత్వవాదులకూ మధ్య జరుగుతున్న పోరాటంగా దాన్ని అభివర్ణించవచ్చు. అమెరికన్ సర్కారు గత కొంతకాలంగా బిఎన్‌పిపట్ల అనుకూలంగా వ్యవహరిస్తోంది. ఆ పార్టీని పెద్దగా ప్రమాదంలేని మతవాద రాజకీయ పక్షంగా వాషింగ్టన్ నాయకత్వం భావిస్తోంది. తాలిబన్లు, అల్‌ఖైదా వంటి ఛాందసపక్షాలతో పోలిస్తే బిఎన్‌పి చాలా మెరుగైన పార్టీ అన్నది అమెరికా అభిప్రాయంలా ఉంది. బిఎన్‌పిని మితవాద ఛాందసవాద పక్షంగా పరిగణిస్తున్న అమెరికా – బంగ్లాదేశ్‌లో రాజకీయ అధికారం దక్కించుకునేందుకు ఆ పార్టీకి అవసరమైన తోడ్పాటు అందిస్తోంది. అవామీలీగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అమెరికా బహిరంగ వ్యాఖ్యలు చేస్తోంది. ప్రపంచంలోని పది ప్రమాదకర దేశాలలో బంగ్లాదేశ్ ఒకటని అమెరికా విదేశాంగ విధానాలను విశ్లేషించే ఓ పత్రిక పేర్కొంది.

ఇప్పుడు బంగ్లాదేశ్‌లో పరిస్థితి క్లిష్టంగా మారింది. మానవీయ వ్యతిరేక నేరాల విచారణపై వివాదం చేస్తూ జమాతే ఇస్లామీ ఛాందసవాద పార్టీ విచారణను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇది బంగ్లాదేశ్ లౌకిక, ప్రజాతంత్ర, ఆధునిక సమాజం అనే పేరును మసకబారుస్తుంది. రెండవది, ఎన్నికల నిర్వహణ పద్ధతులకు సంబంధించిన వివాదం. యుద్ధ నేరాల ట్రిబ్యునల్, బంగ్లా విముక్తి ఉద్యమస్ఫూర్తికి సంబంధించి జమాతే ఇస్లామీతో బిఎన్‌పికి విభేదాలు ఉన్నా జమాతేతో నడుస్తున్నది. ఈ రెండు అంశాలను విడదీసేందుకు అవామీలీగ్ ప్రయత్నించడంలేదు. ఇది ఏ దిశకు సాగుతుందో చెప్పడం క్లిష్టంగా మారింది. దీనిపై ఎవరూ ఏ అంచనాలు చేయలేకపోతున్నారు. దీనికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. దేశంలో అంతర్గతంగా పరిస్థితులు మరింతగా ఎలా దిగజారుతాయి అనేది ఒకటైతే, అంతర్జాతీయ శక్తులు ఏ స్థాయిలో ఇక్కడి పరిణామాలపై జోక్యం చేసుకుంటాయనేది మరో అంశం. ఈ పరిస్థితులలో బంగ్లాదేశ్‌లోని ప్రజాస్వామిక శక్తులు అప్రమత్తమై రాజకీయ ప్రతిష్టంభనకు కారణమవుతున్న అంతర్జాతీయ సామ్రాజ్యవాద శక్తుల మద్దతు ఉన్న ఛాందసవాద శక్తులను, దేశ అంతర్గత వ్యవహారాలలో విదేశీ శక్తుల జోక్యాన్ని ఎదిరించవలసి ఉంది. ప్రజా సాధికారత కోసం, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం కోసం ఉద్యమించడం తప్ప మరో మార్గం లేదు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ఉక్రెయిన్‌లో అగ్రరాజ్యాల ఆటలు

భౌగోళిక, రాజకీయ ఆధిపత్య పోరులో భాగంగా ఉక్రెయిన్ ప్రజలను అంతర్యుద్ధం వైపు ఉసికొలుపుతున్న అగ్రరాజ్యాల దమననీతిని వివరిస్తున్నారు **నర్సింహ ఎం.**

ఉక్రెయిన్ దేశం మరో సిరియా కానుందా? అమెరికా, పశ్చిమ యూరప్ సామ్రాజ్యవాద దేశాలు కలిసి రష్యాను బలహీనం చేసి దెబ్బతీయాలనే ప్రణాళికలో భాగంగా ఆడుతున్న రాజకీయాలు ఒక వైపు, ఎలాగైనా ఉక్రెయిన్‌ను తన విష కౌగిలి నుండి వదలకూడదని రష్యా సామ్రాజ్యవాదం ఇంకోవైపు. ఈ రెండు సామ్రాజ్యవాద శక్తులలో ఎవరో ఒకరికి తొత్తులుగా మారిన ఉక్రెయిన్ పాలక వర్గాల వ్యవస్థ. వెరసి, ఈ రోజు ఉక్రెయిన్ దేశం సామ్రాజ్యవాదల దేశాల భౌగోళిక రాజకీయాలకు బలవుతోంది. ఒక సుదీర్ఘ అంతర్యుద్ధ పరిస్థితి వైపు వెళుతున్నట్టు కనబడుతుంది.

ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవడానికి కొంచెం చరిత్రలోకి వెళాలి. ఉక్రెయిన్ దాదాపు సగభాగం రష్యాతో, అలాగే, ఇరు దేశాలతో కలిసి ఉన్న నల్లసముద్రంతో సరిహద్దు కలిగి ఉంది. మిగితా భాగానికి బెలారుస్, పోలాండ్, స్లొవేకియా, రొమేనియా, మోల్డోవా దేశాలు సరిహద్దులు. ఎంతో సారవంతమైన నల్లరేగడి భూములకు నిలయమైన ఉక్రెయిన్ ధాన్యాల ఉత్పత్తికి ప్రసిద్ధి చెందింది. దాంతో, ఈ దేశాన్ని 1240లో మంగోలులు ఆక్రమించుకున్నారు. 13 నుండి 16వ శతాబ్దం వరకు పోలాండ్, పశ్చిమ యూరప్ ప్రభావంలో ఉంది. 1654లో తమ దేశాన్ని పోలాండ్ నుండి కాపాడమని రష్యన్ జార్ చక్రవర్తిని వేడుకోవడాన్ని అదునుగా చేసుకొని ఉక్రెయిన్‌ను జార్ తన రష్యన్ సామ్రాజ్యంలో కలిపి వేసుకున్నాడు. దాదాపు 265 సంవత్సరాలు వారి స్వాధీనంలో ఉన్న ఉక్రెయిన్ 1917లో రష్యన్ విప్లవంతో జార్ పాలన కూలిపోవడాన్ని అదునుగా చేసుకొని 1918లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది. అయితే, వెంటనే ఎన్నో రకాల శక్తులు అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూడడంతో అంతర్యుద్ధంలోకి వెళ్లిపోయింది. రెండు సంవత్సరాల తరువాత సోవియట్ రష్యా రెడ్ ఆర్మీ ఉక్రెయిన్‌ను తమ ఆధీనంలోకి తీసుకుంది. సోవియట్ రష్యా నేతృత్వంలో, వివిధ జాతులకు విడిపోయే హక్కుతో సహా, స్వయం నిర్ణయాధికార హక్కును భరోసా ఇచ్చే యుఎస్ఎస్ఆర్ (యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్స్) ఏర్పడింది. ఆ ఏర్పాటులో రష్యాతో సహా ఉక్రెయిన్ కూడా ప్రధాన భూమిక పోషించింది. ఆ తరువాత ఉక్రెయిన్‌లో సోషలిజం స్థాపనలో భాగంగా సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు, కార్మికులే యజమానులుగా పరిశ్రమలు అప్రతిహతంగా స్థాపించబడ్డాయి. సోషలిస్టు వ్యవస్థను అధికారం కోల్పోయిన భూస్వాములు, ఇతర పాలకవర్గాలు కొన్ని చోట్ల సాయుధంగా కూడా వ్యతిరేకించారు. అయితే, ప్రజలు వారిని ఎదుర్కొని, తమ జీవితాల్లో మార్పులకు బాట వేసుకున్నారు. 1940 దశకంలో జర్మనీ పెట్టుబడిదారుల ప్రతినిధి అయిన హిట్లర్, ఈ భూమిపై సోషలిస్టు వ్యవస్థను లేకుండా చేయాలని, తమకంటూ ఒక స్థిరమైన మార్కెట్ కొరకు దేశాలను అక్రమించుకోవడానికి మొదలు పెట్టిన రెండవ ప్రపంచ యుద్ధంలో భాగంగా సోవియట్ రష్యాను కబళించడానికి వచ్చిన క్రమంలో, వారికి ఆహార ధాన్యాల కొరత సృష్టించే దుర్నీతిలో భాగంగా ఉక్రెయిన్‌పై బాంబుల వర్షం కురిపించాడు. శ్రామిక వర్గం చేతుల్లోకి అధికారం రావడం, అందునా ఆ సమసమాజ వ్యవస్థ విజయవంతంగా నడుస్తూ శ్రామికవర్గ ప్రజల జీవితాల్లో అనూహ్య మార్పులు తీసుకు వచ్చాయి. అది ప్రపంచ ప్రజలకు మార్గదర్శకం కావడం చూసి అమెరికా, పశ్చిమ యూరప్ (ప్రధానంగా ఇంగ్లండ్, ఫ్రాన్స్ లాంటివి) పెట్టుబడిదారీ దేశాలు కసితో రగిలిపోయాయి. ఈ వ్యవస్థను ఎలాగైనా నాశనం చేయాలనే ఉద్దేశంతో సోవియట్ రిపబ్లిక్‌లపై యుద్ధం చేయడానికి జర్మనీ నాజీ సైన్యాలకు కావలసినంత సహాయం చేశాయి. అయినా శ్రామికవర్గం చేతుల్లో హిట్లర్ సైన్యాలు ఓడిపోయాయి.

1953లో స్టాలిన్ మరణానంతరం రష్యన్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం రివిజనిస్టుల చేతుల్లోకి వెళ్లడం, వారు క్రమానుగతంగా శ్రామిక వర్గం నుండి అధికారాలను లాగేసుకొని సోషలిస్టు వ్యవస్థను నీరుగార్చారు. జాతులకు స్వయం నిర్ణయాధికార హక్కును కల్పించిన యుఎస్ఎస్ఆర్ ఒప్పందాన్ని ఉల్లఘించి, ఆయా జాతులపై పెత్తనం చెలాయించడం మొదలు పెట్టారు. దాంతో ఉక్రెయిన్‌లో నిరుద్యోగం, పేదరికం పెరుగుతూ వచ్చింది. అలాగే రష్యా సామ్రాజ్యవాద ధోరణిపై అసంతృప్తి మొదలైంది. దాంతో 1991 ఆగస్టులో ఉక్రెయిన్ యుఎస్ఎస్ఆర్ నుండి విడిపోయింది. కాని నాలుగు నెలల్లోనే రష్యా, బెలారుస్, ఉక్రెయిన్లు కలిసి కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్‌ను స్థాపించుకున్నాయి.

ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ చాలా వరకు (ఈ రోజుకు కూడా) రష్యాపై ఆధారపడి ఉంది. 1998లో రష్యాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ఉక్రెయిన్‌పై తీవ్ర ప్రభావం చూపింది. 1999లో జరిగిన ఎన్నికలలో పాశ్చాత్య దేశాల వైపు మొగ్గు చూపిన యుషెంకో ప్రధానమంత్రి అయ్యాడు. కాని రష్యావైపు మొగ్గుచూపే బడా వ్యాపారవేత్తలు, కమ్యూనిస్టు పార్టీ అతనిపై అవిశ్వాస తీర్మానం పెట్టి దించేశాయి. దీని వెనుక రష్యా అనుకూలుడైన ప్రెసిడెంట్ కుక్మా ఉన్నాడని పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. చివరికి 2004లో కుక్మా తాను పదవి విరమణ ప్రకటించాడు. ప్రెసిడెంట్ ఎన్నికలలో సంస్కరణవాది, మాజీ ప్రధానమంత్రి అయిన యుషెంకో తన ప్రత్యర్థి అయిన, కుక్మా వారసుడుగా ఎన్నుకున్న ఎన్‌కోవిచ్‌తో పోటీ పడ్డాడు. ఎన్నికలకు కొన్ని వారాల ముందు యుషెంకోపై విష ప్రయోగం జరిగి అతను ఆసుపత్రి పాలయ్యాడు. కేవలం మూడు శాతం ఓట్ల తేడాతో ఎన్‌కోవిచ్ గెలిచినట్లు ప్రకటించారు. ఎన్నికలలో అక్రమాలు జరిగాయని పాశ్చాత్య దేశాల

పరిశీలకులు ఆరోపించారు. ఎన్నో ఆందోళనలు జరిగాయి. సుప్రీంకోర్టు ఆ ఫలితాలను రద్దు చేసింది. మళ్లీ జరిగిన ప్రెసిడెంట్ ఎన్నికలలో యుషెంకో ఎనిమిది శాతం ఓట్లతో గెలిచాడు. అయితే త్వరలోనే యుషెంకో పార్టీ అంతర్గత కలహాలు, అవినీతితో అట్టుడికి పోయింది. 2005లో యుషెంకో మొత్తం మంత్రి వర్గాన్ని రద్దు చేశాడు. సంస్కరణవాదులపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజలు నిరాశకు గురయ్యారు.

పశ్చిమ దేశాల వైపు మొగ్గుచూపుతున్న ప్రెసిడెంట్‌ను దారిలోకి తేవడానికి రష్యా 2006 జనవరిలో ఉక్రెయిన్‌కు అమ్మే గ్యాస్ ధరను నాలుగు రెట్లు పెంచింది. పెరిగిన ధరల ప్రకారం కట్టడానికి ఉక్రెయిన్ మొండి కేసింది. దాంతో రష్యా గ్యాస్ సప్లయిని కొన్ని రోజులు ఆపివేసింది. ఈ చర్యతో రష్యా నుండి ఉక్రెయిన్ గుండా యూరప్ దేశాలకు (రష్యా మూడోవంతు యూరప్ గ్యాస్ అవసరాలను తీరుస్తున్నది) జరుగుతున్న సప్లయికి కూడా అంతరాయం ఏర్పడింది. చివరకు ఉక్రెయిన్ నాలుగింతలకు బదులుగా రెండింతలు చెల్లించడానికి ఒప్పుకోవడం జరిగింది. ఇది అన్యాయపు ఒప్పందమని పార్లమెంట్ ప్రధానమంత్రిని తీసి వేసింది. ఉక్రెయిన్ గుండా యూరప్ దేశాలకు వెళ్లుతున్న గ్యాస్ పైపులకు చెందిన ధరల విషయంలో, రష్యా ఉక్రెయిన్‌కు ఇచ్చిన అప్పుల విషయంలో వచ్చిన సమస్యల వలన రష్యా గ్యాస్ సప్లయిని 2009లో మళ్లీ ఆపివేసింది. దాంతో పది యూరప్ దేశాల వరకు తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొన్నాయి. 2010లో జరిగిన ప్రెసిడెంట్ ఎన్నికలలో రష్యా అనుకూల యాంకోవిచ్ 3.48 శాతం ఓట్లతో గెలిచాడు. ఈ ఎన్నికలు పూర్తి సక్రమంగా జరిగాయని పాశ్చాత్య ఎన్నికల పరిశీలకులే చెప్పారు.

2013 నవంబర్‌లో ఉక్రెయిన్ యూరోపియన్ యూనియన్ (ఇయు)తో ఒక ఒప్పందం చేసుకోవాలనుకుంది. దీనికి రష్యా ప్రెసిడెంట్ పుతిన్ స్పందిస్తూ, ఒకవేళ ఈ ఒప్పందం చేసుకుంటే ఉక్రెయిన్‌పై చర్యలు ఉంటాయని హెచ్చరించాడు. దాంతో ఉక్రెయిన్ ప్రెసిడెంట్ ఆ నిర్ణయాన్ని విరమించుకున్నాడు. తన అధీన దేశం (వ్యాస్సల్ స్టేట్) తన శత్రువులైన నాటో దేశాల చేతుల్లోకి వెళ్లడం రష్యాకు ఏ మాత్రం ఇష్టం లేదు. ఇప్పటికే తన ఒకప్పటి అధీన దేశమైన జార్జియా అనే పొరుగు దేశం అమెరికా తొత్తుగా మారింది.

అమెరికా, ఇతర పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాల దీర్ఘకాలిక ఎజెండా ఏమిటంటే, రష్యా ఆధీనంలో, ప్రభావంలో ఉన్న దేశాలను విచ్ఛిన్నం చేసి, తమ ఆధీనంలోకి తీసుకొని, రష్యాను బలహీనం చేసి, దెబ్బతీయాలి. దాంట్లో భాగంగా సిరియా, ఇరాన్‌లపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. ఇక ఉక్రెయిన్ విషయానికి వస్తే, రష్యా గ్యాస్ ఎగుమతులలో 80 శాతం ఉక్రెయిన్ గుండానే వెళ్తున్నాయి. దాంతో ఉక్రెయిన్ తమ ఆధీనంలోకి వస్తే, రష్యా గ్యాస్ సరఫరాను నియంత్రించవచ్చనేది వారి ఎజెండా. అలాగే సారవంతమైన భూములతో ధాన్యాల ఉత్పత్తి నిలయమైన ఉక్రెయిన్‌ను తమ ఆధీనంలోకి తీసుకోవడం ద్వారా అంతర్జాతీయ కమాడిటీస్ మార్కెట్‌పై తమ ఆధిపత్యం మరింత పెరిగి, భవిష్యత్తులో అతి ముఖ్యంగా మారనున్న ధాన్యాల కొరతను తమ ప్రయోజనాలకు వాడుకోవచ్చని పాశ్చాత్య సామ్రాజ్యవాదుల ప్రణాళిక.

ఈ రాజకీయార్థిక ఎత్తుగడలలో భాగంగా పాశ్చాత్య దేశాలు రష్యా చుట్టూ ఉన్న ఈశాన్య యూరప్ దేశాలకు నాటో సైనిక కూటమిలోకి, ఇయులోకి రావాలని ఎరవేస్తూ, ఒత్తిడి చేస్తున్నాయి. ప్రజాస్వామ్యం, శాంతి కొరకు పాటుపడుతున్నామని చెప్పే పాశ్చాత్య దేశాలు, వారి ఎన్నికల పరిశీలకులు సక్రమంగా జరిగినవని చెప్పిన ఎన్నికలలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రస్తుత ఉక్రెయిన్ ప్రెసిడెంట్‌ను ఇయుతో ఒప్పందాన్ని చేసుకోనట్లయితే దిగిపోవాల్సిందేనని హెచ్చరిస్తున్నాయి. గత దశాబ్దంన్నర నుండి తమ తొత్తు ఎన్‌జిఒలను ఉక్రెయిన్‌లో దింపి వారి ద్వారా ఆ దేశంలో సంక్షోభాన్ని సృష్టిస్తున్నారు. తమ తొత్తు ప్రెసిడెంట్‌ను అధికారంలోకి తేవడానికి ఒక తిరుగుబాటును ప్లాన్ చేసింది అమెరికా. ఈ విషయమై ఉక్రెయిన్‌లోని అమెరికా రాయబారి, ఇయులోని అమెరికా రాయబారి మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ బయటపడింది. ఈ సంభాషణ ట్యాప్ జరిగి లీక్ అయింది. అది యూట్యూబ్‌లో ఉంది. ప్రెసిడెంట్ ఒబామా ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ఉక్రెయిన్ ప్రెసిడెంట్‌ను దింపడానికి కుట్ర చేస్తున్నాడు. ఈ వ్యాసం ముగించే సమయానికి వచ్చిన తాజా వార్త ప్రకారం యానుకోవిచ్‌ను అధ్యక్ష పదవి నుండి పార్లమెంట్ తొలగించింది. యూరప్ తయారు చేసిన దేశ అంతర్గత శాంతి ఒప్పందంపై ప్రతిపక్షాలతో సహా అధ్యక్షుని సంతకం జరగగానే అతన్ని పదవీచ్యుతున్ని చేశారు. అతను రాజధాని కీవ్‌ను వదిలి, రష్యన్ భాష మాట్లాడే, రష్యా అనుకూల క్రిమియాకు పారిపోయాడని వార్తలు వచ్చాయి. అయితే పార్లమెంట్ అతనిపై, అతనికి సహకరించిన అధికారులపై శాంతియుత ఉద్యమకారు లను సామూహిక హత్యలు చేసిన నేరం మోపి అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ప్రస్తుతం రాజధానిలో ఉన్న ప్రభుత్వం పూర్తిగా పాశ్చాత్య దేశాల అనుకూల ప్రభుత్వం. అయితే ఉక్రెయిన్ తూర్పు, పశ్చిమ ప్రాంతాల వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాట్లు చేసి, తమ స్వంత సాయుధ దళాలను తయారు చేసుకుంటున్నాయి.

అమెరికా సైన్యం ఇరాక్‌ను ఆక్రమించి, ఈ పదేళ్లలో కాలంలోనే ఐదు లక్షలపైన ప్రజలను చంపినప్పటికీ తమ దేశం అతి గొప్ప ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్నారు. ఉక్రెయిన్ ప్రభుత్వం యాభై మంది ఆందోళనకారులను చంపిందని అంటూ ప్రభుత్వంలో భాగమైన కొందరి ముఖ్యులపై అంతర్జాతీయ అరెస్టు వారెంట్లు, వారి విదేశీ ఆస్తుల జప్తు ఆర్డర్లను ఇచ్చారు. తమ జేబు సంస్థలైన ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు, యూరోపియన్ యూనియన్ హ్యూమన్ రైట్స్ కోర్టుల ద్వారా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. తమ పెత్తనం, ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని అనుకుంటున్నప్పుడు వివిధ దేశాల ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూలదోయడం, ప్రెసిడెంట్, ప్రధానులను చంపించడం, దేశాలపై ఆంక్షలు విధించడం లాంటి చర్యలు చేస్తున్నాయి.

ఉక్రెయిన్ దేశ ప్రజలు ఇప్పుడు రెండు సామ్రాజ్యవాద శక్తుల ఆటలో బలి అవుతున్నారు. సామ్రాజ్యవాదులు ప్రపంచాన్ని తమ గుప్పిట్లో ఉంచుకొని ప్రజలను, వనరులను దోచుకొనే క్రమంలో, ఆధిపత్య పోరులో భాగంగా అంతిమంగా ప్రజలనే అణచివేస్తున్నారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛా సమానత్వాలు, జాతుల స్వయం నిర్ణయాధికారం కోరుకునే ప్రజలందరూ ఉక్రెయిన్ ప్రజల పక్షం నిలబడాలి.

(రచయిత పరిశోధకులు)

రిలయన్స్‌పై కేసు నమోదు

***దేశ సహజ వనరులను రిలయన్స్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిందనీ, ఈ అంశంలో కేంద్ర మంత్రుల నుంచి ప్రభుత్వ అధికారుల దాకా అందరి పాత్ర ఉందనీ అంటున్నారు* చిమ్మె జాన్‌బర్నబాస్**

రిలయన్స్ గ్యాస్ అంశానికి సంబంధించి, ఢిల్లీ ప్రభుత్వ అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) 2014 ఫిబ్రవరి 12న ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. అందులో నిందితులుగా, పెట్రోలియం శాఖామంత్రి వీరప్పమొయిలీ, రిలయన్స్ అధినేత ముఖేశ్‌అంబానీ, మాజీ కేంద్రమంత్రి మురళీ దేవరా, హైడ్రోకార్బన్స్ రిటైర్డ్‌డైరెక్టర్ జనరల్ వికె సిబాల్ ఉన్నారు.

కృష్ణా – గోదావరి (కెజి) బేసిన్ నుండి వచ్చే సహజ వాయువు ధరల విషయంలో వీరి మధ్య రహస్య ఒప్పందం కుదిరిందనీ, దీనిపై దర్యాప్తు ప్రారంభించాలనీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కోరిన మీదట పైన తెలియచేసిన వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు కాబడింది. అంతేకాకుండా, ఈ కేసులో దర్యాప్తు పూర్తయ్యే వరకూ, ఏప్రిల్ ఒకటి నుండి, గ్యాస్ ధరలు పెంచాలనే నిర్ణయాన్ని నిలుపుదల చేయాలని అభ్యర్థిస్తూ, ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు అరవింద్ కేజ్రీవాల్ ఉత్తరం రాశారు. మాజీ కేంద్ర కేబినెట్ కార్యదర్శి టిఎస్ఆర్ సుబ్రహ్మణ్యన్, మాజీ నేవి ఛీఫ్ అడ్మిరల్ ఆర్‌హెచ్ తహిల్యానీ, సుప్రీంకోర్టు న్యాయవాది కామినీ జైస్వాల్, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎస్ శర్మలు దాఖలు చేసిన ఉమ్మడి ఫిర్యాదు ఆధారంగా, దర్యాప్తు ప్రారంభించాలని ఢిల్లీ ఏసిబి శాఖను కేజ్రీవాల్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

గ్యాస్ ధర పెంచడం వలన, ప్రతి సంవత్సరం రు. 54500 కోట్ల రూపాయల భారం దేశంపై పడుతున్నదని, తద్వారా వచ్చే రు. 1.2 లక్షల కోట్ల భవిష్యత్ లాభాలు రిలయన్స్‌కు చేరతాయని కేజ్రీవాల్ ఈ సందర్భంగా తెలిపారు. కాగా తనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని జారీ అయిన ఉత్తర్వులు దిగ్భ్రాంతిని కలుగచేశాయని రిలయన్స్ సంస్థ, వీరప్పమొయిలీ ప్రకటించడం రాజకీయ దివాళాకోరుతనం, హాస్యాస్పదం తప్ప మరొకటి కాదు.

దర్యాప్తు జరిపే అధికార పరిధి ఢిల్లీ ప్రభుత్వానికి ఉన్నదా? లేదా? అనే అంశాన్ని అటుంచి, కేజ్రీవాల్ ప్రభుత్వం అవినీతినీ, కార్పొరేట్ దోపిడీని వ్యతిరేకిస్తుందనడానికి ఈ అంశం (కేసు) ఒక ఉదాహరణగా ఉపయోగపడుతుంది వారికి. అందుకే పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది కూడా.

వాస్తవానికి కెజి బేసిన్ నుండి (డి – 6 బ్లాక్‌కు చెందిన) రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) ఉత్పత్తి చేస్తున్న గ్యాస్ ధరను ఏప్రిల్ ఒకటి నుండి ఎంఎంబిటియు ఒకటికి 4.2 నుండి 8.4 డాలర్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై సిపిఐ లోక్‌సభ సభ్యుడు గురుదాస్ గుప్తా సాగిస్తున్న పోరాటానికి, అరవింద్ కేజ్రీవాల్ కలిశారు. గురుదాస్ గుప్తా 8 మాసాలుగా పట్టు విడవకుండా, ఈ అంశంపై పోరాడుతున్నప్పటికీ, అంతగా పట్టించుకోని జాతీయ మీడియా ఛానల్స్ కేజ్రీవాల్ ప్రకటనతో ఉలిక్కిపడినట్లు విస్తృత ప్రచారం ఇచ్చింది. రిలయన్స్ చేస్తున్న అవినీతి భాగోతంపై సుప్రీంకోర్టులో గురుదాస్ గుప్తా దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) మార్చ్ 4న విచారణకు రానుంది.

రిలయన్స్ గ్యాస్ రేటును రెట్టింపు చేయడానికి ప్రభుత్వం రంగరాజన్ కమిటీ వంటి ఒక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసినప్పటికినీ, ఇదొక పెద్ద కుంభకోణం. దేశ ప్రజల సొమ్మును దోపిడి చేయడానికి ఒక రాచమార్గం. వినియోగదారులపై, సబ్సిడి రూపంలో ప్రభుత్వంపై పడే విపరీత భారం గూర్చి విద్యుచ్ఛక్తి, ఎరువుల మంత్రిత్వశాఖలు పట్టించు కోలేదు. సబ్సిడి విషయాన్ని తర్వాత నిర్ణయిస్తామంటూ ఆర్థిక మంత్రిత్వ శాఖ చేతులు కలిపింది. రిలయన్స్ కాంట్రాక్ట్ నిబంధనలను ఉల్లంఘించిందనీ, తవ్వవలసిన బావులు తవ్వలేదనీ, అది అన్వేషణ జరపని విస్తారమైన ప్రాంతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న కాగ్ వాదనను తోసిపుచ్చారు.

ఒక రోజుకు 80 ఎంఎంబిటియుల ఉత్పత్తికి వాగ్దానం చేసిన రిలయన్స్ సంస్థ ధర పెంచాలన్న తమ అభ్యర్థన ఆమోదం పొందక పోవడంతో ఉత్పత్తిని కావాలనే తగ్గించింది. అది ఉద్దేశ పూర్వకమన్న హైడ్రోకార్బన్స్ డైరక్టర్ జనరల్ నిర్ణయం ప్రకారం జైపాల్‌రెడ్డి (పెట్రోలియం మంత్రిగా ఉన్నప్పుడు) భారీగా పెనాల్టీ (రుసుము) విధించారు. అనూహ్యమైన భూ భౌతిక కారణాలంటూ ఉత్పత్తి తగ్గుదలను 14 ఎంఎంబిటియు లకు రిలయన్స్ తగ్గించింది. దానిని సమర్థించు కున్నది కూడా ఆ సంస్థ.

ప్రధానమంత్రి పెట్రోలియం శాఖను వీరప్పమొయిలీకి అప్పగించాక, ధర పునర్నిర్ణయ కార్యక్రమం వేగవంతమయింది. దేశ గ్యాస్ అవసరాల్లో 85 శాతం దిగుమతి చేసుకుంటున్నందున, గ్యాస్ అన్వేషణకు దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలంటే, ధర లాభసాటిగా ఉండాలన్నది మొయిలీ వాదన.

దేశంలోనే పెద్ద కార్పొరేట్ సంస్థ అయిన రిలయన్స్ గ్రూప్, తనకు అనుకూలమైన వారిని కేంద్రమంత్రులు గానూ, ఐఎఎస్ అధికారులనూ నియమించు కోవడానికి పెద్ద ప్రయత్నం చేసింది. దానిని సాధించుకున్నది. రిలయన్స్‌తో పొసగకనే, అప్పట్లో మణిశంకర్ అయ్యర్, జైపాల్‌రెడ్డిలు కేంద్రమంత్రులుగా తొలగించబడ్డారు. జైరాం రమేశ్‌లాంటి నలుగురు కేంద్రమంత్రులు కేబినెట్‌లో వ్యతిరేకించినా, రిలయన్స్ సంస్థ ధర పెంపుదలను సాధించుకున్నది. ధరను రెట్టింపు చేయడం వలన

ఆర్‌టిసి అభివృద్ధి - నిజానిజాలు

ప్రజల దైనందిన జీవితంలో భాగమైపోయిన రాష్ట్ర రవాణా సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అటు ప్రభుత్వానిది, ఇటు ప్రజలది అనీ, ప్రభుత్వ ఆర్థిక విధానాలే ఆర్‌టిసిని నష్టాల బాటలో నెట్టాయనీ అంటున్నారు **డా. చిలుమూరి శ్రీనివాసరావు**

రవాణా-మనుషులను, వస్తువులను ఒక చోట నుండి వేరొక చోటుకు చేరవేసేందుకు దోహదం చేస్తుంది. ముఖ్యంగా ప్రయాణీకులకు సేవలందించడంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల పాత్ర చెప్పుకోదగ్గది. ఎపిఎస్‌ఆర్‌టిసి 'బస్సు చక్రం-ప్రజాప్రగతికి చిహ్నం' అనే నినాదంతో ప్రయాణీకులకు విశేషమైన సేవలు అందిస్తూ, రోజు రోజుకు అభివృద్ధి చెందుతూ ప్రజా జీవనంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తూ ఉంది. 1950లో రోడ్డు రవాణా సంస్థ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం బస్సుల జాతీయాకరణను ప్రవేశపెట్టింది. అదే చట్టం కింద దేశంలో అన్ని రాష్ట్ర రవాణా సంస్థలు నిర్వహింపబడుతున్నాయి. ప్రస్తుతం కేంద్ర రోడ్డు రవాణా సంస్థ ఆధీనంలో మొత్తం 71 సంస్థలు పని చేస్తున్నాయి. అవి 21 కార్పొరేషన్లుగా, 31 కంపెనీలుగా, 10 మున్సిపల్ ఆధీనంలోని రోడ్డు రవాణా విభాగాలుగా, 8 గవర్నమెంట్ విభాగాలుగా, ఒకటి అసోసియేషన్ మెంబరుగా పని చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్‌ఆర్‌టిసి)

రోడ్డు రవాణా సంస్థ చట్టం (1950) ద్వారా ప్రయాణీకులకు సమర్థవంతంగా, తగినంతగా, సౌకర్యవంతమైన, క్రమబద్ధమైన రక్షణ యుక్తమైన తక్కువ ధర కలిగిన సేవలను ప్రయాణీకులకు అందించాలనే ధ్యేయంతో 1958 జనవరి 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏర్పడింది. 1958 ప్రారంభంలో కేవలం 609 బస్సులు కలిగి, 5081 మంది ఉద్యోగులతో, 16 డిపోలు, 6.50 లక్షల మంది ప్రయాణీకులను చేరవేస్తూ, మొత్తం 182 కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన ఎపిఎస్‌ఆర్‌టిసి అంచెలంచెలుగా ఎదుగుతూ ఎంతో అభివృద్ధిని సాధించింది.

ప్రయాణికులకు సౌకర్యాలు

ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం ప్రయాణీకులకు మంచి రవాణా సౌకర్యాలను చేకూర్చడం. ఈ సంస్థ ప్రయాణీకులకు రవాణా సౌకర్యాలను కల్పించడంలో ముందు భాగాన ఉంది. వివిధ రకాల ప్రయాణీకుల సౌకర్యం నిమిత్తం అనేక రకాలైన రాయితీలను కల్పిస్తోంది. ఉద్యోగస్తులకు, విద్యార్థులకు, వికలాంగులకు రాయితీలను మంజూరు చేస్తోంది. రాష్ట్రంలోని 22,460 గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించారు. అనేకరకాల ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకొని గరుడ, హైటెక్, లగ్జరీ, నాన్ స్టాప్, ఆర్డినరీ, పల్లెవెలుగు బస్సులను ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి ముఖ్య పట్టణాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన సిటి బస్‌లను, డిపోలను నిర్వహిస్తోంది. కొత్త బస్సులు అవసరమైన చోట ప్రయాణీకుల అవసరాల నిమిత్తం ప్రైవేట్ బస్సులను అద్దెకు తీసుకొని నడుపుతోంది. పక్కనే ఉన్న రాష్ట్రాలకు బస్సులను నడుపుతూ ఎంతో ప్రయోజనాన్ని కల్పిస్తోంది. తమిళనాడు, కర్నాటక, ఒడిషా, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలకు బస్సులను నడుపుతోంది. ప్రయాణీకుల సౌకర్యం కోసం, బస్సులలో అడ్వాన్స్ రిజర్వేషన్లు, ఫోను ద్వారా రిజర్వేషన్లు, తక్కువ స్థాయి ఛార్జీలతో ఎఎన్‌ఎల్ సౌకర్యం కల్పించారు.

ఇతర రాష్ట్రాల సర్వీసుల పోలిక

ఎపిఎస్‌ఆర్‌టిసిని మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్‌లలోని రోడ్డు రవాణా సంస్థలతో పోల్చి చూస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 2009 -10 సంవత్సరం నాటికి 21,469 వాహనాలు కలిగి ఉండి సంఖ్యాపరంగా ప్రథమ స్థానంలో నిలువగా, మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 16,832ను, కర్నాటక 5820, కేరళ 3984,

---

గ్యాస్‌తో ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తి యూనిట్‌కు రెండు రూపాయలు, ఎరువుల ధర టన్నుకు 6000 రూపాయలు పెరుగుతుంది. గ్యాస్ ఉత్పత్తి తగ్గింపు వల్ల ఇప్పటికీ రు. ఒక లక్ష కోట్లకు పైగా ఉత్పత్తి నష్టం సంభవించింది. రేటు పెంపుదల వల్ల రిలయన్స్‌కు దాదాపు రు. లక్ష కోట్లు లబ్ధి చేకూరుతుంది. ప్రజల నెత్తిన అదనపు భారం పడుతుంది. ఒఎన్‌జిసి గ్యాస్‌కు ఇదే రేటు వర్తిస్తుందంటూ, వీరప్ప మొయిలీ రేటు పెంపుదలను గట్టిగా సమర్థిస్తున్నారు. వాస్తవమే కానీ ఒఎన్‌జిసికి లాభాలు పెరిగితే అవి ప్రభుత్వానికి చెందుతాయి. కాగా రిలయన్స్ లాభాలు వారి సొంత జేబుల్లోకి వెలుతాయి.

దేశ సంపద అయిన ప్రకృతి వనరులను ఉదారంగా, ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడంలో అవినీతికి చోటు లేదంటే నమ్మశక్యం కాదు. ధర పెంపుదలను నిలుపుదలలో ఉంచి, స్టాక్ హోల్డర్స్ అందరితో చర్చించాలనీ వామపక్షపార్టీల నాయకులు కోరుతున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం కూడా బడా బూర్జువా శక్తులకే తాబేదార్‌గా వ్యవహరించింది. ఈ దోపిడిపై నియమ, నిబంధనలను రిలయన్స్ ఉల్లంఘించడంపై ప్రభుత్వం కూడా ఆ సంస్థకు దాసోహం కావడాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ ఏకం కావాలి. దోపిడి శక్తులకు వ్యతిరేకంగా పోరాడే ప్రజలందరూ సంఘటితపడాలి. గుత్త పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న దోపిడిశక్తులను ప్రతిఘటించాలి. దళారీ పాలక వర్గాల కుట్రను ప్రజలకు బహిర్గతం చేస్తూ, నూతన ప్రజాస్వామ్య విప్లవం దిశగా ప్రజలను కదిలించడం ద్వారానే విజయవంతం కాగలుగుతాం.

(రచయిత ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

మధ్యప్రదేశ్ 2291 బస్సులను కలిగి ఉన్నాయి. ఉద్యోగస్తులను గమనిస్తే 2009-10 ఎపిఎస్ఆర్టిసి 1,15,898 మందిని, మహారాష్ట్ర 1,10,405 మందిని కలిగి ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉన్నాయి. కర్ణాటక 35,312, మధ్యప్రదేశ్ 20,805, కేరళ 24,270 మంది ఉద్యోగస్తులను కలిగి ఉన్నాయి.

అంతేకాక ప్రయాణీకుల వివరాల ఆధారంగా ఎపిఎస్ఆర్టిసి 2009-10 నాటికి 48,935, మహారాష్ట్ర 6222.41, కర్నాటక 2028.92 కేరళ 2829, మధ్యప్రదేశ్ 195.25 లక్షల ప్రయాణీకులను వారివారి గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి.

ఈ విధంగా ఇతర రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలతో పోల్చిచూస్తే అనేక విషయాలలో ఎంతో అభివృద్ధి సాధించిన ఎపిఎస్ఆర్టిసి ప్రైవేట్ బస్సులకు పర్మిషన్ ఇవ్వడం ద్వారా వ్యవస్థాపరమైన నిర్వాహణ లోపాల వలన ఎంతో నష్టపోతున్నది. కాబట్టి లోపాలను సవరించు కొన్నప్పుడు మాత్రమే సమర్థవంతమైన రోడ్డు రవాణా సంస్థగా దేశంలోనే ముందుండే అవకాశముంది.

ఎపిఎస్ఆర్టిసి ప్రస్తుత పనితీరు

1958 జనవరిలో ఎపిఎస్ఆర్టిసి సంస్థగా అవతరించిన నాటి నుంచి నేటివరకు ప్రతిఅంశంలోనూ అంచెలంచె లుగా ఎదుగుతూ తన పనితీరును పెంచుకుంటూ వెళ్తున్నది. ఈ అభివృద్ధి ప్రశంసించ దగ్గది. ఎపిఎస్ఆర్టిసి పనితీరును (అధికారికంగా అందుబాటులో ఉన్న సమాచారం 2009-2010 ఆధారంగా) నాలుగు రకాలుగా విభజించి పరిశీలించవచ్చు. 1) మూలధన నిర్మాణం, 2) ఆదాయ సంబంధమైన నైపుణం, 3) భౌతిక పరమైన సామర్థ్యం, 4) నిర్వహణ పరమైన సామర్థ్యం.

1) మూలధన నిర్మాణం : ఎపిఎస్ఆర్టిసి మూలధన నిర్మాణాన్ని పరిశీలించినట్లయితే అప్పులు, ఆస్తులు 2003-04లో రు. 3303.10 కోట్లు ఉండగా 2008-09లో రు. 4846.48 కోట్లుగా కనిపిస్తూ ఉంది.

మొత్తం అప్పులను గమనించినట్లయితే అత్యధిక శాతం నిధులు, లోన్ల రూపంలో కనిపిస్తున్నాయి. నిధులు 2003-04లో రు. 1669.98 కోట్లుగా, 2008-09లో రు. 1823.66 కోట్లుగా ఉన్నవి. లోన్లు గమనిస్తే 2003-04లో రు. 1040.98 కోట్లు, 2008-09లో రు. 1404.47కోట్లుగా ఉన్నవి.

రెవెన్యూ అప్పులు 2003-04లో రు. 210.59 కోట్లు, 2008-09 లో రు. 1108.81 కోట్లుగా ఉన్నవి. మూలధనం విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వ మూలధనం 2003-04లోనూ, 2008-09 వరకూ రు. 133.19 కోట్లుగా ఉండి ఏవిధమైన మార్పు లేకుండా ఉంది. కేంద్ర ప్రభుత్వ మూలధనం 2003-04లో రు. 61.07 కోట్లుగా ఉండి 2008-09 వరకు ఏవిధమైన మార్పు లేకుండా ఉంది.

మొత్తం ఆస్తుల్లో స్థిరాస్తులు 2008-09లో రు. 2516.46 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆస్తులు, లోన్లు, అడ్వాన్సులు రు. 178.33 కోట్లుగా ఉన్నవి. రాష్ట్ర ప్రభుత్వం నుండి సహాయం రు. 165.21 కోట్లు, రుణగ్రస్తులు, వసూలు బిల్లులు రు. 854.64 కోట్లు, నికర ఆదాయ లోటు ఖాతా రు. 1151.84 కోట్లుగా ఉన్నవి.

2) ఆర్థిక సంబంధమైన సామర్థ్యం : ఆర్థిక సంబంధమైన అంశాలను గమనిస్తే 2009-10 లో ఆదాయం ట్రాఫిక్ ద్వారా రు. 4398.55 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రాయితీ ఆదాయం రు. 540.79 కోట్లు, ట్రాఫికేతర ఆదాయం రు. 266.92 కోట్లు, మొత్తం ఆదాయం 2009-10 లో రు. 5206.26 కోట్లుగా ఉంది. 2004-05 నుండి 2009-10 వరకూ ఆదాయం పెరుగుతున్నప్పటికి వ్యయం పెరుగుదలతో పోలిస్తే పెరుగుదల తక్కువేనని చెప్పవచ్చు.

ఎపిఎస్ఆర్టిసి 2004-05లో మొత్తం వ్యయం రు. 3440.64 కోట్లు. అందులో ఉద్యోగుల వ్యయం రు. 1359.10 కోట్లు, మెటిరియల్ వ్యయం (ఇంధనం) రు. 1015.01 కోట్లు, పన్నులకు చెల్లించినది రు. 361.89 కోట్లు, అద్దె బస్సులకు చెల్లించినది రు. 262.28 కోట్లు. 2009-10 సంవత్సరంలో మొత్తం ఖర్చును పరిశీలిస్తే పర్సనల్ ఖర్చులకు రు. 2206.95 కోట్లుగాను, మెటిరియల్ ఖర్చులకు రు. 1821.78 కోట్లుగాను, టాక్స్‌లు రు. 279.42 కోట్లుగాను, వడ్డీలు రు. 114.64 కోట్లుగాను, తరుగుదల రు. 224.91 కోట్లుగాను, ఇతర ఖర్చులు అన్ని కలిపి రు. 166.89 కోట్లు, అద్దె బస్సులకు చెల్లించినది రు. 906.19 కోట్లు, నష్టం రు. 514.55 కోట్లు కలిపి మొత్తం ఖర్చు రు. 5720.81 కోట్లుగా ఉన్నది.

3) భౌతికపరమైన సామర్థ్యం : ఆర్టిసి మొత్తం కలిగి ఉన్న బస్సులు 2004-05లో 19,609, 2009-10లో 21,469గా ఉన్నాయి. వీటిలో సొంత బస్సులు 2004-05 లో 17,825, 2009-10లో 17,351, అద్దె బస్సులు 2004-05 లో 1,689, 2009-10లో 4,045. నిర్వహిస్తున్న మొత్తం రూట్ల సంఖ్య 2004-05లో 8,132 కాగా 2009-10లో రూట్ల సంఖ్య 7,955. 2009-10లో వాహనాల ఉపయోగం 99.58 శాతంగా ఉంది.

ఆర్టిసి నిర్వహించిన కి.మీ 2004-05లో 23250 లక్షల కి.మీ గా ఉండగా 2009-10లో 27716 లక్షల కి.మీ కు పెరిగింది. 2004-05లో చేరవేసిన ప్రయాణీకుల సంఖ్య 42,749 లక్షలు కాగా 2009-10 లో 48935 లక్షలుకు చేరింది. మొత్తం ఉద్యోగులు సంఖ్య 2004-05 లో 117400 ఉండగా 2009-10 లో 115898గా ఉన్నారు. వారిలో కండక్టర్లు, డ్రైవర్లు 88183, కంట్రోలర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు, బస్‌స్టేషన్ ఉద్యోగులు 5,514, వర్క్‌షాప్ మొయింటెన్స్ ఉద్యోగులు 13,349 ఉన్నారు. బస్సుకు ఉద్యోగుల శాతం 2004-05 లో 6.31, 2009-10 లో 6.01గా ఉంది.

4) నిర్వహణ సామర్థ్యం : 2009-10లో ఆర్టిసి బస్సుల ఉపయోగం శాతం 99.58. ఒక్క రోజుకు బస్సు తిరిగిన కి.మీ. 357.3గా ఉంది. ఒక్కొక్క బస్సుకు కి.మీ.కు పొందిన ఆదాయం 1838 పైసలు. బస్సు ఎక్కే ప్రయాణీకుల శాతము 69 గాను, నిర్వాహణ నిమిత్తం చేసే కి.మి ఖర్చు 1895 పైసలు ఖర్చు జరుగుతున్నది. నష్టం కి.మీకు 57 పైసలు పొందారు. ఎచ్.ఎస్.డి (కెయంపియల్) 5.28 గా నమోదయింది.

సమస్యలు - నివారణ చర్యలు

1) మూలధనం తక్కువ : సంస్థ మొత్తం అప్పులు రు. 4866.48 కోట్లలో మొత్తం మూలధనం కేవలం రు. 206 కోట్లు మాత్రమే. సంస్థ

నిధులు, రెవెన్యూ అప్పులు, లోన్ల మీద ఆధారపడి కార్యక్రమాలను నిర్వహించడం మంచిది కాదు, కాబట్టి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకుని 1500 కోట్లకు ఆర్‌టిసి మూలధనం పెంచాలి.

2) రుణగ్రస్తులు, వసూలు బిల్లులు : సంస్థకు రుణగ్రస్తులు, వసూలు బిల్లులు ద్వారా రావలసిన మొత్తం 2004-05లో రు. 60.16 కోట్లు నుండి 2009-10లో రు. 854.64 కోట్లుకు పెరగడం ప్రమాదకరం. ఈ మొత్తం తక్షణం పెరగకుండా, వీలైనంత త్వరగా వసూలుకు చర్యలు తీసుకోవాలి.

3) నికర ఆదాయ లోటు ఖాతా : ఇది గత కొద్ది సంవత్సరాల నుంచి వస్తున్న నష్టాల మొత్తం. ఇది 2003-04లో రు. 1018.10 కోట్లుగా ఉండగా, 2008-09లో ఇది రు. 1151.84 కోట్లుగా ఉంది. ప్రస్తుతం అది రు. 1500 కోట్లుపైబడి ఉండవచ్చు. ప్రభుత్వం తక్షణం 750 కోట్లు ఇచ్చి నికర ఆదాయ లోటు ఖాతాను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలి.

4) రాయితీలు : రాష్ట్ర ప్రభుత్వం కారణంగా ఆర్‌టిసి ప్రకటించిన రాయితీలు మొత్తం విలువ 2009-10లో రు. 540.79 కోట్లుగా ఉంది. విద్యార్థులకు, వికలాంగులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ఇతరులకు రాయితీలు ఇచ్చారు. రాయితీ ఇచ్చేది ప్రభుత్వం కోసం, ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికో చెల్లిస్తుంది. ఈ రాయితీ ఇవ్వడం ఆర్‌టిసిని ఎక్కువ ఇబ్బంది కలిగిస్తూ ఉన్నది. రాయితీ మొత్తాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం చెల్లిస్తుంటే నిర్వహణ భారం తగ్గుతుంది.

5) నష్టాల రాబడి, వడ్డీ చెల్లింపులు : ఎపిఎస్‌ఆర్‌టిసి ఎదుర్కొనే సమస్యలలో ఒకటి నష్టాలు. 2009-10లో రు. 514.55 కోట్ల నష్టాలకు గురైంది. ఆర్‌టిసి కొంత లాభాలను సంపాదిస్తూ ఉన్నా అంతకు ముందు ఉన్న అప్పుల కారణంగా, బ్యాంకులకు చెల్లించవలసిన వడ్డీలకు సరిపోతుంది, 2009-10లో నష్టం రు. 114.64 కోట్లుగా ఉంది.

6) అద్దె బస్సులు : ఆర్‌టిసి 2004-05లో నిర్వహించిన అద్దె బస్సులు 1689, వాటికి చెల్లించిన మొత్తం 262.28 కోట్లు, అవి 2009-10 నాటికి 4045కు పెరిగాయి. వాటికి చెల్లించిన మొత్తం 906.19 కోట్లు. అద్దె బస్సులు పెరుగుదల వాటికి చెల్లించే వ్యయం భారీగా పెరగడం ఆర్‌టిసికి ప్రమాదకరం. అద్దె బస్సులు ఇచ్చిన కొందరు ప్రైవేట్ ఆపరేటర్లు కొత్త బస్సులను కొని వాటికి సమాంతరంగా సర్వీసులను నడుపుతున్నారు. కావున ప్రతి అద్దె బస్సు ద్వారా లాభం రావాలి లేకపోతే వాటిని రద్దు చేయాలి లేదా లాభం వచ్చేలాగా వాటి రూటును ఆర్‌టిసి మార్పు చేయాలి.

7) నిర్వహణ, వ్యవస్థాపరమైన సమస్యలు : పాత బస్సులు, అధిక సిబ్బంది, క్రమశిక్షణ కొరవడడం, పాత బస్సు స్టేషన్‌లలో మార్పు లేకపోవడం, క్రమపద్ధతిలో నిర్వహణను మార్చకుండా ఎప్పటి నుంచో నడుపుతున్న విధానాలనే అమలు చేయడం, అధికారులకు, సిబ్బందికి మధ్య సత్సంబంధాలు కొరవడి కార్మిక సంఘాల సమ్మెలకు దారితీయడం, ఇతరత్రా సమ్మెలు, ధర్నాలు, బస్సులపై అల్లరి మూకల దాడులు వంటి వాటి వలన ఆర్‌టిసి అనేక రకాలైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది.

8) కేంద్ర ప్రభుత్వ సరళీకృత విధానాలు-మార్గదర్శక సూత్రాలు : ఆర్థికరంగంలో కేంద్ర ప్రభుత్వ సరళీకృత విధానం రోడ్డు రవాణా రంగంపై కూడా తన ప్రభావాన్ని చూపుతోంది. అధికంగా ప్రైవేట్ బస్సులు నడపడానికి చోటు కల్పించాలని ప్రైవేట్ ఆపరేటర్లను ఆకర్షించని రూట్లలో మాత్రమే ప్రభుత్వ రవాణా సంస్థలు సర్వీసులు నడపాలని ప్రభుత్వరంగ విస్తరణ కూడదని వత్తిడి చేస్తూ ప్రైవేటీకరణను ప్రోత్సాహ మిస్తోంది.

9) మోటారు వాహనాల చట్టం : 1988లో సవరించబడిన మోటారు వాహనాల చట్టం నిబంధనల కారణంగా ఎక్కువ సంఖ్యలో కాంట్రాక్టు కారేజీలు, ఆల్ ఇండియా టూరిస్టు పర్మిట్లకు తోడు చట్ట విరుద్ధ ఆపరేటర్ల చొరబాటు జాతీయం చేయబడిన రంగాలలో బాగా ఎక్కువైపోయింది.

10) ప్రైవేట్ ఆపరేటర్ల పోటీ : ఎక్కువ ప్రయాణీకుల సాంద్రత కలిగిన దూరప్రాంతపు రూట్లపైన తక్కువ స్థాయి పన్నులను అవకాశంగా తీసుకొని ప్రైవేట్ ఆపరేటర్లు లగ్జరీ బస్సులను, కొన్ని ఎయిర్ కండిషన్డ్ బస్సులను కూడా కాంట్రాక్టు క్యారేజీల ముసుగులో తీసుకువస్తున్నారు. ప్రైవేట్ ఆపరేటర్లు లాభదాయకం కాని రూట్లలో కాకుండా ఎక్కువ సాంద్రత కలిగిన రూట్లలో లగ్జరీ కోచ్ రూపంలో ఎక్కువగా నడుపుతూ ఉన్నారు. ప్రైవేట్ ఆపరేటర్ల పోటీ పెరుగుతున్న కారణంగా, సామాజిక బాధ్యతగా నడుపుతున్న ట్రిప్పులలోని నష్టాన్ని, ఇతర చోట్ల లాభదాయకంగా నడిచే సర్వీసులతో భర్తీ చేయడానికి ఆర్‌టిసి చేపట్టిన వ్యూహం కష్టతరమవుతుంది.

భారతదేశ రోడ్డు రవాణా సంస్థలతో పోల్చిచూస్తే ఎపిఎస్‌ఆర్‌టిసి వాహనాల సంఖ్య పరంగా, ఉద్యోగస్తుల సంఖ్య పరంగా మొదటి స్థానంలో ఉన్నది. మొత్తం సంస్థ జోన్స్‌గా విభజించబడి నిర్వహిస్తున్నప్పటికీ నిర్వహణభారం విపరీతంగా పెరిగి ప్రతి సంవత్సరం నష్టాలు పెరిగిపోతూ ఉన్నాయి. సమ్మెలు కారణంగా, అనేక రకాలైన లోపాలు కారణంగా ప్రస్తుతం ఆర్‌టిసి నష్టాల మొత్తం సుమారుగా 4600 కోట్లకు చేరుకొని అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నది.

ఆర్‌టిసి నష్టాలను తగ్గించాలని, అభివృద్ధి పథంలో నడపడానికి ఏం చేయాలో సలహాలు ఇవ్వండి అని 2005లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగుళూరు వారితో ఒక నిపుణుల కమిటీని డా. రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అదే విధంగా ముగ్గురు మంత్రులు, ఆర్‌టిసి ఉన్నతాధికారుల టీం బెంగుళూరు వెళ్లి ప్రత్యేకంగా పరిశీలించి అధ్యయనం చేశారు. ఆ కమిటీ అనేక మంచి సలహాలు ఇచ్చింది.

అంతేకాక తమిళనాడు ప్రభుత్వం టిఎన్‌ఆర్‌టిసిని 1996లో ఎంటిసిగా, టిఎన్‌ఎస్‌టిసి (6 భాగాలు)గా, ఎస్ఇటిసిగా మొత్తం 8 స్వతంత్ర ప్రతిపత్తి గల కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసినట్లు అలాగే బెంగుళూరు ప్రభుత్వం కె.ఎస్.ఆర్‌టిసిని 1997లో బిఎంటిసిగా, ఎన్‌డబ్ల్యూకెఆర్‌టిసిగా, 2000లో ఎన్‌డబ్ల్యూకెఆర్‌టిసిగా మొత్తం (కె.ఎస్.ఆర్‌టిసితో కలిపి) నాలుగు స్వయం ప్రతిపత్తి గల కార్పొరేషన్లుగా విభజించిన విధంగా, ఎపిఎస్‌ఆర్‌టిసిని నిర్వహణ సౌలభ్యం కొరకు, సామర్థ్యం పెంపు కొరకు, నిర్వహణ వ్యయాలు, నష్టాలు తగ్గించు కోవడానికి మూడు లేదా నాలుగు కార్పొరేషన్లుగా విభజించాలని ఐఐఎం బెంగుళూరు నిపుణుల కమిటీ సలహా ఇచ్చింది.

గతంలో కేంద్ర ప్రభుత్వం జెఎన్ఎన్‌యుఆర్ఎం పథకం కింద

దత్తి సుధాకర్



విజయనగరం జిల్లా పెదపెంకి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త దత్తి సుధాకర్ (59) అధిక రక్తపోటు వల్ల పక్షవాతంతో ఫిబ్రవరి 6న విశాఖపట్నంలోని కళా ఆసుపత్రిలో మరణించారు. సమాజంలోని వైఫల్యాలను తెలియపరిచే అసహజ మరణాల శీర్షికను వీక్షణం ప్రతి నెల జిల్లాల వారీగా వెలువరిస్తుంది. ఈ శీర్షికను చూసి సుధాకర్ స్పందించి విజయనగరం జిల్లాలో జరుగుతున్న అసహజ మరణాల వివరాలను 2008 నుండి 2013 డిసెంబర్ వరకు సేకరించి క్రమం తప్పకుండా ప్రతి నెలా అందజేశారు. అనుకోని విధంగా సుధాకర్ కూడా అసహజ మరణానికి గురయ్యారు. ఆయన సామాజిక జీవితాన్ని రైతాంగపేదల సమితితో ప్రారంభించారు. ప్రపంచీకరణ తెస్తున్న విధ్వంసాన్ని అడ్డుకోవడానికి అఖిల భారత ప్రజా ప్రతిఘటన వేదికలో పనిచేశారు. ఆ తరువాత రాష్ట్రంలో ఏర్పడిన దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సంస్థలో పనిచేశారు. ఆయన స్థానిక యువకులను, ఆలోచనాపరులను సమీకరించి సమాజ వికాస సంఘం ఏర్పాటు చేసి దాని ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. పెదపెంకిలో ఉన్న 23 బెల్టుషాపులను ఎత్తివేసి సంపూర్ణ మద్యపాన నిషేధం విధించాలని గత ఎనిమిది సంవత్సరాలుగా కృషి చేస్తున్నారు. పెదపెంకిలో ప్రజలను పట్టిపీడిస్తున్న ఫైలేరియా నిర్మూలనకు గుంటూరు, విజయనగరం నుండి రిటైర్ అయిన వైద్యులను పిలిపించి వైద్య సహాయం అందేలా కృషిచేశారు. 1954లో జన్మించిన ఆయన చనిపోయేంత వరకు సమాజంలోని అసమానతలకు కారణం ప్రభుత్వ వైఫల్యాలే అనే విషయాన్ని ప్రజలకు తెలియజేస్తూ వచ్చారు. నిరంతరం సమాజ మార్పుకోసం కృషిచేశారు. అర్ధాంతరంగా అసహజ మరణం పాలైనందుకు చింతిస్తూ దత్తి సుదాకర్‌కు 'వీక్షణం' వినమ్రంగా నివాళులు అర్పిస్తోంది. ఆయన కృషిలో భాగస్తులై సహకరించిన కుటుంబ సభ్యులకు సహానుభూతిని తెలియజేస్తోంది. వీ

సహాయం చేసే మొదటి దశలో 3 లేదా 4 కార్పొరేషన్లుగా విభజించాలని కోరడం జరిగింది. ప్రస్తుతం జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం పథకం రెండవ దశ కింద ఆర్థిక సహాయం (రు. 845 కోట్లు) ఇవ్వాలంటే తప్పని సరిగా చిన్న చిన్న కార్పొరేషన్లుగా చేయవలసిందేనని నిబంధనలు తప్పనిసరి చేసింది. కాబట్టి ఏవిధంగా చూసిన, ఆర్‌టిసిని నాలుగు బాగాలుగా విభజించడం తప్పనిసరి అలాగే ఆర్‌టిసి అభివృద్ధికి మేలు జరుగుతుంది. అనవసర నిర్వహణ భారం, అన్ని ప్రాంతాలలో రూట్ల సక్రమ నిర్వహణ, స్వయం ప్రతిపత్తి వలన కలుగుతుంది. స్థానికంగా ఉన్న అనేక రకాలైన వనరులను, అవకాశాలను అంది పుచ్చుకోవాడానికి వీలవుతుంది. ఏ జోన్‌లో వచ్చే లాభాలు ఆ జోన్ అభివృద్ధికి వాడుకోవడానికి ఉపయోగ పడతాయి.

కాబట్టి ఆర్‌టిసిని హైదారాబాద్ జోనల్ అర్బన్ ట్రాన్స్ పోర్టు కార్పొరేషన్ (ఎచ్‌జెడ్‌యుటిసి), కరీంనగర్ జోనల్ అర్బన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (కెజెడ్‌యుటిసి), విజయవాడ అండ్ విజయనగరం జోనల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (వి అండ్ విజెడ్‌యుటిసి), కడప అండ్ నెల్లూరు జోనల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కె అండ్ ఎన్‌జెడ్‌యుటిసి) లుగా విభజించాలి. వీటిని స్వతంత్ర సంస్థలుగా ప్రభుత్వ ఆధీనంలో ఏర్పాటు చేయడం చాలా అవసరం. కార్మిక సంఘాలు అనవసర భయాలు వదిలి, సంస్థ అభివృద్ధికోసం ప్రభుత్వం ఏవిధమైన నిర్ణయాలు తీసుకున్నా సహకరిస్తే మంచిది.

ప్రస్తుతం నెలకొని ఉన్న అన్ని సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, పటిష్టమైన, అవసరాలకు తగిన రవాణా విధానాన్ని, లక్ష్యాన్ని బలోపేతం చేసి సంస్థలో సౌకర్యాలలో పెను మార్పులు చేసేందుకు కృషి చేసి, సమస్యలను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి.

నష్టాలు రాకుండా చూసుకొంటూ లాభాల సాధనవైపు కృషి చేస్తూ, ప్రభుత్వం ప్రకటించే రాయితీలను తగ్గించడానికి ప్రయత్నం చేస్తూ లేదా ఆ రాయితీల మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే భరించేలాగా ప్రయత్నాలు చేసి జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. ప్రైవేట్ ఆపరేటర్లను క్రమబద్ధం చేయడం గానీ లేదా పూర్తిగా అన్ని రూట్లను జాతీయకరణ చేయడం ఎంతైనా ఉపయోగపడుతుంది. అలాగే అధిక సిబ్బందిని క్రమేపీ తగ్గిస్తూ అవసరమైన చర్యలను తీసుకొని, వ్యవస్థాపరమైన లోపాలను సరిదిద్దుకొని, సానుకూల అంశాలను పటిష్టంగా ఉపయోగించుకొని ఎపిఎస్‌ఆర్‌టిసి అభివృద్ధి చెందవలసి ఉంది.

ఎక్కువ ఆర్డినరీ సర్వీసులను సమయానుగుణంగా నడపడం, ఛార్జీల వసూళ్లను సులభతరం చేయడం. ముఖ్యంగా ప్రయాణీకులు చేయెత్తిన చోటల్లా ఎక్కించుకోవడం, సంస్థలో సంయుక్త యాజమాన్య కార్మిక మండలి ఏర్పరచుకోవడం ద్వారా కొన్ని ప్రధాన సమస్యలు పరిష్కరించుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రజలకు అత్యధిక సేవలు అందచేయ గలిగినప్పుడే 'బస్సు చక్రం-ప్రజా ప్రగతికి చిహ్నం' అనే నినాదం వాస్తవమవుతుంది.

తాను నడుపుతున్న సర్వీసులు ప్రయాణీకులు ఆశిస్తున్న స్థాయిలో వారి అవసరాలను తీర్చడానికి సరిపోయే స్థాయిలో ఉన్నాయా అన్న సమీక్ష జరుపుకుని చట్టపరమైన సర్వీసుల నుండి పెరుగుతున్న పోటీలో, మారుతున్న పోటీ వాతావరణంలో సమర్థవంతంగా నిలువగలిగేలా ఆర్‌టిసి మరింత ఆధునాత మార్పులను సంతరించుకోవాలి.

(రచయిత, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు,
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి)

వీ

రాజకీయార్థిక, సామాజిక అంశాలపై వ్యాస రచనను ప్రోత్సహించడానికి వీక్షణం సాగిస్తున్న కృషి మీకు తెలుసు. గత పన్నెండు సంవత్సరాలలో దాదాపు మూడు వేల వ్యాసాలు ప్రచురించడం మాత్రమే కాక, వ్యాస రచనలో శిక్షణ ఇచ్చేందుకు వర్క్‌షాప్‌లు కూడ వీక్షణం నడిపింది. ఆ ప్రయత్నంలో భాగంగానే కొత్త వ్యాస రచయితలను ప్రోత్సహించడానికి వారి తొలి వ్యాసాలు 'కొత్త కలాలు' శీర్షికన అచ్చు వేయాలని వీక్షణం నిర్ణయించుకుంది. చేయి తిరిగిన వ్యాస రచయితల ప్రమాణాలతో లేనప్పటికీ అవసరమైన విషయాల మీద ఉంటే కొత్త రచయితలకు ఆత్మ విశ్వాసం కలిగించడానికి, కొద్దిపాటి మార్పులతో ఈ శీర్షిక కింద అచ్చు వేయడం జరుగుతుంది. తెలంగాణ నుంచి మహారాష్ట్రకు వలస వెళ్లిన శ్రామిక కుటుంబపు రెండోతరం యువతి, భివాండిలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఈ వ్యాస రచయిత్రితో ఈ శీర్షిక ప్రారంభిస్తున్నాం. – సం.

సావిత్రి బాయి ఫూలే

జ్ఞానం, విజ్ఞానం నేర్పని నేటి చదువుల వల్ల విద్యార్థులు చరిత్రను, మానవ విలువలను తెలుసుకోలేరనీ, జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలేలు నింపాలనుకున్న వెలుగు ఆరిపోతుందనీ అంటున్నారు మసున అనూష విఘ్నేష్

కొవ్వొత్తి తాను కరుగుతూ యావత్తు ప్రపంచానికి వెలుగు పంచుతుంది! తన ప్రకాశవంతమైన ఆ వెలుగుకి చీకటి మాయమై పోతుంది! ఆనాడు వంటింటి నాలుగుగోడలు తప్ప బయటి ప్రపంచం తెలియని అమాయక ఆడవాళ్లందరికీ విద్య పొందే అర్హత ఉందని పోట్లాడి, సమాజంలో మొట్టమొదటి సారిగా ఆడవాళ్లకోసం విద్య అనే కొవ్వొత్తిని వెలిగించిన ప్రకాశవంతమైన దీపం సావిత్రి బాయి ఫూలే.

చదువు అంటే యావత్తు ప్రపంచ మార్పుకి, అభివృద్ధికి పునాది! ఈ చదువుకి పెద్ద చరిత్రనే ఉంది. రుషులకి, మునులకి అంటే బ్రాహ్మణులకి మాత్రమే పరిమితమైన ఈ చదువుని మనదాక తీసుకురావడానికి, ఇద్దరు మహానుభావులు, ఎంతగానో కృషి చేశారు. చాలా అవమానాలను భరించారు.

ఈ చదువు బ్రాహ్మణులకి మాత్రమే సొంతం కాదని అది ప్రతి సామాన్య వ్యక్తి అధికారమని ప్రతి సామాన్యునికి విద్య పొందే కనీస అధికారం ఉందని చెప్పిన మొట్టమొదటి భారతీయ వ్యక్తి జ్యోతిరావు ఫూలే. ఆయన చదువు రాని తన భార్యకు (సావిత్రిబాయి) చదువు విలువని, మూలాన్ని విప్పి చెప్పి రాత్రింబవళ్లు మేలుకుని చదువు నేర్పించారు. ఆ చదువుని తన భార్య ద్వారా సమాజానికి అందించాలని ఎంతగానో తపన పడ్డారు. చివరికి తన భార్య సావిత్రిబాయి చేత ప్రతి సామాన్యునికి విద్యనందించాలని నిర్ణయించుకున్నారు. 'మట్టిలో నుండి మాణిక్యం పుట్టినట్టు' పేదవాడి కుటుంబంలో బంగారంలా పుట్టిన జ్యోతిరావు ఫూలే పేద కుటుంబం నుండి వచ్చిన తన భార్య సావిత్రిబాయి ఫూలే ద్వారా సమాజంలో వెలుగుని నింపాలని ఆలోచించారు.

ఎన్నో ఎదురుదెబ్బలు ఎదుర్కొని, అవమానాల్ని భరించి, ఈనాడు ఎంతో మంది విద్యార్థులు శిక్షణకి అర్హులయ్యారంటే దానికి ముఖ్య కారణం వీరిద్దరే. ముఖ్యంగా ఆడవాళ్ల గురించి ఎంతగానో తపించి, ఇంటింటికి వెళ్లి నచ్చజెప్పి స్త్రీలను పోగుచేసి ఏ ఆటంకాలను లెక్కచేయకుండా, ఏ రాళ్ల దెబ్బలకు మనసు చిన్నబుచ్చుకోకుండా, ఎన్ని పేడ దెబ్బలకు సిగ్గు పడకుండా ధైర్యంగా, నమ్మకంగా ముందడుగు వేసి విద్య అనే విత్తనాన్ని సమాజ మార్పుకై, అభివృద్ధికై, సమానత్వానికై తొలిసారిగా నాటింది. విద్యకి ప్రాణం పోసింది. ఎన్నో పాఠశాలలను మొదలుపెట్టి మొట్టమొదటి భారతీయ మహిళా టీచర్‌గా పేరొందింది.

ప్రతిక్షణం ఎన్నో శాపనార్థాలని దిగమింగుకుంటూ కరిగిపోతున్న కొవ్వొత్తిలా అంధవిశ్వాసం, మూఢ నమ్మకం, అసమానత అనే చీకటి కమ్ముకున్న సమాజంలో ఉజ్వలమైన వెలుగుని నింపింది. ఎంతో మంది ఆనాథ పిల్లలని, ఏ దిక్కు లేని అమాయక ఆడ పిల్లలని, వితంతువులని అమ్మలా చేరదీసి వారికి నీడనిచ్చి, కాపాడి ఆశ్రయం ఇచ్చింది. ఎడారి లాంటి వారి జీవితంలో ఆశల కిరణాలను నింపింది. ఉచిత విద్య, ఉచిత ఆహారం, ఆధారం కల్పించింది. ఆ కాలంలో అంత నేర్పుగా, ఓర్పుగా అందరికి తోడుంటూ చేయుత నిస్తూ, దిక్కు మొక్కులేని వారిని ఆదుకుంటూ సమాజ అభివృద్ధికై పాటుపడిన తొలి భారతీయ నారీమణి సావిత్రిబాయి ఫూలే.

మరి ఇవన్నీ తెలిసిన ఈ కాలంలో కూడా చదువుల తల్లి సరస్వతి దేవి అనడం ఎంత మూర్ఖత్వం! సరస్వతిని చదువుల తల్లిని చేశారు. ఆమె అసలీ చదువుని అమాయక బిడ్డలకి అందించడానికి ఎన్ని పురిటినొప్పులు పడింది? విద్యని పొందే హక్కు ప్రతి సామాన్య పౌరుడికి ఉందని ఎంతమందితో పోట్లాడింది? మరి ఇవేవి కానప్పుడు చదువుల తల్లి సరస్వతిదేవి ఎలా అయింది?

కష్టం ఒకడు చేస్తే, ఫలితం ఇంకొకరికి దక్కిందంటూ తన సొంత జీవితాన్ని త్యాగం చేసి తన సంతోషాలకి, ఆశలకు అడ్డుకట్టలేసి ఎదుటి వారి సంతోషానికై, ప్రపంచ మార్పుకై పాటుపడి కష్టపడింది సావిత్రిబాయి అయితే ఆవిడను పక్కకు నెట్టి అసలు రూపమే లేని సరస్వతి దేవిని చదువుల తల్లి అంటారేమిటి? పోనీ సృష్టి మొదలుకొని నేటి వరకు ఏనాడైనా, ఎప్పుడైనా సరస్వతి దేవి వచ్చి ఏ ఒక్కరికైనా చదువు చెప్పినట్టుగాని, నేర్పినట్టుగాని ఆనవాలు ఉన్నట్టు ఎవరికైన కనబడిందా?

ఈనాడు ఏ స్కూల్‌లో చూసిన, కాలేజిలో చూసిన ప్రతి ఫంక్షన్‌కి, సెలెబ్రెషన్‌కి సరస్వతి దేవి ఫొటో ముందు పెట్టి పూల దండలు వేసి, కొబ్బరి కాయలు కొట్టి ఆ ఫొటోకి పూజ చేస్తారే తప్ప, సావిత్రిబాయి ఫూలే ఫొటో ఎక్కడా పెట్టరు. ఒకవేళ పెట్టినా అది ఎక్కడో మూలకుంటుంది తప్ప ముందుండదు.

అసలు ఈ కాలం చదువులే ఓ పెద్ద వింతైపోయాయి. సెప్టెంబర్ 5న ప్రతి స్కూల్‌లో, కాలేజిలో టీచర్స్ డే జరుపుకుంటారు. ఆ రోజు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు కాబట్టి. ఆయన పుట్టిన రోజు

నాడు టీచర్స్‌డే పండుగ జరుపుకోవడానికి ఆయన అందరూ నమ్మే సరస్వతిదేవి కాదు. పోనీ నిరంతరం కృషి చేసి రాత్రింబవళ్లు కష్టబడి ఒక న్యాయమైన లక్ష్యంతో విద్యని అందించడానికి కృషి చేసిన సావిత్రి బాయి పూలే కూడా కాదు. ఒక సామాన్య డాక్టరేట్ పొందిన టీచర్‌కి అంత పెద్ద విలువనిచ్చి ఆయన పుట్టిన రోజున టీచర్స్ డే పండుగ జరుపుకుంటే తన ప్రాణాల్నే పణంగా పెట్టి పోరాడిన సావిత్రి బాయి పూలేని ఎలా గౌరవించాలి? ఆమెను స్మరించుకుంటూ ఎన్ని పుట్టిన రోజులు, పండుగలు జరుపుకోవాలి.

కొత్త సంవత్సరానికి పది రోజుల ముందు నుండే పిల్లలకి సెలిబ్రేషన్ గురించి చెపుతారు. ఓ పెద్ద ఫంక్షన్ ఏర్పాటు చేస్తారు. పోని ఆ ఫంక్షన్‌లో పిల్లలకి ఏమైన విజ్ఞానాన్ని, వికాసాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేస్తారా అంటే అది కాదు. సినిమా పాటల ప్రోగ్రాంలు పెట్టి, డిస్కో డాన్స్‌లు పెడతారు. ఇందులో ఏ ఒక్కటైన స్కూల్‌లో అంటే ఎక్కడైతే పిల్లలకు ఒక ఉన్నత విద్యను అందించి, మంచి చెడు సంస్కారం నేర్పి, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది దేశ ప్రగతిపథంగా మార్చే పాఠశాలలో చేపట్టవలసిన కార్యక్రమాల ఇవి? విద్యని అందించే పాఠశాలలని తరతరాల నుండి మందిరంతో పోలుస్తారు మన దేశ ప్రజలు. మరి ఆ మందిరంలో పిల్లలకి నేర్పించవలసినవి ఇవేనా? అలాగని స్కూల్‌లో, కాలేజిలో విద్యార్థులకి క్రీడల కోసం కొంత సమయం కేటాయించకూడదని నేననను కానీ విద్యార్థుల మానసిక వికాసాన్ని పెంపొందించే ఆ ఆటలకి, ఇలా వీళ్లు స్కూల్‌లో జరిపించే ప్రోగ్రామ్స్‌కి ఏమైన పొంతన ఉందా?

కొత్తగా ఈ మధ్య కాలేజి డేస్‌లు మొదలయ్యాయి. ఒక రోజు టై డే, ఒక రోజు సారీ డే, మరొక రోజు బ్లాక్ అండ్ వైట్ డే, చాక్‌లేట్ డే, రోజ్ డే అంటూ ఇలా రకరకాల డేస్ జరుపుకుంటున్నారు. అసలు ఈ డేస్ ఎలా వచ్చాయి? ఎందుకొచ్చాయి? దానికి కారణం ఏమిటి? ఎవరికి తెలియదు. కానీ అందరికి తెలిసిందల్లా ఒక్కటే ఆ డేస్ ఉన్న ఐదారు రోజులు కొత్త బట్టలు వేసుకొని, మోడ్రన్‌గా తయారై కాలేజికి వెళ్లి ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేయడం ఆ ఐదారు రోజులు ఏం జరిగినా యజమాన్యం కూడా అసలు పట్టించుకోదు. అందుకే డేస్ అనగానే సంవత్సరమంతా కాలేజ్ వంక చూడని వాడు కూడా ఆ ఐదారు రోజులు వరుస తప్పకుండా వస్తాడు. అది కూడా సమయానికి ముందే వచ్చి మొత్తం కార్యక్రమం అయిపోయాకగాని వెళ్లరు.

ఆనాడు ఆ ఇద్దరు మహానుభావులు వారి కృషికి మించి కష్టపడి చెమటోడ్చి పోరాడింది ఇలాంటి విద్యల కోసమేనా? ఈనాటి ఇలాంటి దుర్భర పరిస్థితి కోసమేనా? ఇలా కొన్ని రోజులు డేస్‌లో, మరో కొన్ని రోజులు పండుగ సెలవుల్లో గడిచిపోతే మరి మిగిలిన సగం అసైన్‌మెంట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లతో తీరిక లేకుండా గడిచిపోతే తీరా చివరికి పరీక్షలకి పది రోజుల ముందు బండెడు భారంతో చస్తూ, బతుకుతూ కనీసం పాస్ అవ్వాలనుకుంటూ పాట్లుపడుతూ ప్రతి క్లాస్ పాసవుతూ వచ్చే ఆ చదువులు ఎందుకు? జ్ఞానం పంచలేని చదువులు, విజ్ఞానం పెంపొందించలేని నేటి చదువులు ఎందుకు? ఇలాంటి ఈ బండెడు భారం చదువుతో పిల్లలు నేర్చుకునేదెప్పుడు, వికాసం పెరిగెదెప్పుడు? ఆ చదువులు మన దేశ చరిత్రను, మనిషి విలువలను సమాజం తప్పొప్పులను నేర్పేది ఎప్పుడు?

సమాజాన్ని ఇల్లుగా మార్చుకుని ఆ ఇంట్లో ప్రతివ్యక్తి చదువుకోవాలని, విజ్ఞానవంతులు కావాలని, కులమతాలు లేని, ఆప్యాయత, అనుబంధాలతో కూడిన విశాలమైన ప్రపంచం కోసం అనునిత్యం కృషి చేసి, న్యాయమైన లక్ష్యం కోసం యవ్వనం, సర్వస్వం త్యాగం చేసిన ఆ ఇద్దరి వ్యక్తుల (సావిత్రి బాయి, జ్యోతిరావు పూలే) ప్రాణ త్యాగానికి నేటి ఈ చదువులు ఏ మాత్రం న్యాయం చేస్తున్నాయి?

ఉచిత విద్యని అందించి, స్థోమత లేని విద్యార్థుల కోసం ఆ కాలంలోనే ఒక ఉచిత హాస్టల్ పెట్టి వారిని ఆదుకొని, వితంతువులని చేరదీసి ఆశ్రయం ఇచ్చి, అక్కడ పురుడు పోసుకున్న ఎంతో మంది అనాథ బిడ్డలకి సొంత తల్లిదండ్రులుగా ప్రేమను పంచి, మనుషులంతా ఒక్కటేనని, కులం, మతం వట్టి అడ్డుగోడలని చెప్పి సమానమైన సమాజం కోసం కృషి చేశారు. చివరి క్షణాల్లో నడవలేని పరిస్థితిలో మంచం పట్టినా ధైర్యాన్ని విడవక ఆత్మవిశ్వాసంతో ఎన్నో రచనలను సమాజ మార్పుకై రచించాడు. ఆ రచనలు ప్రతి సామాన్యుడికి అందాలని తహతహలాడాడు. తరువాత ఆయన చనిపోయినా, సావిత్రిబాయి పూలే ఆయన లక్ష్యాన్ని మధ్యలో అంతమవనీయకుండా నిరంతరం పోరాడింది. ఎన్నో సభల్లో మంచి మంచి ఉపన్యాసాలతో ప్రజల్లో చైతన్యాన్ని ప్రేరేపించింది. చివరికి ప్లేగు వ్యాధితో బాధపడుతున్న ప్రజల్ని ఎవరు పట్టించుకోకపోతుంటే ఎంతగానో కుంగిపోయింది. సహాయం కోసం అర్థిస్తున్న ఆ పీడిత ప్రజల్ని చూసి మనసు ఆపుకోలేక ముందుకు వెళ్లి ఎంతో మంది రోగులకు చేయూతనిచ్చి ఆదుకోని ప్రాణాల్ని నిలబెట్టింది. తన ప్రాణాన్ని లెక్కచేయకుండా సమాజాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి సావిత్రి బాయి పూలే. ఎంత వర్ణించినా ఏ భాషలో సంభాషించినా వీరి గొప్పతనానికి మనం విలువ కట్టలేం. అంతటి కృషి చేసి, స్వార్థం లేకుండా సమాజ మార్పే ధ్యేయంగా పోరాడి ప్రాణాలు ఆర్పించారే మరి ఆ ప్రాణ త్యాగాలకి నేడు మనమిచ్చే బహుమతి ఏమిటి?

న్యూ ఇయర్‌లు, డేస్‌లు కాకుండా సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలేలను స్మరించుకుంటూ, వారి జయంతి, వర్ధంతిలకు విద్యార్థులలో అవగాహన ఏర్పడేలా వారి విలువల గురించి, త్యాగాల గురించి చర్చిస్తూ వీటికి ప్రాధాన్యతనిస్తే భవిష్యత్తు బాగుంటుంది. ఈ బాధ్యతను ప్రతి స్కూల్లో, కాలేజిల్లో యాజమాన్యాలు తీసుకోవాలి. దేశం పట్ల మన బాధ్యత తెలిసొచ్చేలా విద్యార్థులలో అవగాహన నింపాలి. అలా చేయని నాడు ఇవన్నీ వట్టి స్వార్థపు చదువులే అవుతాయి తప్ప దేశ అభివృద్ధికి ఏమాత్రం తోడ్పడవు.

(రచయిత మహారాష్ట్రలో ఉపాధ్యాయులు) వీ

ఇటీవల పోస్టల్ శాఖ అన్ని మనీ ఆర్డర్‌లను ఎలక్ట్రానిక్ మనీ ఆర్డర్‌లుగా పంపుతున్నది. మీరు ఎం.ఒ. చేసినప్పుడు కింద కూపన్‌లో రాసిన ఉత్తరం, సమాచారం ఈ ఎలక్ట్రానిక్ ఎం.ఒ.లో మాకు చేరదు. కనుక ఎం.ఒ.లు చేసేవారందరూ విడిగా ఒక పోస్ట్‌కార్డు రాయడం గానీ, ఫోన్ చేసి చెప్పడం గానీ చేయాలి. అలాగే, బ్యాంక్ అకౌంట్‌లోకి నగదు బదిలీ చేసినప్పుడు అది ఎందుకో వివరాలు వీక్షణం కార్యాలయానికి ఫోను ద్వారా గాని, కార్డు ద్వారా గాని తెలపాలి. – సం.

తాగు నీటి హక్కు మానవ హక్కే

***మానవ హక్కైన నీటిని నేడు పెట్టుబడిదారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వ్యాపార సరుకుగా మార్చుకున్నారని అంటున్నారు* వి. విజయకుమార్**

మానవ హక్కుల సార్వజనీన ప్రకటన 2011 నుండి 25వ తాగునీటి హక్కు ప్రకటించారు. నేడు అంతర్జాతీయ పత్రాల్లో చాలా కాలంగా ఇది చోటు చేసుకుంటూనే ఉంది. నీటి హక్కు ప్రత్యేకంగా జీవించే హక్కులో ముఖ్యమైన భాగంగా, సాధారణ మానవ హక్కులలో భాగంగా ఈ పత్రాల్లో ఉంటూనే వచ్చింది. అంతర్జాతీయ ఒప్పందాల్లో నీటిని గర్భితంగా ఒక మౌలిక వనరుగానే భావించారు. అదీకాక, పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉండనట్లయితే అనేక హక్కులు, ముఖ్యంగా ఆహారం, ఆరోగ్యం, అభివృద్ధి లాంటి వాటికి హామీ ఇచ్చే ఎన్నో స్పష్టమైన హక్కుల్ని సాధించుకోవడం జరగదు.

నీటి హక్కును స్పష్టమైన తీరులో పొందుపరచడం అవసరం అని భావించడం అది మానవ మనుగడకు అంత ముఖ్యమైంది కనుక, పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ ఒప్పందంలో 6(1) అధికరణంలో జీవించేహక్కును స్పష్టంగా పొందుపరిచారు. అదేం చెపుతుందంటే 'మీ హక్కుని చట్టం ద్వారా పరిరక్షించడం జరుగుతుంది. ఎవరిని నిరంకుశంగా జీవనహరణం చేయడం జరగదు'. నీరు జీవితానికి అత్యావ్యశకమైంది. అందుచేత ఆచరణలో జీవితానికి నీటి అందుబాటు తగ్గేటట్టు, పొందలేనట్టు తయరయ్యే ప్రభుత్వ విధానాలన్నీ ప్రజల జీవితాన్ని హరించే స్వయంచాలకమైన (ఆటోమేటివ్) సుంకాల సవరణలు, ఫలితంగా పేద ప్రజలకు నీరు తక్కువ అందుబాటులో ఉండడం జరిగాయి. దీనిమీద వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు. 'ఇలాంటి విధానాలని అనుసరించడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం 'ఉద్దేశ పూర్వకంగా జీవిత హక్కును తొలగించడం' ఘనాలో నీటి ప్రైవేటీకరణ గురించి అంతర్జాతీయ నిజ నిర్ధారణ కమిటీ ఈ వ్యాఖ్య చేసింది. కోట్లాది ప్రజానీకానికి 'తగినంత పరిమాణంలో ఆహారం, నీరు, బట్ట, గృహవసతి, మందులు లాంటి మౌలికమైనవి అందుబాటులో లేకుండా చేసే' అభివృద్ధి రహిత మొండి పరిస్థితులు ఉంటే అవి మానవ హక్కుల్ని, భారిస్థాయిలో నిస్సిగ్గుగా, దారుణంగా ఉల్లంఘించడాన్నే సూచిస్తాయి. (ఐక్యరాజ్య సమితి, గ్లీక్ ఉల్లేఖన, 1999).

యునెస్కో ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కు కమిటీ 29వ సమావేశం నవంబర్ 2002లో జరిగింది. మొట్టమొదటి సారిగా ఆ సమావేశంలో నీటి హక్కును మౌలిక హక్కుగా జీవించే హక్కు కింద, స్పష్టంగా ప్రకటించింది. పౌరులు ఈ హక్కు సాధించేందుకు గాను, హామీ ఉండేటట్టు దేశాల మీద అనేక బాధ్యతలు విధించింది. రక్షిత తాగునీరు జీవితానికి, ఆరోగ్యానికి మౌలిక హక్కు అని స్పష్టంగా ప్రకటించింది. అది 'అన్ని మానవ హక్కుల్ని సాధించుకునేందుకు పూర్వావసరం' అని చాటింది. ప్రతి పౌరునికి శుభ్రమైన, తగినంత భరించగలిగే స్థాయిలో అందుబాటులో ఉండే తాగునీరు వ్యక్తిగత అవసరాలకు సరిపడేటట్టు పొందే హక్కు ఉంది. అవసరాలు అంటే గృహ పారిశుద్ధ్యం, వంట ఆరోగ్యం, అంతేకాదు, తాగునీరు హక్కును సాధించుకునే తీరు నిలకడగా ఉండాలి కూడా. ఈ హక్కు ప్రస్తుత తరం, భావితరాలు సాధించుకునేటట్టు ఉండాలి అని ఐరాస(ఐక్యరాజ్య సమితి) 2002లో తీర్మానం చేసింది.

స్థానిక ప్రభుత్వాల నీటి నియమావళిలో ఐదు ప్రధాన సూత్రాలు ఉన్నాయి. వీటిలో ఒకటి ఇలా చెపుతుంది. 'పరిశుభ్రమైన స్తోమతకు తగిన్న తాగునీరు అందుబాటులో ఉండడం ఒక ప్రాథమిక హక్కు. అందుచేత, అందరికి నీరు, పారిశుద్ధ్యం సేవల్ని కల్పించే బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. మిగిలిన నాలుగు సూత్రాలు ఇవి. నీటి ఉమ్మడి సరుకుగా అజమాయిషి చేయాలి. జీవిత, పర్యావరణ పునాదిగా నీటిని పరిరక్షించాలి. నీటిని పరిమిత ఆర్థిక వనరుగా నిర్వహించాలి. నీటిని భాగస్వామ్య సాంస్కృతిక సంపదగా కాపాడు కోవాలి. సమాజంలో బడుగు వర్గాల వాళ్లకి ముఖ్యంగా పిల్లలకి సంక్షేమాన్ని, ఆరోగ్యాన్ని అందించే కీలక ప్రాముఖ్యం ఉన్న అంశంగా రక్షిత నీరు అందుబాటులో ఉండాలి. ఈ బడుగు వర్గాల వాళ్లూ, పిల్లలూ కలుషిత నీటివల్ల జబ్బుల బారిన పడతారు. నీటి కారక వ్యాధులు, పుట్టుకొచ్చే బాహ్యాంశాల్ని బట్టి ప్రతివాళ్లకీ రక్షితనీరు అందుబాటులో ఉండాలని పేర్కొనవచ్చు.

భారతదేశంలో నీటి హక్కు

అంతర్జాతీయ ప్రకటనలు, పౌర సంఘాలు, న్యాయస్థానం తలుపులు తట్టడం, సుప్రీంకోర్టు, అనేక కోర్టులు జోక్యం చేసుకోవడం లాంటివి ఒక సానుకూల ప్రభావాన్ని కలిగించాయి. భారతదేశంలో తాగునీటి అందుబాటును పరిశీలించేందుకు తగ్గిన సానుకూల వాతావరణాన్ని కలిగించాయి. భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులలో 21వ అధికరణ ఉంది. దీని శీర్షిక 'జీవిత పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛాని లుప్తం చేయరాదు'. అని అది చెప్తోంది. ఈ అధికరణాన్నే సామాన్యంగా 'జీవించే హక్కు' అధికరణం అంటున్నారు. పౌరుల హక్కులు, సంక్షేమం, ప్రభుత్వ పాత్ర అనే నూతన సమస్యలు ఇటీవలి కాలంలో న్యాయస్థానం ముందుకు వచ్చాయి. జీవిత హక్కు పరిధిని గణనీయంగా పెంచారు. మరోలా చెప్పుకోవాలంటే సుప్రీంకోర్టు 21వి అధికరణం (వ్యక్తి జీవితం, స్వేచ్ఛా) లోని మాటలకు 'కొత్త ఊపిరి పోసింది'. 'మానవ మర్యాదతో కూడిన జీవితం, సకల శక్తులూ పటుత్వంతో ఉన్న జీవితం' క్రమంగా ఈ భావన విస్తరించుకుంటూ వచ్చింది.

ఈ హక్కు దృష్ట్యా పరిసరాలు, పర్యావరణం, గాలి–నీటి కాలుష్యం వగైరాలు 21వ అధికరణాన్ని ఉల్లంఘించడం కిందికి వచ్చి చేరాయి. అదీకాక 'పౌరులు సురక్షితమైన తాగునీరు పొందే హక్కు 21వ అధికరణం ప్రకారం కలిగి ఉన్నారు. ఇటీవల విస్తరిస్తున్న 'ధర్మశాస్త్రంలో', సమిష్టి హక్కుల్ని పొదుపుకునే పర్యావరణ హక్కులు' 'తృతీయతరం హక్కులు'గా వర్ణితమవుతున్నాయి. పౌర రాజకీయ హక్కులు 'మొదటి తరం హక్కులు' అనీ, 'ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులు'. 'రెండవ తరం హక్కులు' అనీ పరిగణిస్తున్నారు.

'పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండే హక్కు జీవితానికి

మౌలిక హక్కు 21వ అధికరణం ప్రకారం పౌరులకు పరిశుభ్రమైన తాగునీరు అందించే బాధ్యత ప్రభుత్వానిది' అంటూ సుప్రీంకోర్టు ఇటీవల పునరుద్ఘాటించింది. ప్రభుత్వం తగినంత తాగునీరు అందించాల్సి ఉంది. అంతే కాదు నీటి వనరులను కాలుష్యం చేసే ఏ చట్టాన్నైనాగానీ 'నిరంకుశమైందిగా ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైందిగా 21వ అధికరణం కింద శుభ్రమైన నీటి హక్కును ఉల్లంఘించేదిగా పరిగణించాలి.

ఈ తీర్పు వెలువడడానికి ముందే సుప్రీంకోర్టు, కొన్ని హైకోర్టులు 21వ అధికరణం కింద శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంటే పౌరహక్కును సమర్థించాయి. సుభాష్‌కుమార్ - బీహార్ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఇలా చెప్పింది. జీవించే హక్కులో కాలుష్య రహిత నీరు, గాలి పొందే హక్కు సంపూర్ణ జీవితానికి అవసరం అన్న అంశం కలిసే ఉంటుంది. చట్టాలు అతిక్రమించి, జీవన ప్రమాణాన్ని ఏది ప్రమాదకరంగా చేసినా లేదా ఆటంకపరచినా రాజ్యాంగంలోని 32వ అధికరణాన్ని ఆశ్రయించే హక్కు ప్రతి పౌరునికీ ఉంటుంది. జీవిత ప్రమాణాలకి భంగకరంగా ఉండే నీటి కాలుష్యాన్ని, గాలి కాలుష్యాన్ని తొలగించుకునేందుకు ఈ అధికరణాన్ని ఎత్తి చూపించవచ్చు. ఎం.సి. మెహతా, కమలనాథ్ (1997) కేసులో సుప్రీంకోర్టు మినహాయింపులేని తీర్పిచ్చింది. ప్రభుత్వం నీటి సరఫరాని క్రమబద్ధం చేయవలసి ఉండడమే కాదు. ఆరోగ్య ప్రమాదాల్ని నిరోధించి, ఆరోగ్య పూరిత నీటిని పొందే హక్కు సాధించుకునేందుకు ఆసరా ఉండాలి అని దాని తీర్పు రోమన్ ధర్మశాస్త్రంలో 'సాలస్ పాపులి ఎస్ట్ సుప్రీమా వెక్స్' (ప్రజా సంక్షేమమే అత్యున్నత న్యాయం) అన్న సూత్రం భారత రాజ్యాంగంలో విశ్వసించి మన్నించవలసిన భూమిక. ప్రభుత్వానికి ప్రజలు తమ హక్కుల్ని, అవసరాల్ని సాధించుకునేటట్టు చేయవలసిన క్రియాశీల పాత్ర ఉంది. కర్ణాటక ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్న కేసులో, నీటి హక్కు జీవన హక్కు అని కోర్టు ప్రకటించింది. ఆ రకంగా అది ప్రాథమిక హక్కు అని చాటింది. నర్మదా బచావో ఆందోళన్, భారత ప్రభుత్వం (2000) కేసులో బతికి బట్టకట్టడానికి నీరు మౌలిక అవసరం. ఇది 'మానవ హక్కుల్లో, జీవిత హక్కుల్లో భాగం' అని కోర్టు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పైన చెప్పుకున్న తీర్పులని ఎన్నింటినో ఉదహరిస్తూ పౌరులకు తాగునీరు అందించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే అని పునరుద్ఘాటించింది.

తాగునీరు ప్రాముఖ్యత

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 1950 తొలినాళ్లలో భారతదేశంలో ఆరోగ్యం దుర్భరంగా ఉంది. ఇందుకు అనేక కారణాలు ఉండవచ్చు కానీ ముఖ్యమైన రక్షిత నీటి సరఫరా, పారిశుద్ధ్యం లేకపోవడం వాటిలో ఒకటి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి భిన్న పంచవర్ష ప్రణాళికలు చూస్తే ఒక విషయం విశదమవుతుంది. అదేమిటంటే ప్రజల సంక్షేమాన్ని పెంచే లక్ష్యంలో ఈ రంగానికి దక్కవలసినంత ప్రాధాన్యం దక్కలేదు.

మొదటి పంచవర్ష ప్రణాళిక (1951-56)లో తగినంత రక్షిత నీరు అంశం మౌలిక అవసరంగా గుర్తింపు పొందింది. యావత్ దృష్టి దాని మీదనే లగ్నం చేయవలసి వచ్చేటంతటి అంశం అని భావించారు. 'రక్షిత నీటి సరఫరాకు ఇంగ్లండ్, అమెరికా దేశాలలో అవకాశం కల్పించిన సమయంలోనే ఇంచుమించుగా భారతదేశంలోనూ కల్పించినా సాధించింది మాత్రం చెప్పుకోదగ్గట్టుగా లేదు. సాధారణంగా ఐదు శాతం ఇళ్లకు కూడా గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేవు. ఇక పారిశ్రామికీకరణ, నగరీకరణ జరగడంలో పారిశ్రామిక సముదాయాల నుండి వెలువడే నానా కల్మషాలతోనూ, పట్టణాల నుంచీ వచ్చే మురికి వ్యర్థాలతోనూ నీటి కాలుష్యం జరుగుతుంది. ఇది గత కొద్ది సంవత్సరాలుగా ఒక సమస్యగా తయారయింది. భారతదేశంలో ప్రజల ఆరోగ్య సమస్యల్లో 80 శాతం నీటి సంబంధ వ్యాధులేనని నాలుగవ ప్రణాళికలో (1967-74) అంగీకరించారు.

1987లో జాతీయ నీటి విధానాన్ని ప్రకటించారు. తాగునీటి సరఫరాకు ఇందులో పెద్దపీట వేశారు. కానీ అమలుకు వచ్చేటప్పటికి ఏమంత మార్పు కనిపించ లేదు. ఏడవ ప్రణాళిక (1985-90 వచ్చింది. 'పట్టణ ప్రాంత పేదల వాడల్లో మరణాలు, వ్యాధులు ఎక్కువగా ఉన్నాయి. దీనికి కారణం నాసిరకం నీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు అని చెప్పాలి' అని ఆ ప్రణాళిక గుర్తించింది. ఎనిమిదవ ప్రణాళిక రూపొందించాలని, అలా అయితే శతాబ్దం ముగిసే నాటికి నూటికి నూరుశాతం జనాభాకి నీరు అందించినట్టు అవుతుంది అని గుర్తించింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ప్రణాళిక నిరాధార, తీవ్ర సమస్యాత్మక పల్లెలకి ముందుపీట వేసింది. తొమ్మిదవ ప్రణాళిక (1997-02) పత్రం ఈ సందర్భంలో ప్రభుత్వం ఉద్దేశాల్ని పునరుద్ఘాటించింది. ప్రభుత్వం 'అయిదేళ్ల కాలంలో దేశంలోని ప్రతి ఆవాసానికి తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉందని అది ప్రకటించింది. తొమ్మిదవ ప్రణాళికకు పరిసరాల, ఆరోగ్య ప్రణాళిక సంఘ ఉపబృందం ఉంది. శుభ్రమైన తాగునీరు సరఫరా సంతృప్తికరంగా లేకపోవడం వల్లనూ, ఘన ద్రవ వ్యర్థాలని తొలగించే పారిశుద్ధ్య వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల నీటివల్ల, అంటు వ్యాధుల వల్ల వచ్చే వ్యాధులు విషమంగా చాలా అధికంగా తలెత్తాయని ఈ బృందం తీర్మానించింది. 2004 మార్చి నాటికి సకల ఆవాసాలకి ముందుగా రూపొందించిన నియమావళి ప్రకారం నిలకడగా శుభ్రమైన నీటి సరఫరా చేయాలని పదవ ప్రణాళిక (2002-07) ప్రకటించింది.

పౌరులందరికి తగినంత తాగునీరు అందించవలసి ఉందని ఇన్ని పెద్ద పెద్ద కబుర్లు చెప్పినా ఆందోళనలు వెల్లడి చేసినా స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రణాళికా నిధుల కేటాయింపు పట్టణ నీటి, పారిశుద్ధ్య రంగానికి సంబంధించి రెండు శాతం కూడా ఎన్నడూ దాటలేదు. ఈ కాలంలో పట్టణ జనాభా 61.6 మిలియన్ల నుండి 78.6 మిలియన్లకి పెరిగింది. దేశ జనాభాలో 1951-2001 రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశమే. అయినా కేంద్ర ప్రభుత్వం ఈ కీలక రంగానికి ఇచ్చిన తక్కువ ప్రాధాన్యం తగ్గ స్థాయిలో కేటాయింపులు జరపడంలోనే వెల్లడవుతుంది. అది కూడా పట్టణ జనాభా నాలుగింతలు పైబడి పెరిగిన నేపథ్యంలో.

తాగునీటి అందుబాటు

నగరీకరణ జాతీయ కమీషన్ ఇలా తెలియ జేసింది ఇలా 'అసలు సమస్యలు తలెత్తేది నీరు లేకపోవడం వల్లకాదు. అసమ పంపిణీ వల్ల. నీటి సరఫరా వ్యవస్థ సమానంగా లేదు. అన్యాయ పూరితంగా ఉంది. సంపన్న వర్గాల వాళ్లకే ఎక్కువ మొగ్గు'. భారత నగరాలలో రోజుకు తలసరి 70 లీటర్లు కనాకష్టంగా అవసరం (ఎల్‌పిసిడి). వాంఛనీయ పరిమితి 90 ఎల్‌పిసిడి స్థాయి. (110-120 ఎల్‌పిసిడి అయితే మరింత మెరుగు) ఇంత ఉంటే కనీస ఆరోగ్య ప్రమాణాలతో జీవితం గడుస్తుంది. పరమ అనావృష్టి పరిస్థితులలో, పరమ పేదరిక బస్తీల్లో కూడా కనీసం 70 ఎల్‌పిసిడి, నీటి సరఫరా మనిషి మనుగడకు ఉండాలని ఈ కమీషన్ గట్టిగా సిఫార్సు చేసింది. దీన్ని సాధించాలంటే నీటి సరఫరా పంపిణీ వ్యవస్థను క్షాళన చేయాలి. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో సాధారణ కార్యకలాప స్థాయిలో జీవనాధారానికి 50 ఎల్‌పిసిడి కనీసం అవసరం అని అంచనా.

1988 సంవత్సరానికి జాతీయ శాంపిల్ సర్వే సంస్థ తాజాగా అందించిన గణాంకాల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 70 శాతం, గ్రామీణ

ఆధారం	గ్రామీణ			పట్టణ		
	1988	**1993**	**1998**	**1988**	**1993**	**1998**
కుళాయి	15.5	18.9	18.7	72.1	70.4	70.1
గొట్ట బావి	39.1	44.5	50.1	17.2	18.5	21.3
బావి	39.1	31.7	28.8	9.2	8.6	6.7
చెరువులు	2.2	2.1	1.9	0.3	0.8	0.3
నదులు	2.4	1.7	1.3	0.3	0.1	0.1
ఊటలు	1.4	0.9	1.7	0.2	0.1	0.1
ఇతర	0.6	0.3	0.4	0.8	1.4	1.1
అన్నీ కలిపి	100	100	100	100	100	100
మరుగుదొడ్లు	89.0	85.8	82.5	31.8	3.06	25.5

గృహ సముదాయాల్లో 18.7 శాతం గృహాలకు కుళాయిల ద్వారా నీరు అందుతుంది. ఇక ఇంటి నుంచి ప్రధాన తాగునీటి వనరుకు మధ్య ఉన్న దూరం కూడా ఇక్కడ ముఖ్య మైందే. ఏమంటే గృహ సభ్యుల జీవన స్థాయిని అది సూచిస్తుంది. తాము నివసించే చోటుకు ముఖ్య నీటి వనరు సమీపం లో ఉందని గ్రామీణ ప్రాంతాల్లో 31 శాతం మంది, పట్టణ ప్రాంతాల్లో 66 శాతం మంది చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతం మంది, పట్టణ ప్రాంతాల్లో 32 శాతం మంది తమ నీటి ఆధారం బయటనే ఉందని చెప్పారు. అంటే సుమారుగా 0.2 కిలో మీటర్లు.

1990లలో పట్టణ ప్రాంతాల్లో కుళాయిల ద్వారా రక్షిత మంచినీటి అందుబాటు తగ్గింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లోనూ భూగర్భజలం మీద ప్రధాన వనరుగా ఆధారపడడం పెరిగింది. (గొట్టపు బావులు, చేతి పంపులు). ఇవాళ గ్రామీణ ప్రాంతాల్లో సగం జనాభా భూగర్భజలం మీద ఆధారపడుతుంది. బహిరంగ బావుల మీద ఆధారపడడం కూడా (25.8 శాతం) హెచ్చుగానే ఉంది. భూగర్భ జలాలు కాలుష్యం వల్ల నాసిరకంగా తయారవుతున్నాయి. ఇది భారతదేశంలో పెద్ద సమస్య అయింది. నీటి నాణ్యత సంబంధిత సమస్యలతో దాదాపు 44 మిలియన్ల మంది బాధపడుతున్నారు. ఫ్లోరైడ్, ఇనుము, నైట్రేట్, అర్సెనిక్, భారలోహాలు, లవణం ఎక్కువవడం లాంటి వాటివల్ల (ఇతరులు 2002–2003) జార్ఖండ్ రాష్ట్రం (అధిక భాగం బీహార్ నుంచి వేర్పాటు చేసి ఏర్పరిచిందే) పలుమావు జిల్లా మనాతుబ్లాక్‌లో కుసుమాతండ్ అనే గ్రామంలో సంభవించిన ఆకలి చావుల గురించి పరిశీలించడానికి నిజనిర్ధారణ కమిటీ అక్కడికి వెళ్లింది. గ్రామలస్తులు పరమ కలుషిత నీటిని తాగుతున్నారని ఆహారం, శుభ్రమైన నీరు లేకపోవడంతో దారుణమైన జబ్బులబారిన పడడం, మరణాలు సంభవించడం జరుగుతుందని ఆ కమిటీ గమనించింది

భారతదేశంలోని చాలా రాష్ట్రాల్లో గ్రామీణ గృహాలలో 10 శాతం కంటే తక్కువ మందికే కుళాయి నీరు అందుబాటులో ఉంటుంది. వాళ్లు భూగర్భజలం మీదే ఎక్కువగా ఆధారపడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఈ సౌకర్యం బీహార్, కేరళ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అఖిల భారత సగటు కంటే తక్కువే ఉంది. కొన్ని రాష్ట్రాల్లో పట్టణ ప్రాంతాల్లో భూగర్భజలం మీద ఆధారపడడమూ ఎక్కువే. కొన్ని రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల సదుపాయంలేని ఇళ్ల శాతం దాదాపుగా 90 శాతం ఉంది. మరుగుదొడ్ల సౌకర్యంలేని ఇళ్లు పట్టణ ప్రాంతాల్లో, కొన్ని రాష్ట్రాల్లో 35–40 శాతం దాకా ఉన్నాయి. కుళాయి, గొట్టపు బావి, అలాగే గ్రామీణ పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ మరుగుదొడ్లులేని వర్గీకరణలో సంఖ్య రీత్యా కేరళలో ఎక్కువ ఉన్నాయి. విద్య, ఆరోగ్యం, సామాజికాభివృద్ధి సూచికల స్థాయికి సంబంధించి భారతదేశంలో కేరళదే అగ్రస్థానం. బహిరంగ బావులే తాగునీటిని ప్రధాన ఆధారంగా హెచ్చు శాతం అక్కడి ఇళ్లలో ఉంది.

అనేక సందర్భాలలో సుప్రీంకోర్టు తీర్పులు ఇందుకు సంబంధించి వెలువడుతూ ఉన్నా సరిస్థితి ఇలానే ఉంది. రాజ్యాంగంలో 21వ అధికరణం ప్రకారం జీవిత ప్రాథమిక హక్కులో భాగంగా తాగునీటి హక్కు ఉందని కోర్టు చెపుతూనే ఉంది. కేంద్రంలో, రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు ప్రజల ముందు రాజ్యాంగబద్ధులమని చాటుకుంటూ ఉన్నాగానీ పేద ప్రజల తాగునీటి విషయంలో ఎందుకింత కర్కశ వైఖరితో ఉంటున్నాయి? రాజ్యాంగ యంత్రాంగం మీద సంపన్న వర్గాలకి, బలమైన మధ్యతరగతి వాళ్లకు పట్టు ఉంది. సహజ వనరుల్ని జేబులో వేసుకునే శక్తి ఉంది. పేద ప్రజలు తమకిగా తాము సంఘటితులు కాలేక బలమైన ఒత్తిడి కారణంగా తయారవలేని శక్తిహీనత కూడా ఒక కారణం.

1991 నుంచి, సరళీకరణ దశ తరువాత, బహుళజాతి కంపెనీలు, గడపలో కాలుపెట్టినప్పటి నుంచి సహజ వనరుల మీద, ప్రభుత్వ యంత్రాంగం మీద వారి పట్టు మరింత బిగిసింది. ఈ బృందాల ద్వారా నీటి పథకాలు అమలు జరిపించడానికి ప్రభుత్వాలు మహా ఉత్సాహం చూపిస్తున్నాయి. దాంతో పేదలకు నిలకడగా శుభ్రమైన నీటిని సరఫరా చేయ్యాలన్న ఆతృత ఆచరణలో కనిపించడం లేదు. పరిస్థితులు మారాయి. ఈ పరిస్థితుల్లో పేదలస్థితి, వాళ్లు నిలదీసి అడిగే హక్కు మరింత దుర్బలమయ్యాయి. ఈ బలమైన శక్తులు నీటి రంగంలో, కార్పొరేట్ రంగంలో కుదుర్చుకున్న ఒప్పందాల ఛాయలో ఇలా జరిగింది. నిజానికి మున్సిపల్ నీటిని నదీజలాల నీటిని మళ్లించుకోవడానికి అతిగా భూగర్భ జలాలని తోడుకోనిచ్చేందుకు కార్పొరేట్ రంగానికి అనుకూలంగా చర్యలు తీసుకునే ప్రభుత్వానికి మరింత ధైర్యం చిక్కింది. పైకి నలుగురి ముందూ ప్రభుత్వాన్ని నడిపించే అన్ని పార్టీలు రాజ్యాంగానికి బద్ధులై ఉన్నట్లు ప్రకటిస్తూనే ఉంటాయి. అదే చిత్రం. ప్రాథమిక హక్కుల విషయంలో కోర్టులు పౌరులకు అనుకూలంగా ఉండే తీర్పులు ఇస్తూనే ఉన్నాయి. అయితే తగినంత పరిశుభ్రమైన నీటికోసం హక్కును అమలుజరిపే స్థితిలో లేకపోవడం లేదా కొన్ని సమయాల్లో ఇష్టపడకపోవడం విచారకరం. ప్రభుత్వం తన కర్తవ్యాల నుంచి వంచనా పూర్వకంగా ముఖం చాటేస్తున్నాయి. ఆ రకంగా జీవితానికి – నీటికి ఉన్న ప్రాథమిక హక్కును దారుణంగా ఉల్లంఘిస్తున్నాయి. 'నీటి హక్కు' అనేది ఒక నినాదంగా కుదించుకు పోతుంది.

అయితే పౌరుల సాంఘిక ఆర్థిక హక్కుల గురించి చైతన్యం మరింతగా పెరుగుతూ ఉంది. భారతదేశంలో ఆహారం హక్కు ఆందోళన ఇటీవల ఊపు అందుకుంది. ఫలితాలు దూర ప్రాంతాలకు వేగంగా తరలించవచ్చు. సంక్షోభ సమయాల్లో పంపిణీకి వీలుగా ఎక్కువ కాలం నిలువ ఉండవచ్చు. అయితే శుభ్రమైన నీటి విషయంలో ఇలా చెయ్యడం కుదరదు. నీటి అవసరం అయ్యే పరిమాణమూ ఆహారధాన్యాల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ. శుభ్రమైన నీరు అందుబాటులో ఉండడం, రవాణా చేయడం, నిలువ చేయడం దూర ప్రాంతాలకు సంబంధించి, కాల పరిమితికి సంబంధించి కష్టం. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో సంగతి చెప్పనే అక్కర్లేదు. పరిశుభ్రమైన నీటిని ఆహార దినుసుల్లో ఒకటిగా ప్రస్తావించుకునే బదులు ఆహారం హక్కు ప్రచారం ఆకలికీ, పస్తులకీ వ్యతిరేకంగా జరిగే పోరాటంలో నీటి హక్కును మరింత బలీయంగా ఇముడ్చుకోవాలి.

(రచయిత అధ్యాపకులు)

వీ

రక్షణ వ్యయం పెరుగుదల ఎవరి కోసం?

సరిహద్దు భద్రతా, అంతర్గత భద్రతా, రక్షణ వ్యయాల పేరుతో అధిక మొత్తంలో ప్రజాధనాన్ని వెచ్చించడాన్ని సామ్రాజ్యవాదుల వ్యూహంలో భాగంగా చూడాలని అంటున్నారు **విశ్వం**

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కూడా బడ్జెట్‌లో తన రక్షణ వ్యయాన్ని మరోమారు పెంచింది. ప్రపంచంలోని అన్ని దేశాలలాగే భారత్ కూడా తన రక్షణ వ్యయాన్ని పెంచడానికిగానూ, దేశ భద్రతకే ముప్పు ముంచుకు వస్తున్నదనే సాకును చూపిస్తున్నది. సరిహద్దులో ఉద్రిక్తతలు, అణ్వాయుధాల పోటీ, అంతర్గత భద్రత, అంతర్జాతీయ ఉగ్రవాదం లాంటి అంశాలు రక్షణ వ్యయాన్ని పెంచేలా ఒత్తిడి తెస్తున్నాయనీ, పాలకులు ఎంత చెపుతున్నప్పటికీ, నేడు దేశంలో నెలకొన్న ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సాధారణ ప్రజానీకానికి సామాజిక భద్రత కరువై, నిత్యం అభద్రత భావంతో ఎందుకు బతుకులీడ్వాల్సి వస్తున్నదనే విషయాన్ని కూడా మనం గమనంలోకి తీసుకున్నప్పుడు, రక్షణ వ్యయపు పెరుగుదలను, సరిహద్దు భద్రత, అంతర్గత భద్రత విషయాలను సామ్రాజ్యవాదుల వ్యూహంలో భాగంగానే చూడాలి.

సరిహద్దులో యుద్ధ ప్రమాదం పొంచి ఉందని, అందుకుగాను సైనిక బలగాలను పటిష్ట పరచకుంటే దేశ భద్రతకే ముప్పు ముంచుకు వస్తుందని కేంద్ర ప్రభుత్వం ఏ ఏటికాఏడు తన రక్షణ వ్యయాన్ని విపరీతంగా పెంచుకుంటూ పోతున్నది. కేంద్రం 2013-14కు గాను తన బడ్జెట్‌లో రక్షణ కోసమని 2,03,672 కోట్ల రూపాయలను కేటాయించింది. ఇది గత సంవత్సరం కేటాయించిన దానికంటే 16 శాతం ఎక్కువ. 2000-01లో రక్షణ వ్యయం 70,948 కోట్లు ఉండగా 2011-12లో 1,70,913 కోట్లు, 2012-13లో 1,78,504 కోట్లుగా ఉండి అది క్రమంగా 2013-14 నాటికి 2,03,72 కోట్ల రూపాయలకు చేరింది. ఇది మన మొత్తం బడ్జెట్‌లో 12.23 శాతంగాను, మనదేశ స్థూల జాతీయోత్పత్తిలో 1.83 శాతంగాను ఉంది. ఈ కేటాయింపు కూడా ఇక్కడికే పరిమితమని కాదు. మన ఆర్థిక మంత్రి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సందర్భంగా దేశ భద్రతకోసం ఎంతటి ఖర్చునైనా భరించడానికి ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడబోదని ఇచ్చిన హామీయే ఇందుకు నిదర్శనం. ఈ ఆర్థిక సంవత్సరానికి ఇందులో మరింత పెద్ద మొత్తం వచ్చి చేరుతుందనే దాంట్లో ఎటువంటి సందేహం పెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఈ వ్యాసం రాస్తున్న సమయం నాటికే ప్రధాన మంత్రి అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ కేబినెట్ కమిటీ చైనా సరిహద్దులో (చికెన్ నెక్ ప్రాంతంలో) యాభైవేల సైన్యాన్ని మోహరిస్తూ అందుకు 65 వేల కోట్ల రూపాయలను అదనంగా మంజూరు చేసింది. రక్షణ వ్యయాన్ని నిత్యం పెంచుకుంటూ పోవడమనేది దేశానికి ఆర్థికంగానూ, రాజకీయంగానూ అంత ఆరోగ్యకరమైన విషయమేమీ కాదు. ఈ పెరిగిన వ్యయం దేశంలో ఇప్పటికే అంతంత మాత్రాన అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను మరింత కుంటు పడేలా చేస్తుంది. ప్రభుత్వం ఈ ఏడాది ప్రజలకిచ్చే మొత్తం సబ్సిడీల నుంచి 26,570 కోట్ల రూపాయల కోత విధించి, అదే మోతాదులో 25,168 కోట్ల రూపాయలను రక్షణ వ్యయంలో పెంచింది. అంటే ప్రజల సంక్షేమాన్ని పణంగా పెట్టైనాసరే రక్షణ వ్యయాన్ని పెంచుతూ పోతున్నది. పెద్ద మొత్తంలో రక్షణ కోసం ఖర్చుపెట్టడమనేది పెద్ద సంఖ్యలో నిరుపేదలున్న మన దేశానికి మోయలేని పెను భారంగానే తయారవుతుంది.

రక్షణ వ్యయంలోనే బయటికి రావాల్సిన విషయం మరొకటి ఉంది. అది రక్షణ వ్యయాన్ని వాస్తవానికంటే తక్కువ చేసి చూపించడమనేది. అధికారంలోకి వచ్చే అన్ని ప్రభుత్వాలు, రక్షణ వ్యయాన్ని తక్కువ చేసి చూపించడమనేది దాన్ని ఒక సంప్రదాయంగానే పాటిస్తున్నాయి. సైనిక వ్యవహారాలు, వాటి వ్యయాలు బహిరంగం కావడమనేది దేశ భద్రతకు ముప్పును తీసుకువస్తుందనే దాంతో సైనికపరమైన అన్ని విషయాలను అతి గుప్తంగా ఉంచడం జరుగుతున్నది. రక్షణ వ్యయం గురించి, భారత రాజ్యాంగం ఏమని పేర్కొందో ఇప్పుడు చూద్దాం. కేంద్ర ప్రభుత్వ 7వ షెడ్యూలు ఈ విధంగా వివరిస్తుంది. 'పదాతి, నావిక, వాయుసేనలతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని రకాల సాయుధ బలగాల కేటాయింపుల మొత్తాన్ని రక్షణ వ్యయం కింద చేర్చాలి.' అలా చూసినప్పుడు కేంద్ర ప్రభుత్వం 1984-85 నుండి మాజీ సైనికులకిచ్చే పింఛన్‌లను రక్షణ వ్యయంలోంచి తొలగించి విడిగానే ఇస్తున్నది. వాస్తవానికి ఈ ఖర్చును రక్షణ వ్యయంలోనే చేర్చాల్సి ఉంటుంది. ఎందుకంటే, గతంలో వీరందించిన సేవలు రక్షణ రంగానికి సంబంధించినవే కాబట్టి నేడు మాజీ సైనిక పింఛనుదారుల సంఖ్య, సర్వీసులో ఉన్న సైనికులతో పోలిస్తే నాలుగింతలుంది. 2001లో సైనికుల పింఛనుకోసం 12000 కోట్లు ఖర్చయితే, ఇప్పుడది మూడింతలు పెరిగింది. రక్షణ మంత్రిత్వ శాఖ ఖర్చును కూడా రక్షణ వ్యయంలో చేర్చడం లేదు. మరి ఇది ఎవరికోసం పనిచేస్తున్నట్లు? రక్షణ మంత్రిత్వ శాఖ ఖర్చులతోపాటు తీరప్రాంత గస్తీ నౌకదళం, సరిహద్దు రహదారుల సంస్థ (బిఆర్‌ఒ)ల కేటాయింపులను కూడా రక్షణ వ్యయంలోనే చేర్చాలి. భవిష్యత్తులో యుద్ధ సైనికులుగా తయారయ్యే ఎన్‌సిసి కాడెట్లకై అలాట్ చేసిన మొత్తాన్ని కూడా ఇందులోనే చేర్చాలి. ఎందుకంటే ఈ సంస్థల కార్యకలాపాలన్ని ప్రత్యక్ష సైనిక పర్యవేక్షణలో కొనసాగేవే. ఇవేగాక అంతరిక్ష శాఖలోని సగం ఖర్చును, అణు ఇంధనశాఖలోని సగం ఖర్చును కూడా రక్షణ వ్యయంలోనే చేర్చాలి. అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సమాచార ఉపగ్రహ ప్రయోగాలతో

పాటు మిస్సైయిల్స్‌ను అభివృద్ధి పరచడంలో దాని పాత్ర కాదనలేనిది. అలాగే అణు ఇంధనాన్ని, అణు విద్యుత్తు ఉత్పత్తితో పాటు అణ్వాయుధాల తయారీలో కూడా ఉపయోగిస్తున్నారనేది అందరికి తెలిసిన విషయమే. వీటన్నింటితో పాటు అనేక రక్షణ ప్రాజెక్టుల కింద పనిచేసే ప్రభుత్వ ఏజెన్సీల (డిఆర్‌డిఓ, మిధాని, హిందుస్తాన్ ఏరోనాటిక్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, భారత్ ఎర్త్ మూవర్స్, మాజ్‌గావ్ డాక్ యార్డ్, గోవా షిప్‌యార్డ్, భారత్ డైనామిక్స్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 39కిపైగా ఆయుధాల, మందుగుండు ఫ్యాక్టరీల)కు కేటాయించిన నిధులను కూడా రక్షణ వ్యయంలోనే చేర్చాల్సి ఉంటుంది. ఇప్పటికే కేటాయించిన రెండు లక్షల కోట్లు కాక, పైన పేర్కొన్న వాటన్నింటిని రక్షణ వ్యయంలో చేర్చితే మరో లక్ష కోట్ల వరకైన పెరుగుతుంది. నిజంగానే అందరూ అనుకుంటున్నట్లు రక్షణ వ్యయమనేది వెలుతురు సోకని విషయంగానే మిగిలిపోయింది. టట్రా, బోఫోర్స్, ప్రముఖుల హెలికాప్టర్ల లాంటి కుంభకోణాలు వెలుగులోకి వస్తే తప్ప, రక్షణ రంగం వైపుకు ఎవరి దృష్టి పోవడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు యుద్ధాల పట్ల, యుద్ధ విధ్వంసాల పట్ల, మితిమీరిన సైనిక ఖర్చుల పట్ల తీవ్ర వ్యతిరేకతలను, నిరసనలను వ్యక్త పరుస్తుండడం తో, ఆ వ్యతిరేకతల నుండి తప్పించుకోవడానికే అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రక్షణ వ్యయాన్ని, రక్షణకై పెట్టే వివిధ ఖర్చులను వివిధ శాఖలకింద విడగొట్టి అసలు రక్షణ వ్యయాన్ని వాస్తవానికంటే చాలా తక్కువచేసి చూపుతూ ప్రజల ముందుంచుతున్నాయి.

రక్షణ వ్యయంలో సగం వరకు ఆయుధాల కొనుగోలుకే వెచ్చించ బడుతున్నది. అందులోనూ వాయుసేన కోసం పెట్టే ఖర్చులే అత్యధికం. భారత్ ఈ మధ్యన ఫ్రాన్స్ నుండి తొంబైవేల కోట్ల ఖర్చుతో 126 బహు ఉద్దేశ్య 'డెసాల్ట్ రాఫేల్' యుద్ధ విమానాలను, అమెరికాలోని బోయింగ్ కంపెనీతో 41 సి-17 గ్లోబ్ మాస్టర్ భారీ సరుకుల రవాణా విమానాలను, 8500 కోట్లతో ఎనిమిది పి-81 టోహి విమానాలను, అలాగే ప్రముఖుల కోసమని 3600 కోట్ల ఖర్చుతో 12 హెలికాప్టర్ల కొనుగోలుకై ఇటలీతో ఒప్పందాలు చేసుకుంది. వాయుసేన కోసమని మరో 300, పదాతి దళానికి 197, కామోవ్-31 హెలికాప్టర్లతో సహా మరిన్ని సుఖోయ్ 30 ఎంకె1 యుద్ధ విమానాలు, పొజిడాన్ విమానాలు కూడా కొనుగోలు వరుసలో ఉన్నాయి. ఇప్పటికే భారత్ వద్దా ఎయిర్ సుపీరియారిటీ, మల్టీరోల్, గ్రౌండ్ అటాక్ చేసే విమానాలతో సహా అణ్వాస్త్రాలను సైతం మోసుకెళ్ల గలిగే యుద్ధ విమానాలు 667 వరకు ఉన్నాయి. వీటితోపాటే 246 రవాణా, 190 శిక్షణ నిచ్చే విమానాలతో పాటు 286 హెలికాప్టర్లు కూడా ఉన్నాయి. అయినా కూడా ఇప్పటికివి చాలవన్నట్లు కేంద్రం మరిన్ని యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు రక్షణ వ్యయాన్ని పెంచింది. ఒక్కో యుద్ధ విమానం ఖరీదు వెయ్యి నుండి మూడు, నాలుగు వేల కోట్ల రూపాయల వరకు ఉంటుంది. వీటిలో కనీసం ఏదేని ఒకే ఒక యుద్ధ విమానాన్ని కొనడం మానుకున్నా ఆ ఖర్చుతో ఓ రాష్ట్ర వ్యాప్తంగా ఒక హెల్త్ ప్రాజెక్ట్‌నో, లేక మిడ్‌డే మీల్ ప్రాజెక్ట్‌నో సులువుగా నడపవచ్చు. కాని ఈ ప్రభుత్వానికి ఇందుకై ఏచింతా లేదు. ఇంకా బోఫోర్స్ ఫిరంగులు పాతబడ్డాయనే దాంతో ఇరవై వేల కోట్ల ఖర్చుతో అమెరికా నుండి 2700 భారీ ఫిరంగులను (ఎం-777 అల్ట్రాలైట్ హోవిట్జర్స్) రష్యాతో మూడు వందల టి-90 యుద్ధ ట్యాంకులను, ఫ్రాన్స్‌తో 6888 కోట్ల ఖర్చుతో మైకా మిస్సైయిల్స్ ఇంకా 20 వేల కోట్ల రూపాయల ఖర్చుతో మైన్‌ప్రూఫ్ వాహనాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, రాకెట్ లాంచర్స్, నైట్‌విజన్ సెట్‌లు కూడా కొనుగోలులో ఉన్నాయి. ఇవేకాక 11,572 కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి 4,60,638 అసాల్ట్ రైఫిల్స్‌ను, కార్బన్స్‌ను కొనుగోలు చేస్తున్నది. 2009లోనే రక్షణ శాఖ అరవై కోట్ల ఖర్చుతో 5 వేల ఎకె తుపాకులను కొనుగోలు చేసింది. ఆపై 2010-12 మధ్యలో మరో 28 వేల అసాల్ట్ రైఫిల్స్‌ను కొనుగోలుచేసి, వాటిలో నుండి 18 వేల అసాల్ట్ రైఫిల్స్‌ను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని అర్ధసైనిక బలగాలకు, రాష్ట్ర సాయుధ బలగాలకు పంపిణీ చేసింది. అందులో ఎక్కువ శాతం రష్యా నుండి కొన్న ఎకె తుపాకులే ఉన్నాయి. ప్రస్తుతం కొనుగోలుచేసే నాలుగు లక్షలకుపైగా అసాల్ట్ రైఫిల్స్ సరిహద్దు భద్రతకే అనడం అనుమానించాల్సిన విషయమే. ఎందుకంటే ఏవోకొన్ని ప్రత్యేకమైన ఆపరేషన్స్‌కు తప్ప సరిహద్దులో జరిగే యుద్ధంలో మోయిన్ బాటిల్ రైఫిల్స్ తప్ప అసాల్ట్ రైఫిల్స్‌ను ఉపయోగించడం లేదు. పైన పేర్కొన్న యుద్ధ విమానాల, ఆయుధాల కొనుగోలు ఒప్పందాలన్నింటిని అమలు చేయాలంటే, భారీమొత్తంలోనే మరిన్ని నిధులను మంజూరు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం ఈ అదనపు నిధులను సమకూర్చడం కోసం ప్రజలపై మరిన్ని పన్నులు విధించక తప్పదు. లేదా ప్రజా సంక్షేమ కార్యక్రమాలనైనా మరింత కుదించక తప్పదు. ఇప్పటికే ప్రభుత్వం ప్రతి ఏటా యుద్ధ విమానాలు, ఆయుధాలు, జలాంతర్గాముల కోసమని లక్ష కోట్ల రూపాయల వరకు ఖర్చు పెడుతున్నది. 2009-12 మధ్య కాలంలో ఇందుకై రెండు లక్షల కోట్లు వెచ్చించింది. ఇంత పెద్ద మొత్తంలో రక్షణకై ఖర్చు చేయడం అంతవసరమా అని ఎవరైనా మన నాయకులను ప్రశ్నిస్తే, వారి నుండి వచ్చే సమాధానం 'దేశ భద్రత విషయంలో నో కాంప్రమైజ్' అనే మొండి సమాధానం ప్రజలను మళ్లీ నోరెత్తకుండా చేస్తున్నది. మళ్లీ కూడా ఎవరైనా ప్రశ్నిస్తే దేశద్రోహి అనే పేరుపెట్టి బొక్కలో తోసేసినా చేసేదేమీ లేదు.

రక్షణ వ్యయమంటే కేవలం సైనిక వ్యయం మాత్రమే కాదు. అంతర్గత భద్రతా పేరుతో అర్ధసైనిక బలగాలకయ్యే ఖర్చులను కూడా రక్షణ వ్యయంలోనే చేర్చాల్సి ఉంటుంది. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అన్ని రకాల సాయుధ బలగాలు అన్నప్పుడు, అర్ధసైనిక బలగాలు కూడా కేంద్ర ప్రభుత్వ పరిధిలోకే వస్తాయి. పైగా వీటికి గరపిన ఉన్నత సైనిక శిక్షణతో ఆ బలగాలు ఏ నిమిషంలోనైనా యుద్ధంలోకి దూకడానికి మిలటరీ పరంగా, ఎత్తుగడల పరంగా సర్వ సన్నద్ధంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ బలగాలను అటు సరిహద్దు ప్రాంతాల్లోను, ఇటు అంతర్గత భద్రత పేరుతో రాష్ట్రాలకు సహాయ పడేవిధంగా వాడుకుంటున్నది. వీటికోసం భారీ మొత్తంలోనే నిధులు కేటాయించబడుతున్నాయి. అయినా కూడా కేంద్ర ప్రభుత్వం వీటి ఖర్చులను రక్షణ వ్యయంగా పరిగణించడం లేదు. ఈ ఏడు కేంద్ర ప్రభుత్వం తన పోలీసు (అర్ధసైనిక) బడ్జెట్‌ను 40895 కోట్లుగా నిర్ణయించింది. ఇది గత ఏడాది కేటాయించిన దాని కంటే పది శాతం ఎక్కువ. 2000-01లో 8034 కోట్ల రూపాయలుగా ఉన్న కేంద్ర ప్రభుత్వ

పోలీసు బడ్జెట్ అనేది 40895 కోట్లకు చేరింది. గత పన్నెండేళ్లలో సరిహద్దు భద్రత పేరుతో సైనిక (రక్షణ) వ్యయం మూడింతలు పెరిగితే, అంతర్గత భద్రత పేరుతో పోలీసు బడ్జెట్ ఐదింతలు పెరిగింది. దేశంలో సరళీకృత విధానాలు మొదలైన నాటి నుండి ప్రజల నుండి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకతను అణచి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తన పోలీసు (అర్ధసైనిక) బడ్జెట్‌ను వేగంగా పెంచుతూ పోతున్నది. గట్టి పోలీసు భద్రత లేకుండా కార్పొరేట్, బహుళజాతి సంస్థలు అడవి నుండి విలువైన ఖనిజ సంపదలను తవ్వి తీసుకెళ్లడం అసాధ్యమైపోయింది. కళింగనగర్, నందిగ్రామ్ మొదలు పోస్కో, నియమగిరి, లోహండిగూడ, రావ్‌ఘాట్, బోధ్‌ఘాట్, నగర్‌నార్ వరకు అది ప్రభుత్వ ప్రాజెక్ట్ అయినా లేక బహుళజాతి సంస్థల ప్రాజెక్ట్ అయినా అర్ధసైనిక బలగాల మోహరింపులు లేకుండా ప్రభుత్వం తమ పనులను కొనసాగించ లేకపోతున్నది. దీన్నే అంతర్గత భద్రత సమస్యగా చిత్రిస్తూ ప్రభుత్వం పోలీసు వ్యయాన్ని విపరీతంగా పెంచుతూ పోతున్నది. ఈ పన్నెండేళ్లలో పోలీసు వ్యయం ఐదింతలు పెరిగితే ఈ అండతో కార్పొరేట్, బహుళజాతి సంస్థల లాభాలు మాత్రం వందల రెట్లలో పెరిగాయి. అదే మైనింగ్ కింగ్ వేదాంత లాభాలయితే వెయ్యింతలు పెరిగాయి.

కేంద్ర ప్రభుత్వం రక్షణ వ్యయం లాగానే పోలీసు వ్యయాన్ని కూడా ఒకటిగా చేర్చి ప్రజల ముందుంచడం లేదు. దేశంలోని తొమ్మిది మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో సమాచార వ్యవస్థను పటిష్టపరచేందుకని ఆరువేల కోట్ల రూపాయల ఖర్చుతో 2199 మొబైల్ టవర్ల ఏర్పాటుకై కేంద్రం నిర్ణయం తీసుకుంది. వీటి ఖర్చును భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ భరిస్తున్నప్పటికీ, వీటి అవసరం అధికాధికంగా సాయుధ బలగాల కోసమేననేది స్పష్టం. ఇంకా కశ్మీర్‌తో సహా ఈశాన్య, మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలో శాంతి భద్రతల కోసమని రాష్ట్రాలు పెట్టే ఖర్చుల్లో కూడా సగం ఖర్చులను తానే భరిస్తానని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు హామీలనిచ్చింది. కాబట్టి వీటన్నింటిని పోలీసు వ్యయంలోనే చేర్చాల్సి ఉంటుంది. అంతే కాదు స్వయానా ప్రధాన మంత్రి వెల్లడించిన విధంగా, ప్రధాన మంత్రితో పాటు, అతి ముఖ్యమైన రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులు శాంతి భద్రతల సమస్య తీవ్రంగా ఉన్న కశ్మీర్, ఈశాన్య, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలాంటి కల్లోలిత ప్రాంతాల పర్యటనల సందర్భంగా అయ్యే ఇంధనపు ఖర్చుల్లో సగం ఖర్చును రక్షణ వ్యయం కిందనే చేర్చాలంటూ సెలవిచ్చారు. నిజంగానే దీన్ని కూడా సైనిక వ్యయంలోనో లేక పోలీసు వ్యయంలోనో చేర్చాల్సి ఉంటుంది. వీటన్నింటితో పాటు హోంమంత్రిత్వశాఖ, ప్రధానమంత్రి జాతీయ భద్రత సలహాదార్ల ఖర్చుతో పాటు దేశంలోని బాహ్య, అంతర్గత భద్రత కోసం పని చేసే ఇంటలిజెన్స్ (25 సంస్థల) సంస్థల ఖర్చులలో పెద్ద మొత్తాన్నే ఇందులో చేర్చాల్సి ఉంటుంది. వీటి కార్యకలాపాలు అత్యంత గోప్యంగా ఉంచడంతో వీటికయ్యే ఖర్చులు ఏ మాత్రం బహిర్గతం కావడం లేదు. రా (రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్) లాంటి సంస్థలపై నేరుగా ప్రధానమంత్రి పర్యవేక్షణ ఉంటుంది. కనుక వీటికి నియమాలు, చట్టాలేవి వర్తించవు. వాటన్నింటికి ఇవి అతీతమైనవి. ఈ ఇంటిలిజెన్స్ ఏజన్సీలలో పనిచేసే ఉన్నతాధికారులకు అనేక ఉచిత సౌకర్యాలే కాక, భారీ మొత్తంలో జీతాలతో పాటు, అవార్డులు, రివార్డుల పేరుతో పాటు, ప్రభుత్వ రహస్య కుట్రలను అమలు జరిపేందుకు భారీ మొత్తంలో నిధులు సమకూర్చబడుతున్నాయి. ఇలా అంతర్గత భద్రత పేరుతో చేసే వ్యయం మొత్తంగా రెండింతలవుతున్నది. అయినా కూడా ఇంకనూ అంతర్గత భద్రతకు మరిన్ని నిధులను సమకూర్చేందుకు అధికారంలో ఉన్న అన్ని ప్రభుత్వాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయి.

అంతర్గత భద్రత మాటున సాగే పోలీసు వ్యయంలోని మరో అంశాన్ని కూడా ఈ సందర్భంగానే చర్చించక తప్పదు. ప్రధానమంత్రి లాంటి ప్రముఖులకు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ రక్షణ కల్పిస్తే, కేబినెట్ మంత్రులకు, సుప్రీంకోర్టు జడ్జీలాంటి ప్రముఖులకు ఎక్స్, వై, జడ్‌ప్లస్‌ల శ్రేణి కింద ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది. జడ్‌ప్లస్ శ్రేణికి 36 మంది, జడ్ శ్రేణికి 28, వైకి 11, ఎక్స్‌కు ఇరువురు చొప్పున రక్షణ ఉంది. నేడు దేశ వ్యాప్తంగా 14842 ప్రముఖుల కోసమని 47557 మంది సాయుధ పోలీసులు ఎకె, కార్బైన్ లాంటి తుపాకులతో రాత్రింబవళ్లు వారికి రక్షణ నిస్తున్నారు. ఒక్క రాజధాని ఢిల్లీలోనే 427 మంది ప్రముఖులకు 5183 మంది స్పెషల్ పోలీసులు రక్షణగా ఉన్నారు. వీరి రక్షణ కోసం కాన్వాయ్‌లు, తుపాకులుగాక పోలీసుల జీత భత్యాలకే ఏటా 1500 కోట్ల రూపాయల ఖర్చు వస్తున్నది. జడ్, జడ్ ప్లస్ కింద ఇచ్చే ఒక్కో బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఖరీదు 70 లక్షల రూపాయలుంది. ఇంత భారీ మొత్తాలను ప్రముఖుల రక్షణ కోసం ఖర్చు చేయడానికి 'మన్మోహన్‌సింగ్' అన్నట్లు ప్రభుత్వం దగ్గర పైసలేమి చెట్లకు కాయడం లేదు గదా? తెంపి ఖర్చు పెట్టడానికి, ఇదంతా ప్రజా ధనమే.

నేడు జాతీయ భద్రత పేరుతో సరిహద్దు భద్రత, అంతర్గత అనేవి రెండు కలగలసిపోయాయి. కేవలం సరిహద్దులకే పరిమితమై యుద్ధం చేస్తామన్న సైన్యం, నేడు దేశ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం బాగా పెరిగిపోయింది. కార్పొరేట్, బహుళజాతి సంస్థల దోపిడి దౌర్జన్యాలకు, తమ విస్థాపనకు వ్యతిరేకంగా ప్రజల అసంతృప్తినే అంతర్గత భద్రత సమస్యగా పరిగణిస్తున్న భారత పాలకవర్గాలు, చివరకు ప్రజలనే శత్రువులుగా భావించి, భూమి, భుక్తి విముక్తి కోసం, జల్-జంగల్-జమీన్ కోసం తూర్పు మధ్య భారతంలో పోరాడుతున్న ప్రజలపై గ్రీన్‌హంట్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధాన్ని ప్రకటించాయి. వామపక్ష తీవ్రవాదం దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పుగా తయారైందన్న మన్మోహన్‌సింగ్ ప్రకటనతో కశ్మీర్, ఈశాన్యం తరువాత ఇప్పుడు మధ్య భారతంలో తన మూడవ ఫ్రంట్‌ను తెరవడానికి భారత సైన్యం సర్వసన్నాహాలను మొదలుపెట్టింది. తొమ్మిది రాష్ట్రాలలో తొంభై బెటాలియన్ల అర్ధ సైనిక బలగాలను దింపి తూర్పు, మధ్య భారతాన్ని మొత్తం మొత్తంగానే సైనిక శిబిరంగా మార్చివేసింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, జాతులు స్వయం నిర్ణయాధికారం కోసం, భూమి, భుక్తి కోసం పోరాడే ప్రజల సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతులలో పరిష్కరించలేని ప్రభుత్వం, బలప్రయోగాన్నే ఒక సాధనంగా ఎంచుకుంది. స్వాతంత్రం వచ్చిందని చెపుతున్న నాటి నుండి మన భారత సైన్యం, సరిహద్దులో విదేశీ సైనికులను వేల సంఖ్యలో హత మార్చితే, హక్కులకై ఉద్యమించిన ఈ దేశ ప్రజలను అంతర్గత భద్రత పేరుతో లక్షల సంఖ్యలో హతమార్చిన చరిత్ర మన భారతీయ సైన్యానికి, దాని అనుబంధ సాయుధ బలగాలకుంది. పాకిస్థాన్‌తో జరిగిన మూడు

యుద్ధాలలోనూ, భారత సైనికుల చేతిలో 12396 మంది పాకిస్థాన్ సైనికులు హతమవ్వగా, ఇటు దేశ అంతర్భూమిలోనే మూడు దశాబ్దాలుగా కశ్మీర్ అజాదీ కోసం పోరాడిన డెబ్బై వేలమందికి పైగా మిలిటెంట్‌లను భారత సైనిక, అర్ధసైనిక బలగాలు హతమార్చాయి. అలాగే స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడిన, ఉల్ఫాతో సహా ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఎనిమిది వేల మందిని, ఖలిస్థాన్ కోసం పోరాడిన ఐదువేల మంది సిక్కు ప్రజలను, మిలిటెంట్‌లను ఇవే బలగాలు ఊచకోత కోశాయి. 1950లో నెహ్రూ సైన్యాలు భూమి కోసం పోరాడిన మూడు వేల మందికి పైగా తెలంగాణ రైతాంగాన్ని క్రూరంగా చంపివేస్తే ఆపై నక్సల్బరీ మొదలు నేటి బీహార్, జార్ఖండ్ దండకారణ్యంల వరకు భూమి, భుక్తి, విముక్తి కోసం ఉద్యమించిన పదమూడువేల మందికి పైగానే విప్లవ ప్రజానీకాన్ని, విప్లవకారులను కాల్పుల్లో, బూటకపు ఎదురు కాల్పుల్లో నేలకూల్చింది. ఆఖరికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు జీతాలు పెంచమని, రైతులు తమ ధాన్యానికి గిట్టుబాటు ధరకోసం, అధిక ధరలకు వ్యతిరేకంగా, 'అభివృద్ధి' పథకాల కోసం తమ భూములు ఇవ్వడానికి నిరాకరించినా, విస్థాపనకు వ్యతిరేకంగా ఉద్యమించినా, నీటి ముంపును వ్యతిరేకించినా, అణు విద్యుత్తు ప్రాజెక్టులను వ్యతిరేకించినా, ఆఖరికి తాగే మంచి నీళ్ల కోసం ఉద్యమిస్తూ రోడ్లపైకి వచ్చిన వారిపై, సాయుధ బలగాలు నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇలా 1947 మొదలు నేటి వరకు అంతర్గత భద్రతను కాపాడే పేరుతో ఘనత వహించిన మన భారత సైన్యం దాని అనుబంధ బలగాలు, వాటికి తోడుగా రాష్ట్రాలకు చెందిన సాయుధ బలగాలు మొత్తంగా, సుమారు లక్ష యాభై వేల మందికి పైగా ఈ దేశపు పుడమి బిడ్డలను తన మరతుపాకులతో కాల్చి చంపిన చరిత్రను ఈ సందర్భంగా గుర్తు చేయాల్సి వస్తున్నది. దీంతో మన పాలకులు చెపుతున్న విధంగా పెనుముప్పు అంతర్గత భద్రతకు గాక, కార్పొరేట్, బహుళ జాతి సంస్థల లాభాలార్జనకు ఏర్పడిందనేది అర్థమవుతున్నది.

ఒకవైపు దేశంలో సగానికి పైగా ప్రజానీకం ఆర్థాకలితో అలమటిస్తూంటే, అధికారంలో ఉన్న పాలక వర్గాలు అణ్వాస్త్రాలు, మిస్సైల్స్ తయారీలో అభివృద్ధిని సాధించామంటూ, అగ్ర రాజ్యాల సరసన చేరామంటూ డాంబికపు ప్రగల్భాలు పలుకుతున్నాయి. ఎన్నికలలో గెలిచే ముందు ప్రజలకు ఎన్నెన్నో వాగ్దానాలు చేసిన రాజకీయ నాయకులు, ఎన్నికలలో గెలవగానే వారి బాగోగులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మిస్సైల్స్ అభివృద్ధికై చూపుతున్న శ్రద్ధలో కనీసం సగమైనా ప్రజల సంక్షేమం పట్ల చూపించక పోవడంతో ఆ రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురికావాల్సి వస్తుంది. బడ్జెట్‌లో సంక్షేమ పథకాల కేటాయింపులను పరిశీలించినా ఈ విషయం అర్థమవుతుంది. కేంద్ర ప్రభుత్వం తన 2013-14 సంవత్సరపు ఆర్థిక బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలకు గాను 94,051 కోట్లు (5.65 శాతం), విద్యారంగానికి 65,867 కోట్లు (3.95 శాతం), వైద్యరంగానికి 37,330 కోట్లు (2.24 శాతం) రూపాయలను కేటాయించింది. ఇవి సమాజంలో అతి ముఖ్యమైన రంగాలు. ఈ ముఖ్యమైన మూడు రంగాల మొత్తాలను కలిపినా కూడా (1,97,248 కోట్లు-11.84 శాతం) రక్షణ వ్యయాన్ని (2,03,672 కోట్లు-12.23 శాతం) ఏమాత్రం మించడం లేదు. సి-17 గ్లోబ్ మాస్టర్ భారీ సరుకుల యుద్ధ విమానం ఖరీదు, రాజీవ్ గాంధీ గ్రామీణ విద్యుద్దీకరణ ప్రాజెక్ట్‌కై 2013-14లో కేటాయించిన (4500 కోట్లు) దానికి సమానం. ఒక ఎకె తుపాకి ఖర్చుతో ఓ పేదవాడికి ఉచితంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను చేయవచ్చు. రష్యా నుండి కొనుగోలు చేస్తున్న సెకండ్ హండ్ గోర్మ్‌కోవ్ యుద్ధ నౌక ఖరీదు 12,500 కోట్లు. దీని ఖర్చుతో పది లక్షల మందికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ వైద్యాన్ని ఉచితంగా అందించవచ్చు. అందుకే దక్షిణాసియా మానవ వికాస్ సంస్థ తన రిపోర్ట్‌లో సరిగ్గానే, సైనిక వ్యయాన్ని మానవాభివృద్ధితో ఇలా పోల్చింది. 'ఒక యుద్ధ ట్యాంకుకి బదులుగా 40 లక్షల మంది పిల్లలకు టీకాలు వేయవచ్చు. ఒక మిరాజ్-2000 యుద్ధ విమానపు ఖర్చుతో 30 లక్షల మంది పిల్లలకు ఒక సంవత్సరం పాటు ఉచితంగా ప్రాథమిక విద్యను బోధించవచ్చు. ఒక ఆధునిక జలంతర్గామి, దాని ఉపకరణాలకయ్యే ఖర్చుతో ప్రతి సంవత్సరం ఆరు కోట్ల మందికి పరిశుభ్రమైన త్రాగునీటిని అందించవచ్చు.' ఇప్పుడు భారత్ 50 వేల కోట్ల రూపాయల ఖర్చుతో మరో భారీ యుద్ధనౌక నిర్మాణాన్ని మొదలు పెట్టింది. మహాన్ భారత్ నిర్మాణ్ అంటూ ఢంకా బజాయిస్తున్న భారతదేశం, మానవాభివృద్ధి సూచికలో ప్రపంచంలోనే అత్యంత వెనక వరుసలో నిలబడాల్సి రావడమనేది దాని డొల్లతనాన్ని తెలియజేస్తున్నది. దేశంలో ఏటా పది లక్షల మంది శిశువులు నెలలోపే తనువు చాలిస్తున్నారు. 45 శాతం పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలు 43 శాతం తక్కువ బరువులో ఉన్నారు. మహిళల్లో రక్తహీనత 57.5 శాతంగా ఉంది. దేశంలో శిశుమరణాల రేటు వెయ్యికి 48గా ఉంటే, మాతృమృత్యు రేటు 212గా ఉంది. గర్భం దాల్చిన సమయంలో మహిళలు తగిన పోషకాహారం తీసుకోకపోవడం వలన పిల్లలు తక్కువ బరువులో పుట్టడంవల్ల శిశుమరణాల సంఖ్య రోజు రోజుకు పెరిగి పోతున్నది. ప్రభుత్వాలు అవలంబిస్తున్న దిక్కుమాలిన విధానాల వలన భారత్ నేడు దక్షిణాసియాలో సైతం మానవాభివృద్ధి సూచికలో అయిదో స్థానంలోకి దిగజారింది. దేశంలోని ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా, వారిని విశ్వాసంలోకి తీసుకోకుండా భద్రతను వూహించలేం.

శాంతి భద్రతలను కాపాడే పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టే పోలీసు ఖర్చులు కూడా తక్కువేమి లేవు. అధికారంలోకి వచ్చేముందు ప్రజలకు ఎన్నెన్ని వాగ్దానాలు చేసినప్పటికీ, ఒకసారి అధికారాన్ని చేజిక్కించుకోగానే పోలీసులపైనే ఆధారపడుతున్నాయి అన్ని ప్రభుత్వాలు. తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రజలను అణచడంలో రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఏమాత్రం వెనకబడి లేవు. దేశంలోని సగానికి పైగా రాష్ట్రాలు (కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలతోపాటు, తొమ్మిది మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలు) తమ ప్రభుత్వాలను సాయుధీకరించడంలో ముందు వరుసలో నిలబడ్డాయి. ఇందుకై ఛత్తీస్‌గఢ్‌లోని శాంతి భద్రతల విషయాన్ని పరిశీలించిన విషయం బోధపడుతుంది. 2003లో ఛత్తీస్‌గఢ్‌లో 26 వేల మంది సాయుధ పోలీసులుండగా, 2013 నాటికి ఆ బలగాలు 67 వేలకు పెరిగాయి. అలాగే 2003లో కేవలం 288 కోట్ల రూపాయలుగా ఉన్న పోలీసు బడ్జెట్ 2013 నాటికి 1862 కోట్ల రూపాయలకు పెరిగింది. ఇది గత సంవత్సరం కంటే 21 శాతం ఎక్కువ. కేంద్ర ప్రభుత్వ పోలీసు బడ్జెట్ పెరుగుదల 10 శాతం మాత్రమే. ఈ పదేళ్లలో పోలీసుల సంఖ్య మూడింతలు పెరిగితే, వాటికి కేటాయించిన బడ్జెట్ మాత్రం ఆరింతలు పెరిగింది. రమణ్‌సింగ్

ప్రభుత్వం 2012-13 వార్షిక బడ్జెట్‌లో వైద్య రంగానికి 1055 కోట్లు కేటాయించినప్పటికీ, అందులో నుండి కేవలం 76 శాతం మాత్రమే అంటే 806 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. అదే పోలీసు వ్యయాన్ని 1862 కోట్లుగా నిర్ణయించి 1928 కోట్లు అంటే 103 శాతం ఖర్చుచేసింది. జూలై 8న ఢిల్లీలో అంతరంగిక భద్రతపై జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో ఆయా రాష్ట్రాలలో ఖాళీగా పోలీసు ఉద్యోగాలను పూరించాల్సిందిగా నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 1.80 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 30 వేలు, పశ్చిమ బెంగాల్‌లో 29 వేలు, బీహార్‌లో 16 వేలు, ఛత్తీస్‌గఢ్‌లో 13 వేలు, జార్ఖండ్‌లో 10 వేలు, ఒరిస్సాలో 2 వేలు మహారాష్ట్రలో 6 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయట. ఇందుకై నిరుద్యోగ యువతను పెద్ద ఎత్తున చేర్చుకో వాల్సిందిగా నిర్ణయం. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కంటే రాష్ట్రంలోని ఖనిజ సంపదలన్నింటిని కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు ధారదత్తం చేసేందుకే ఈ పెరుగుదల అనేది స్పష్టం. ప్రభుత్వాలు చెపుతున్న అంతర్గత సమస్య, శాంతి భద్రతల సమస్య అంటే అది కార్పొరేట్, బహుళజాతి సంస్థల ఆస్తుల సంరక్షణయే తప్ప మరేమీ కాదు.

జాతీయ భద్రత పేరుతో సరిహద్దు భద్రత, అంతర్గత భద్రతలకై సైనిక-అర్ధసైనిక బలగాల వ్యయాలను పెంచడం అత్యంతవసరమని ప్రభుత్వం ఎంతగా చెపుతున్నప్పటికీ ఇదంతా అనుత్పాదక రంగపు ఖర్చు అనే విషయాన్ని మనం మర్చిపోకూడదు. రక్షణ వ్యయాలను నిరంతరం పెంచుతూ పోవడమంటే దేశ ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టడమే. ఈ వ్యయాలన్ని మొత్తంగా, మనదేశ స్థూల జాతీయోత్పత్తిలో 4 శాతాన్ని మించేలా ఉన్నాయి. ఈ అనుత్పాదక ఖర్చు అభివృద్ధిని, ఉత్పత్తిని కొరవడేలా చేసి దేశాన్ని మరింత అప్పుల్లోకి కూరుకుపోయేలా చేస్తుంది. ప్రభుత్వమేమీ ఈ అనూత్పాదక రంగాన్నే గొప్ప ఉపాధి అవకాశాలు గల రంగంగా అభివర్ణిస్తూ, రిక్రూట్‌మెంట్ల పేరుతో కొంత మంది యువకుల భుజాలకు తుపాకులను వేలాడదీయడం మరి శోచనీయమైన విషయం. వీరికి ఆకర్షణీయమైన జీతభత్యాలతో పాటు, ఉద్యోగ భద్రత, పెన్షన్‌లే కాక డ్యూటీలో చనిపోతే 20 లక్షల పరిహారాలు ఇస్తున్నది ప్రభుత్వం. అదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, కార్మికులు తమ జీత భత్యాల పెంపుదల కోసం ఎడతెగని పోరాటాలు చేసినా, వాటిని పరిష్కరించక మొండి వైఖరిని అవలంబిస్తు న్నాయి. దేశంలో సరళీకృత విధానాలు మొదలైన నాటి నుండి పర్మనెంట్ ఉద్యోగాల మాటే లేకుండా పోయింది. ఉత్పాదక, సామాజిక రంగాల్లో కోత, భద్రత రంగాల్లో పెరుగుదల, సామ్రాజ్య వాదులు పన్నుతున్న రాజకీయ,ఆర్థిక, సైనిక వ్యూహంలో భాగమే.

ప్రజలు తమ దైనందిన సమస్యల పరిష్కారాల కోసమని పోరాటాల్లోకి దిగిన ప్రతిసారి, వారిని దారి మళ్లించేందుకు 'ఇదిగో యుద్ధం' అంటూ ప్రజలను ఇతర దేశాలపైకి రెచ్చగొట్టడం మన రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. యుద్ధాల్లో విధ్వంసాన్ని, వినాశనాన్ని చవిచూసిన ప్రజలేమో యుద్ధాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుంటే, అధికారంలోకి వచ్చిన ప్రతి రాజకీయ నాయకుడు మాత్రం యుద్ధం గురించే మాట్లాడుతాడు. పాకిస్థాన్ నుంచి పశ్చిమ సరిహద్దులో ప్రమాదం పొంచి ఉందని, అంతకంటే మించి దేశానికి భద్రతా సవాళ్లను ఈశాన్య సరిహద్దులో చైనా సిద్ధపరిచిందని, సరిహద్దులో చైనా చేస్తున్న రక్షణ ఏర్పాట్లను చూసైనా మనం బలంగా తయారు కాకపోతే, సాయుధ బలాలను ఆధునీకరించకపోతే రాబోయే రోజుల్లో ఫలితాలు తీవ్రంగా ఉంటాయని మన పాలకులు, మీడియా కారాలు, మిరియాలు నూరుతూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. నిన్నటిదాక పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టిన భారత పాలక వర్గాలు, నేడు ఆ వ్యతిరేకతను చైనా పైకి మళ్లించాయి. 50 సంవత్సరాల కింద జరిగిన యుద్ధంతో భారత-చైనా సంబంధాలు తెగిపోయి మిన్నకుండిన భారత్ నేడు చైనాతో సంబంధాలు మెరుగైన నేపథ్యంలో దౌత్యపరమైన పరిష్కారాలు ఎంచుకోకుండా ప్రతి వస్తువును చైనా నుండే దిగుమతి చేసుకుంటూ చైనాకు వ్యతిరేకంగా యుద్ధ ప్రచారాన్ని లంకించుకోవడం గమనార్హం. యుద్ధం వల్ల ఆస్తి నష్టం, ప్రాణ నష్టం పెద్ద ఎత్తున జరుగుతుందని, యుద్ధం భయంకరమైన వినాశనాన్ని సృష్టిస్తుందని మనకెంత తెలుసో, మన పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్‌లకు కూడా అంతే తెలుసు. యుద్ధం పట్ల మన దేశ ప్రజలు ఎంతటి వ్యతిరేకతను వ్యక్తపరుస్తున్నారో, అంతటి వ్యతిరేకతను చైనా, పాకిస్థాన్ దేశాల ప్రజలు కూడా వ్యక్త పరుస్తారనే విషయాన్ని మనం గమనంలో ఉంచుకోవాలి. యుద్ధం వల్ల కన్నీళ్లు కడగండ్లు తప్ప ప్రజలకొనగూరే ప్రయోజనం ఏమీ లేదనేది స్పష్టం. నిత్యం రక్షణ వ్యయాన్ని పెంచుతూ, సరిహద్దులను కాపాడే పేరుతో చేసే సైనిక తయారీల వెనక భారత పాలకుల విస్తరణవాద కాంక్ష లేదని చెప్పలేం. సరిహద్దులను విస్తరించుకోవడం రాజ్యంకున్న మొదటి లక్షణం.

సామ్రాజ్య వాదుల కుటిల పన్నాగాలతో, ఒకవేళ పొరుగు దేశాలతో యుద్ధమే బద్ధలైతే, నిర్ణయించిన సైనిక వ్యయాలతోపాటు అదనంగా మరిన్ని యుద్ధ ఖర్చులు వచ్చి మీద పడతాయి. 1971లో 14 రోజుల పాటు జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో 400 కోట్లు అదనంగా ఖర్చయితే 1999లో 56 రోజులపాటు జరిగిన కార్గిల్ యుద్ధంలో 10,000 కోట్ల రూపాయలు అదనంగా ఖర్చయ్యాయి. ప్రభుత్వం ఈ యుద్ధ ఖర్చులన్నింటిని 'యుద్ధపు సర్‌చార్జీ' రూపంలో బస్సు టికెట్ల, సినిమా టికెట్ల మీద ప్రజల దగ్గర నుండి వసూలు చేస్తుంది. ఇరాక్, ఆఫ్ఘన్ యుద్ధంలో కూరుకుపోయిన అమెరికా 16 ట్రిలియన్ డాలర్లు అప్పుల పాలయి, దాని ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతే, 80వ దశకంలో అఫ్ఘనిస్థాన్ యుద్ధంతో మొత్తం సోవియట్ యూనియనే పతనమైన విషయం మనకందరికి తెలిసిందే. ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని పాలక వర్గాలు 'అంతర్గత భద్రత'కై సాయుధ బలగాలపై ఆధార పడడమనేది వాటి రాజకీయ బలహీనతను, పతనాన్ని సూచిస్తున్నాయి. అటు దేశ భద్రతకై ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, ప్రజలపై ఆధారపడడం కాకుండా, కేవలం సైనికుల మీదనే ఆధారపడుతున్నారు. కానీ, చరిత్రలో తేలిన విషయం ఏమిటంటే, యుద్ధాలలో సైనికులు గెలిచినా, ఓడినా, చివరకు ఆ దేశాలను కాపాడింది, వాటిని రక్షించింది ఆ దేశ ప్రజలేననే విషయాన్ని మనమెన్నటికీ మరవకూడదు. అందుకు రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో తమ ప్రాణాలొడ్డి సోవియట్ యూనియన్‌ని, మిగతా ప్రపంచాన్ని రక్షించిన ప్రబల ఉదాహరణ చాలు.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

వరుస తుపాన్లు - పర్యావరణం

***ప్రపంచంలో ఆరు శాతం జనాభా ఉన్న అమెరికా, జపాన్ తొంబై నాలుగు శాతం జనాభా ఉన్న దేశాలను పర్యవరణ విధ్వంసంలోకి నెడుతున్నాయని అంటున్నారు* షేక్ కరిముల్లా**

ఈ సంవత్సరం వానలు బాగా ఉంటాయని పంచాంగం విని మురిసిన రైతులు ఆ వానలే కొంపముంచుతాయని ఊహించలేక పోయారు. మునుపెన్నడు లేనట్టుగా వరుస తుఫాన్లు వారిని కోలుకోలేని దెబ్బతీశాయి. ఖరీఫ్ పంట కళకళలాడుతున్న తరుణంలో తొలుత ఫైలీన్ తుఫాన్ వచ్చింది. దాని దెబ్బకు శ్రీకాకుళం జిల్లాలో పంటలన్నీ తుడిచి పెట్టుకుపోయాయి. ఆ వెంటనే హెలెన్ పంజా విసిరింది. ఏకంగా 16 జిల్లాలను అతలాకుతలం చేసింది. కోస్తాతో పాటు తెలంగాణ జిల్లాలలో కూడా పంటలు సర్వ నాశనమయ్యాయి. ఆ దెబ్బ నుండి తేరుకోకముందే 'లెహర్' విరుచుకుపడింది. కేవలం రెండు నెలల వ్యవధిలో ఇలా మూడు తుఫాన్లు, అతి భారీ వర్షాలు దాదాపు 2 వేల కోట్ల రూపాయల విలువైన పంటలను, సుమారు 30 లక్షల ఎకరాల్లోని పంటలను సర్వనాశనం చేశాయి. ఈ వరుస ప్రకృతి విపత్తులు ఈ ఏడాది వచ్చినంతగా ఎన్నడు రాలేదు. ఒకదాని వెంబడి ఒకటిగా విరుచుకు పడిన విపత్తులు యావత్ దేశాన్ని అతలాకుతలం చేసిన సంవత్సరం ఇది. అసలే కరువు కాలంలో కరెంటు కోత బారినపడి తీవ్రంగా నష్టపోయిన రైతులు ఈ ఖరీఫ్‌లో సర్వం కోల్పోయి మరింతగా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అంతేకాక ఇళ్లల్కు, ఇతర ఆస్తులకు, పశువులకు, జనానికి నష్టం కలిగించాయి. కొద్ది వ్యవధిలోనే ఎంతో తీవ్ర నష్టాన్ని, కన్నీళ్లలను, కడ గళ్లలను మిగిలిస్తున్న అసలు ఈ తుఫానుల కథా కమామీషు ఏంటో చూద్దాం.

సముద్రశాస్త్రం ప్రకారం తుఫాను అంటే గాలిలో పెద్ద సుడి గుండంగా భావించవచ్చు. ఇది 10 నుండి 15 కిలోమీటర్ల ఎత్తు వరకు వాతావరణంలో వ్యాపించి ఉంటుంది. సహజంగా వాయు గుండాలు బంగాళఖాతంలో ఏర్పడతాయి. ఆంధ్ర రాష్ట్రం సహజ సిద్ధంగా విశాలమైన తీర రేఖ గల ప్రాంతం (972 కి.మీ.). మన రాష్ట్రానికి రెండు తుఫాను ఋతువులున్నాయి. ఒకటి వేసవిలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు, రెండవది వర్షాకాలం చివరిలో సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు. తుఫానులు ఏర్పడడంలో వాయు గుండం ప్రథమ దశ. గాలి వేగం గంటకు 60 కి.మీ. మించకు ఉంటాయి. అదే గాలుల వేగం గంటకు 68 కి.మీ. చేరితే తుఫాను అంటారు. గంటకు 96 కి.మీ.కు చేరితే పెను తుఫాను అంటారు. 120 కి.మీ. చేరినప్పుడు దానిని 'హరికేన్'గా వ్యవహరిస్తారు.

సాధారణంగా తుఫానుల జన్మ స్థలం ఉష్ణ మండలపు సముద్ర ప్రాంతం. ఇందులో మొదటిది ఫసిఫిక్ మహా సముద్రం పశ్చిమ భాగం. ఇక్కడ సూర్యుడు ఉత్తరార్ధగోళంపైన ఉన్నప్పుడు (జూన్ నుంచి అక్టోబర్ వరకు) తుఫానులు ఏర్పడతాయి. ఈ కాలంలో 25 నుంచి 30 తుఫానులు ఏర్పడతాయి. ఒక సంవత్సరంలో రమారమి 60 నుంచి 80 తుఫానులు ఏర్పడతాయి. వాటిలో ఇంచుమించు సగం ఈ ప్రాంతంలో ఏర్పడతాయి. ఇక్కడ వీటిని 'టైఫూన్'లు అంటారు. ఈ టైఫూన్‌లు ఫిలిప్పీన్స్, చైనా, జపాన్‌లలో విధ్వంసం సృష్టిస్తాయి. ఫసిఫిక్ తర్వాత ప్రపంచంలో తుఫానులు ఏర్పడే రెండవ ముఖ్యమైన సముద్ర ప్రాంతం ఉత్తరార్ధగోళంలోని అట్లాంటిక్ మహా సముద్ర పశ్చిమ ప్రాంతం. ఇక్కడ ఏర్పడే తుఫానులను కూడా 'హరికేన్' అని అంటారు. ఇవి కరేబియన్ దీవులను, క్యూబా, వెస్ట్ ఇండీస్, మెక్సికో, దక్షిణ అమెరికాలపై ప్రభావాన్ని చూపిస్తాయి. ఇక మూడవ ప్రాంతం హిందూ మహా సముద్రం.

తుఫానులలో విపరీత స్థితి 'ఉప్పెన'. ఈ ఉప్పెనల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు ఎక్కువగా ఉంటాయి. ఉప్పెన సామాన్యంగా పెను తుఫానులతో కూడి వస్తుంది. ఐతే ఇవి చాలా అరుదు. ఇవి నదులు సముద్రంలో కలిసే ముఖ ద్వారాల వద్ద వస్తాయి. 20వ శతాబ్దం వరకు మన ప్రాంతంలో రెండు సార్లు వచ్చాయి. ఒకటి 1864లో మచిలీపట్నం వద్ద వచ్చింది. రెండవసారి కూడా 1949 అక్టోబర్ 27న మచిలీపట్నం వద్దే వచ్చింది. ఇక్కడే రెండు సార్లు రావడం విశేషం. ఒక ఉప్పెన 1977 నవంబర్ 19న దివిసీమ కృష్ణా జిల్లాలో వచ్చింది. ఇక ఆంధ్ర ప్రాంతానికి వస్తే, అక్టోబర్, నవంబర్ నెలలు ఆంధ్ర తీర ప్రాంతానికి తుఫాను నెలలుగా చెప్పవచ్చు. బంగాళఖాతం దక్షిణ భాగంలో అంటే అక్షాంశం 10 రేఖ వద్ద లేదా ఇంకా దక్షిణంగా ఏర్పడి అక్కడి నుండి వాయువ్యంగా పయనించి ఆంధ్ర తీరాన్ని తాకుతాయి. లేదా ఉత్తర తమిళనాడు తీరాన్ని తాకితే దక్షిణ కోస్తాలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాలో తుఫాను ప్రభావం ఉంటుంది. ఐతే ఎక్కువ ప్రభావితమవుతున్న జిల్లాలు నెల్లూరు, కృష్ణా, శ్రీకాకుళం, ఆ తరువాత ఉభయ గోదావరి జిల్లాలపై ప్రభావం ఉంటుంది. తదుపరి వరుసలో విశాఖ, గుంటూరు జిల్లాలు ఉన్నాయి. ఐతే ఉప్పెనలు, తుఫానులు 1933,1939,1945, 1949, 1955, 1969, 1977లలో గత శతాబ్దంలో వచ్చాయి. అన్నిటికంటే ఎక్కువ ప్రాణ నష్టం 1977లో దివిసీమ ప్రాంతం కృష్ణా జిల్లాలో జరిగింది. రమారమి 10,000 మంది చనిపోయారు. 1864లో మచిలీపట్నం, 1939లో కోరంగి కాకినాడ దగ్గర తాకిన పెను తుఫానులు ఉప్పెనలుగా సంభవించాయి. ఇవి రెండు పెను తుఫానుల చరిత్రలో వినాశనకరమైనవి. విశేషమేమంటే ఇంత విధ్వంసం మొత్తం కొన్ని గంటలలోనే జరిగిపోతుంది. ఒక తుఫాను జీవితకాలం వారం రోజుల నుండి 10-15 రోజులు మాత్రమే, తరువాత అవి క్షీణించి, వాయు గుండంగా మారి తర్వాత అల్పపీడన వ్యవస్థగా బలహీనపడి సమసి పోతాయి. ఇంత వినాశనం, నష్టంకు కారణాలైన తుఫానులపై చర్చ జరగాలి. నష్ట నివారణ చర్యలు చేపట్టాలి.

ఆంధ్ర రాష్ట్రానికి ముందెన్నడు లేని ఈ వరుస విపత్తులకు అసలు కారణాలను వెతకాల్సిన అవసరం, బాధ్యత పర్యావరణ వేత్తలకు, ప్రకృతి ప్రేమికులకు, సమాజం గురించి అలోచించే బుద్ధిజీవులకు, పౌర సమాజంపై ఉంది. మానవాళిని తీవ్ర మార్పులకు గురి చేసిన అపారమైన శాస్త్ర-సాంకేతిక విజ్ఞానం రెండు వైపుల పదునున్న కత్తిలాంటిది. సద్వినియోగం చేసుకుంటే సుఖ శాంతులతో వర్ధిల్లే అవకాశం ప్రపంచానికి కలుగుతుంది. దుర్వినియోగమైతే ప్రపంచ మనుగడే ప్రమాదంలో పడుతుంది. ఈ సందర్భంగా భూగోళం ఎదుర్కొంటున్న రెండు ప్రమాదాల గురించి చెప్పాలి. ఒకటి వర్తమాన మానవ సమాజాన్ని, ఈ భూగోళాన్ని తక్షణమే పూర్తిగా సర్వనాశనం చేయగల శక్తిగల అణ్వాయుధాలను ప్రయోగించే అణు యుద్ధ ప్రమాదం. ఇక రెండవది భవిష్యత్ మానవ సమాజాన్ని తాపీగా, కచ్చితంగా యమ యాతనకు గురిచేస్తూ నాశనం చేయగల శక్తి ఉన్న వాతావరణ కాలుష్యం వల్ల వేడెక్కుతున్న భూగోళం. అణు యుద్ధ ప్రమాదాన్ని చైతన్యంతో ఎదుర్కొని తాత్కాలికంగానైన అటకెక్కించాడు నేటి మానవుడు. ఈ స్పందనకు తాను బతకాలనే స్వార్థమే ప్రేరణ కావచ్చు. ఐతే రెండవ ప్రమాదాన్ని చైతన్యాన్ని ప్రదర్శించి నివారించకపోయిన, మరింత పెరగకుండా చేయడానికి ప్రయత్నించడం లేదు. ఇది బాధ కలిగించే అంశం. మన ముందు తరం వారు క్షేమంగా మనకు అందించిన ఈ అందమైన భూగోళాన్ని ఈతరం కూడా భావి తరాల వారికి అందివ్వాల్సిన కర్తవ్యం మనపై ఉంది. లేకుంటే వారు మనల్ని క్షమించరు. గతంలో కాలుష్య రహితంగా ఉన్న పర్యావరణం, నేడు పరిశ్రమలు, మోటరు వాహనాలు, అణు పాటవ పరీక్షలు, పేలుళ్లు, అడవుల నరికివేత వగైరాల వల్ల ఉత్పత్తి అవుతున్న బొగ్గు పులుసు వాయువు (కార్బన్‌డై ఆక్సైడ్-సి02) మిథైన్ గ్యాస్, నైట్రోజన్ఆక్సైడ్ వగైరా విష వాయువుల వలన గ్లోబల్‌వార్మింగ్ ఏర్పడి భూమి వేడెక్కుతుంది. పర్యావరణాన్ని రక్షించుకుందాం! వంటి హెచ్చరికలు తరచుగా వింటున్నాం. కాని ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నామని ఒక్కసారి ప్రశ్నించుకుంటే సమాధానం నిరాశ జనకమే. గ్లోబల్ హ్యూమాని టేరియన్ ఫోరం నివేదిక ప్రకారం వాతావరణంలో వస్తున్న విపరీతమైన మార్పుల వలన తీవ్రమైన వ్యాధులు, ప్రకృతి విపత్తులు వంటి వాటితో ఏడాదికి 3 లక్షలకుపైగా జనం చనిపోతున్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 50 లక్షలకు పెరగవచ్చని అంచనా. ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఏ స్థాయిలో ఉంటాయో అంతే స్థాయిలో దారుణంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు పతనం కాగలవు.

గత పదివేల సంవత్సరాలలో కంటే ఈ శతాబ్దంలో ధరణి ఉష్ణోగ్రత పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఉష్ణోగ్రత 2100 నాటికి 3.3 డిగ్రీల సెల్సియస్ పెరుగుతుందని శాస్త్రజ్ఞుల అంచనా. దీని కారణంగా వచ్చే శతాబ్దంలో సముద్ర మట్టాలు పెరిగి అనేక దీవులు, ప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం, ఫలితంగా 100 కోట్ల మంది నిరాశ్రయులు కావచ్చుని అంచనా. ఈ గ్లోబల్‌వార్మింగ్ మూలంగా 2040 నాటికి ఆసియాలోని అతి ముఖ్య జీవనదులన్నీ ఎండిపోతాయి. దీని కారణంగా 250 కోట్ల మంది ప్రజలు ప్రమాదానికి గురవుతారని ఐక్యరాజ్య సమితి సూచిస్తోంది. ఈ జీవ మనుగడకు తోడ్పడుతున్న ప్రకృతి సమతుల్యత వాతావరణ వ్యవస్థ దెబ్బతినడం మూలంగానే ఈ వరుస తుఫానులు, సునామీలు, భూకంపాలు రావడం, సముద్ర మట్టాలు పెరగడం, మంచుకొండలు కరగడం, మంచు తుఫానులు రావడం, పంట దిగుబడులు తగ్గడం, కరువులు, కొత్తకొత్త వ్యాధులు రావడం వగైరాలు సంభవిస్తున్నాయి. ఐతే ఈ వినాశనంకు ప్రథమ కారకులు ఎవరు? అంటే అమెరికా, దాని కనుసన్నుల్లో నడిచే బడా సామ్రాజ్యవాద దేశాలైన జపాన్, బ్రిటన్, జర్మనీ, రష్యా, చైనా దేశాలు. విష వాయువులు విడుదల చేయడంలో అమెరికా వాటాయే పెద్దది. దీని వాటా 25.7 శాతం కాగా చైనాది 15.6 శాతం. భారత్‌ది 4.6 శాతం. జర్మనీ, జపాన్, రష్యా దేశాలది 15 టన్నుల వరకు ఉంది. ఈ పరిస్థితిని నివారించడానికి ఐక్యరాజ్య సమితి నేతృత్వంలో 172కు పైగా దేశాలు 1992లో బ్రెజిల్‌లోని రియోడిజనీరోలో సమావేశం, 1997 డిసెంబర్‌లో జపాన్‌లోని 'క్యోటో'లో, మూడవ కీలక సమావేశం డిసెంబర్ 2009 'కోపెన్ హెగెన్'లో జరిగింది. ఈ సమావేశాలలో అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడమైనది. 2020 నాటికి పారిశ్రామిక దేశాలు విషవాయువులను 10-40 శాతం వరకు తగ్గించుకోవాలని తీర్మానించాయి. కానీ ఈ సంపన్న దేశాలు పరస్పర విమర్శలకే పరిమితమై అనుకున్న లక్ష్యం సాధించలేక పోయాయని రుజువైంది. తాజాగా 'దోహ'లో జరిగిన వాతావరణ సదస్సు కూడా నీరుకారి పోయింది. 200పైగా దేశాలు పాల్గొన్న ఈ సదస్సులో కూడా పరస్పర విమర్శలు మినహా, దీర్ఘకాలిక ప్రయోజనాలు ఆవిష్కృతం కాలేదు. ఫలితంగా ఈ వాతావరణ సంక్షోభాల కారణంగా వర్ధమాన దేశాలు అతలాకుతలం అవుతున్నాయి. ధరిత్రి సదస్సుల్లో తీసుకున్న కాలుష్య నివారణ తీర్మానాలను బడా దేశాలు తుంగలో తొక్కి, తమ పని తాము చేసుకుపోతున్నారు. ప్రపంచ జనాభాలో కేవలం 6 శాతంగా ఉన్న అమెరికా, జపాన్ దేశాలు, మిగిలిన 94 శాతం ప్రజల భవిష్యత్తును అంధకారంలో నెట్టడం సహించరాని విషయం. ప్రపంచ ప్రజలు చైతన్య వంతంగా దీనిని ఎదుర్కోకపోతే ఈ భూగోళం ప్రమాదంలో పడిపోతుంది. ఫలితంగా మానవజాతే కాకుండా ఇతర జీవరాశులు, ప్రకృతి కూడా అంతరించిపోయే ప్రమాదం ఎంతో దూరంలో లేదు అనడం అతిశయోక్తి కాదేమో. ఏమైనా ఇప్పటి వరకు మానవ సమాజం సృష్టించుకున్న చరిత్ర, విజ్ఞానం, సంస్కృతి అంతరించి పోకూడదు. ఈ ఫలాలు భావితరాలకు వరాలుగా అందివ్వాలి. ఆ దిశగా మానవజాతి మనుగడ, కోటానుకోట్ల జీవరాశుల ఉనికిని పరిరక్షించగల చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు స్వీకరించాలి. ఈ అందమైన ప్రకృతిని రక్షించుకోవాలి. నిల బెట్టుకోవాలి. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

(రచయిత ఉపాధ్యాయుడు) వీ

వీక్షణంకు వచ్చే రచనలలో కొన్ని జిరాక్స్ కాపీలు వస్తున్నాయి. జిరాక్స్ నాణ్యత సరిగా ఉండడంలేదు. కొన్నిటిలో చేతి రాతలు కూడా కష్టంగా ఉంటున్నాయి. అందువల్ల అర్థం చేసుకొని టైప్ చేయడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయి. అక్షరాలు అర్థమయ్యేలా రాయండి. జిరాక్స్ మీరు ఉంచుకుని ఒరిజినల్స్ మాకు పంపి సహకరించండి. – సం.

అభివృద్ధి బలిపీఠంపై మూలవాసులు

ఆర్థిక సంక్షోభం నుంచి బైటపడడానికి పెట్టుబడిదారులు, భారత దళారీ పాలకవర్గాలను తమకు అనుకూలంగా మార్చుకొని ఆదివాసి ప్రాంతాలను, ఖనిజాలను కొల్లగొట్టి ఆదివాసులను నిర్వాసితులను చేస్తున్నారని అంటున్నారు ఎం. నాగమణి

ఆదివాసులు ఈ దేశం మూలవాసులు. అంతేకాదు దేశానికి మూల స్తంభాలు. శ్రమ సంస్కృతికి, సమిష్టి జీవనానికి, నాగరికతకు ప్రతీకలు. అటవీ సంపదను కంటికి రెప్పలా కాపాడే వీర సైనికులు. తమ మనుగడ కోసం ప్రకృతితో, శత్రువుతో రాజీలేని పోరు చేసే సాహసవంతులు. కల్లాకపటం తెలియని నిర్మల హృదయులు. స్వంతాస్తి, స్వార్థం, దరిచేరనివ్వక ఆదిమ కమ్యూనిస్టు లక్షణాలను ఇంకా సజీవంగా నిలుపుకుంటూ స్వేచ్ఛే ఊపిరిగా ఒక్క ఆదివాసి తెగలు మాత్రమే జీవిస్తున్నాయి. ఈ దేశ సార్వభౌమత్వాన్ని, దేశవారసత్వ సంపదల్ని కాపాడుతున్నది వాస్తవంగా ఆదివాసులే. అలాంటి మూలవాసుల బతుకులను అభివృద్ధి నిరోధకుల కారణంగా చిన్నాభిన్నామవుతోంది. పురాతన ఆవాసాలను వదలడమంటే జీవన విధానాన్ని, సంస్కృతిని, జాతి అస్తిత్వాన్ని కోల్పోవడమేననీ, అది తమపాలిట మరణ శాసనమేనన్న, మూలవాసుల వాదనకూ 'అభివృద్ధి' తర్కానికి పొసగదు. విశాఖ మన్యంలో దశాబ్దకాలనికి పైగా బాక్సైట్ మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసులు చేస్తున్న పోరాటమే నిదర్శనం.

ఒకప్పుడు ఉత్తర అమెరికా ఖండంలోని రెడ్ ఇండియన్లను వెంటాడి, వేటాడి ఆకలికి మాడ్చి రోగాలతో కడతేర్చితేగానీ, ఆధునిక అమెరికా, కెనడాల నిర్మాణం జరగలేదు. అదే పని నేడు విశాఖ మన్యంలో సాగుతోంది. ఎప్పుడైనా, ఎక్కడైనా అభివృద్ధి సౌధానికి పునాదులుగా మారేది మూలవాసులేనన్న చేదు నిజాన్ని గుర్తించని మన్యం వాసులను వేటాడడం తప్పలేదు. తరతరాల నుండి తమ సాంస్కృతిక పునరుజ్జీవనానికి, వారసత్వ సంపదకు నిలయమైన అడవిని కబళించక తప్పింది కాదు. మన్యం మూలవాసులను మన్యం నుండి పారదోలే పని పోలీసులు నిర్విఘ్నంగా సాగేట్టు చేస్తున్నారు.

సామ్రాజ్యవాదులు తాము ఎదుర్కొంటున్న ఆర్థిక, ద్రవ్య సంక్షోభం నుండి గట్టెక్కడానికి, మనదేశంలో కూడ దళారీ పాలకవర్గాలను ఉపయోగించుకొని దేశ ప్రజలపై తమ దోపిడి పీడనలను తీవ్రతరం చేస్తున్నారు. దళారీ పాలకవర్గాలు ఇదే అదునుగా సామ్రాజ్యవాదులతో, మరీ ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంతో కుమ్మక్కై అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాల కోసం, తమ సొంత లాభాల కోసం మన్యంలోని భౌతిక సహజ వనరులను పెద్ద ఎత్తున లూటీ చేయడానికి బహుళజాతి కంపెనీలతో ఎం.ఒ.యు.లను కుదుర్చుకున్నారు. బాక్సైట్ మైనింగ్ తవ్వకాల వలన ప్రత్యక్షంగా 57 వేల మంది, పరోక్షంగా లక్ష మంది ప్రజలు నిరాశ్రయులవుతారు. లక్షన్నర ఎకరాల్లో విస్తరించిన కాఫీ, టేకు, 65 రకాల కలపేతర అటవీ ఉత్పత్తులు ఔషధ గుణాలున్న పిప్పిల మోడి కరక్కాయ, పసుపు అంతరించిపోయే ప్రమాదం ఉంది. 980 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న బాక్సైట్ నిక్షేపాలు వెలికి తీయడం వలన అడవి అంతర్ధానం కానుంది. వాటితో పాటే ఆదివాసుల సంస్కృతి, సంప్రదాయాలు, వారి ఉనికి, జంతుజాలం మొత్తం నాశనమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఎంతో అపురూపమైన జీవ వైవిధ్యపు సంపద మట్టిపాలు కానుంది. కేంద్ర, రాష్ట్ర సర్కార్లు తలపెట్టిన ఈ ప్రజా వ్యతిరేక బాక్సైట్ తవ్వకాలను ప్రజలు సమైక్యంగా ప్రతిఘటిస్తున్నారు. ప్రజలపై ప్రభుత్వ దాడి తీవ్రతరం అవుతున్నది. మన్యం వాసులు బాక్సైట్ మైనింగ్ కార్యకలాపాలను వ్యతిరేకించడమే కాదు, అందుకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వివిధ సందర్భాల్లో ధ్వంసం చేశారు. అంతటితో ఆగక బాక్సైట్‌కు అనుకూలంగా ఉన్న వారిని మహా పంచాయితీల్లో నిలదీశారు. అయినప్పటికీ వారి వైఖరిలో ఏ మాత్రం మార్పు కనిపించకపోయే సరికి, కొంతమందిని గ్రామ బహిష్కరణ విధించారు. ప్రభుత్వ సర్వేలను, ప్రజాభిప్రాయ సేకరణలను అడ్డుకున్నారు. దశాబ్దంపైగా కొనసాగుతున్న బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక పోరాటంపై రాజ్య నిర్బంధం తీవ్రంగా కొనసాగుతున్నది. ఇప్పటి వరకు ప్రభుత్వ సాయుధ బలగాల దమనకాండలో 10 మంది ఆదివాసులు ఆశువులు బాశారు. వీరిలో ఒక ఆదివాసి మహిళ కూడా ఉంది. 20 మంది వరకు ఆదివాసి మహిళలు అత్యాచారాలకు గురికాబడ్డారు. సాయుధ బలగాలతో జరిగిన ఘర్షణల్లో పదుల సంఖ్యలో ఆదివాసులు గాయపడ్డారు. వందలాది మంది ఆదివాసులపై అక్రమ కేసులు బనాయించి, సంవత్సరాల తరబడి కారాగారాల్లో మగ్గేలాగ నిర్బంధిస్తున్నారు. గనుల ఏర్పాటు వ్యతిరేకిస్తున్న ప్రజలపై ప్రభుత్వ హంతక బలగాలు అమలు చేస్తున్న ఫాసిస్టు దమనకాండ మూలంగా మన్యం అశాంతికి గురైంది. ఒక పక్క శాంతియుతంగా ప్రజలు చేస్తున్న ప్రజా పోరాటాలపై విషం గక్కుతూ దాడులు చేస్తూ, పౌర, ప్రజాస్వామిక హక్కులను కాలరాసి వేస్తూ మరొక పక్క శాంతి భద్రతలను కాపాడడమే తమ ధ్యేయమని చెప్పుకుంటున్నది. బాక్సైట్ గనుల స్థాపన రాజ్యాంగంలోని 244 షెడ్యూల్ ప్రకారం ఆదివాసుల ప్రయోజనాలకు వ్యతిరేకమైనది. విదేశీ పెట్టుబడిదారులకు దేశ సంపదలను దోచిపెట్టేందుకే ఈ గనులకు అనుమతులిచ్చారు. మన్యం మూలవాసుల చేతుల్లో విస్తారమైన భూములు అరణ్యాలుగా పడి ఉండడం కంటే, భూస్వాముల, దళారీ నిరంకుశ బూర్జువాలు, సామ్రాజ్యవాదుల చేతుల్లో బంగారు పంటలు పండడం మేలనే అభివృద్ధి తర్కం ఎక్కడైనా తిరుగులేనిదే! తూర్పు కనుమల జీవ వైవిధ్యానికి నిలయమైన మన్యం అడవి అంతరించి పోయి ఎడారిగా మారిపోనుంది. ప్రజలను, వారి ప్రయోజనాలను పూర్తిగా ధ్వంసం చేసి ప్రభుత్వం స్థాపించేది స్మశాన శాంతి మాత్రమేననీ స్పష్టమవుతున్నది. నిర్వాసితులయ్యే 57 వేల మంది ప్రజలకు పునరావాసం కల్పిస్తామని సర్కార్ అంటోంది. పునరావాసం వారి పాలిట సామూహిక మరణశిక్ష కాక తప్పదని శాస్త్రవేత్తల ఆందోళన.

చంద్రబాబు కాలంలో సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు

ఆంధ్రప్రదేశ్ ఒక ప్రయోగశాలగా మారినప్పటి నుండి విప్లవోద్యమాలతో పాటుగా పౌర, ప్రజాస్వామిక ఉద్యమాలపై అణచివేత తీవ్రస్థాయికి చేరింది. దీంట్లో భాగంగానే బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక పోరాటంపై కూడా రాజ్యం విరుచుకుపడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పాలనలో అణచివేత తారా స్థాయికి చేరింది. తరతరాల పోరాట వారసత్వం మూడు దశాబ్దాలకు పైగా ఇక్కడ కొనసాగుతున్న విప్లవోద్యమం వెదజల్లిన చైతన్యం మాసిపోలేదని పాలకులకు తెలుసు. నివురు కప్పిన నిప్పులా అది మళ్లీ రాజుకుంటుందని పాలకుల భయం. వాళ్ల భయాన్ని నిజం చేస్తూ మన్యంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న 'కాఫీ తోటల స్వాధీన పోరాటం' బద్ధలై సుమారు 600 హెక్టార్ల కాఫీ తోటలు ఆదివాసుల పరం అయ్యాయి. ఈ పోరాటం విశాల ప్రాంతంలో ఉన్న ఆదివాసులపై మంచి ప్రభావాన్ని వేసింది. ఈ పోరాట ప్రభావంతో మరిన్ని ప్రాంతాల్లో కాఫీ తోటల స్వాధీనం కోసం ఆదివాసులు సంసిద్ధమవుతున్నారు. ఇంకా మరెన్నో దైనందిన సమస్యలపై పోరాటానికి నడుం భిగిస్తున్నారు. ఇక్కడ మళ్లీ విప్లవోద్యమం పుంజుకోడానికి భూమికగా ఉన్న బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక పోరాటం కాఫీ తోటల స్వాధీన పోరాటాలను పాలకులు సహించలేక పోతున్నారు.

ఈ ప్రాంతంలో పోలీసు బలగాల సంఖ్య పెంచుతున్నారు. నిత్యం కూబింగ్స్ చేపట్టి అడవులను జల్లెడపడుతున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా 2012 మే 10న విశాఖ జిల్లా జి. మాడుగుల మండలం పినలువ్వాసింగి అటవీ ప్రాంతంలో తప్పిపోయిన పశువుల కోసం వెతుకుతున్న ఇద్దరు ఆదివాసులను పట్టుకొని హత్య చేశారు. ఆపై ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. ఆదివాసి గూడెంలపై పడి చేసే ఆకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. 2013 జూలైలో విశాఖ జిల్లా, చింతపల్లి మండలం, బలపం పంచాయితీ దిగువ జనాభా గ్రామంపై బిఎస్ఎఫ్ బలగాలు దాడి చేశాయి. పండు ముసలి నుండి మొదలుకొని పసి పిల్లల వరకు దొరికిన వారిని దొరికినట్టు చితక బాదారు. ఆరు మంది ఆదివాసులు తీవ్రంగా గాయపడ్డారు. బంగారం, డబ్బు, వెండి, ఇతర విలువైన ఆస్తులు లూటీ చేశారు. ఈ పరంపరలో ఒడిషా - ఆంధ్ర సరిహద్దు గ్రామాలైన దబ్బలపాడు, దూద్‌పల్లి, రోళ్లగెడ్డ గ్రామాలపై కూడా బిఎస్ఎఫ్ బలగాల దాడులు కొనసాగాయి. ఇదే నెల 22న ఒడిషా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా కె.గుమ్మ బ్లాక్ పరిధిలోని వేలంపాక గ్రామంపై దాడి చేసి ఆ గ్రామస్తుడైన వేణును అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారు. చివరకు శవాన్ని కూడా కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా పూడ్చి పెట్టేశారు. సెప్టెంబర్ 13న మల్కాన్‌గిరి జిల్లా పొడియా బ్లాక్ షీలా కట్ట అనే గ్రామ సమీపంలో పొలం పాకల వద్ద నిద్రిస్తున్న విప్లవ ప్రజాసంఘ కార్యకర్తలపై అకస్మాత్తుగా దాడిచేసి, 13 మంది నిరాయుధులను హత్య చేశారు. ప్రభుత్వ ప్రత్యేక సాయుధ బలగాల దురాగతాలను ఈ ప్రాంత ప్రజలు ఎన్నో అనుభవిస్తున్నారు.

ప్రజాస్వామ్య భారతదేశంలో జీవించే హక్కును రాజ్యాంగం ప్రతి పౌరునికి కల్పించిన ప్రాథమిక హక్కును హరించే అధికారం సమాజంలో ఏ వ్యక్తి గానీ, ఏ ప్రభుత్వానికి గానీ లేదు. ఒక వ్యక్తిని నేరస్తునిగా నిర్ధారించి శిక్షించే హక్కు న్యాయస్థానానికి మాత్రమే ఉంటుంది. అటువంటిది పోలీసు యంత్రాంగమో, కార్యనిర్వహణ యంత్రాంగమో నిందితులను ఏకపక్షంగా నేరస్తుడిగా నిర్ధారించి, సమాజ అభివృద్ధి రక్షణ పేరుతో అతని, ఆమె ప్రాణాలను హరించడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగం కల్పించిన (ఆర్టికల్ 21) జీవించే హక్కుకి భంగకరం. ఇన్ని రకాల నియమ నిబంధనలతో ఉన్న భారతావనికి పచ్చని వడ్డానంలా సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిలయంగా ఉన్న అపార సహజ వనరులకు పెట్టని కోటలా ఉన్న మన్యం అడవి నేడు రణక్షేత్రంగా మారింది. బాక్సైట్ వ్యతిరేకోద్యమానికి నీడ నేడు ఆదివాసులకు శాపంగా మారిందా? లేక ప్రభుత్వమే మార్చిందా? ఆపరేషన్ గ్రీన్‌హంట్ (హరితవేట) పేరిట రాజ్యం తలపెట్టిన సాయుధ కార్యక్రమం మన్యం పచ్చ దనాన్ని పొట్టన పెట్టుకొని వేలకోట్ల రూపాయలను గడించడానికి అనేది బుద్ధిజీవులందరూ గమనించాల్సిన విషయం. బయట మావోయిస్టుల ఏరివేతగా లక్ష్యంగా కనిపిస్తున్నా దాని అంతర్గతంగా మూలవాసుల నిర్మూలన, స్థానభ్రంశం చేయడం అనంతరం ఇక్కడ అపారమైన ఖనిజ నిక్షేపాలను వెలికితీయడానికి మార్గం సుగమం చేయడం, వాటిని సామ్రాజ్యవాదులకు కట్టబెట్టడం అనేది నిర్వివాదమైన అంశం.

చారిత్రాత్మకంగా ఆదివాసులపై జరిగిన సంఘటలను కూడా ప్రస్తుతం మనం సందర్భానుచితంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. 1940 ల నుంచి నాలుగు దశాబ్దాల పాటు బ్రెజిలియన్ రెడ్ ఇండియన్లపై జరిగిన ఊచకోత, అత్యాచారాలు, చిత్రహింసల వంటి నేరాలు మూలవాసులను జంతువుల కంటే హీనంగా జమకట్టి ఇండియన్ తెగలు అంతరించిపోయేలా చేసినది. వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ది ఇండియన్ ప్రొటెక్షన్ సర్వీసెస్ అధికారులే బొటనవేళ్లకు తాళ్లు కట్టి చెట్టుకు వేలాడదీసి కొట్టి అతిక్రూరంగా సాగించిన హత్యాకాండ, నేడు బ్రెజిల్‌లో బడా భూస్వాములు తిరిగి చెరుకు, పామ్ అయిల్ తోటలతో చుట్టుముట్టేయగా, సంప్రదాయ జీవనాధారం కరువై ఉక్కిరిబిక్కిరవుతున్న ఇండియన్లను ఇప్పటికీ తుపాకీ పట్టిన వారెవరైనా వేటాడవచ్చు. కేసులు నమోదుకావు. శిక్షలుపడవు. అమెరికా సరసన భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వ స్థానం కోసం అర్రులు చాస్తున్న బ్రెజిల్, భారత్‌కు అదే న్యాయం వర్తిస్తుందనుకోవాలా? ప్రస్తుతం దీని తరహాలోనే మన్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన గ్రీన్‌హంట్ వలన మూలవాసులు వినాశనం అవుతారనీ చెప్పవచ్చు.

ఆదివాసుల జీవితంలో ఇంత విధ్వంసం సృష్టిస్తూ వాళ్లకు బతుకు లేకుండా, ఇక్కడ జీవవైవిధ్యం, పర్యావరణాన్ని విధ్వంసం చేయనున్న బాక్సైట్ మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఏ రాజకీయ (బూర్జువా, భూస్వామ్య) పార్టీలు పట్టించుకోవడం లేదు. చివరకు ఆదివాసుల కోసమే పని చేస్తున్నామని చెప్పుకునే పార్టీలు కూడా మౌనంగా ఉన్నాయి. ఫలితంగా ఆదివాసుల వ్యతిరేకత ఉద్యమ రూపం సంతరించుకోవడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి, 65 సంవత్సరాలు దాటిపోయిన ఆదివాసుల అభివృద్ధిని పాలకవర్గాలు ఏనాడు పట్టించుకోలేదు. కానీ ప్రస్తుతం అభివృద్ధి పేరుతో అభివృద్ధికి ఆటంకం మావోయిస్టు పార్టీ కనుక మావోయిస్టులను అణచివేస్తామని ప్రభుత్వం అంటుంది. మావోయిస్టుల అణచివేత సాకుతో పెద్ద ఎత్తున సాయుధ బలగాలను మన్యం నిండా దింపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో పాలకులు దాడిని ప్రారంభించి కొనసాగిస్తున్నారు.

బహుళ జాతి కంపెనీలకు ఇక్కడి వనరులను, అటవీ సంపదలను, బాక్సైట్ మైనింగ్‌ను ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నందుకే ఇంతటి మారణకాండ జరుగుతున్నది. ప్రభుత్వం ఆదివాసులపై తలపెట్టిన దాడి ప్రారంభంలోనే ఇంతటి అమానుషకాండ జరిగితే ఇక దాడి ఉధృతమైతే ఇక్కడి ఆదివాసి జాతి హననం జరుగుతుందనడంలో సందేహం లేదు.

గతితార్కిక వ్యవసాయం

మార్క్సిజం - లెనినిజం - మావోయిజం అనే సైన్స్‌ను వ్యవసాయానికి అన్వయించి, గొప్ప ప్రయోగాలు చేసి, దిగుబడిని పెంచిన ఆనాటి చైనా రైతుల అనుభవాలను వివరిస్తున్నారు **లోకసంచారి**

మార్క్సిజం – లెనినిజం – మావోయిజం (ఎంఎల్‌ఎం)కు చెందిన తత్వజ్ఞానంతో వ్యవసాయ దిగుబడులు పెంచవచ్చా? పెంచవచ్చని నిరూపించారు మావో కాలపు సోషలిస్టు చైనా రైతులు. దిగుబడులు ఎలా పెంచాలని చెప్పేది వ్యవసాయ శాస్త్రవేత్తలు కదా? రసాయనిక ఎరువులు, హైబ్రిడ్ విత్తనాలు వాడితే దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెపుతారు కదా? మరి రైతులు దిగుబడి ఎలా పెంచారు? ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఉదయిస్తాయి. భావవాదాన్ని నమ్మే వారైతే దేవుళ్లకు పూజలు చేస్తే, అదృష్టం బాగుంటే దిగుబడులు పెరుగుతాయని నమ్ముతారు. అయితే, వాస్తవం ఏంటంటే, ఐదవ తరగతి కూడా చదవని రైతులు, పిహెచ్‌డి చేసిన వ్యవసాయ శాస్త్రవేత్తల కన్నా గొప్ప ప్రయోగాలు చేసి, విజయాలు సాధించారు. వారి విజయాల వెనుక ఏ వ్యవసాయ శాస్త్రవేత్త లేడు. ఏ రసాయనిక ఎరువులు లేవు. ఏ హైబ్రిడ్ విత్తనాలు లేవు. ఏ దేవుళ్ల ఆశీస్సులు, అదృష్ట జాతకాలు లేవు. ఏ విజయ రహస్యాలు, ఏ షార్ట్‌కట్‌లు లేవు. వారి విజయం వెనుక ఎంఎల్‌ఎం తత్వశాస్త్రం అందించిన సైంటిఫిక్ ఆలోచనా విధానం ఉంది. శ్రామిక వర్గానికి నిరంతరంగా సేవ చేయడమే నిజమైన దేశభక్తి, జీవిత పరమావధి అనే ఆలోచనా దృక్పథం ఉంది.

చైనాలో 1950–60 దశకాలలో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణంలో భాగంగా ఏర్పడిన కమ్యూన్ వ్యవసాయ క్షేత్రాల్లో ఎందరో రైతులు ఎంఎల్‌ఎం తత్వశాస్త్రాన్ని నేర్చుకొని, దాన్ని వ్యవసాయానికి అన్వయించి, ఎన్నో ప్రయోగాలు చేశారు. వారిలో నుండి కొందరు రైతులు తమ అనుభవాలను క్రోడీకరిస్తూ, తాము సాధించిన విజయాలను తత్వశాస్త్ర వ్యాసాల ద్వారా 'పీకింగ్ రివ్యూ' పత్రికలో ప్రచురించారు. ఎంఎల్‌ఎం తత్వశాస్త్రాన్ని వివిధ రకాల పంటలకు అన్వయించి, విజయాలు సాధించిన రైతుల విజయ గాథలు ఎన్నో అచ్చయినప్పటికీ, సౌలభ్యం రీత్యా కేవలం ఒక్క రైతు వ్యాసాన్నే ఈ వ్యాసం రాయడానికి వాడడం జరిగింది. 'యావో–షి–చాంగ్' అనే నాలుగవ తరగతి మాత్రమే చదివిన ఒక కమ్యూన్ వ్యవసాయ క్షేత్ర రైతు నాయకుడు తాను మావో తత్త్వశాస్త్ర రచనలను చదివి సైంటిఫిక్ ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేసుకొని, దాన్ని తమ కమ్యూన్ వ్యవసాయ క్షేత్రంలో పండించిన వేరుశనగ పంటకు అన్వయించాడు. అతని అనుభవాలేంటో చూద్దాం.

ఆచరణలో తప్పు, సైన్స్ వైఫల్యం కాదు

తమ కమ్యూన్‌కే చెందిన పక్క గ్రామం వారు వేరుశనగ పంటపై చేసిన ఒక ప్రయోగం విజయం సాధించిందని తెలుసుకొన్నాడు యావో అనే రైతు. అతను వ్యవసాయ బ్రిగేడ్ నాయకుడు అయినందున, తమ గ్రామ కమ్యూన్ సభ్యులకు ఆ పద్ధతి పాటించవలసిందిగా చెప్పాడు. 'లోతైన చాళ్లు తీసి, పలుచని మట్టి పొర కింద విత్తనం నాటాలి' అనేది పక్క గ్రామం వారు కనిపెట్టిన పద్ధతి. అయితే, పక్క గ్రామం వారి భూముల వలె తమ భూములు చదునైనవి, అంత సారవంతమైనవి కానందున, కొంచెం దగ్గరగా విత్తనాలు వేయాలని యావో చెప్పాడు. అంటే, పక్క గ్రామం వారి పద్ధతికి కొంచెం మార్పు చేశారు. దాంతో, లోతైన నాగటి చాళ్లు తీసే క్రమంలో ఆ మట్టి అప్పుడే విత్తనం వేసిన పక్క చాలుపై పడ్తూ వచ్చింది. తత్ఫలితంగా, 'పలుచటి మట్టి పొర కింద విత్తనం నాటాలి' అనే పక్క గ్రామం అభివృద్ధి చేసిన పద్ధతి కాస్తా ఆచరణలో, సాంద్రత కలిగిన మట్టి పొర కింద నాటడంగా మారింది. ఆ సంవత్సరం వేరుశనగ దిగుబడి అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దాంతో యావో నాయకత్వం వహిస్తున్న వ్యవసాయ కమ్యూన్ సభ్యులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. కొందరైతే తాము ఆ సంవత్సరం కష్టాలు అనుభవించడానికి యావోనే కారణం అనే స్థాయి ఆరోపణలు కూడా చేశారు.

ఈ అడవి మాదేననీ ఉద్యమిస్తున్న ఆదివాసుల పోరాటం వాళ్లకు సంబంధించినదే కాదు. దేశంలోని వనరులను, సంపదను బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడాన్ని ఆదివాసులు వ్యతిరేకిస్తున్నా, ఈ పోరాటం దేశ సార్వభౌమత్వానికి, స్వయం ప్రతిపత్తికి, స్వావలంబనకు సంబంధించినది. కనుక ఈ పోరాటానికి మద్దతునిస్తూ, ప్రభుత్వం తలపెట్టిన దమనకాండను వ్యతిరేకిస్తూ ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను రద్దుచేయాలనీ, ఉద్యమించాల్సిన అవసరం ప్రజలపై, ప్రజాస్వామిక వాదులందరిపై ఉంది.

భారత రాజ్యాంగ 5వ, 6వ షెడ్యూల్ ప్రకారం 1996లో 73 రాజ్యాంగ సవరణ ద్వారా సంకల్పించిన పంచాయితీరాజ్ షెడ్యూల్డ్ ప్రాంతాల విస్తరణ చట్టాన్ని (పెసా) అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం ఆదివాసులు నివసించే ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా, పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాలన్నా గ్రామ సభ అనుమతి ఉండాలి. ఈ చట్టాల ప్రకారం ఆదివాసి ప్రాంతాలను ఆదివాసులే పరిపాలించుకునే అధికారం సంక్రమించింది. ఈ చట్టాల ప్రకారం ఆపరేషన్ గ్రీన్‌హంట్ మన్య ప్రాంతంలో రాజ్యాంగ విరుద్ధంగా కొనసాగుతోంది. కనుక ఆదివాసుల మనుగడను కాపాడుకోవడం కోసం యావత్ ప్రజానీకం గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయకుంటే భారత పాలకులు ఆదివాసి తెగలను సామ్రాజ్యవాద సిద్ధాంతాలతో అంతమొందిస్తారనేది అందరూ గుర్తించాల్సిన విషయం.

(రచయిత ఆదివాసి ఉద్యమ కార్యకర్త)

వీ

అయితే, యావో మాత్రం ఈ వైఫల్యాన్ని పెద్ద సవాలుగా తీసుకొన్నాడు. అసలు తప్పు ఎక్కడ జరిగిందో తెలుసుకోవాలంటే సైంటిఫిక్ ఆలోచనా దృక్పథం అవసరమని, దాని కొరకు చైర్మన్ మావో రచనలను సరిగ్గా అర్థం చేసుకొని, ఆచరించడమే మార్గమనే నిర్ణయానికి వచ్చి, వాటిని మరింతగా చదవడం ఆరంభించాడు.

నిజాయితీ కలిగిందే సైన్స్

మావోయిజం అందించిన 'విమర్శ – ఆత్మ విమర్శ' అనే సైంటిఫిక్ పద్ధతిని ఉపయోగించి తనను తాను ఆత్మవిమర్శ చేసుకున్నాడు. గ్రామస్తుల స్పందనలో, విమర్శలో న్యాయముందా అని ఆలోచించాడు. 'మన అధ్యయనాన్ని సంస్కరించుకుందాం' (రిఫార్మ్ అవర్ స్టడీ) అనే రచనలో 'మార్క్సిజం – లెనినిజం ఒక సైన్స్. సైన్స్ నిజాయితీతో కూడిన, పకడ్బందీ విజ్ఞానం. సైన్స్‌తో జిమ్మిక్కులు చేయడానికి ఏ అవకాశమూ లేదు. అందుకే, మనం నిజాయితీగా ఉందాం' అని మావో అన్న మాటలు జ్ఞాపకం చేసుకున్నాడు. ఆత్మవిమర్శలో భాగంగా నిజాయితీతో తన తప్పుల్ని, లోపాల్ని ఒక లిస్టుగా రాసుకున్నాడు.

అవి ఏంటంటే, ఇతరులు కనిపెట్టిన పద్ధతిని తాను లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయలేదు. ఆ పద్ధతిని తమ గ్రామ భూ పరిస్థితికి అనుగుణంగా మార్పు చేయలేదు. ముందుగా చిన్న స్థాయిలో ఆచరించి, ఫలితాలను అధ్యయనం చేయలేదు. పైగా, తాను విజయానికి ఒక గొప్ప షార్ట్‌కట్‌ను కనుగొన్నట్టుగా భావించి, తొందరపాటుతో ఆ పద్ధతిని తన వ్యవసాయ బ్రిగేడ్‌పై రుద్దానని అర్థం చేసుకున్నాడు. మావోయిజం ప్రకారం ఇది నిజాయితీతో కూడిన ప్రవర్తన కాదని, ఇది సైన్స్‌తో జిమ్మిక్‌లు ఆడుకోవడమేనని అర్థం చేసుకున్నాడు. మావోయిజం అనే సైంటిఫిక్ ఆలోచనా దృక్పథం ప్రకారం ఒక పెద్ద శత్రువును (అంటే సమస్యను) విజయవంతంగా ఎదుర్కోవాలంటే అధ్యయనంలో కాని, ఆచరణలో కాని దీర్ఘకాలిక పోరాట పంథా ఉండాలి. త్వరితగత ఫలితాల కోసం తొందర పాటు నిర్ణయాలు తీసుకోకూడదని, అలా చేస్తే అనివార్యంగా వైఫల్యాలకు కారణమవుతుందని అర్థం చేసుకున్నాడు. విజయం సాధిస్తే తన గొప్ప అని, వైఫల్యం చెందితే సైన్స్ తప్పని చెప్పే రివిజనిస్టు భావజాలం లేని యావో తాను ఒక నాయకుడిగా శాస్త్రీయంగా, నిబద్ధతతో నాయకత్వం వహించలేదని, అందుకే ప్రజలు తనను తప్పుపట్టడంలో న్యాయం ఉందని అర్థం చేసుకున్నాడు.

మావో తన 'ఆచరణ గురించి', 'వైరుధ్యం గురించి' అనే రచనల్లో, 'ఎవరైతే సమస్యను ఒకే కోణంలో, పైపైనే చూస్తారో, ఆ సమస్య గత చరిత్రను, ప్రస్తుత పరిస్థితిని కలిపి మొత్తంగా చూడరో, ఆ సమస్యకున్న గుణం, దాంట్లో ఉండే వివిధ అంశాల మధ్య ఉన్న అంతర్గత సంబంధాలను (అంటే సమస్య అంతస్సారాన్ని) అర్థం చేసుకోరో, వారు అనివార్యంగా వైఫల్యం చెందుతారు' అని అన్న మాటలను జ్ఞాపకం తెచ్చుకొని, 'సైన్స్‌తో నిజాయితీగా ఉండు' అనే మావో సూక్తిని కచ్చితంగా పాటించాలనుకున్నాడు.

నిజాయితీగా ఉండడమంటే

'నిజాయితీగా ఉండడమంటే వాస్తవాల (ఫ్యాక్ట్స్) నుండి నిజాన్ని (ట్రుత్) తెలుసుకోవడం. కళ్ల ముందు వాస్తవికంగా ఉన్న వాటినే 'వాస్తవాలు' అంటారు. ఈ వాస్తవాల మధ్య ఉన్న అంతర్గత సంబంధాలనే, అంటే వాస్తవాలను నడుపుతున్న సూత్రాలనే 'నిజాలు' అంటారు. 'నిజాలు' తెలుసుకోవడమంటే పరిశోధించడం', అని మావో అంటాడు. ఈ పేరాను యావో మరిచిపోలేనంతగా ఎన్నో సార్లు చదివాడు.

వింటే కాదు, తింటేనే రుచి తెలుస్తుంది

తాను సరైన మార్గంలో నడవాలంటే, సైంటిఫిక్‌గా ఆలోచించాలంటే, శ్రామికవర్గ విజయానికి కావలసిన కమ్యూనిస్టు ప్రవర్తన కలిగి ఉండాలంటే, ఇంకా నేర్చుకోవాల్సిన అవసరం యావోకు అర్థమయ్యింది. మావో చెప్పినట్టు, 'ఎవరైనా ఒక విషయం గురించి తెలుసుకోవాలంటే, ఆ విషయంతో సాన్నిహిత్యం లేకుండా, ఆ అంశానికి చెందిన వాతావరణంలో నివసించకుండా, ఆచరించకుండా, ఆ విషయం గురించి లోతుగా తెలుసుకునే అవకాశం లేదు. పియర్ అనే పండు రుచి ఎలా ఉంటుందో నీకు తెలుసుకోవాలని ఉంటే, దాన్ని నువ్వే తినక తప్పదు'.

మావో చెప్పిన ఈ మాటల్ని యావో తన పరిస్థితికి అన్వయించు కున్నాడు. తాను నాయకత్వ పనులల్లో బిజీగా ఉన్నప్పటికీ, వేరుశనగ దిగుబడి పెంచే టెక్నిక్‌లపై పట్టు రావాలంటే వేరుశనగ పంటతో సాన్నిహిత్యాన్ని పెంచుకోవాలి. ఆ వాతావరణంలోనే నిరంతరంగా గడపాలి. ఆ పంట అంతర్, బహిర్ విషయాలన్నీ ఆచరణలో ఉంటూ తెలుసుకోవాలి. అప్పుడే దాన్ని మార్చాలి అని అర్థం చేసుకున్నాడు.

మావోయిజం నుండి యావో నేర్చుకున్న మరో సైంటిఫిక్ సూత్రం ఏంటంటే, 'వ్యతిరేకాంశాల చలనాన్ని (మూవ్‌మెంట్ ఆఫ్ ఆపోజిట్స్) పరిశీలించాలి. విశ్లేషించాలి. ఆ విశ్లేషణను ఆధారంగా చేసుకొని, వాటిలో ఉండే వైరుధ్యాలను పరిష్కరించే పద్ధతులను సూచించడమనే దానినే ప్రధానంగా మనకు గతితార్కిక ప్రాపంచిక దృక్పథం నేర్పుతుంది'. దీన్ని యావో తన సమస్యకు అన్వయించుకున్నప్పుడు, వేరుశనగ పంటను, దాని చలన (అభివృద్ధి) క్రమంలో పరిశీలించాలి, విశ్లేషించాలి. అలాగే, ఆచరణ ద్వారా పంట అభివృద్ధిని నియంత్రిస్తున్న వైరుధ్యాలను, సూత్రాలను కనుగొని, ఆ సమస్యలకు పరిష్కారాలను ఎంఎల్ఎం గతితార్కిక సూత్రాల ద్వారా కనుగొనడంగా అర్థం చేసుకున్నాడు.

తత్వశాస్త్ర అధ్యయనం ద్వారా సాధించిన సైంటిఫిక్ జ్ఞానాన్ని ఆచరణలో అమలు చేయడానికి క్షేత్రంలోకి దిగాడు. ఈ సారి ప్రయోగాత్మకంగా చిన్న స్థాయి రెండు క్లస్టర్లని (మడులను) తన పరిశోధనకు ఎంచుకున్నాడు. ప్రతి రోజు పగలు తనిఖీకి వెళ్లడమే కాకుండా, రాత్రి కూడా మూడు సార్లు వెళ్లి పరిశీలించే వాడు. వింటే కాదు తింటేనే రుచి తెలుస్తుంది. విప్లవం చేయాలంటే విప్లవకారునిగా ఉండాల్సిందేననే మావో మాటలను తూచ తప్పకుండా పాటించాడు. ప్రతి చిన్న మార్పును కూడా పుస్తకంలో రాయడం మొదలు పెట్టాడు. తాను పరిశీలిస్తున్న మొక్కలకు మొలకెత్తిన ప్రతి పువ్వుకు ఒక లేబుల్, నంబర్ వేసి అతికించాడు. ఆ పువ్వులు ఏ రోజు, ఏ సమయంలో పూశాయి, పువ్వు స్థానంలో కాయ ఎప్పుడు కాసింది, ఆ కాయ భూమిలోకి ఎప్పుడు చొచ్చుకు వెళ్లింది, ఆ కాయకొన నుండి వేరుశనగలు ఎప్పుడు మొలిచాయి, ఒక్కొక్క కాడకు ఎన్ని వేరుశనగలు మొలిచాయి, ఆయా సమయాల్లో వాతావరణం ఎలా ఉంది లాంటి మార్పులను రికార్డ్ చేశాడు. కొన్ని రాత్రులైతే పంట చేనులోనే గడిపేవాడు.

ఈ అధ్యయనం ద్వారా యావోకు సూక్ష్మస్థాయి అంశాలు కూడా అర్థమయ్యాయి. ఉదాహరణకు, ప్రధాన కాండానికి మొదటగా మొలిచే (కుడి, ఎడమల) రెండు జతల కొమ్మలకే అత్యధికంగా కాయలు కాశాయి. ఇవ్వే మిగితా కొమ్మల కన్నా ముందుగా పెరిగి, పువ్వులు కాసి వేరుగా మారాయి. ఆ వేరుకు మొలిచిన వేరుశనగలు కూడా నిండుగా, బలంగా మొలిచాయి. ఈ రెండు జతల కొమ్మల పెరుగుదల, అభివృద్ధి మొత్తం పంట దిగుబడిపై అత్యంత ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి.

అలాగే వేరుశనగలు సూర్యోదయానికి కొంచెం ముందు వికసిస్తాయనే వాస్తవాన్ని రాత్రులు వెళ్లి అక్కడే గడిపిన రోజుల్లో గ్రహించాడు. ఇలా రాత్రులు వెలుతున్న క్రమంలో ఒక రోజు రాత్రి బాగా వర్షం పడింది. ఈ ఒక్క రోజు రాత్రి చేనుకు వెళ్లనంత మాత్రాన జరిగే నష్టమేమీ లేదు అని అనుకున్నాడు. అయితే, మావో బోధనలు గుర్తుకు వచ్చాయి. 'మార్క్సిస్టు తత్వశాస్త్రానికి చెందిన గతితార్కిక భౌతికవాదం రెండు విశిష్టమైన లక్షణాలు కలిగినది. ఒకటి, దాని వర్గ స్వభావం, అంటే అది కేవలం శ్రామిక వర్గ సేవ కోరకే ఉంది. రెండు, దాని ఆచరణాత్మకత (ప్రాక్టికాలిటీ)', అని మావో అంటాడు. ఆచరణాత్మకమైన ఎంఎల్ఎం అనే సైన్స్‌ను మనస్ఫూర్తిగా, సైంటిఫిక్‌గా అమలు చేస్తేనే, ఎన్ని కష్టాలెదురైనా శ్రామికవర్గ సేవలో నిరంతరంగా ఉండడమనే వర్గ స్వభావాన్ని అమలు చేస్తేనే అంతిమంగా విజయం సాధ్యమవుతుందని తన పరిస్థితికి అన్వయించుకున్నాడు యావో. ఎలాంటి అడ్డంకులు ఉన్నప్పటికీ, రాత్రి కూడా చేను వద్దకు వెళ్లవలసిందేనని నిర్ణయించు కుంటాడు. ఆ రాత్రి మొత్తం తడిచి పోయి, చలితో వనికి పోతాడు. అయినా ఉక్కు క్రమశిక్షణతో, మొక్కవోని నిబద్ధతతో రోజూ వెళ్తాడు.

ఆచరణ ద్వారానే సత్యం ఏంటో తెలుస్తుంది

'ఆచరణ ద్వారానే సత్యాన్ని తెలుసుకోగలుగుతాం. మళ్లీ ఆచరణ ద్వారానే సత్యాన్ని పరిశీలించి, అభివృద్ధి చేయగలుతాం' అనే మావో మాటల్ని జ్ఞాపకం చేసుకుంటూ యావో తన వేరుశనగ పరిశోధనలో తేలిన సూత్రాలను మరుసటి సంవత్సరంలో మళ్లీ పరిశీలనకు పెట్టాడు. రెండవసారి ప్రయోగంలో కూడా మొదటి పరిశోధనలో తేలిన సూత్రాలు సత్యాలుగా నిరూపించబడ్డాయి. ఈ రెండు సార్లు కూడా తాను వేరుశనగ పంటలో చాలా అధిక దిగుబడిని సాధించాడు.

వైరుధ్యాలను పరిష్కరించడమే పరిశోధన లక్ష్యం

'అన్నింట్లో అన్ని సమయాల్లో (నిరంతరంగా) వైరుధ్యం ఉంటుంది', అని మావో తన 'వైరుధ్యం గురించి' అనే రచనలో సూత్రీకరణ చేశాడు. చిన్న స్థాయిలో ప్రయోగం చేసి విజయం సాధించిన యావోకు పెద్ద స్థాయి వ్యవసాయ క్షేత్రాల్లో ఈ సూత్రాలను అమలు చేసే సమయం వచ్చింది. వేరుశనగ పంట పెద్ద వ్యవసాయ క్షేత్రాల్లో పండించే క్రమంలో నిరంతరంగా ఉదయించే అంతర్గత, బహిర్గత వైరుధ్యాలను అధ్యయనం చేయడం, విశ్లేషించడం, పరిష్కరించడం అవసరమని మావో సూత్రీకరణను తన పరిస్థితికి అన్వయించుకున్నాడు.

ప్రతి దాంట్లో వైరుధ్యం ఎలా నిభిడీకృతమై ఉంటుందో ఈ ప్రయోగాల తర్వాత యావోకు బాగా అర్థమైంది. ఉదాహరణకు, విత్తనాలు బాగా ఆలస్యంగా వేస్తే దిగుబడి తగ్గుతుంది. ఎందుకంటే, ఆ రుతువుకు చెందిన సమయం కుదించుకు పోతుంది కాబట్టి. ఒకవేళ ముందే విత్తనాలు వేస్తే కూడా దిగుబడి తగ్గుతుంది. ఎందుకంటే, భూమి వేడి విత్తనం మొలకెత్తడానికి కావలసినంతగా ఉండదు కాబట్టి. స్థానిక పరిస్థితులను గతితార్కికంగా విశ్లేషించినపుడు యావో ఈ వైరుధ్యాలను ఎలా పరిష్కరించాలో అర్థం చేసుకున్నాడు. తమ గ్రామ వాతావరణం ప్రకారం మే 5 నుండి 18 మధ్యలో భూమి వేడి 14 –15 సెల్సియస్ డిగ్రీలు ఉన్నప్పుడు విత్తనాలు వేస్తే ఈ వైరుధ్యాన్ని పరిష్కరించవచ్చని అర్థం చేసుకున్నాడు. యావో ముందుకు ఇంకో వైరుధ్యం వచ్చింది. ఒక వేరుశనగ మొక్కకు వచ్చే దిగుబడిలో 60 నుండి 70 శాతం దిగుబడి కేవలం మొట్టమొదట మొలిచే రెండు జతల కొమ్మల నుండే వస్తున్నది. ఒకవేళ ఈ రెండు జతల కొమ్మలను సహజ, శాస్త్రీయ పద్ధతిలో వీలైనంత త్వరగా, ఆరోగ్యంగా పెరిగేట్టు చేయగలిగితే దిగుబడి ఇంకా పెంచవచ్చు కదా అనే ఆలోచన వచ్చింది. లోతు లేకుండా విత్తనం వేయడం వలన తొందరగా పువ్వు పూస్తుంది. కాని ఈ పద్ధతిలో విత్తనాలు బాగా మొలకెత్తుతాయనే గ్యారంటీ లేదు. అదే సమయంలో లోతుగా విత్తనాలు వేయడం వలన విత్తనాలు బలంగా మొలకెత్తుతాయి. కాని కొమ్మల అభివృద్ధిని దెబ్బతీసి (సూర్యరశ్మి భూమిలోకి సరిగ్గా పోక) దిగుబడి తగ్గుతుంది. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించడానికి యావో, తన కమ్యూన్ వ్యవసాయ క్షేత్ర సభ్యులు కలిసి మూడు సంవత్సరాలు ప్రయోగాలు చేసి ఒక కొత్త తరహా సేద్యాన్ని కనుగొన్నారు. లోతుగా విత్తనాలు నాటి, త్వరలోనే ఆ మొలక చుట్టూ ఉన్న మట్టిని తీసివేయడం ద్వారా ఆ మొలకకు ముందు కాసే రెండు జతల కొమ్మలు త్వరగా, ఆరోగ్యంగా పెరిగేట్టు చేయడం ఈ కొత్త సేద్యపు సూత్రం. తద్వారా కలుపు కూడా తీసినట్టు అవుతుంది. ఈ పద్ధతి ద్వారా 10 – 23 శాతం దిగుబడి పెరిగింది.

1960లలో యావో తన తత్వశాస్త్ర వ్యాసం రాసే సమయానికి వారి కమ్యూన్ సభ్యులు ఇంకో వైరుధ్యాన్ని పరిష్కరించే ప్రయోగంలో ఉన్నారు. ప్రధాన కాండం త్వరగా పెరిగితే ఇతర కాడల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. మొక్క ఒక స్థాయికి ఎదిగిన తర్వాత ప్రధాన కాండము మొనను తుంచి వేయడం వలన దాని ప్రతికూల ప్రభావాన్ని ఆపివేయవచ్చని గ్రహించారు. అయితే, మావోయిజం నేర్పిన 'దీర్ఘకాలిక పోరాట దృక్పథం ఉండాలి' అనే సైంటిఫిక్ సూత్రం ప్రకారం దీనిపై ఇంకా కొన్నిసార్లు ప్రయోగాలు చేయాలని నిర్ణయించుకున్నారు.

ఇంకో వైరుధ్యం యావో, అతని కమ్యూన్ బృందం ముందుకు వచ్చింది. అది ఏంటంటే, దగ్గరగా విత్తనాలు నాటాలా లేదా దూరంగా నాటాలా? దగ్గరగా నాటితే, మొక్కలు ఆరోగ్యంగా ఎదగవు. దాంతో దిగుబడి తగ్గుతుంది. దూరంగా నాటితే, ప్రతి మొక్కకు ఎక్కువ దిగుబడి వస్తుంది. కాని మొక్కల సంఖ్య తగ్గి దిగుబడి తక్కువగా ఉంటుంది. సారవంతమైన భూమిలో దగ్గరగా నాటాలా, దూరంగా నాటాలా? మధ్యరకం భూమిలో ఎలా నాటాలి? సారవంతం కాని భూమిలో ఎలా నాటాలి? ఎంఎల్ఎం అందించిన గతితార్కిక సైంటిఫిక్ ఆలోచనా దృక్పథంతో ఎన్నో ప్రయోగాలు, పరిశోధనలు చేసిన తర్వాత యావో, తన కమ్యూన్ సభ్యులు కలిసి ఒక కొత్త పద్ధతిని కనుగొన్నారు. సారాన్ని బట్టి భూమిని మూడు రకాలుగా విడదీసి, మళ్లీ ఒక్కో రకం భూమిని క్లస్టర్లగా (చిన్న మడులుగా) విడదీసి, భూసారం బట్టి ఒక్కొక్క క్లస్టర్‌కు ఎన్ని విత్తనాలు వేయాలని నిర్ణయించారు. ఈ పద్ధతితో దిగుబడి మరింతగా పెరిగింది.

సమిష్టిలోనే జ్ఞానం వికసిస్తుంది

సమిష్టి ప్రయోజనాల కొరకు సమిష్టిగా కలిసి వైరుధ్యాలను ఎదుర్కొనే క్రమంలో జ్ఞానం అనంతంగా అభివృద్ధి చెందుతుందనే సత్యం యావో, తన కమ్యూన్ సభ్యుల సమిష్టి ప్రయోగాల అనుభవ పాఠాలను గమనిస్తే అర్థమవుతుంది. యావో తన ప్రయోగాల, పరిశోధనల పరంపర మొదలు పెట్టినప్పుడు అది కేవలం కొన్ని మొక్కలపైనే చిన్న కమతంలో చేసినందున, అతను ఒక్కడే చేయగలిగాడు. కాని తను కనిపెట్టిన సూత్రాలను విస్తృత స్థాయిలో ప్రజా క్షేత్రంలో ఆచరించి, నిరూపించడానికి తన ఒక్కడి శక్తి చాలదు. ఆ ప్రయోగానికి అందరి సహకారం, సమ్మతి, త్యాగం కూడా అవసరం. చిన్న స్థాయిలో ప్రయోగం చేసినపుడు రిస్క్ చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. ప్రయోగం పరిధి పెరుగుతున్నా కొలది, రిస్క్ విస్తృతి, తీవ్రత పెరుగుతాయి, వైరుధ్యాలు

చర్చ

నెగేషన్ గురించి...

'మేం మళ్లీ వస్తాం' పుస్తకం మీద రంగనాయకమ్మ విమర్శకు పుస్తక రచయిత తోలేటి జగన్మోహనరావు సమాధానం - 2

రంగనాయకమ్మ విమర్శకు నా సమాధానం, 'వీక్షణం' జనవరి 2014 సంచికలో వచ్చిన తర్వాత, రంగనాయకమ్మ లేవనెత్తిన ప్రధాన విషయం, నెగేషన్ గురించి, నేను ఏమీ చెప్పకుండా దాటవేశానని కొంతమంది అంటున్న కారణంగా, నేను ఈ వ్యాసం రాయవలసి వస్తోంది. గొంగలిలో తింటూ, ఎన్ని వెంట్రుకలు ఏరుతాంలే అని వదిలేశాను కాని సమాధానం చెప్పకుండా దాటవేయడం ఏమీలేదు.

గతితార్కికంతో పరిచయంలేని, లేదా కొద్ది పరిచయం మాత్రమే ఉన్న పాఠకులకు, గతి తార్కిక నెగేషన్ గురించి చెప్పడం, వారు అర్థం చేసుకోవడం, చాలా కష్టంగా ఉంటుంది. గతితార్కికం బాగా అధ్యయనం చేసిన వారికి ఈ చిన్న వ్యాసం అసంతృప్తిగా ఉంటుంది. అయినా నాకు సాధ్యమైన రీతిలో నెగేషన్ గురించి చెప్పడానికి ప్రయత్నిస్తాను. క్లిష్టమైన గతితార్కిక భావనల కంటే, రంగనాయకమ్మ కేవలం కామన్ సెన్సుతో చేసే వాదనలు – మంచి కూడా తిరస్కరణకు గురి అవుతుందా? రివిజనిజం రావడానికి వీలుగా కమ్యూనిస్టులు లోపాలతోనే సోషలిజం నిర్మిస్తారా? – లాంటి వాదనలు, అదెంత కుతర్కమైనా, సామాన్య పాఠకులు తేలికగా అర్థం చేసుకోగలరు. గతి తార్కికం అర్థం కావాలంటే పాఠకులు కూడా తమ వంతు కృషి చేయాలి.

ప్రతీ శాస్త్రానికీ, దాని పరిభాష ఉంటుందనీ, ఆ శాస్త్రంలో వాడే పదాల అర్థం, మామూలుగా మనం అర్థం చేసుకునే విధానానికి భిన్నంగా ఉంటుందనీ, ఇంగ్లిషులో నెగేషన్ కాని, తెలుగులో దాని అనువాదం 'తిరస్కరణ' అన్నది కాని, మనం ఈ పదాలను మామూలుగా అర్థం చేసుకునే రీతిలో కాకుండా, గతి తార్కికంలో ఈ మాటలకున్న అర్థంలోనే అర్థం చేసుకోవాలనీ, నా పుస్తకంలో నెగేషన్ గురించి చెప్పిన చోట చాలా స్పష్టంగా చెప్పాను (పే. 305). రంగనాయకమ్మ, సరిగ్గా నేను చెప్పినదానికి వ్యతిరేకంగా, గతితార్కిక నెగేషన్ అన్న భావాన్ని అర్థం చేసుకుని, 'ఎన్ని సార్లయినా సోషలిజం వస్తూనే, పోతూనే ఉంటుంది. రావాలి కాబట్టి వస్తుంది, పోవాలి కాబట్టి పోతుంది...' అని విమర్శించారు.

హెగెల్, జర్మన్ భాషలో ప్రయోగించిన పదాలకు, సమానమైన పదాలు ఇంగ్లిషులో లేవనీ, నెగేషన్ అన్న ఇంగ్లిషు పదం, జర్మన్ పద భావాన్ని పూర్తిగా వెల్లడించదనీ, కొంతమంది తత్వవేత్తలు చెప్పారు. హెగెల్, నెగేషన్ అన్న పదాన్ని రకరకాల సంబంధాలు – difference, opposition, reflection or relation – వివరించడానికి ప్రయోగించాడు అని కూడా హెగెల్‌ను అధ్యయనం చేసిన వారు చెప్పారు. ఎంగెల్స్, '...Every limitation or determination is at the same a negation...' అని చెప్పాడు (ఏంటీ డూహ్రింగ్). నెగేషన్ అన్న ఒక్క పదమే కాదు, – limitation, determination, sublation, reason, moment, category, measure – లాంటి పదాలన్నీ గతి తార్కికం ఇచ్చే అర్థం లోనే అర్థం చేసుకోవాలి కాని నిఘంటువులు ఇచ్చే అర్థంతో, కామన్‌సెన్స్‌తో అర్థం చేసుకుంటే, చాలా గందరగోళానికి దారి తీస్తుంది. ఈ విషయం గురించి ఇక్కడ మరింత వివరంగా లోతుకు పోనక్కర్లేదు. పైన చెప్పినది గతితార్కికంతో పరిచయంలేని పాఠకులకు అర్థం కాకపోయినా ఫరవాలేదు. కాని, గతి తార్కికంలో నెగేషన్ అన్నది, సోషలిజం పోయి కేపిటలిజం, కేపిటలిజం పోయి సోషలిజం, వరసగా వస్తుంటాయి అని రంగనాయకమ్మ చెప్పే నెగేషన్ కాదని ఇక్కడ మనం గుర్తిస్తే సరిపోతుంది.

ఈ గతితార్కిక నెగేషన్‌ను హెగెల్, ఎంగెల్స్ లాంటి తత్వవేత్తలు ఇచ్చిన ఉదాహరణల ద్వారా కొంత అర్థం చేసుకోవచ్చు.

హెగెల్, మొగ్గ కాయగా పరిణామం చెందే ప్రక్రియ గురించి చెబుతూ – పువ్వు, మొగ్గని తిరస్కరిస్తుంది. కాయ పువ్వుని తిరస్కరిస్తుంది – అని ఒక ఉదాహరణ చెప్పాడు. ఈ గతి తార్కిక తిరస్కరణలో ఒక గుణాత్మకమైన మార్పు ఉంది, మొగ్గ పువ్వుగానూ, పువ్వు కాయగానూ మారుతోంది. ఒక అనుక్రమం (continuity) కూడా ఉంది. మొగ్గ, పువ్వు, కాయ, వేటికవి, ఒకదానితో ఒకటి సంబంధం లేనివి కావు. మొగ్గ కాయగా పరిణామం చెందడంలో ఒక భాగమే. షిర్కిన్ అనే మరో తత్వవేత్త, బాల్యాన్ని యవ్వనం, యవ్వనాన్ని మధ్య వయసు, మధ్య వయసుని

కూడా పెరుగుతాయి. దాంతో ప్లానింగ్ చేయడం, బాధ్యతలను అందరికీ పంచడం, ప్రతికూల పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయాలు ఏంటో, దాన్ని ఎలా ప్లాన్ చేసుకోవాలో, అందరు కలిసి నిర్ణయించుకోవాలి. ఇలాంటి ఎన్నో అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే, క్షేత్ర స్థాయితో సంబంధం లేకుండా ఎక్కడో కూర్చొని అభివృద్ధి చేసిన ఆలోచనలు, క్షేత్ర స్థాయిలో అమలు చేసినపుడు విఫలం అవుతుంటాయి. అందుకే మావో అన్నట్టు 'ఆచరణలో ఉంటూనే ప్రయోగం చేయాలి, సత్యాన్ని కనుగొనాలి'. అందుకే, గతితార్కిక ఆలోచనా విధానం ప్రకారం ఒక్క వ్యక్తి ఎంత గొప్ప తెలివిమంతుడైనా దాని వలన సమాజానికి కలిగే గొప్ప, విస్తృత లాభమేమీ ఉండదు. ఏ వినూత్న ఆలోచన, ఆవిష్కరణ అయినా అది సమాజానికంతా మేలు చేయాలంటే సమాజమంతా దాన్ని సమిష్టిగా, తమ త్యాగాన్ని జోడించి రిస్క్ తీసుకుంటేనే ఆ ఆలోచన, ఆవిష్కరణ ప్రజా క్షేత్రంలో విజయం సాధిస్తుంది. నిజానికి చైనా ప్రజల త్యాగం లేకుంటే మావో ఎవరో ఈ రోజు ప్రపంచంలో ఎవరికీ తెలిసి ఉండేది కాదు. అందుకే, మావోయిజంలో 'ప్రజల నుండి, ప్రజల వద్దకు' అనేది అతి ప్రధానమైన సూత్రాల్లో ఒకటి.

వేల సంవత్సరాల మానవ శ్రమ ఫలితంగా ఏర్పడిన సమిష్టి జ్ఞానాన్ని, భాషను వాడుకొని, పేటెంట్ చేయగలిగిందే, మార్కెట్ చేసి డబ్బు సంపాదించ గలిగిందే జ్ఞానమని అంటూ సమిష్టి సంపదను, సమిష్టి జ్ఞానాన్ని ప్రైవేట్ పరం చేస్తూ దోచుకుంటున్నారు. తమ రాజభోగాలకు, పెత్తనానికి వాడుకుంటూ, అశేష ప్రజానీకపు భవిష్యత్తును రోజురోజుకు మరింత అంధకారంలోకి, దుర్భర పరిస్థితులలోకి నెడుతున్నారు నేటి పాలక వర్గాలు. సమిష్టి ప్రయోజనం తప్పించి మరేమీ ఆశించకుండా రాత్రుళ్లు, పగళ్లు యావో లాంటి కోట్లాది శ్రామిక వర్గ ప్రజలు చేసిన త్యాగాల సోషలిస్టు వ్యవస్థలో ఉండే సైంటిఫిక్ ఆలోచనా విధానం మానవ నాగరికతకు మంచిదా? లేదా సమిష్టి వనరులను, జ్ఞానాన్ని, శ్రమని దోచుకునే కొందరి పాలక వర్గాల (రాజభోగాల జీవితాల) కోసం మెజారిటీ ప్రజలు దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ, తమ జీవితాన్ని త్యాగం చేయాల్సి రావడమే కాకుండా(శవాల కన్నా మించి) కుళ్లి కంపు కొడుతున్న వందలాది రకాల అన్‌సైంటిఫిక్ భావజాలాల మధ్య జీవచ్ఛవంలా బతకాల్సి రావడం మానవ నాగరికతకు మంచిదా? ఇదే అందరం ప్రశ్నించుకొని, పరిశోధించవలసిన అంశం.

(రచయిత అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త) వీ

వార్ధక్యం, తిరస్కరిస్తాయని మరో ఉదాహరణ ఇచ్చాడు. బాల్యం, యవ్వనం, మధ్య వయసు, వార్ధక్యం, ఒకే వ్యక్తి జీవితంలో సంభవించే మార్పులు. ఇక్కడ కూడా మార్పుతో పాటు అనుక్రమం కూడా ఉంటుంది.

ఎంగెల్స్, ఏంటీ డూహ్రింగ్‌లో, 'నెగేషన్ అన్నది ప్రతీరోజూ, ప్రతీచోటా సంభవించే సామాన్య ప్రక్రియ' (process) అని చెపుతూ ఒక ఉదాహరణ ఇచ్చాడు. ఒక బార్లీ గింజ, గింజకు సహజమైన పరిస్థితులలో, అనువైన నేల మీద పడితే, వెచ్చదనం, తేమతో అది ఒక ప్రత్యేకమైన మార్పు చెందుతుంది. విత్తన జీవితం ముగుస్తుంది – విత్తనం నెగేట్ చేయబడి దాని నుంచి మొక్క జన్మిస్తుంది. తన సహజ క్రమంలో మొక్క ఎదుగుతుంది, పుష్పిస్తుంది, చిట్టచివరకు మళ్లీ బార్లీ గింజలు తయారవుతాయి. బార్లీ గింజలు పూర్తిగా తయారయ్యాక, కాండం (stalk) నెగేట్ చేయబడి చచ్చిపోతుంది. ఈ నెగేషన్ కారణంగా మనకు మళ్లీ ఒక బార్లీ గింజ స్థానంలో, పది, ఇరవై, ముప్పై రెట్లు బార్లీ గింజలు లభిస్తాయి. బార్లీ జాతి చాలా నెమ్మదిగా మారుతుంది. ఆ కారణంగా మనం బార్లీ జాతిలో సంభవిస్తున్న గుణాత్మక పరిణామం గుర్తించలేం కాని అక్కడ కూడా, నెగేషన్ల క్రమంలో, అతి నెమ్మదిగానైనా గుణాత్మక పరిణామం సంభవిస్తూ ఉంటుంది.బార్లీ విత్తనం సహజంగా నెగేట్ చేయబడితేనే నెగేషన్ అవుతుంది కాని మనం విత్తనాన్ని కాలి కింద నలిపేస్తే అది నెగేషన్ కాదు.

జంతు ప్రపంచం నుంచీ, భూ విజ్ఞానశాస్త్రం నుంచీ, గణితం నుంచీ, చరిత్ర నుంచీ, మరికొన్ని ఉదాహరణలు ఇచ్చిన తర్వాత, 'నెగేషన్ ఆఫ్ నెగేషన్ అంటే ఏమిటి? ప్రకృతిలోనూ, చరిత్రలోనూ, ఆలోచనలోనూ సంభవించే అభివృద్ధిని వివరించే సర్వ సాధారణ సూత్రం. ఆ కారణంగా ఈ సూత్రం చాలా ముఖ్యమైనది. ఈ సూత్రం, జంతు ప్రపంచానికి, వృక్ష ప్రపంచానికి, భూవిజ్ఞాన శాస్త్రానికి, గణితానికి, చరిత్రకు, తత్వ శాస్త్రానికి కూడా వర్తిస్తుందన్న విషయం మనం చూశాం....ఈ ప్రక్రియలన్నీ నెగేషన్ ఆఫ్ నెగేషన్ అనే ఒక్క సూత్రంగా నేను చెపుతున్నప్పుడు, ప్రతీ ప్రత్యేక ప్రక్రియ ప్రత్యేక విశేషాల గురించి నేను చెప్పడం లేదు. ... నెగేషన్ అన్నది, మొట్టమొదట ఒక ప్రక్రియ సాధారణ స్వభావం ద్వారానూ, ఆ తర్వాత ఆ ప్రక్రియ ప్రత్యేక స్వభావం ద్వారానూ నిర్ణయించబడుతుంది....ప్రతీ విషయం ఒక అభివృద్ధికి కారణమయ్యేలా తనదైన ప్రత్యేక పద్ధతిలో నెగేట్ చేయబడుతూ ఉంటుంది...' అని వివరించాడు ఎంగెల్స్ (ఏంటీ డూహ్రింగ్).

పై ఉదాహరణలో, బార్లీ, కంకులు వేసిన తర్వాత నెగేట్ చెయబడి, కాండం చచ్చిపోతుంది. కొన్ని చెట్లు అనేక మార్లు కాపు కాసిన తర్వాత చచ్చిపోతాయి. కొన్ని కీటకాలు, సంతతికి జన్మనిచ్చిన వెంటనే నెగేట్ చెయ్యబడి చచ్చిపోతాయి. కొన్ని జంతువులు ఒకటి కంటే ఎక్కువమార్లు సంతతికి జన్మనిస్తాయి. నెగేషన్ ఒక సాధారణ ప్రక్రియ అయినా, ప్రతీ వస్తువూ, ఒక అభివృద్ధికి కారణమయ్యేలా తనదైన ప్రత్యేక పద్ధతిలో నెగేట్ చేయబడుతూ ఉంటుంది.

నెగేషన్ ఆఫ్ నెగేషన్‌ను, థీసిస్ – ఏంటీ థీసిస్– సింథసిస్ సూత్రం (ట్రయాడ్ – త్రయం – అంటారు) ద్వారా కూడా అర్థం చేసుకోవచ్చు. అయితే, మనం నెగేషన్‌ను అర్థం చేసుకోవడానికి మాత్రమే ఈ త్రయం గురించి ఇక్కడ మాట్లాడుతున్నాం కాని, హెగెల్, థీసిస్–ఏంటీ థీసిస్–సింథసిస్ అన్న పదాలను ఎక్కడా ప్రయోగించలేదు అన్న విషయం గుర్తుంచుకోవాలి.

థీసిస్– త్రయం లో మొదటి కేటగిరీ థీసిస్. థీసిస్ ఒక విషయాన్ని ధృవీకరిస్తుంది. ఉదాహరణకు, థీసిస్ లో ఒక సిద్ధాంతం ధృవీకరించబడుతుంది. కాని మరింత ఆలోచించిన కొలదీ, అది అసంపూర్ణంగా ఉందనీ, ఆ సిద్ధాంతం ఇచ్చే వివరణ అసంతృప్తిగా, వైరుధ్య పూరితంగా ఉందనీ భావించడం జరిగిన కారణంగా ఈ థీసిస్, ఏంటీ థీసిస్ చేత నెగేట్ చేయబడుతుంది. ఈ ఏంటీ థీసిస్, థీసిస్ నుంచే జన్మిస్తుంది కాని వెలుపలనుంచి రాదు.

– థీసిస్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని ఏంటీ థీసిస్ నెగేట్ చేస్తుంది. ఇది మొదటి నెగేషన్. కాని మరింత ఆలోచించిన కొలదీ, ఏంటీ థీసిస్ కూడా అసంపూర్ణంగా ఉందనీ, అది ఇచ్చే వివరణ కూడా అసంతృప్తిగా, వైరుధ్య పూరితంగా ఉందనీ భావించడం జరిగిన కారణంగా, ఏంటీ థీసిస్ కూడా నెగేట్ చేయబడి, సింథసిస్ అవుతుంది. ఇది రెండో నెగేషన్ – అంటే నెగేషన్ ఆఫ్ నెగేషన్.

సింథసిస్ అన్నది థీసిస్, ఏంటీ థీసిస్‌ల ఐక్యత (unity) అవుతుంది. ఈ సింథసిస్‌లో థీసిస్, ఏంటీ థీసిస్‌లలో ఉన్న వైరుధ్యాన్ని, ఒక ఉన్నత స్థాయిలో సమన్వయం చేయడం జరుగుతుంది. సింథసిస్‌లో, పాత వైరుధ్యం, రూపంలో అధిగమించబడుతుంది, పాత వైరుధ్యంలోని వాస్తవ విషయం (real content) చేరుతుంది. (సింథసిస్‌లో జరిగే ఈ మార్పుని వ్యక్తీకరించడానికి, హెగెల్ Aufheben అన్న పదం వాడాడు. ఈ జర్మన్ పదానికి 'both overcome and preserved' అన్న అర్థంలో, ఇంగ్లిషులో sublation అన్న పదం ఉంది. ఈ ఇంగ్లిషు పదానికి సరియైన తెలుగు పదం ఉన్నట్లు లేదు. Sublation అంటే, మొదట, వైరుధ్యం అధిగమించబడుతుంది, అదే సమయంలో ఈ వైరుధ్యం కొత్త సింథసిస్‌లో కొనసాగుతుంది (భద్రపరచబడుతుంది) అని అర్థం. (గతితార్కికంతో పరిచయం లేని వారికి అధిగమించబడిన వైరుధ్యం కొనసాగడమేమిటో గందరగోళంగా అనిపిస్తుంది. అందుకని ఒక ఉదాహరణ ఇస్తాను. అక్టోబరు విప్లవంలో పెట్టుబడికి, శ్రమకి మధ్య వైరుధ్యం రూపంలో అధిగమించబడి, కార్మిక వర్గం పాలకవర్గం మైంది, పెట్టుబడిదారీవర్గం పాలితవర్గం అయ్యింది. అయినా శ్రమకి, పెట్టుబడికి మధ్య వైరుధ్యం నూతన సోషలిస్టు వ్యవస్థలో కూడా కొనసాగింది. 20వ శతాబ్దం అంతంలో జరిగిన నెగేషన్‌లో పెట్టుబడిదారీ వర్గం తిరిగి పాలకవర్గమైంది, కార్మిక వర్గం పాలిత వర్గమైంది. కాని వైరుధ్యం అంతం కాలేదు. కొనసాగుతూనే ఉంది. ఐతిలీజిబిశిరిళిదీ అన్న పదాన్ని ఇలా అర్థం చేసుకోవాలి) ఈ త్రయం పూర్తయిన తక్షణం, సింథసిస్ ఒక కొత్త థీసిస్‌గా మారుతుంది. ఈ కొత్త థీసిస్ ఏర్పడిన వెంటనే, ఈ కొత్త థీసిస్ కూడా అసంపూర్ణంగా ఉన్న కారణంగా ఈ థీసిస్ లోనుంచే వ్యతిరేకత ఏర్పడి ఏంటీ థీసిస్‌కు జన్మనిస్తుంది. ఈ కొత్త వైరుధ్యం మళ్లీ ఉన్నత స్థాయిలో, కొత్త సింథసిస్‌లో సమన్వయం కావాల్సి ఉంటుంది. మళ్లీ ఒక ట్రయాడ్.....

తేలికగా అర్థం చేసుకోవడానికి వీలుగా, పై ఉదాహరణలో ఆలోచనను ఒక థీసిస్‌గా చెప్పడం జరిగింది కాని థీసిస్ ఒక ఆలోచన కావచ్చు, చారిత్రక గతి (movement) కావచ్చు, మరేదైనా కావచ్చు. ఒక ప్రక్రియ ఉన్నంతవరకూ, ఆ ప్రక్రియలోని వైరుధ్యం, ఒక నెగేషన్ తర్వాత మరొక నెగేషన్‌కు దారి తీస్తూనే ఉంటుంది. వైరుధ్య పూరితంగా అభివృద్ధి చెందే ఒక ప్రక్రియలో, నెగేషన్, నెగేషన్ ఆఫ్ నెగేషన్ అన్నవి దశలు (moments) గా ఉంటాయి. గతితార్కిక నెగేషన్ ఒక సృజనాత్మక నెగేషన్. ఒక వస్తువు లేక జ్ఞానంలో అభివృద్ధి, గుణాత్మకమైన మార్పుల పరంపర ద్వారా సంభవిస్తుంది. ఈ గుణాత్మకమైన మార్పుల పరంపరనే మనం గతితార్కిక నెగేషన్లు అంటున్నాం. మరో విషయం ఏమిటంటే, నెగేషన్ ఆఫ్ నెగేషన్ తర్వాత, ఒక ఉన్నత స్థాయిలో (higher level) నూతన వైరుధ్యంలో సంఘర్షణ మళ్లీ ప్రారంభమవుతుందన్నప్పుడు, ఉన్నత స్థాయి అంటే మెరుగైన (better) స్థాయిగా అర్థం చేసుకోకూడదు. ఒక ప్రక్రియ, మరొక అడుగు ముందుకు వేయడం జరిగిందనీ, మరింత ఉన్నత స్థాయిలో సంఘర్షణ కొనసాగుతుందనీ, అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, 'సోషలిజం' నెగేట్ చేయబడి, కేపిటలిజం పునరుద్ధ రింపబడింది అంటే, నెగేట్ చేయబడిన 'సోషలిజం' కంటే పునరుద్ధ రింపబడిన కేపిటలిజం మెరుగైన వ్యవస్థగా అర్థం చేసుకోకూడదు. మునుపటి కంటే మరింత విస్తృతమైన స్థాయిలో, మరింత అవగాహనతో, శ్రమ, కాపిటల్‌ల మధ్య సంఘర్షణ జరుగుతుంది అని అర్థం చేసుకోవాలి. నెగేషన్ ద్వారా సంభవించే ఈ మార్పు ఎలా ఉంటుంది? రంగనాయకమ్మ భావిస్తున్నట్లు, సోషలిజం పోయి కేపిటలిజం, కేపిటలిజం పోయి సోషలిజం, మళ్లీ సోషలిజం పోయి.....ఇలా వృత్తాకారంలో ఉంటుందా? ఇలా సంభవించినదే సంభవిస్తుంటే పురోగమనం ఎలా ఉంటుంది?

అంతులేకుండా జరిగే ఈ తిరస్కరణల క్రమంలో, కొన్ని రూపాలు అంతమై, మరికొన్ని రూపాలు పుడుతున్నప్పుడు, మనం అప్పటికే అధిగమించిన రూపాలు, సంఘటనలు, సిద్ధాంతాలు, పునరావృతమ వుతున్న ధోరణి ఒకటి కనుపిస్తుంది. ఆ కారణంగా 'చరిత్ర పునరావృతమ వుతుంది – history repeats itself' అన్న నానుడి వచ్చింది. కాని వాస్తవానికి చరిత్ర అలా పునరావృత్తం కాదు. అలా పునరావృతమవు తున్నట్లు పైకి కనుపించే దానిలో, గతితార్కికం, దిగువనుంచి ఎగువకు ఒక అభివృద్ధిని, ఒక పరిణామాన్ని గమనిస్తుంది. అవే రూపాలు, అంతకు ముందు సంభవించిన అభివృద్ధి వలన, మరింత ఉన్నత స్థాయిలో,

పునరావృతమవుతాయి. చరిత్ర పురోగమనం క్లిష్టమైన పరస్పర క్రియల (interactions) ఫలితంగా సంభవిస్తూ ఉంటుంది. ప్రతీ ముందడుగు, పాక్షికంగా వెనుకడుగు ద్వారా సంభవిస్తుంది. ఈ వెనుకంజలు, తరువాతి దశలో సరిదిద్దబడుతుంటాయి. చరిత్ర ఇలా జిగ్ జాగ్‌గా పురోగమిస్తూ ఉంటుంది. ఒక ప్రక్రియలో పాక్షిక తిరోగమనం ఉండవచ్చు కాని పూర్తి తిరోగమనం ఉండదు.

మార్క్సిజం, అభివృద్ధి క్రమాన్ని ఎలా అర్థం చేసుకుంటుందో వివరిస్తూ, నా పుస్తకంలో, లెనిన్ రచనల నుంచి, ఈ కింది రెండు కొటేషన్లు ఇచ్చాను (పే. 306).

'ఈ అభివృద్ధి క్రమంలో గతించిన దశలు పునరావృత్తమవుతుంటాయి. కాని ఈ పునరావృతమవడమనేది (పాతకు) భిన్నంగా, నూతన ప్రాతిపాదిక మీద జరుగుతుంది (తిరస్కరణ మళ్లీ తిరస్కరించబడుతుంది). అభివృద్ధి అనేది రేఖలా సాగదు. సరళంగా సాగుతున్న క్రమం తెగి, విప్లవాలు, గంతులు (leaps), విపత్తుల ద్వారా ఈ అభివృద్ధి సంభవిస్తుంది....– లెనిన్, 'కార్ల్ మార్క్స్' అన్న వ్యాసం నుండి.

'..పాత దశలో ఉన్న కొన్ని పాత రూపాలు, లక్షణాలు, ఉన్నత....దశలో పునరావృతమవుతాయి...స్థూలంగా పాత స్థితికి తిరిగి చేరినట్లు కనిపిస్తుంది...– లెనిన్, Summary of Dialectics.

ఒక వృత్తం పూర్తయి, మనం ఎక్కడ నుంచి బయలుదేరామో మళ్లీ అక్కడికే చేరినట్లు కనుపించినా, వాస్తవానికి ఈ క్రమంలో చివరి స్థానం, మొదటి స్థానాన్ని కలవదనీ, దానికి ఎగువగా ఉంటుందనీ, అక్కడనుంచి నూతన క్రమం మళ్లీ వృత్తాకారంలో ప్రారంభమవుతుందనీ, తిరిగి ఆ క్రమంలో కూడా చివరి స్థానం, మొదటి స్థానానికి పైన ఉంటుందనీ, ఈ విధంగా వస్తువులో కాని, చరిత్రలో కాని దిగువనుంచి ఎగువకు అభివృద్ధి స్పైరల్ ఆకారంలో జరుగుతుందనీ చెప్పాను.

రంగనాయకమ్మ, '...ఇక్కడ లెనిన్ కొటేషన్ ఏదో ఒక సందర్భంలోది తీసుకొచ్చి ఇచ్చారు. దాన్ని వివరంగా చూస్తే, అది ఒక దోపిడీ దశ పోయి, ఇంకో దోపిడీ దశకు సంబంధించినదిగా ఉంటుంది. 'ప్రతీ దోపిడీ దశలోనూ పాత లక్షణాలూ ఉంటాయి. వాటితో పాటు అభివృద్ధీ ఉంటుంది' అని చెప్పింది లెనిన్ కొటేషన్..' అంటున్నారు. నేను Summary of Dialectics నుంచీ, 'కార్ల్ మార్క్స్' అన్న వ్యాసం నుంచీ, కొటేషన్లు ఇచ్చానని చెప్పాను. ఆ వ్యాసాలు చదివి, ఆ 'సందర్భం' ఏమిటో, రంగనాయకమ్మ 'వివరంగా' చూశారా? ఆవిడకు ఏం అర్థమైంది? లెనిన్, 16 అంశాలలో గతితార్కికాన్ని వివరించిన చోట కాని 'కార్ల్ మార్క్స్' వ్యాసంలో, అభివృద్ధి, పరిణామాల (development, evolution) స్వభావం గురించి వివరించిన చోటకాని 'దోపిడీ దశ' గురించి ఎక్కడైనా, సూచన మాత్రంగానైనా, ఉందా? లెనిన్ వస్తువులోనూ, పదార్థంలోనూ, సమాజంలోనూ సంభవించే అభివృద్ధి, పరిణామాల గురించి స్పష్టంగా మాట్లాడాడు. సమాజంలో దోపిడీ దశ ఉంది కాని, వస్తువులో కూడా దోపిడీ దశ ఉంటుందా? ఏవిటీ అవాకులు, చెవాకులు?

నాకు దేవుడంటే నమ్మకంలేదు కాని మార్క్సిజం గురించి రంగనాయకమ్మ రాతలు చూస్తుంటే, 'దేవుడా! రంగనాయకమ్మ లాంటి మార్క్సిస్టు అభిమానుల నుంచి మార్క్సిజాన్ని రక్షించు తండ్రీ' అని వేడుకోవాలనిపిస్తోంది.

'...మేం మళ్లీ వస్తాం అనే కేకలతో వచ్చే విప్లవకారులు, ఈ పుస్తకం ప్రకారం, వాళ్లు వచ్చి చేసే పని ఏమిటంటే, కొత్తగా నిర్మించే సోషలిజాన్ని తప్పకుండా లోపాలతోనే నిర్మిస్తారు – అనుకోవాలి. తర్వాత రివిజనిజం రావడానికి అనుకూలంగా...'

'...చెడ్డ పనిని, మంచి పని తిరస్కరిస్తే, ఆ మంచి పని కూడా తర్వాత తిరస్కరణకు గురి అవుతుందా? 'చెడ్డ' పోయి, 'మంచి' వస్తూ ఉండడం కనపడుతోంది. 'మంచి' కూడా పోతూ ఉంటుందని చెప్పే సూత్రం ఒక సూత్రమా?' అన్నారు రంగనాయకమ్మ.

'...In history progress makes its appearance as the negation of the existing state of things..' అన్నాడు ఎంగెల్స్ (Dialectics). ఉనికిలో ఉన్న విషయాలను నెగేట్ చేయడం ద్వారా చరిత్రలో పురోగమనం సంభవిస్తుంది.

ఉనికిలో ఉన్న వ్యవస్థ, విషయం, అనివార్యంగా ఎందుకు నెగేట్ చెయ్యబడుతుంది?

జ్ఞానం విషయంలో కాని, సమాజ విషయంలో కాని, ఇక ముందుకు వెళ్లలేని నిర్దుష్ట (perfect) స్థితి అనేది ఎప్పటికీ ఏర్పడదని ఇంతకుముందు చెప్పాను. జ్ఞానం విషయంలో కాని, సమాజ పురోగమనంలో కాని ప్రతీ దశా, స్వభావరీత్యా, అసంపూర్ణంగా ఉంటూనే ఉంటుంది. ఆ కారణంగా దానికి వ్యతిరేకత ఏర్పడుతుంది. నెగేట్ చేయబడుతుంది. ఈ నెగేషన్ల పరంపరలో, సమాజం ఒక నిర్దుష్టమైన స్థితికి ఎన్నటికీ చేరుకోకుండానే పురోగమిస్తూ ఉంటుంది. విప్లవకారులు ఏ లోపాలు లేని సిద్ధాంతాన్ని కాని, వ్యవస్థను కాని, ఎన్నటికీ నిర్మించలేరు. ఈ గతితర్కం రంగనాయకమ్మకి అర్థం కాని కారణంగా, దీన్ని 'మేం మళ్లీ వస్తాం' విప్లవకారులు, 'రివిజనిజం రావడానికి అనుకూలంగా సోషలిజాన్ని లోపాలతోనే నిర్మిస్తారు' అని వెటకారంగా వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే, 'మంచి పని' తిరస్కరింపకూడదు అంటే నిర్దుష్టమైన, ఏ మార్పులు అవసరం లేని, మంచి సంభవించాలి. అది ఎప్పటికీ సాధ్యంకాదు. ఈ విషయాలు అర్థం కావాలంటే గతి తార్కికం గురించి కొంతైనా అవగాహన ఉండాలి.

నెగేషన్‌తో పాటు, రంగనాయకమ్మగారికి గతి తార్కికం చెప్పే నిరంతర చలనం అన్న భావన కూడా మింగుడుపడడం లేదు.

'...గతితర్క సూత్రాలుగా చెప్పుకున్న వాటిని తప్పుతప్పులుగా అర్థం చేసుకోవడం ఈ 'మేంవస్తాం' పుస్తకంలో చాలా ఎక్కువగా ఉంది. సమాజ సంబంధాల్లో ఎప్పుడూ మార్పులు (ఎప్పుడూ చలనం) జరుగుతూనే ఉంటాయి అనీ (అంటే, కమ్యూనిజం కూడా పోతుంది అని), ఒక దశని తిరస్కరించిన ఇంకో దశకి కూడా అలాగే జరుగుతుంది – అనీ, ఆ రకంగా ఆ మార్పులన్నీ నిరంతరం జరుగుతాయని భావిస్తుంది, ఈ పుస్తకం. అందుకే, 'ఏ సమాజమూ నిలబడదు' అనే అర్థానికి వచ్చింది...'

'..సరే సోషలిజం పోతుంది, చివరికి ఏమిటి? చివరికి నిలబడి ఉండి పోయే దాన్ని చెప్పుకోవాలి గానీ, దారి పొడుగునా వచ్చి పోయే వాటి సంగతెందుకు? అనకండి. ఈ పుస్తకం ప్రకారం, 'చివర' ఉండదు చివర ఉంటే చెప్పుకుంటాం గానీ, లేని దాన్ని ఎలా చెప్పుకుంటాం? 'సమాజానికి, ఎందుకలా జరుగుతుంది?' అని అడగండి! ఎందుకంటే, అలా జరుగుతుందని చెప్పే సూత్రం ఒకటి ఉందని ఈ పుస్తకం చెపుతోంది...'గతితార్కిక భౌతికవాదం' అనే దాన్ని విన్నారా?...నెగేషన్ ఆఫ్ నెగేషన్ సూత్రం గురించి విన్నారా?' అన్నారు రంగనాయకమ్మ

'అన్ని వస్తువులూ చలనంలో ఉంటాయి, మారుతూ ఉంటాయి, ఒకే ప్రవాహంలో రెండు సార్లు స్నానం చేయలేం,' అన్నాడు, ప్రాచీన గ్రీకు తత్వవేత్త, హెరాక్లిటస్. మనం ఒక ప్రవాహంలో మునిగి తేలే లోగా ఆ నీరు పోయి కొత్త నీరు వస్తుంది. ప్రతీదీ నిరంతరం అస్థిరంగా ఉంటుంది, ఒక క్షణంలో ఒక దృగ్విషయం స్థిరపడుతున్నట్లు కనుపిస్తుంది, మరుక్షణంలో అదృశ్యమవుతూ కనుపిస్తుంది. ప్రకృతిలోనూ, సమాజం లోనూ, ఆలోచనలోనూ, ఏదీ స్థిరంగా ఉండదు. భూమి సృష్టించబడిన నాటి నుండి నేటి వరకూ సంభవించిన మార్పును – భూమి జన్మించడం, ఈ భూమి మీద ఖండాలు, సముద్రాలు ఏర్పడడం, ఏక కణ జీవి దగ్గర నుంచి నేటి మానవుడి దాకా జరిగిన పరిణామాన్నంతా– ఒక పది నిమిషాల చిత్రానికి కుదించి చూడగలిగితే, ఒక ఫ్రేం తర్వాత మరొక ఫ్రేం వేగంగా మన కళ్లముందు ప్రత్యక్షమవుతుంటే, ఏదీ, ఎప్పుడూ స్థిరంగా ఉండదనీ, నిరంతర చలనం ఉంటుందనీ, గతి తార్కికం చెప్పే దానిలో సత్యం మనకు అర్థమవుతుంది. అలాగే మానవసమాజం పుట్టినప్పటినుంచీ నేటివరకూ మానవ సమాజాన్ని కాని, భావాలను కాని చూస్తే, నిరంతరం జరిగే మార్పు కనుపిస్తుంది. ఈ గతి తార్కికాన్ని హెగెల్ భావ వాద పరంగా అభివృద్ధి చేసి, ప్రపంచాన్ని, రెడీమేడ్ వస్తువుల సముదాయంగా (complex of ready made things) కాక, ప్రక్రియల సముదాయంగా (complex of processes) గా అర్థం చేసుకోవాలనీ ఈ ప్రక్రియలలో పైకి స్థిరంగా కనుపించే వస్తువులూ, మన మెదడులో ఆ వస్తువుల చిత్రాలూ – అంటే భావాలూ – అంతులేకుండా, ఉనికిలోకి వచ్చి, అదృశ్యమవుతుంటాయనీ, హెగెల్ వివరించాడు. ఎంగెల్స్, ఈ సూత్రీకరణను ఒక మహత్తర సూత్రీకరణగా వర్ణించాడు.

ఈ నిరంతర చలనాన్ని దృష్టిలో ఉంచుకునే, 'ఒక దాని తర్వాత ఒకటి వచ్చే చారిత్రక వ్యవస్థలన్నీ, దిగువనుంచి ఎగువకు సంభవించే అంతులేని మానవ సమాజ

పురోగమనంలో, తాత్కాలిక దశలు మాత్రమే... గతితార్కిక తత్వశాస్త్రానికి ఏదీ అంతిమమైనదీ, పవిత్రమైనదీ, సంపూర్ణమైనదీ (absolute) కాదు... ప్రతీ వస్తువు యొక్క ప్రతీ వస్తువులోనూ, తాత్కాలిక స్వభావాన్ని అది వెల్లడిస్తుంది....'అన్నాడు ఎంగెల్స్ (Ludwig Feuerbach and the end of classical German philosophy). గతి తార్కికానికి ఏదీ సంపూర్ణమైనది కాదు, మానవ సమాజ పురోగమనం అంతులేకుండా జరుగుతూనే ఉంటుంది, ప్రతీ చారిత్రక వ్యవస్థా తాత్కాలిక దశ – ఈ భావనలు, రంగనాయకమ్మగారికి మింగుడు పడడం లేదు.

'బానిసత్వం, కమ్యూనిజం వరకూ మారిందంటే, అది శత్రువైరుధ్యాల వల్ల! ఆ వైరుధ్యాలు ఏ దశ నాటికి పోతాయో, సమాజ గుణంలో మంచి మార్పు అక్కడే స్థిరపడి ఆగిపోవాలి....ప్రకృతికి ఆదీ, అంతమూ, ఉండవని చెప్పుకుంటాం....కానీ మానవ సమాజానికి మొదలు, చివరా, ఉంటాయి. మొదలు ఆదిమ సమాజం అయితే, చివరిది కమ్యూనిజం...' అన్నారు రంగనాయకమ్మ.

రంగనాయకమ్మ చెప్పే ఈ ఎన్నటికీ మారని, స్థిరంగా ఉండిపోయే ఈ 'మంచి మార్పు' ఏమిటో నాకు అర్థం కావడం లేదు. మార్క్సిస్టులు అభివృద్ధి, మార్పు (development, change) అన్న పదాలను వాడుతారు కాని మంచి మార్పు, చెడు మార్పు మంచి అభివృద్ధి, చెడు అభివృద్ధి (good change, bad change; good development, bad development) అన్న పదాలు ఎక్కడా వాడరు. ఒక శాస్త్రం గురించి మాట్లాడేటప్పుడు అందరూ అర్థం చేసుకునే, అందరూ వాడే పదాలే వాడాలి కాని ఎవరికి వారు తమకు తోచిన పదాలు, తమకు తోచిన అర్థంలో వాడితే, ఆ శాస్త్రం అర్థం కాకుండా పోతుంది. ఆ కారణంగా, రంగనాయకమ్మ 'మంచి మార్పు'ను నేను 'మార్పు'గానే అర్థం చేసుకుంటున్నాను. రంగనాయకమ్మకి అస్పష్టంగా, తనకు తోచినదేదో రాసిపడేయడం ఒక అలవాటులా కనుపిస్తోంది.

'కమ్యూనిజాన్ని వైరుధ్యాలు లేని సమాజంగా ఊహిస్తాం. అది అలా తయారైతేనే అది కమ్యూనిజం....'అంటున్నారు రంగనాయకమ్మ. కమ్యూనిస్టు సమాజం ఏర్పడ్డాకా వైషమ్య పూరిత వైరుధ్యాలు లేకపోవచ్చు కాని వైరుధ్యాలు అంతంకావు. వైరుధ్యం ఉన్నదీ అంటే, అది అనివార్యంగా మార్పుకు దారి తీస్తుంది. ఆ కారణంగా సమాజంలో మార్పు స్థిరపడడమంటూ ఉండదు.

'మానవ సమాజం క్రమంగా పురోగమించే క్రమంలో, ప్రతీ రోజూ, అంతులేకుండా, వైరుధ్యం పరిష్కరించబడుతూనే ఉంటుంది.... – ఎంగెల్స్ (ఏంటీ – డూహ్రింగ్).

'...వైరుధ్యాలన్నింటినీ సమూలంగా నిర్మూలించినట్లయితే, మనం పరమ సత్యాన్ని చేరుకున్నట్లే. ప్రపంచ చరిత్ర ముగుస్తుంది. కాని, ఇంక చెయ్యవలసినదేమీ లేకపోయినా, చరిత్ర ముందుకు నడుస్తూనే ఉండాలి. ఇది మళ్లీ పరిష్కరింపలేని కొత్త వైరుధ్యమవుతుంది.. – ఎంగెల్స్ (Ludwig Fuebach and the end of classical German philosophy).

ఏ వైరుధ్యాలు లేని, నిర్దుష్ట (perfect) వ్యవస్థ నిర్మించబడిన రోజున (రంగనాయకమ్మ భావిస్తున్నట్లు సమాజ గుణంలో మంచి మార్పు స్థిరపడి ఆగిపోయిన రోజున) ప్రగతి నిలిచిపోతుంది. ఏ వైరుధ్యాలు లేని వ్యవస్థ ఎలా ఉంటుంది?

'వైరుధ్యం, మార్పుకు మూల కారణమని మనం ఎందుకు అంటాం? ఎందుకంటే, ఒక ప్రక్రియలో ఉండే వైరుధ్యాలు మాత్రమే, మార్పు అవసరమయ్యే అంతర్గత పరిస్థితులు సృష్టిస్తాయి. వైరుధ్యాలు లేని ఒక ప్రక్రియ, బాహ్య శక్తి ఏదైనా ఆపు చేసేవరకూ లేదా మార్చేవరకూ, నిరంతరం, అదే విధంగా సాగుతుంటుంది.....వైరుధ్యాలు లేని సమాజాన్ని మీరు ఊహించగలిగితే ఊహించండి. చేసిన పనులే, చేసిన పద్ధతులలోనే చేస్తుండడం ద్వారా, ప్రజలు తమ అవసరాలన్నింటినీ తీర్చుకునే సమాజం అది. అటువంటి సమాజం ఎన్నటికీ మారదు. ప్రజలు నిరంతరం ఏదో పని చేస్తూ ఉంటారనే అర్థంలో ఈ సమాజంలో నిరంతరం చలనం ఉంటుంది, కాని ఈ చలనం ఎప్పుడూ ఒకేలాగా ఉంటుంది. అక్కడ ఒక ప్రక్రియ ఉంటుంది, కాని పునరావృతమవుతుండే ప్రక్రియ అది. కాని, అటువంటి సమాజం ఎప్పుడూ లేదు, ఎప్పుడూ ఉండబోదు. ఎందుకంటే, మానవుడు జీవించే పరిస్థితుల స్వభావరీత్యా, సమాజంలో ఎప్పుడూ ఒక వైరుధ్యం ఉండి తీరాలి. – మారిస్ కార్న్ ఫోర్త్ (Materialism and Dialectical Method).

'..ఒక ఆదర్శ మానవ సమాజ స్థితిలో, జ్ఞానం ఒక ముగింపుకు చేరుకోనట్లే, చరిత్ర కూడా ముగింపుకు చేరుకోదు. నిర్దుష్ట సమాజం (perfect society), నిర్దుష్ట 'రాజ్యం', లాంటివి ఊహలలో మాత్రమే ఉంటాయి. ఒక దాని తర్వాత ఒకటి వచ్చే చారిత్రక వ్యవస్థలన్నీ, దిగువ నుంచి ఎగువకు అంతులేకుండా మానవ సమాజం పురోగమించే దారిలో తాత్కాలిక దశలు మాత్రమే. ఆ కారణంగా, ఆ దశకు జన్మనిచ్చిన కాలానికీ, పరిస్థితులకూ, అవి యోగ్యమైనవిగా అనిపిస్తాయి. కాని, ఆ దశలోనుంచి క్రమంగా అభివృద్ధి అయ్యే నూతన, ఉన్నత పరిస్థితులు ఎదురైనప్పుడు, ఆ దశ తన యోగ్యతను, చెల్లుబాటును కోల్పోతుంది. అది ఉన్నత దశకు దారి ఇచ్చి తీరాలి. ఈ ఉన్నత దశ కూడా తన వంతు వచ్చినప్పుడు పతనమవుతుంది, నశిస్తుంది....గతి తార్కిక తత్వశాస్త్రానికి ఏదీ అంతిమమైనది కాదు... All that exists deserves to perish... ఉనికిలో ఉన్నది ప్రతీదీ నశించవలసిందే...' – ఎంగెల్స్ (Ludwig Fuebach and the end of classical German Philosophy).

రంగయనాకమ్మ భావిస్తున్నట్లు కమ్యూనిస్టు సమాజం ఏర్పడడంతో చరిత్ర ఆగిపోదు, మనిషి చైతన్యవంతంగా లిఖించే చరిత్ర అప్పటినుంచీ ప్రారంభ మవుతుంది.

అడవిలో జంతువు ఏ రోజుకారోజు వేటాడి జీవిస్తూ ఉంటుంది. కాపిటలిస్టు సమాజంలో మనిషి బ్రతుకు కూడా ఈ జంతు స్థాయిని దాటి పోలేదు, రోజూ బ్రతుకు తెరువు కొరకు మనిషి జంతువులా పడరాని పాట్లు పడుతున్నాడు. కమ్యూనిస్టు సమాజంలో, మనిషి, జంతువులా బ్రతుకు తెరువుకోసం నిరంతరం పెనుగులాడే పరిస్థితినుంచి విముక్తుడై, జంతు ప్రపంచం నుంచి అంతిమంగా వేరుపడి, నిజమైన మనిషిగా జీవించడం ప్రారంభిస్తాడు. అంతవరకూ, ప్రకృతీ, చరిత్రా, మనిషి మీద రుద్దుతున్న ఒక ఆవశ్యకతగా అగుపిస్తున్న సామాజిక వ్యవస్థ, అప్పుడు అతని స్వేచ్ఛా కార్యకలాపాల ఫలితంగా నడుస్తుంది. అప్పటినుంచీ మాత్రమే, మనిషి క్రమంగా, చైతన్యవంతంగా, తన చరిత్ర తానే రాస్తాడు. అప్పటినుంచీ మాత్రమే, మనిషి సంకల్పించిన సామాజిక మార్పులు, క్రమంగా, అతను అనుకున్న ఫలితాలు సాధించడం మొదలు పెడతాయి. ఆవశ్యకత నడిపించే ప్రపంచాన్నుంచి మనిషి స్వేచ్ఛా ప్రపంచానికి ఎదగడం ఇది. (It is the ascent of man from the kingdom of necessity to the kingdom of freedom) – ఎంగెల్స్ (Socialism - Utopian and Scientific).

మనిషి సామాజిక జీవితం ప్రారంభమై కొన్ని వేల సంవత్సరాలు మాత్రమే అయింది. కమ్యూనిస్టు సమాజాన్ని చేరడానికి మరికొన్ని వందల సంవత్సరాలు పట్టవచ్చు. ఆ తర్వాత ఈ భూమి అంతమయ్యేవరకూ, లేదా ఏదో మహత్తర విపత్తు జరిగి, మానవజాతి సంపూర్ణంగా నాశనమయ్యే వరకూ, మానవ జాతి బహుశా లక్షల సంవత్సరాలు ఉంటుంది. కమ్యూనిస్టు సమాజం ఏర్పడిన తర్వాత, మరి కొన్ని లక్షల సంవత్సరాలు, ఏ మార్పూ జరగకుండా సమాజం స్థిరపడి పోతుందని సూత్రీకరించడం హాస్యాస్పదం కాదా!

'...నెగేషన్ సూత్రం ఎంతవరకూ పని చేస్తుందంటే, శత్రు వైరుధ్యాలు ఉన్నంతవరకే....అంటే పోయేవరకే... ఆ వైరుధ్యాలు అంతరించిపోయిన తర్వాత, ఆ సూత్రంతో పని ఉండదు. ఆ సూత్రాన్ని ఇలా అర్థం చేసుకుంటే, దానితో ఇబ్బంది ఉండదు' (రంగనాయకమ్మ).

నెగేషన్, ప్రకృతిలోనూ, చరిత్రలోనూ, ఆలోచనలోనూ సంభవించే అభివృద్ధిని వివరించే సర్వ సాధారణ సూత్రం అని మనం తెలుసుకున్నాం. రంగనాయకమ్మ ఇక్కడ నెగేషన్ అనే సాధారణ సూత్రం గురించి మాట్లాడుతున్నారా లేక మానవ సమాజంలో నెగేషన్ పని చెయ్యడం గురించి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. అస్పష్టంగా రాయడం అంటే ఇదే. ఒక సాధారణ సూత్రంగా నెగేషన్ గురించి ఇక్కడ మాట్లాడుతుంటే, ఈ రాతలు అర్థం పర్థం లేనివి.ఎందుకంటే, ప్రకృతిలో శత్రు వైరుధ్యాలుండవు. ఒకవేళ మానవ సమాజంలో నెగేషన్ గురించి మాత్రమే ఇక్కడ చెబుతున్నారనుకున్నా, ఇది కూడా అర్థంలేని మాటే. నెగేషన్ సూత్రం శత్రు వైరుధ్యాలున్నంతవరకూ పని చెయ్యడం ఏమిటి? ఆ వైరుధ్యాలు అంతరించిపోయిన తర్వాత ఆ సూత్రంతో పని ఉండకపోవడమేమిటి? నాకు తెలుసున్నంత వరకూ మిత్ర వైరుధ్యాలు, శత్రు వైరుధ్యాలు అన్న పదాలు, మిత్రుల మధ్య వైరుధ్యం,

శత్రువుతో వైరుధ్యం, అన్న అర్థంలో మావో ప్రయోగించాడు కాని అంతకుముందు ఎవ్వరూ ఈ పదాలను వాడలేదు. నెగేషన్ గురించి హెగెల్, ఎంగెల్స్ లు వివరించిన దానిలో 'శతృ వైరుధ్యాల' ప్రసక్తి ఎక్కడైనా ఉందా? శతృ వైరుధ్యాలు ఉన్నంతవరకే, అంటే పోయేవరకే నెగేషన్ సూత్రం పని చేస్తుందని ఏ గతి తార్కిక తత్వ వేత్త అయినా, ఎప్పుడైనా అన్నాడా? ఈ 'ఆణి ముత్యానికి' రంగనాయకమ్మ గతి తార్కికంలో ఎక్కడైనా ఆధారాలు చూపించగలరా? గతి తార్కిక నెగేషన్ రంగనాయకమ్మకి అర్థం కాలేదు. 'ఆ సూత్రాన్ని అలా అర్థం చేసుకుంటే', ఆవిడకు 'ఇబ్బంది' లేకుండా అర్థమైంది కాబట్టి 'అలా అర్థం చేసుకున్నారు' అంతకంటే మరేమీ లేదు.

నెగేషన్ గురించీ, నెగేషన్ ఆఫ్ నెగేషన్ గురించి గతి తార్కికం ఏం చెప్పిందో వివరించిన తర్వాత, నేను నా పుస్తకంలో ఈ నెగేషన్ గురించి ఎందుకు చెప్పానో వివరిస్తాను. 20వ శతాబ్దంలో సోషలిస్టు ఉద్యమ చరిత్ర మనం గమనిస్తే, 'సోషలిస్టు వ్యవస్థ' తిరస్కరించబడిందని మనకు స్పష్టమవుతుంది. వాస్తవ చరిత్రలో, మన ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా ఈ తిరస్కరణ సంభవించింది. ఈ నెగేషన్‌ను ఎలా అర్థం చేసుకోవాలి? అన్నది నేడు మార్క్సిస్టుల ముందున్న ప్రశ్న.

అక్టోబరు విప్లవం తర్వాతి సోషలిస్టు చరిత్ర జరిగింది జరిగినట్లు చూసినప్పుడు, మనకు కొన్ని విషయాలు స్పష్టమవుతాయి.

అక్టోబరు విప్లవం, అభివృద్ధి చెందిన కాపిటలిస్టు దేశంలో కాక, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, వెనుకబడిన దేశంలో సంభవించిన కారణంగా, ఈ విప్లవం అనేక కఠిన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. అనేక పరిమితులకు లోనైంది, అంతిమంగా కార్మిక వర్గం తన అధికారాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అలాగే రెండో ప్రపంచ యుద్ధానంతరం, వెనుకబడిన దేశాలలో వచ్చిన 'సోషలిస్టు' విప్లవాలు కాని, 'జనతా ప్రజాస్వామ్య విప్లవాలు' కాని తమ పరిమితులను దాటి సోషలిస్టు విప్లవాలుగా పరిణమించలేకపోయాయి. ఫాసిస్టు దేశాలకు వ్యతిరేకంగా దేశభక్త శక్తులన్నీ ఐక్యమై, జాతి విముక్తి కోసం పోరాడిన కారణంగా, ఈ దేశాలలో కార్మిక వర్గ భావజాలమైన అంతర్జాతీయత కంటే, జాతి వాద భావ జాలం ప్రబలంగా ఉంది. ఆ కారణంగా, కార్మిక వర్గ అంతర్జాతీయత బదులు, ప్రతీ 'సోషలిస్టు' దేశంలోనూ, జాతి వాదం బలపడింది. ఈ దేశాలలో పెట్టీ బూర్జువా వర్గం, రైతాంగం, మేధావి వర్గం, మార్క్సిజం పట్ల ఆకర్షితులై, విముక్తి కోసం పోరాడాయి. కాని ఈ వర్గాలు సోషలిజం సాధించగలిగితే, కార్మిక వర్గ నాయకత్వంలో మాత్రమే సోషలిజానికి పురోగమనం సాధ్యం అన్న మార్క్సిస్టు సూత్రీకరణ తప్పు అయ్యేది. తమ వర్గ ప్రయోజనం నెరవేరిన తర్వాత ఈ వర్గాలకు సోషలిస్టు మార్గంలో పురోగమనం అవసరం లేకపోయింది. ఈ వర్గాలు తమ పరిమితులు దాటలేక, మార్క్సిజాన్ని నూతన పరిస్థితులకనుగుణంగా మార్చాలనే వాదనతో, తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా వక్రీకరించి, దాన్ని సోషలిస్టు వ్యవస్థగా ప్రచారం చేశాయి. ఈ పరిస్థితులలో, కాపిటలిస్టు ప్రపంచం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాల పేరుతో, సోషలిస్టు శిబిర దేశాలలో విజయవంతంగా తిరుగుబాట్లు, మార్పులు తీసుకు రాగలిగింది. సోషలిస్టు శిబిరం అని మనం అంటున్నది కూలిపోయింది. ఈ పరిణామం గురించి నేను నా పుస్తకంలో వివరంగా రాశాను. ఏది ఏమైనా, మన ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా వాస్తవంలో జరిగిన ఒక నెగేషన్ ఇది.

మనం కళ్లు మూసుకుని ఈ నెగేషన్ ను గుర్తించకుండా ఉండగలమా?

ఈ పరాజయంతో మార్క్సిస్టులు నిరుత్సాహంగా ఉన్నారు నిజమే కాని మార్క్సిస్టు అన్న వారెవరూ ఈ ఘోర పరాజయంతో కథ ముగిసిందని భావించడం లేదు. ఈ సంవత్సరం, జనవరి 20వ తేదీ 'గార్డియన్' పత్రికలో ప్రచురింపబడిన ఆక్స్ ఫామ్ నివేదిక, ప్రపంచంలో కేవలం 85 మంది వ్యక్తుల సంపద, ప్రపంచంలో సగం మంది (350 కోట్ల జనాభా) సంపదతో సమానమని తెలియజేసింది. ఇలా సంపద, పేదరికం, చెరో ధృవంలోనూ పోగుపడడం యాదృచ్ఛికం కాదనీ, ఇది దోపిడీ ఫలితమనీ, కాపిటలిజంలో ఇది అనివార్యమనీ, మార్క్సిజం మనకు చెపుతోంది. సోషలిజం తాత్కాలికంగా కూలిపోయినా ఈ దోపిడీ వ్యవస్థ స్థిరంగా ఉండలేదనీ, సోషలిస్టు శక్తులు చెల్లాచెదురై బలహీనపడినా, మనిషిని వేతన బానిసగా చేస్తున్న ఈ అమానుష వ్యవస్థ నాశనమై తీరుతుందని మార్క్సిస్టులు భావిస్తున్నారు. ఏం చేయాలా అని ఆలోచిస్తున్నారు. ఎంత బలహీనంగా ఉన్నా, ప్రపంచంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక స్థాయిలలో పోరాటాలు జరుగుతున్నాయి. ఎన్ని ప్రతికూల పరిస్థితులనెదుర్కొంటున్నా, ఈ పోరాటాలు అనివార్యంగా జరుగుతాయి. ఆ కారణంగా ఇక్కడ నుంచి మళ్లీ ఒక నూతన క్రమం ప్రారంభమైంది అని చెప్పాను. ఈ పోరాటాలు అంతిమంగా సామ్రాజ్యవాదాన్ని కూలదోయక తప్పదని మార్క్సిస్టులు భావిస్తున్నారు. అలా కూలదోయడమంటే మరో నెగేషన్ అన్న మాట.

'.. చరిత్ర ఈ గతితార్కిక సూత్రాన్ని ధృవపరిచింది కనుక మనం ఈ సూత్రాన్ని ఇక్కడ అంగీకరిస్తున్నాం. బహుశా సోషలిస్టు పురోగమనం ఈ మార్గంలోనే జరుగుతుంది. సోషలిజం కొంత పురోగమనం చెందుతుంది. అదే సమయంలో ఈ సోషలిస్టు పురోగమనాన్ని ప్రతిఘటించే శక్తులు తలెత్తి ఈ పురోగమనానికి అడ్డుపడి సోషలిస్టు విజయాలను తలకిందులు చేస్తాయి. దానితో ఒక క్రమం అంతమవుతుంది. మనం ఎక్కడనుంచి బయలుదేరామో అక్కడకు తిరిగి చేరినట్లు అనుపిస్తుంది కాని అది వాస్తవం కాదు. అక్కడ నుంచి మళ్లీ నూతన సంఘర్షణా క్రమం ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో, పై చెయ్యి సంపాదించిన సోషలిస్టు వ్యతిరేక శక్తులను సోషలిజం మరింత ఉన్నత స్థాయిలో ప్రతిఘటించి మళ్లీ విజయం సాధిస్తుంది. సోషలిజం మరో ముందడుగు వేస్తుంది. 'ఈ విధంగా శంఖాకారంలో సోషలిస్టు పురోగమనం ఉంటుందని మనం భావించవచ్చు' అని చెప్పాను (పే. 308).

సోషలిస్టు విజయాలు ఎందుకు తలకిందులయ్యే అవకాశం ఉంది?

అంతర్జాతీయ కాపిటల్ చాలా బలమైన శత్రువు. కార్మిక వర్గ విప్లవోద్యమాలను అణచి వేయడంలో, తప్పుదారి పట్టించడంలో శతాబ్దానికి పైగా అనుభవం ఉంది. ఇది మొదటి విషయం. రెండో విషయం ఏమిటంటే, సామ్రాజ్యవాద దశలో, సోషలిస్టు విప్లవాలు అని మనం భావిస్తున్నవి, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా వెనుకబడిన దేశాలలోనే సంభవించే అవకాశం ఎక్కువగా కనుపిస్తోంది. వెనుకబడిన దేశాలలో సంభవించే ఈ విప్లవాలు అనేక కష్టాలను ఎదుర్కోవలసి వస్తోందని చరిత్ర మనకు రుజువు చేస్తోంది. ఆ కారణంగా, ఈ దేశాలలో కార్మిక వర్గ ప్రభుత్వాలు ఏర్పడినా, అనుకూల పరిస్థితులలో, చాలా బలమైన అంతర్జాతీయ కాపిటల్ అండదండలతో, పెట్టుబడిదారీ శక్తులు, కార్మిక వర్గ ప్రభుత్వాలను కూలద్రోసి, కాపిటలిస్టు పునరుద్ధరణకు చేసే ప్రయత్నాలలో విజయం సాధించే అవకాశం కూడా ఎక్కువే. ఆ కారణంగా, ప్రతీఘాత విప్లవాలు సంభవించి, సోషలిస్టు విజయాలు తలకిందులయ్యే అవకాశం ఎక్కువగానే కనుపిస్తోంది. ఈ క్లిష్టమైన క్రమాన్ని అర్థం చేసుకోకుండా రంగనాయకమ్మ 'సోషలిజం రావాలి కాబట్టి వస్తుంది, పోవాలి కాబట్టి పోతుంది' అని నేను చెప్పినట్లు భావిస్తున్నారు.

కేపిటలిజం, సోషలిజం – ఈ రెండు పక్షాలలోనూ, ఏదో ఒక పక్షం అంతమైనప్పుడు మాత్రమే ఈ రెండింటి మధ్య ఉన్న వైరుధ్యం, అంతిమంగా పరిష్కారమవుతుంది. బూర్జువా వర్గం లేకుండా ప్రపంచం ఉండగలదు కాని శ్రామిక వర్గం లేకుండా ఒక్క రోజు కూడా సమాజం నడవదు కనుక చిట్టచివరకు అంతమయ్యేది బూర్జువా వర్గమే. ఈ వైరుధ్యం అంతిమంగా పరిష్కారమయ్యేవరకూ, ఈ ప్రక్రియలో నెగేషన్ల క్రమం సంభవిస్తూనే ఉంటుంది.

ఒక వేళ వెనుకబడిన దేశాలలో కాక, అభివృద్ధి చెందిన దేశాలలో, సోషలిస్టు విప్లవాలు సంభవిస్తే, సోషలిజం వైపు పురోగమనం చాలా వేగంగా ఉంటుంది. ఇదంతా స్థల కాల పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. ఆ కారణంగా, నేను 'బహుశా సోషలిస్టు పురోగమనం ఈ మార్గంలోనే జరుగుతుంది' అన్నాను కాని నిశ్చయంగా ఈ మార్గంలోనే జరుగుతుంది అనలేదు. భౌతిక పరిస్థితులు మారినప్పుడు మార్క్సిస్టుల అవగాహన కూడా మారుతుంది, కార్యక్రమం కూడా మారుతుంది. ఏదీ ఇప్పుడే కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు.

శ్రమకు – పెట్టుబడికి మధ్య ఉన్న వైరుధ్యంలో ప్రబలంగా ఉండే పక్షాన్ని విప్లవాల ద్వారా కాని, ప్రతీఘాత విప్లవాల ద్వారా గాని మార్చవచ్చునని చరిత్ర మనకు చెపుతోంది. ఓడిపోయిన పక్షం, బలహీనపడుతుందే కాని చరిత్ర నుంచి వెంటనే నిష్క్రమించదు అని కూడా మనకు స్పష్టమవుతోంది.

సోషలిజం అంతిమ విజయం ప్రపంచవ్యాపితంగా మాత్రమే సాధ్యమన్న సంగతి మార్క్సిస్టులకు తెలుసు. ఆ అంతిమ విజయం చేరేలోగా ఆటుపోట్లు, వెనుకంజలు, తిరోగమనాలు, కూడా ఉంటాయని కూడా మార్క్సిస్టులకు తెలుసు. వీ

నిత్య జీవితంలో సోషలిజం

- వి. రాజశేఖర్

'నిత్య జీవితంలో సోషలిజం' పుస్తకం చదవడం ద్వారా మార్క్సిజం అంటే ఏమిటో, ఎంత అవసరమో తెలుస్తుంది. ఎందుకంటే సిద్ధాంతం తెలియడంతోనే దాన్ని అందరూ అంగీకరించరు. అది నిరూపిస్తే ఎవరైనా అంగీకరించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. మరీ ముఖ్యంగా సామాజిక విషయాల్లో ఇది మరీ అవసరం. మార్క్సిజం సిద్ధాంతాన్ని అమలుచేసి, సమాజాన్ని సమూలంగా మార్చడం సాధ్యమనీ నిరూపించాయి గతంలో రష్యా, చైనా లాంటి పలు దేశాలు. అయితే ఆ విషయాలకు తగినంత ప్రచారంలేక, చాలామంది కొందరు తెలిసీ, కొందరు తెలియకా మార్క్సిజాన్ని వ్యతిరేకిస్తున్నారు. అది అవుట్‌డేట్ అనీ, ఫెయిల్ అనీ పలు రకాల వాదనలు చేస్తున్నారు.

అనేక విషయాలలో పెట్టుబడిదారీ పంథా వందల సంవత్సరాలలో కూడా సాధించలేని అభివృద్ధిని, సోషలిస్టు దేశాలు 10 సంవత్సరాల్లో చేసి చూపించాయి. అయితే ఆ తర్వాత అవి మార్గం తప్పి మళ్లీ పెట్టుబడిదారీ పంథాలోకి పోవడంతో వాటి మాటకు విలువ లేకుండా పోయింది. కానీ సోషలిస్టు పథంలో కేవలం కొన్ని సంవత్సరాలు మాత్రమే ఉన్నప్పటికీ ఆ దేశాలు ఎంత అభివృద్ధిని సాధించాయో, ఎలాంటి కార్యక్రమాలను తీసుకున్నాయో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయాలను ప్రజలకు అందుబాటులోకి రాకుండా కమ్యూనిస్టు దేశాల పట్ల, కమ్యూనిజం పట్ల తీవ్ర వ్యతిరేకతను ప్రచారం చేయడంలో పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు ఇప్పటి వరకు విజయం సాధించారని చెప్పక తప్పదు.

అయితే ప్రస్తుతం పెట్టుబడిదారీ పంథాలో నడుస్తున్న దేశాల్లో ఉన్న సమస్యలు కోకొల్లలు. ప్రజలందరికీ కూడూ, గూడూ, గుడ్డా లాంటి ప్రాథమిక అవసరాలు కూడా సమకూర్చలేవు. కనీస భవిష్యత్తులో వాటిని సమకూర్చగలమన్న ఆశకూడా వాటికి లేదు. అంతరిక్షయానాలు చేస్తున్నాం అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప వారు చేసిన వాస్తవ అభివృద్ధి ఏమీ లేదు. ఉదయం లేచినప్పటి నుండి పేద, మధ్యతరగతి వారంతా బతుకు పోరాటంలో పరుగులెత్తడంతోనే సరిపోతోంది. కార్మికులు, కర్షకులు దుర్భర జీవితాలనీడుస్తున్నారు. విప్లవం విజయవంతమై కార్మికవర్గ పాలనలో సోషలిస్టు సమాజం ప్రారంభమైతే మిగిలిన అభివృద్ధి కొంత నిదానంగా జరిగినా, ప్రాథమిక అవసరాలన్నీ రోజుల్లోనే పరిష్కారమైపోతాయనే విషయం మెజారిటీ ప్రజలకు తెలియాలంటే ఇలాంటి పుస్తకాల అవసరం ఎంతో ఉంది.

సోషలిస్టు విప్లవం విజయవంతమైన అన్ని దేశాల గురించి ఇలాంటి పుస్తకాలు విరివిగా రావాలి. మీరు కొంత అడ్వాన్స్ అయిన తర్వాత విషయాలు బాగా వివరించారు. అయితే మొట్టమొదట విప్లవం విజయవంతం కాగానే 1917 లో ఎలా ప్రారంభించారు, ఎలా మార్పులు చేశారు లాంటి ప్రాథమిక విషయాలు కూడా తెలుస్తే ఇంకా ఉత్సాహంగా ఉంటుంది.

1923 లోనే 5 నెలల్లో 16 కోట్ల పాఠ్య పుస్తకాలు అచ్చువేశారంటే, ప్రజలు తమకోసం తాము చేసుకునే పనుల్లో దేన్నయినా(ఎంత పెద్ద పనినైనా) సునాయాసంగా సాధించగలరని రష్యన్ ప్రజలు నిరూపించారు. 90 సంవత్సరాల క్రితం పెద్దగా టెక్నాలజీ అడ్వాన్స్ కాని కాలంలో వారు దీన్ని సాధించడం గమనార్హం. ఇప్పుడు ఎంతో ఆధునిక టెక్నాలజీ ఉన్నా పిల్లలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించలేకపోతున్నారు. వ్యక్తిగత ఆదాయం ఉన్నప్పుడు పనిచేసినట్లు, సమిష్టిగా ఉన్నప్పుడు చేయరు అన్న పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల వాదాలను ఇది తిప్పికొడుతుంది.

ఆ కాలంలోనే పాఠశాలల్ని వర్క్‌స్కూల్స్‌గా ఉండాలని, 3 వ తరగతి నుండే ఫ్యాక్టరీల సందర్శన, దేవుడి ప్రసక్తి లేకుండా ప్రకృతి పాఠాలు చెప్పడం ఇప్పటికీ చాలా గొప్ప విషయమే. స్వయంకృషి, స్వయం నిర్వహణ, సహజీవనపు మేళవింపుతో పాఠశాలలు, కళాశాలు నడిపిన వారి విధానం శ్లాఘనీయం. విద్యార్థులు వేళ్లే రైలు మధ్యలో ఆగిపోతే, వారు దాన్ని గురించి చింతించడం లేదా గొడవలు చేయకుండా, పరిసర గ్రామాల ప్రజలకు పాఠాలు చెప్పడం భలే బాగుంది. అలాంటి సంఘటన ఇప్పట్లో మనకు కలేనేమో? సోషలిజం కేవలం ఆర్థిక విషయాల్లోనే కాదు, బౌద్ధిక, సాంస్కృతిక విలువలను, ఆశయాలను నిలబెట్టు కోవడం, వాటి సుసంపన్నం చేసుకోవడం అని వారు అనేక విధాలుగా నిరూపించారు.

'ఆకాశంలో సగం' అంటూ మన రాజకీయ నాయకులు డాంబికాలు తప్ప, ఆచరణలో ఏమీ జరగడం లేదు. సోవియట్ యూనియన్లో 1917 లో విప్లవం విజయవంతమైన 1,2 సంవత్సరాల్లోనే మహిళలు చదవడం ప్రారంభించారంటే, వారి అభివృద్ధి అన్ని రంగాల్లో ఎలా ఉంటుందో ఊహించవచ్చు. మహిళలను వంట పని నుండి విముక్తి చేయడానికి 1938 నాటికే 30,000 ప్రజా భోజనశాలలు ప్రారంభించడం చాలా గొప్ప విషయం. ప్రేమ వివాహాలు చేసుకునే విద్యార్థినీ, విద్యార్థులకు తగిన ఏర్పాట్లు చేయడం బ్రహ్మాండంగా ఉంది.

ఇక వైద్య, ఆరోగ్య విషయాల్లో వారి అభివృద్ధి, పెట్టుబడిదారీ దేశాల్లో 200 సంవత్సరాలకు కూడా సాధ్యం కాదు. వ్యవసాయరంగంలోనూ, పారిశ్రామిక రంగంలోనూ జరిగిన అభివృద్ధి కలలో కూడా ఊహించలేనిది. అక్కడ వెనుకబడ్డ వారిని, ఆదివాసులను, కనీసం లిపి కూడా లేని వారిని అభివృద్ధి చేయడానికి ఎంత కృషిచేశారో చదువుతుంటే ఎంతో అబ్బురంగా ఉంది.

ఇందులో లక్ష తప్పులు జరగనీయండి. వాటిని సరిచేసుకునే మార్గం ఉంటుంది. మొత్తం దేశ ప్రజలందరికీ, అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ, వారు ప్రశాంతంగా బతికే ఏర్పాటు చేయడం శ్రామికవర్గ పాలనకే సాధ్యమని నిరూపణ అయింది. పెట్టుబడిదారీ పరిపాలన ఇంకో వెయ్యేళ్లు (ఇది సాధ్యం కాదులెండి) గడిచినా ప్రజలందరూ సుఖంగా ఉండే మార్గం లేదు. అలాంటి మోడల్ ఇప్పటికీ వారికి లేదు. మనకు ఇప్పటికే చాలా దేశాలు నమూనాలుగా ఉన్నాయి. పారిస్ కమ్యూన్ మొదలుకొని రష్యా, చైనా, క్యూబా, ఇలా ఎన్నో దేశాల్లో ఇది జరిగి నిరూపించబడింది. దీన్ని విస్తృత స్థాయిలో ప్రచారం చేయడం చాలా అవసరం.

వీ

(...4వ పేజీ తరువాయి)

వీక్షణం ఫిబ్రవరి సంచికలో తిరుపతిని 'అయోధ్యగా మారుస్తారా' అన్న వ్యాసంలో కొన్ని అవాస్తవాలు, అభాండాలు ఉన్నాయి. కొన్నింటిని మాత్రం ఉటంకిస్తున్నాను. 'హిందూ దేవాలయాలకు ఆనుకునే కాశీ మధురలలో మసీదులున్నాయి.' మత దురహంకారంతో, దోచుకోడానికీ, దేవాలయాలను ధ్వంసం చేయడానికీ, దేశాన్ని ఆక్రమించి, పాలించి, మతాంతీకరణం చేయడానికి విదేశాల నుండి వచ్చి, స్థిరపడ్డ ముస్లిం పాలకులు, హిందువులపై ఆధిపత్యం చెలాయించడానికి, వారిని నిస్సహాయులుగా నిర్వీర్యులుగా చూపించడానికి, కాశీ, మధుర, అయోధ్య, ఉజ్జయిని, ద్వారక, రాజ మహేంద్రవరం ఆది పట్నాల్లో దేవాలయాల్ని కూల్చి ఆ స్థలంలోనే మసీదులను కట్టడమో లేక వాటి ఆవరణలో కొంత భాగంపై మసీదులు కట్టడమో జరిగింది. అయోధ్యలో బాబర్ పేర కట్టబడ్డ మసీదు, ధ్వంసం చేయబడ్డ హిందూ మందిరంపై ఉన్నదని పురాతత్త్వ శాఖవారి పరిశోధనల ఆధారంగా అలహాబాద్ ఉచ్చ న్యాయాలయం తీర్పునిచ్చింది. రొమిలా థాపర్ కన్నా, ప్రపంచస్థాయిలో ఖ్యాతిగాంచిన చరిత్రకారుల ఈ కింది అభిప్రాయాలను చదువరులు గమనించగలరు.

తొండవాడలో పేద, అనాథ ముస్లిం విద్యార్థులకు మద్రసా విద్య, ఉర్దూ, అరబిక్ భాషల ద్వారా ఇస్తే వారికి ఏ ఉద్యోగార్హతలు లభిస్తాయి? ఆ విద్య నేర్పడానికి, ఏడంతస్తుల విలాసవంతమైన భవనం, 12 అడుగుల ఎత్తైన ప్రహరీ గోడలు, సి.సి కెమెరాలు కావాలా? ఇంటర్ నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ, ఉమెన్స్ అరబిక్ కాలేజీ పేర్లు రాయబడ్డ సైన్ బోర్డులు పెట్టారు. ఇటువంటివి, ముస్లింలు ఎక్కువగా ఉన్న హైదరాబాద్‌లోనో, ముర్షిదాబాద్‌లోనో, అలీఘర్‌లోనో పెట్టవచ్చు గదా? తిరుమల-తిరుపతి పరిసరాల్లోనే ఎందుకు?

అందునా తిమ్మప్ప దేవాలయాన్నానుకొని ఉన్న స్థలంలోనే ఎందుకు - మధురలో కేశవదేవ్; కాశీలో విశ్వనాథ దేవాలయాల పక్కనే ఏ దురుద్దేశంతో మసీదులు కట్టారో, అదే ఉద్దేశంతో కాదా? తిమ్మప్ప దేవాలయాన్ని పునర్నిర్మించవలసిన బాధ్యత తిరుమల-తిరుపతి, దేవాదాయ-ధర్మాదాయ శాఖల బాధ్యత. కాని అవి ప్రభుత్వపు దుష్ట హస్తాలలో ఉండడం మూలాన, తమ బాధ్యతలను విస్మరించి హిందూ ధర్మానికి ద్రోహం చేస్తున్నాయి. 'హిందూ దేవాలయాలకు నిధులిచ్చే ప్రభుత్వం మదర్సాలకు, చర్చీలకు ఎందుకు నిధులివ్వదో ప్రశ్నించాలి.' అన్నారు వ్యాసకర్త. హిందువుల పట్ల ఉన్న ద్వేషంతో, మైనారిటీల పట్ల అపారమైన ప్రేమతో వ్యాసకర్త అబద్ధం చెప్పసాహసించారు. చర్చీలు, మసీదులు, వారి ప్రార్థనాలయాలు ప్రభుత్వ యాజమాన్యంలో లేవు. వాటి నిర్వహణా స్వాతంత్ర్యాన్ని, వారి సంస్థలకే వదిలిపెట్టారు. కేవలం హిందువుల దేవాలయాలను మాత్రమే ప్రభుత్వం నియంత్రణలో, పాలనలో ఉంచుతోంది. రాజ్యాంగం, లౌకిక సిద్ధాంతాన్ని చాటుతోంది. కాని దానికి కట్టుబడి ఉండవలసిన ప్రభుత్వం దేవాలయాలను తన అజమాయిషీలో పెట్టుకుని లౌకికతకు అపచారం చేస్తోంది; అంతే కాదు; ఈ చర్య ద్వారా హిందూ వ్యతిరేక వివక్షతను చూపుతోంది; ఇది రెండో నేరం.

ప్రభుత్వం దేవాలయాలకు, ఒక్క పైసాకూడా ఇవ్వడం లేదు. పైపెచ్చు దేవాలయాలకు వచ్చే రాబడుల్లో నుండి 14 శాతం, తీసుకుని, దేవాదాయ ధర్మాదాయ శాఖోద్యోగులకు జీత భత్యాలిస్తోంది. ఆ శాఖలో డ్రైవర్లకూ, బంట్రోతులకు నెలకు పదివేల నుంచి పాతిక వేల రూపాయలిస్తూ, అర్చకులకు వందలతో సరిపెడుతోంది.

ప్రభుత్వాల అలౌకిక (నాన్ సెక్యులర్, కమ్యూనల్) చేష్టలు వ్యాసకర్తకు తెలియవా? కేంద్ర ప్రభుత్వం, సంవత్సరానికి వేయికోట్ల రూపాయలు ముస్లింల, మక్కా హజ్ యాత్రకై ఇస్తోంది. మదర్సాలకు నిధులిస్తోంది; మసీదుల్లో ప్రార్థనలు జరిపించే ఇమాంలకు, ము అజ్జిన్‌లకు జీతాలిస్తోంది. మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు వేల కోట్ల రూపాయల నిధులిచ్చి, వాటిలోని కొంత భాగాన్ని ఎ.పి. స్టేట్ మైనారిటీ ఫినాన్స్ కార్పొరేషన్, ఎ.పి. స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫినాన్స్ కార్పొరేషన్‌ల ద్వారా, మసీదులు, చర్చీలు కట్టడానికి, వాటి నిర్వహణకు నిధులిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రిస్టియన్ల జెరూసలెం తీర్థయాత్రలకు రు. 25,000 ఇస్తోంది. హిందువుల తీర్థయాత్రలకు ప్రభుత్వం డబ్బిస్తోందా? లేదు. పైపెచ్చు, దేవుణ్ణి చూడ్డానికి హిందువులు టికెట్ కొనుక్కోవలసి వస్తోంది. ఈ వాస్తవాలను కప్పిపుచ్చడం వ్యాసకర్తకు తగునా?

అనుమతులు లేని కట్టడాలు, శాసనోల్లంఘన భూ అక్రమాల మీద చర్య తీసుకోకుండా కేవలం హిందూ సంస్థ భవనం మీదే ఎందుకు చర్య అంటున్నారు. ఎంతో మంది లంచగొండులుండగా, హంతకులూ, దొంగలుండగా, నన్నే ఎందుకు పట్టుకుని శిక్షిస్తున్నారని, అడగడం ఎంత సమంజసం? ఎంత విజ్ఞత?

హీరా సంస్థ భవనం, వాటిలో తలపెట్టే కార్యక్రమాలు, ఎటువంటి కవ్వింపు చర్యలో, ఏ ప్రమాదాలతో కూడుకున్నవో వివరిస్తూ 'తిరుపతి పరిసరాలలో, అంతర్జాతీయ ఇస్లామిక్ విశ్వవిద్యాలయం, మసీదు, అరబిక్ కళాశాలలా' అనే వ్యాసం రాశాను.

- డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి, సికిందరాబాద్

తోలేటి జగన్మోహనరావు 'మేం మళ్లీ వస్తాం' పుస్తకమూ, ఆ పుస్తకం మీద రంగనాయకమ్మ సమీక్షా వ్యాసాలు చదివాను. రంగనాయకమ్మ సమీక్షకి తోలేటి జగన్మోహనరావు వివరణ (వీక్షణం-జనవరి సంచిక) చూసి, ఈ లేఖ రాస్తున్నాను.

'మేం మళ్లీ వస్తాం' పుస్తకం చదివాక, నాకు మొట్టమొదట కలిగిన అభిప్రాయమేమంటే, పుస్తక రచయితకి స్టాలిన్ పట్ల విపరీతమైన భక్తి భావం ఉందనీ, మావోలో ఉన్న ఏ సానుకూల అంశాన్నీ గుర్తించడానికి సిద్ధపడే ఉద్దేశం లేదనేది. మావోలో ఉన్న పాజిటివ్ అంశాల్ని గుర్తిస్తే, స్టాలిన్ 'పరిపూర్ణత్వాని'కి భంగం కలుగుతుందనేది రచయిత ఉద్దేశం అయి ఉంటుందని అనుకుంటున్నాను.

స్టాలిన్ చేసిన ప్రతి పనికీ గొప్ప మార్క్సిస్టు ప్రయోజనం ఉందని 'చేయని' పనికి కూడా అదే రకమైన ప్రయోజనం ఉందనీ ఈ రచయిత నమ్మకం. సోవియట్ యూనియన్లో బ్యూరోక్రసీ అధికారాన్ని చేజిక్కించు కుంటుందని, అందరి కంటే ముందు ట్రాట్స్కీ చెప్పిన మాట నిజమే కదా! చివరికి జరిగిందదే కదా! 'ఆ సంగతి స్టాలిన్‌కి తెలియదా? ఆయన తన జీవితకాలంలో బ్యూరోక్రసీని అదుపులో ఉంచే ప్రయత్నం చేశాడు' అంటూ స్టాలిన్‌ని సమర్థిస్తూ, అంత మంచి విషయాన్ని ముందుగానే చెప్పి, అప్రమత్తం చేయాలని చూసిన ట్రాట్స్కీని అపశకునాలు పలికేవాడిగానూ, సుదూర భవిష్యత్తు గురించి జోస్యాలు చెప్పేవాడిగానూ భావించాడీ రచయిత. బ్యూరోక్రసీని అదుపులో ఉంచడానికి, స్టాలిన్ చేశాడంటున్న ప్రయత్నాలకు సంబంధించిన వివరాలేవీ రచయిత ఇవ్వలేదు. సోవియట్ యూనియన్ పతనానికి స్టాలినిస్టు బ్యూరోక్రాటిక్ వర్గం కారణమైందనే అపనింద నుంచి, స్టాలిన్‌ని తప్పించాలనే ఉద్దేశంతోనే, ఈ రచయిత ట్రాట్స్కీని 'భవిష్యత్తు గురించి జోస్యాలు చెప్పేవాడి'గా విమర్శించారు.

స్టాలిన్ కాలంలో ప్రజలకి కావాల్సిన వస్తువులన్నీ, అవసరాలకు మించి ఉత్పత్తి జరిగి అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు, లంచగొండి తనం, స్వార్థం, మోసం, దగా లాంటివి అంతం కావడానికి కావాల్సిన భౌతిక పునాది ఏర్పడితే, మరి నూతన బూర్జువా వర్గం ఎలా తలెత్తిందో, అధికారాన్ని చేజిక్కించుకుని, సోషలిస్టు వ్యవస్థని ఎలా కూలదోసిందో అర్థం కాలేదు.

చైనాలో, సాంస్కృతిక విప్లవంలో జరిగిన కొన్ని మంచి మార్పుల్ని కూడా ఈ రచయిత గుర్తించ లేదు. ఆ ఉద్యమం మావో ఊహలోంచి పుట్టిందనీ, అందులో పాల్గొన్న విద్యార్థుల్ని 'మూకలు' కింద తీసిపడేశారు. ఈ రచయిత అంగీకరించినా, అంగీకరించకపోయినా సాంస్కృతిక విప్లవంలో పాత శ్రమ విభజన్ని మార్చే ప్రయత్నం జరిగింది. స్టాలిన్ కాలంలో అటువంటి ప్రయత్నమేదైనా జరిగిందా?

ప్రజల చొరవని ప్రోత్సహిస్తూ మావో చెప్పిన ప్రతిమాటకీ వ్యతిరేక అర్థాలు తీశారు జగన్మోహనరావు. 'ప్రజలు' అని ప్రస్తావించినప్పుడు మావో 'వర్గస్పృహ' లేకుండా మాట్లాడతాడనీ, 'ప్రజల' గురించిన మావో ఆలోచన మార్క్సిజం నుంచి

కాకుండా ప్రాచీన చైనా భావజాలం నుంచి వచ్చిందనేది ఈ రచయిత ఆరోపణ. ప్రజల చొరవతో కాకుండా, ప్రజల్ని సంసిద్ధం చేయకుండా, రష్యాలో స్టాలిన్ అమలుపరిచిన 'నిర్బంధ వ్యవసాయ సమిష్టీకరణ' ఎంతటి దారుణ పరిస్థితులకీ, ఎంత మంది పేద రైతుల మరణానికి కారణమయ్యిందో ఈ రచయిత గుర్తించడానికి నిరాకరించారు.

అలాగే శత్రు వైరుధ్యాలు, మిత్ర వైరుధ్యాలంటూ మావో చెప్పిన వివరణ గొప్ప విషయం. ఈ రచయిత దీనిని కూడా నిరాకరించారు. మావో వ్యక్తి పూజ అన్ని పరిధిలూ దాటి, వెర్రితలలు వేసిందనే ఆరోపణ వాస్తవమే. కానీ మావో వ్యక్తి పూజ ఆయన ప్రత్యర్థుల్ని అణచడానికి ఉపయోగపడిందనీ, స్టాలిన్ వ్యక్తి పూజ మాత్రం అలాంటిది కాదనీ, అది వర్గ పోరాటంలో బ్రహ్మాండమైన ఆయుధమయ్యిందనీ ఈ రచయిత చెప్పారు. ఏ నాయకుడి వ్యక్తి పూజనైనా నిర్ద్వంద్వంగా ఖండించి తీరాలని ఈ రచయిత తెలుసుకోవాలి. మావో అసలు మార్క్సిస్టే కాడనీ, కుహనా మార్క్సిస్టనీ, జాతివాద మార్క్సిస్టనీ, వర్గ సంకర రాజకీయాలు చేశాడనీ, చాలా రకాలుగా విమర్శించాడీ రచయిత.

ఈ రచయిత నిస్సందేహంగా స్టాలిన్ మీద ఈగల్ని మావో మీదకు 'తోలేటి' వారే. రంగనాయకమ్మ పోలిక అద్భుతంగా, అతికినట్లుగా ఉంది. 'ఈగ వాలనివ్వక పోవడం' అంటే నిందపడనివ్వ కుండా చూడడమనేదే. ఈ రచయిత తన పుస్తకంలో చేసిందంతా స్టాలిన్ మీద నింద పడనివ్వకుండా ఉంచడమే. ఉన్నమాటంటే ఉలిక్కి పడ్డట్టుగా, రంగనాయకమ్మవి 'వెకిలి వాఖ్యల'ని అహంభావ పూరితంగా స్పందించారు. విచిత్రమేమంటే, తనకి 'అహం' లేదని స్వోత్కర్ష చేసుకుని మరీ అటువంటి వ్యాఖ్యలు చేశారు.

జగన్మోహనరావు తన పుస్తకంలో గతితార్కిక సూత్రాల్ని సామాజిక వ్యవస్థల మార్పుకి యాంత్రికంగా అన్వయించారు. వర్గాలు నశించి, వర్గ రహితం అయిన కమ్యూనిష్టు వ్యవస్థ కూడా నెగేషన్ సూత్రం ద్వారా మళ్లీ రద్దయి పోతుందనే వాదన ఏమాత్రమూ కన్విన్సింగ్‌గా లేదు.

స్టాలిన్ హత్య చేయబడ్డాడనే వార్త గురించిన ప్రస్తావన నేను కూడా మొదటి సారిగా ఈ పుస్తకంలోనే చూశాను. మరణాల్ని కూడా రాజకీయం చేసే వర్గం ఏదైనా ఈ వార్త పుట్టించిందేమో? ఏమైనా, ఇది జగన్మోహనరావు పిండిమరకు మాత్రమే చేరిన 'కొట్టని పిండి'.

ఫిబ్రవరి వీక్షణం సంచికలో, కె.ఎం.వి.జి. కృష్ణమూర్తి, కాకినాడవారి లేఖలో, ఒక న్యాయమైన సమసమాజాన్ని నిర్మించాలనే మానవ జాతి ఆలోచనకి కొత్త ప్రేరణ కావాలంటే, మార్క్స్, లెనిన్, మావోల వంటి మౌలికమైన, ప్రభావశీలమైన ఆలోచనాపరులతో సమానమైన ఆలోచనలు అవసరం అని రాస్తూ, అప్పటి వరకూ మనం జగన్మోహనరావు వంటి 'అరకొర ఆదర్శవంతుల'తోనూ, రంగనాయకమ్మ వంటి, తనవంటి 'పడకుర్చీ రచయితల'తోనూ సంతృప్తి పడడం మినహా మరో గత్యంతరం లేదనే వ్యాఖ్య ఒకటి చేశారు. తోలేటి జగన్మోహనరావు తన పుస్తకంలో తాను 'పూర్తి ఆదర్శవంతుడి'ననో, ఆదర్శవంతుడి'ననో ఎక్కడా చెప్పుకోలేదు. అలాగే రంగనాయకమ్మ, తాను మార్క్స్, లెనిన్, మావోల వంటి 'మౌలికమైన', 'ప్రభావశీలమైన' ఆలోచనా పరురాలిననీ ఎప్పుడూ చెప్పుకోలేదు. కానీ, ఆమె తనదైన శైలిలో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని, సాహిత్యాన్ని, సరళంగా, సులభంగా ప్రజలకు చేరువ చేసే అద్భుతమైన, ప్రభావశీలమైన కృషి చేస్తుందనేది నిర్వివాదాంశం. కృష్ణమూర్తి తన లేఖలో జగన్మోహనరావు పుస్తకంలోని అభిప్రాయల గురించి కానీ, ఆ పుస్తకంపై రంగనాయకమ్మ సమీక్ష మీద కానీ చర్చించడానికి పరిమితమయ్యింటే బాగుండేది. అంతేకానీ, జగన్మోహనరావు 'అరకొర ఆదర్శవంతుడ'నీ, రంగనాయకమ్మ 'పడకుర్చీ రచయిత'నీ వ్యాఖ్యానించడం పూర్తి అసందర్భపు, అనవసరపు ప్రేలాపన మాత్రమే. రంగనాయకమ్మ పడకుర్చీ రచయితని అనడం అంటే, తెలుగునాట మార్క్సిస్టు సిద్ధాంత వ్యాప్తికి, ఆవిడ చేస్తున్న అద్భుతమైన సాహిత్య కృషికి వీపుతిప్పి, ఆవిణ్ణి అవమానించడమే.

– పి. వర్మ, బాపట్ల

వీక్షణం రచయితల సమావేశం గురించిన ప్రకటన చదివాను. ఇలాంటి మంచి సంప్రదాయాన్ని ప్రారంభించి, కొనసాగిస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ సంప్రదాయాన్ని చివరకంట కొనసాగిస్తారని ఆశిస్తూ సమావేశంలో పాల్గొనే వాళ్లు దృష్టిలో ఉంచుకొని చర్చించడానికి ఒకటి, రెండు విషయాలు రాస్తున్నాను. *1)* వీక్షణంలో పాలకవర్గాల వ్యాపార ప్రకటనలు ప్రచురించడం గురించి చర్చిస్తే బాగుంటుంది. మనం ఏ పాలక వర్గాల విధానాలనైతే ఎండగడుతూ ఒక ప్రత్యామ్నాయ రాజకీయాల గురించి రాస్తామో దానికి భిన్నంగా అవే దోపిడీ ప్రభుత్వాల గొప్పతనాన్ని పొగిడే వ్యాపార ప్రకటనలని వేసుకోవడం మన బలహీనతకే చిహ్నం. అదే సమయంలో అంతకంటే ముఖ్యంగా విలువలకు సంబంధించిన సమస్య కూడ. కాబట్టి వీక్షణం అభిమానులు, శ్రేయోభిలాషులు చందాలు వసూలు చేసే కాంపెయిన్ తీసుకోవడం. పత్రికను నడపాలి కాని ఇలాంటి ప్రకటనలు వేయకపోతేనే బాగుంటుంది. ఆలోచించండి. రచనలు చేయడమే కాకుండా ఒక మంచి పత్రికను ఆర్థికంగా రక్షించుకోవడానికి కృషి చేయడం కూడ ఒక బాధ్యత కద. ఇక వ్యాపార ప్రకటనలు వేయడం అనివార్యం అయిపోయినప్పుడు పాలకవర్గాల గొప్పలు చెప్పే ప్రకటనలు కాకుండా, విద్య, వైద్య సంబంధమైన ప్రకటనలు, ప్రైవేట్ అయినా, ప్రభుత్వానివైనా చివరి ఆప్షన్‌గా వేసుకోవడం గురించి ఆలోచించడం మంచిదేమో.

పత్రికలో వచ్చే వ్యాసాల్లో అట్టడుగు, అణగారిణ వర్గాల సమస్యలు, పోరాటాలకు మరింత ఎక్కువ అవకాశం కల్పించాలి. ఆలోచించాలి. సోకాల్డ్ ప్రధాన స్రవంతి మీడియాలో నోచుకోని వార్తలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం బాగుంటుంది. వ్యాసాల నిడివి 3,4 పేజీలకు మించకుండా ఉంటే బాగుంటుంది.

– నటాష, (వీక్షణం బ్లాగ్‌పై)

వ్యాపార ప్రకటనల గురించి పెద్దగా ఆందోళన చెందవలసిన అవసరం లేదనిపిస్తుంది. పత్రిక నడవడానికి కొంత ఆదాయంగా చూసినంతవరకు ఇబ్బందేమీ లేదు. కాని వ్యాపార ప్రకటనల కోసం సంపాదకీయ ప్రమాణాలు వదులుకుంటే నష్టం. అలా జరుగుతున్న ఆధారాలు ప్రస్తుతం లేవు. పత్రికలకు ఈ ప్రకటనల సమస్య తప్పదు. రచనల అకాడమిక్ ధోరణి కాకుండా చర్చ, సాహిత్య, ఆచరణకు మార్గం చూపించే దృక్పథం ఉంటే పత్రిక మరింత నిలదొక్కు కుంటుంది.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ మీద కొర్ర జ్యోతి వ్యాసం చాలా విషయాలు తెలియ జేసింది. గ్రీన్‌హంట్‌ను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. అందుకు అవసరమైన రాజకీయ కార్యాచరణ గురించి ఆలోచించాలి. ఈ దేశంలో చిన్న వ్యవసాయ దారుల అంతం ముంచుకు వస్తుందని అనిపిస్తోంది. ప్రశ్నల్ల ఆ ముగింపు హింసాత్మకంగా, సామాజిక విధ్వంసం రూపంలో జరగాలా లేక సామాజిక పరివర్తనలో భాగంగా సమష్టి క్షేత్రాల రూపంలో జరగాలా అన్నదే కనబడుతుంది.

చివరిగా రచయిత సాయుధ పోరాటమే ఏకైక మార్గం అని రాశారు. సాయుధ పోరాటం సంప్రదాయకంగా కొన్ని వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉన్న సాధనం. గత రెండు మూడు సంవత్సరాలలోనే సమావేశాలు, ఘేరావ్‌లు, పికెటింగ్, సమ్మె, సాధారణ సమ్మె వంటి కార్మిక వర్గ పోరాట రూపాలు దేశవ్యాప్తంగా చూశాం. సాధారణ సమ్మె వరకు వచ్చిన పోరాటం సరైన నాయకత్వం ఉంటే మరింత ముందు నడిచి మౌలిక సమస్యల పరిష్కారం వైపు నడిచి ఉండేది. దురదృష్టవశాత్తు, కార్మికవర్గ దృక్పథం, కార్మికవర్గ సిద్ధాంతం, కార్మికవర్గ సంస్థలని పట్టించుకున్న వాటికి కూడ కార్మికవర్గ పునాది దాదాపు శూన్యం. ఈ సంస్థల నాయకత్వంలో కార్మికవర్గంలో నుండి ఎదిగివచ్చిన నాయకత్వం అంగిక మేధావులు నామమాత్రం. కార్మికులు అంతిమంగా తమ ఆత్మరక్షణ కోసం ఆయుధాలు పట్టినా అది విశాలమైన రాజకీయ, సామాజిక, సైద్ధాంతిక పోరాటాల నేపథ్యంలోనే. ఒక పోరాట రూపాన్ని ఏకైక మార్గం అని వాదించే సంస్థలు నేడు కార్మికులకు దూరంగా, వర్గ విభజన అట్టే లేని ప్రాంతాలకు పరిమితమై దిగ్బంధనంలో ఉండడం చూడవచ్చు.

– నరేంద్రమోహన్, (వీక్షణం బ్లాగ్‌పై)

ఉత్తరాఖండ్ సిఎం మార్పు

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి విజయ్ బహుగుణ జనవరి 31న తన పదవికి రాజీనామా చేశారు. కేదార్‌నాథ్‌లో వరద విపత్తు సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు సరైన రీతిలో వ్యవహరించలేదనే కారణంతో కాంగ్రెస్ పార్టీ ఆయనను పదవి నుంచి తప్పించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, హరిద్వార్ పార్లమెంట్ సభ్యుడు హరీష్ రావత్‌కు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పజెప్పింది. ఆయన ఫిబ్రవరి 1న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

నిందితులు ఎన్నికల్లో పాల్గొనవచ్చు

ఏదైనా కేసులో అరెస్టయిన లేదా జైలుపాలైై న్యాయవిచారణను ఎదుర్కొంటున్న వ్యక్తి ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించలేమని ఢిల్లీ హైకోర్టు ఫిబ్రవరి 6న ఈ తీర్పువెలువరించింది. నేరం రుజువై శిక్ష అనుభవిస్తున్న నేరస్థులను మాత్రమే ఈ విధంగా ఎన్నికల నుంచి బహిష్కరించాలని స్పష్టం చేస్తూ జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. జైలులోగానీ, పోలీసు కస్టడీలోగానీ ఉన్న వ్యక్తికి ఎన్నికల్లో ఓటు వేసే హక్కు లేదు కాబట్టి, ఎన్నికల్లో పాల్గొనే అర్హత కూడా లేదని సుప్రీంకోర్టు 2013 జూలై 10న తీర్పు చెప్పింది. ఓటు వేసే హక్కు ఉన్న వాళ్లు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనాలని స్పష్టం చేసింది.

మహానదిలో పడవ బోల్తా

మహానదిలో ఫిబ్రవరి 9న పడవ బోల్తాపడి 31 మంది మృతి చెందారు. సంబల్‌పూర్ జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్‌కు చెందిన 150 మంది వారి కుటుంబ సభ్యులతో ఫిబ్రవరి 9న సమారాధన కోసం మహానది సమీపాన ఉన్న పితాపల్లి పర్యాటక ప్రాంతానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పడవలోకి నీరు చేరడంతో పడవ బోల్తా పడి ఈ ప్రమాదం జరిగింది.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగుల వేతన సవరణను కోరుతూ బ్యాంకుల యూనియన్లు ఫిబ్రవరి 10, 11న దేశవ్యాప్తంగా సమ్మె చేశాయి. చీఫ్ లేబర్ కమిషనర్‌తో జరిపిన సమావేశంలో బ్యాంకు యూనియన్లు, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ) మధ్య రాజీ కుదరకపోవడం తో సమ్మెకు పిలుపు ఇచ్చారు. ప్రభుత్వ రంగంలోని 27 బ్యాంకులు పనిచేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఈ బ్యాంకులకు దాదాపు యాభై వేల శాఖలలో ఎనిమిది లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి రాజీనామా

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఫిబ్రవరి 14న రాజీనామా చేశారు. దీంతో 2013 డిసెంబర్ 28న ఏర్పాటైన ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం 49 రోజులకు అంతమైపోయింది. అవినీతిని అరికట్టడానికి సంబంధించిన 'జనలోక్‌పాల్ బిల్లు' అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించగా బిజెపి, కాంగ్రెస్ శాసనసభ్యులు అడ్డుకున్నారు. దీంతో కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. ఢిల్లీ అసెంబ్లీని రద్దుచేసి ఎన్నికలు నిర్వహించాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్‌కు రాజీనామా లేఖ సమర్పిస్తూ కేజ్రీవాల్, ఆయన మంత్రివర్గం కోరారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు లెఫ్టినెంట్ గవర్నర్ చేసిన సిఫారసును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.

రాజీవ్ హత్యకేసులో దోషుల విడుదలపై స్టే

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో ముగ్గురు దోషులను విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం అమలుపై సుప్రీంకోర్టు ఫిబ్రవరి 20న స్టే విధించింది. తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో లోపాలున్నాయని, చట్టాన్ని పూర్తిగా అమలు పరుచలేదని పేర్కొంది. ముగ్గురు దోషుల విషయంలో యథాస్థితిని కొనసాగించాలని, మరో నలుగురు దోషుల విషయంలో కేంద్రం పిటిషన్ వేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సదాశివం నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఫిబ్రవరి 20న ఆదేశించింది.

సాహిత్యవేత్త అమర్‌కాంత్ మృతి

ప్రముఖ హిందీ రచయిత, జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత అమర్‌కాంత్ (89) అనారోగ్యంతో బాధపడుతూ అలహాబాద్‌లో ఫిబ్రవరి 17న మృతి చెందారు. ఆయన 1925లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలియా జిల్లాలో పుట్టారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. పాత్రికేయ వృత్తితో మొదలైన ఆయనకు కథలు, నవలలు, సామాన్య ప్రజల జీవితాలను తన రచనల్లో ప్రతిఫలింప చేయడంతో గుర్తింపు లభించింది. 'ఇన్ హీ హత్యారోంసే' నవలకు 2007లో సాహిత్య అకాడమీ అవార్డు, 2009లో జ్ఞానపీఠ్ అవార్డు లభించింది.

అసోంలో రైతు ఆత్మాహుతి

పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న 85 వేల కుటుంబాలకు భూపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి (కెఎంఎస్ఎస్) పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా ఫిబ్రవరి 24న కెఎంఎస్ఎస్ చెందిన కార్యకర్త ప్రణబ్ బోరో(45) అనే రైతు సెక్రటేరియట్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహుతికి పాల్పడ్డాడు. వంద శాతం కాలిన గాయాలతో బోరోను గువాహటి వైద్య బోధనాసుపత్రిలో చేర్పించారని సూపరింటెండెంట్ డాక్టర్ రెహ్మాన్ తాలూక్దార్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు ఆమోదం

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు-2014కు పార్లమెంట్ మూజవాని ఓటుతో ఫిబ్రవరి 18న అధికార, ప్రతిపక్షాలు ఆమోదం తెలిపాయి. ఫిబ్రవరి 20న రాజ్యసభలో ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు-2014పై చర్చ జరిగి మూజవాణి ఓటుతో ఆమోదం పొందింది. దీంతో పది జిల్లాలతో కూడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఏర్పడబోతున్నాయి.

మావోయిస్ట్ మద్దతుదారుల హత్య

అసోంలోని సోనిత్‌పూర్ జిల్లాలో మావోయిస్ట్ సానుభూతిపరులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పది మందిని చంపేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది గాయపడ్డారు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద ఈ దాడి జరిగినట్లు డిసిపి లలిత్ గొగోయ్ తెలిపారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించేందుకు తమ పార్టీ అక్కడ రెండు నెలల నుంచి ఉంటోందని మావోయిస్ట్ పార్టీ అసోం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివేక్‌దాస్ తెలిపారు. వీ

కవి, గాయకుడు పీట్ సీగర్ మృతి

ప్రఖ్యాత అమెరికాన్ జానపద గాయకుడు, సాహిత్యకారుడు, సామాజిక ఉద్యమకారుడు పీట్ సీగర్ (94) జనవరి 27న మృతిచెందారు. అనారోగ్యంతో ఆయన న్యూయార్క్‌లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. 90 ఏళ్లు దాటిన తర్వాత కూడా ఆయన ఆక్యుపై వాల్‌స్ట్రీట్ నిరసనలో పాల్గొని ఆందోళనకారులను పాటలతో ఉత్సాహపరిచారు. ఇఫ్ ఐ హాడ్ ఏ హేమర్ (నావద్ద సుత్తి ఉండి ఉంటే) వేర్ హావ్ ఆల్‌ది ఫ్లవర్ గాన్ పూవులు ఎక్కడకు వెళ్లాయి? వంటి అనేక పాటలు ఆయనకు మంచి పేరు తెచ్చాయి. పర్యావరణవేత్తగా, అమెరికా యుద్ధోన్మాద వ్యతిరేకిగా, ఉద్యమకారునిగా నిలిచాడు. కమ్యూనిస్టు పార్టీలో ఏ కాలంలో పనిచేశారో కాంగ్రెస్ ముందు చెప్పేందుకు నిరాకరించి కొంతకాలం జైలు శిక్ష కూడా అనుభవించారు.

వెనిజులాలో నిరసనలు

వెనిజులా రాజధాని కారాకస్‌లో అధ్యక్షుడు మదురో వామపక్ష విధానాలకు వ్యతిరేకంగా, బలహీన భద్రత, ద్రవ్యోల్బణం, కనీస నిత్యావసరాల కొరత మొదలైన సమస్యలకు వ్యతిరేకంగా జనవరి చివరి వారం నుండి మొదలుకొని వేలాది మంది నిరసన ప్రదర్శన చేపట్టారు. ఫిబ్రవరి మొదటి వారంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలో ముగ్గురు చనిపోయారు. తమ దేశంలో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలను ప్రోత్సహిస్తున్నారన్న నెపంతో ముగ్గురు అమెరికా దౌత్యవేత్తలను మదురో బహిష్కరించాడు.

బోస్నియాలో నిరుద్యోగుల నిరసన

బోస్నియాలో నిరుద్యోగం, రాజకీయ ఉన్నతవర్గాలకు అధిక వేతనాలు, కల్పిస్తున్న సౌకర్యాల పట్ల వ్యతిరేకంగా ఫిబ్రవరి మొదటివారంలో వేలాది మంది నిరుద్యోగులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. భద్రతా దళాలు తీవ్ర అణచివేతకు దిగడంతో ప్రదర్శనలు హింసాత్మక రూపం దాల్చాయి.

నేపాల్ ప్రధానిగా సుశీల్ కొయిరాలా

నేపాల్ రాజ్యాంగ పరిషత్ జరిగిన ఎన్నికల్లో అధికారాన్ని ఏర్పాటు చేయడానికి కావలసిన మెజారిటీ ఏ పార్టీకి రాలేదు. దీంతో అత్యధిక స్థానాలను గెలుచుకున్న నేపాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుశీల్ కొయిరాలా నేపాల్ కమ్యూనిస్టు పార్టీ మద్దతుతో నేపాల్ ప్రధానిగా ఎన్నికయ్యారు. 2008లో నేపాల్‌ను రిపబ్లిక్‌గా ప్రకటించారు. అప్పటి నుండి నేపాల్ రాజ్యాంగాన్ని రూపొందించడానికి ఏర్పడిన ప్రభుత్వాలలో కొయిరాలా ప్రభుత్వం ఆరవది. ఈ ఎన్నికల్లో నేపాల్ మావోయిస్టు పార్టీ మూడవ స్థానానికి నెట్టబడింది.

పాకిస్తాన్ - అమెరికా

బిన్ లాడెన్ హత్యలో సిఐఎకు సహకరించినందుకు జైలులో నిర్బంధం ఉన్న డా. షకీల్ ఆఫ్రీదిని విడుదల చేయవలసిందిగా అమెరికా కోరికను పాకిస్తాన్ నిరాకరించడంతో అమెరికా తను హామీపడిన 33 మిలియన్ డాలర్ల సహాయపు మంజూరీని నిలిపివేసింది. 2010లో పాకిస్తాన్ వచ్చిన బ్రిటిష్ పాకిస్తానీ మహ్మద్ అస్గర్ తను ప్రాఫెట్ మహ్మద్ (పీస్ బి అపాన్ హిమ్)నని ప్రకటించుకొని ఇస్లాం చట్ట వ్యతిరేకతను, ఉల్లంఘనకు పాల్పడ్డాడని జనవరి 23న మరణశిక్ష విధించి అమలు పరిచింది.

రష్యా - ఉక్రెయిన్ పరిణామాలు

ఉక్రెయిన్‌లో మూడు మాసాలుగా ప్రధాన ప్రతిపక్షం బట్‌కివెశ్చినా నేతృత్వంలో ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేక నిరసన ప్రదర్శనలు రాజధాని కీవ్ కేంద్రంగా జరుగుతున్నాయి. పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణలో అనేక మంది చనిపోయారు. ఫిబ్రవరి 21న యూరోపియన్ మధ్యవర్తుల సమక్షంలో అధ్యక్షుడు యనుకోవిచ్ ప్రతిపక్షాలను రాజీ ఒప్పందం కుదిరిన మరుసటిరోజే ప్రతిపక్షం పార్లమెంట్‌లో అధ్యక్షుని రాజీనామాను ఆమోదించి, ఒప్పందంలో కుదుర్చుకున్నట్లు సంవత్సరం చివర కాక మే 25న ఎన్నికలను ప్రకటించిన నాటకీయ పరిణామాలతో అధ్యక్షుడు యనుకోవిచ్ రాజధానిని, అధ్యక్ష భవాన్ని వదిలి తనకు పట్టున్న ఉక్రెయిన్ తూర్పున మరొక ప్రధాన నగరం ఖర్‌కివ్‌కు పారిపోయారు.

మధ్య ఆఫ్రికా మతకలహాలు

క్రిస్టియన్‌లు అధికంగా నివసించే మధ్య ఆఫ్రికాలో మతఘర్షణలు తీవ్రమైనవి. క్రిస్టియన్‌లు గుంపులుగా మసీదుల మీద, ఇండ్ల మీద దాడి చేస్తుండడంతో రాజధాని బాంగుయ్ నుండి వేలాది మంది ముస్లింలు వలస వెళ్లిపోతున్నారు. ఈ ఘర్షణలను నివారించడానికి ఆరువందల ఫ్రెంచ్ ఆఫ్రికన్ బలగాలను పంపడానికి యురోపియన్ యూనియన్‌కు ఐక్యరాజ్య సమితి అనుమతినిచ్చింది.

ఇటలీ ప్రధానమంత్రి

ఇటలీకి అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానమంత్రిగా మాటియో రెంజీ ఫిబ్రవరి 22న ప్రమాణ స్వీకారం చేశారు. కాబినేట్ అంతా కూడా 48.7 సంవత్సరాల సగటు వయసువాళ్లు, అందులో సగం స్త్రీలు. యుద్ధానంతర కాలంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇటలీకి మాటియోరెంజీ అనుభవ రాహిత్యం సంక్షోభ ఇటలీని గట్టెక్కిస్తుందా అన్న సందేహాన్ని పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.

అల్జీరియాలో ఆర్మీ విమాన దుర్ఘటన

అల్జీరియా సైన్యానికి చెందిన హెక్యులస్ సి-130 విమానం ఫిబ్రవరి 10న దట్టమైన మంచు, బలమైన గాలుల మధ్య చిక్కి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 102 మంది చనిపోయారు. స్థానిక టామాన్రసెట్ నుంచి కాన్‌స్టాంటైన్ సిటీకి బయలుదేరిన ఈ విమానం గమ్యస్థానానికి కేవలం 30 మైళ్ల దూరంలో కుప్పకూలిపోయింది. విమానంలో ప్రయాణిస్తున్న వారిలో 99 మంది సైనికులు, వారి కుటుంబ సభ్యులు కాగా, నలుగురు విమాన సిబ్బంది ఉన్నారు.

ఈజిప్ట్‌లో ఘర్షణలు

2011 అరబ్ స్ప్రింగ్ వార్షికోత్సవాల సందర్భంగా పదవీచ్యుత మోర్సీ మద్దతుదార్లు, ముస్లిం బ్రదర్‌హుడ్ ప్రస్తుత మిలిటరీ ప్రభుత్వ మద్దతుదార్లకు మధ్య హింసాయుత ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పదవీచ్యుత మోర్సీపై కైరో పోలీస్ అకాడమీలో విచారణ మొదలైంది. 2011లో జైళ్ల నుండి ఇరవై వేల మంది ఖైదీలను తప్పించాడని, పాలస్తీనియన్ హమాస్, లెబనీస్ హిజ్‌బుల్లాలతో చేతులు కలిపి తిరుగుబాటుదారులను హత్య చేయించాడనేది అభియోగం.

వాటికన్ - ఐక్య రాజ్యసమితి

పిల్లల హక్కుల ఐక్యరాజ్య సమితి వాటికన్ రోమన్ కాథలిక్ చర్చి హోలిసీని తీవ్రంగా మందలించింది. కాథలిక్ చర్చి స్కూళ్లలో వేలాది మంది చిన్నారులు సంవత్సరాలుగా లైంగిక వేధింపులకు గురవుతున్నారనీ, వ్యక్తులను సిబ్బందిని తొలగించడం వంటి తగిన చర్యలతో దీన్ని ఆపాలనీ ఆదేశించింది. దీనికి వాటికన్ స్పందిస్తూ తాము ఇదివరకే రాతపూర్వక హామీ ఇచ్చినప్పటికీ ఐక్యరాజ్య సమితి ఈ విధంగా వ్యాఖ్యానించడం కాథలిక్ వ్యతిరేకులకు అనుకూలమవుతుందని చెప్పింది.

వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎ.మల్లేశ్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 జనవరి నుండి 31 జనవరి 2013 వరకు 11 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1153)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	1	–	23	21	7	5	6	2	2	5	4	1	1	32	–	–	–	–	1	–
మహబూబ్‌నగర్	2	6	1	15	16	4	3	4	3	2	19	15	20	11	44	7	–	–	–	–	–
హైదరాబాద్	–	–	–	12	17	–	–	–	–	5	9	7	–	6	23	18	–	–	–	3	–
మెదక్	–	5	–	10	13	–	4	–	–	5	3	4	1	11	49	20	–	–	–	–	–
వరంగల్	–	–	–	5	7	8	5	6	–	–	–	–	–	5	9	8	–	–	–	–	2
అనంతపురం	–	4	2	18	5	2	2	1	1	–	2	2	3	3	19	6	–	–	–	–	–
ఖమ్మం	–	3	–	7	10	1	9	2	1	1	3	3	–	4	18	10	–	–	–	–	–
నిజామాబాద్	–	–	–	4	6	3	2	–	–	4	2	3	4	2	18	13	–	–	–	–	–
కరీంనగర్*	3	9	8	30	28	19	22	4	9	10	11	13	3	6	45	27	–	–	–	–	–
శ్రీకాకుళం	–	–	–	6	8	2	6	–	2	3	1	2	1	3	26	6	–	–	–	–	–
చిత్తూరు	వివరాలు అందలేదు																				
విశాఖపట్నం	–	–	–	4	13	–	4	–	1	7	1	–	2	1	19	10	–	–	–	12	–
మొత్తం	**6**	**28**	**11**	**134**	**144**	**45**	**62**	**23**	**19**	**39**	**56**	**53**	**35**	**53**	**302**	**125**	**–**	**–**	**–**	**16**	**2**

* కరీంనగర్ జిల్లా డిసెంబర్ 2013, జనవరి 2014 నెలల జాబితా

వీక్షణం రచయితల సమావేశం 2014

ప్రాంతీయ, దేశీయ, అంతర్దేశీయ పరిణామాలపై అవగాహనలను, తెలుగు సమాజం తనతో తాను జరుపుతున్న సంభాషణను అక్షరబద్ధం చేస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక వీక్షణం ప్రతి సంవత్సరం తన రచయితల మధ్య సంభాషణకు కూడ వేదిక కల్పిస్తున్నది. వీక్షణం ఎనిమిది సంవత్సరాల కింద ఈ వార్షిక రచయితల సమావేశం ప్రారంభించింది. వీక్షణం రచయితలు, పాఠకులు, అభిమానులు, సిబ్బంది కలిసి కూచుని వీక్షణంలో అచ్చవుతున్న రచనల గురించీ, అచ్చు కావలసిన అంశాల గురించీ చర్చించుకోవడానికి, పత్రిక వెలువడుతున్న తీరు గురించి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు పంచుకోవడానికి, గతాన్ని సమీక్షించుకుని భవిష్యత్తుకు మార్గాలు వేసుకోవడానికి ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ వరుసలో ఏడవ సమావేశంగా ఈ సంవత్సరానికి గాను వీక్షణం రచయితల సమావేశం మార్చ్ 9, 2014 ఆదివారం జరుగుతుంది. ఇప్పటికే వీక్షణంలో రచనలు చేసి ఉన్నవారు, వీక్షణంలో రచనలు చేయదలచుకున్నవారు, వీక్షణం పాఠకులు, వీక్షణం అభిమానులు, మొత్తంగా తెలుగు సమాజ జీవితం గురించి, ప్రజల గురించి ఆలోచించే ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి ఆహ్వానితులే.

తేదీ : మార్చ్ 9 ఆదివారం ఉదయం 10 నుంచి (భోజనం ఏర్పాట్లు ఉన్నాయి)

స్థలం : తెలంగాణ రిసోర్స్ సెంటర్, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఆవరణ, స్ట్రీట్ నెం. 11, హిమాయత్‌నగర్, హైదరాబాద్

(సికిందరాబాద్, ఇమ్లిబన్‌ల నుంచి వచ్చేవారు నారాయణగూడ ఫ్లైఓవర్ దగ్గర దిగాలి.
తాజ్‌మహల్ హోటల్ వైపు మూడవ సందు)

రండి మన ఆలోచనలు కలబోసుకుందాం.
ప్రజాపక్ష ఆలోచనా వేదికగా వీక్షణం మరింత మెరుగ్గా వెలువడేందుకు మన వంతు సహాయం చేద్దాం.

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 152 - Mar 2014 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/02/2014 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16

వీక్షణం ఆగిపోయినా ఫర్వాలేదనుకుంటే

ఈ విజ్ఞప్తి మీ కోసం కాదు

తెలుగు సమాజంలో ప్రగతిశీల, ప్రజానుకూల ఆలోచనల వ్యాప్తికి

విశేషకృషి చేస్తున్న

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

వీక్షణం

ఎటువంటి పరిస్థితిలోనూ ఆగిపోగూడదని ఆకాంక్షిస్తున్న

వేలాది మంది పాఠకులకు, అభిమానులకు

విజ్ఞప్తి

వీక్షణం ఆర్థిక పరిస్థితి సరిగా లేదని, ఆర్థిక కారణాలవల్లనే వీక్షణం ఎప్పుడైనా ఆగిపోయే ప్రమాదం ఉందని కొంతకాలంగా విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. వీక్షణం బడ్జెట్ నెలకు దాదాపు తొంబైవేల రూపాయలు. ఇందులో ముప్పై వేల రూపాయల దాకా లోటు ఉంటున్నది. అంటే మూడు పేజీల ప్రకటనలు వచ్చినా, ఆ మేరకు విరాళాలు వచ్చినా సరిపోతుంది. వీక్షణం గత పదకొండు సంవత్సరాలు ఒక్క సంచిక కూడ ఆగకుండా నిరాటంకంగా వెలువడినట్టుగానే ఇకముందు కూడ కొనసాగుతుంది. వీక్షణం పట్ల ప్రకటితమవుతున్న ఆదరాభిమానాలతో పోల్చినప్పుడు ఈ లోటు పూరించడం పెద్ద కష్టం కాదు. వీక్షణం ఆగిపోగూడదని కోరుకునే అభిమానులందరూ తలా ఒక చెయ్యివేసి వీక్షణంను నిలబెట్టండి. మీకు అవకాశం ఉన్నచోటి నుంచి ప్రకటనలు, విరాళాలు సేకరించి పంపండి. వీక్షణం తన రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా కృషిని మరింత సమర్థంగా, మరింత ఎక్కువగా సాగించాలంటే ఈ ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించండి.

ఇది మీ పత్రిక! ఇది ప్రజల పత్రిక! ఇది ఆగిపోగూడని పత్రిక!

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao